

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 97

శనివారం 28-6-2025



84 వేల పైకి సెన్సెక్స్...
నిఫ్టీ లాభం 89 పాయింట్లు

- 15లో



ఏడడుగులు
తడబడి... విడివడి

- IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



GREEN BONUS OF ₹1000$ FOR VEHICLE SCRAPPING

pine labs PAY LATER CASHBACK UPTO ₹7500*

TOLL FREE NO. 1800-266-0018

INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply

Hero MotoCorp Ltd, Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354I. For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or CALL TOLL-FREE 1800 266 0018 or visit us on www.heromotocorp.com . Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. ~Based on the combined & cumulative dispatch volume of the Splendor range of motorcycles till March 2025. *Finance offer is at the sole discretion of the financier, subject to its respective T&Cs. $Green Bonus is applicable to Pan India on select Hero Products and Bonus amount may vary as per model/variant. 'Internal benchmarking on the basis of data available in public forums for 100cc segment bikes in India. Hero MotoCorp reserves the rights to modify or withdraw any or all the offers without prior notice.

Authorised Dealers: Hyderabad: Geetha Hero, Suchitra: Ph: 9289923134, Taduband Ph: 9515408055, Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155, Vanasthalipuram: Ph: 9246223423, Bhanu Hero, Erragadda: Ph: 9289922148, Kukatpally: Ph: 9392525886, Miyapur: Ph: 9392525885, Phoenix Hero, Habsiguda: Ph: 9289922515, Ramanthapur: Ph: 9246394475, Nagole: Ph: 9246394476, Kushaiguda: Ph: 9246824193, Dealwel Hero, Nampally: Ph: 9289922827, Asifnagar: Ph: 7013367531, Narsingi: Ph: 8712314565, Bibinagar: Ph: 7993119099, Attapur: Ph: 7995852452, Sri Venkanna Hero, Patancheru: Ph: 9289922150, Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133, Phoenix Hero, Hi-Tech City: Ph: 9289922759, Hafeezpet: Ph: 7799017976, Tolichowki: Ph: 7799960345, Chandanagar: Ph: 9100189997, Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972, Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147, Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: Ph: 8886642271, Prudhvi Hero, Sangareddy Ph: 9821697396, Associate Dealer – Medak: Ph: 9346848532, Chintal: Ph: 9246562269, Hayatnagar: Ph: 9246555683, Ibbrahimpatnam: Ph: 9703394833, Kphb: Ph: 9246566605, Medchal: Ph: 9949881116, Seethafalmandi: Ph: 9848868671, Shamshabad: Ph: 7893812758, Turkayamzal: Ph: 9014250111, Zaheerabad: Ph: 9440953602, Balapur: Ph: 7396284446, Kothur: Ph: 9989660055, Shadnagar: Ph: 9849408227, Manikonda: Ph: 9453912345, Mallapur: Ph: 9849362062, Amangal: Ph: 9985799937, Santoshnagar: Ph: 9885307031, Tilak Nagar: Ph: 8977731792, Bn Reddy Nagar: Ph: 9030167171, Also Available At – Chegunta: Ph: 8019134280, Dubbak: Ph: 9866663089, Jogipet: Ph: 9849417030, Narayankhed: Ph: 8019134280, Narsapur: Ph: 9701685551, Ramayampet: Ph: 9912475028, Sadasivpet: Ph: 9395383939, Vantimamidi: Ph: 7659084449, Alwal: Ph: 8019011555, Bachupally: Ph: 9505268989, Chevella: Ph: 9550024062, Gachibowli: Ph: 7799238866, Ghatkesar: Ph: 9866825296, Jagdevpur: Ph: 9346072111, Kandukur X Road: Ph: 9290874477, Kattedan: Ph: 8790467659, Kuknurpalle: Ph: 9912433300, Kulkacherla: Ph: 9866594434, Majidpur: Ph: 9440249174, Mall: Ph: 7729991772, Moinabad: Ph: 9966492929, Nagaram: Ph: 9391043316, Shankerpally: Vaishno Motors, Ph: 9849095545, Tandur: Ph: 9701942955, Thukkuguda: Ph: 9014250111, Thumkunta: Ph: 9440028414, Vikarabad: Ph: 9866594434.

RS/Hero/06/25

ఈ తరం కాపురం



ఏడడుగులు

తడబడి... విడివడి



పెళ్లి, పిల్లలు,పేరెంటింగ్, విడాకులు, ఆందోళన వంటివన్నీ మనదాకా వస్తేగానీ తెలియవు. కాలం కలిసి వచ్చినప్పుడు అంతా బ్రహ్మాండంగా సాగుతూ మనంత తెలివిగల వాళ్లు లేరనిపిస్తుంది. కాలం ఎదురు తిరిగినప్పుడే అసలు సినిమా కనిపిస్తుంది.

– కరీనా కపూర్



భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ చాలా ముఖ్యం. మంచి, చెడు రెండిటికీ కమ్యూనికేషన్ ఉంటేనే ఆ బంధం నిలబడుతుంది. అనుబంధం బలపడుతుంది. అలాగే ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ఆ బంధంలోకి మూడోవ్యక్తి దూరకూడదు. ఆ జంటే పరిష్కరించుకోవాలి.

– విద్యా బాలన్

సుచరిత బిజినెస్ ఎనలిస్ట్. పెళ్లయి రెండేళ్లవుతోంది. భర్త సాఫ్ట్‌వేర్. పెళ్లయిన వెంటనే యూకేలో మంచి జాబ్ ఆఫర్ వస్తే.. పెళ్లిని నిలబెట్టుకోవడం కోసం ఆ జాబ్ ఆఫర్‌ని వద్దనుకుంది. ఓ స్టార్టప్ ప్లాన్ చేసుకుని ఈ రెండేళ్లలో దాన్ని బాగా డెవలప్ చేసుకుని ఆంట్రప్రెన్యూర్‌గా స్థిరపడే దశకు చేరుకుంది. ఆ క్రమంలో పిల్లలనూ అప్పుడే వద్దనుకుంది. భర్త మాత్రం పిల్లలు కావాలనుకుంటున్నాడు. ఈ మధ్యే అతనికి అమెరికాలో మంచి జాబ్ ఆఫర్ వచ్చింది. సుచరితనూ తీసుకుని అమెరికా వెళ్లిపోతే పిల్లల కోసం కన్విన్స్ అవుతుందనుకుని ఆ జాబ్‌కు ఓకే చేసి ఇక్కడున్న ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, సుచరిత ముందు తన ప్రపోజల్ పెట్టాడు. తను స్టార్టప్‌ను వదిలేసి వచ్చే సమస్యే లేదని స్పష్టం చేసింది. చర్చలు, వాదనలు జరిగాయి. 'పెళ్లయిన కొత్తలోనే ఇప్పుడు నీకొచ్చిన జాబ్ ఆఫర్ కన్నా రెట్టింపు శాలరీతో మంచి ఆఫర్ నాకు వచ్చింది. కానీ మన పెళ్లిని ప్రొటెక్ట్ చేసుకోవడానికి ఆ జాబ్‌ను వద్దనుకున్నాను. ఇప్పుడు నా స్టార్టప్ క్లిక్ అయ్యింది. ఇంత ఎఫర్ట్‌నీ తుంగలో తొక్కి నీతో రమ్మంటే రాలేను. కావాలంటే నువ్వు నా కంపెనీలో చేరు. ఇద్దరం కలిసి పనిచేద్దాం!' అంది. ససేమిరా అన్నాడు. మన బంధానికన్నా నీకు ఆ స్టార్టప్పే ఎక్కువ?

నీ కెరీర్ కోసం మదర్‌హుడ్‌ని కూడా పణంగా పెడతావా?' అంటూ నిలదీశాడు. ఆ మాటలకు, ఆ ఆలోచనా ధోరణికి విస్తుపోయింది సుచరిత.

'నేనేం పిల్లలను వద్దనుకోవట్లేదు. నీ అమెరికా జాబ్ కోసం నా కెరీర్‌ను వదలను అంటున్నాను. నువ్వు ఇక్కడే ఉండు.. పిల్లల కోసమూ ప్లాన్ చేసుకుందాం' అంది. రాజీకి రాలేదు అతను. అయితే విడాకులు కావాలంది సుచరిత. ఆమె నిర్ణయానికి అటు పెద్దలు, ఇటు పెద్దలు హతాశులయ్యారు. మూర్ఖత్వంతో కాపురాన్ని కూల్చుకుంటున్నావంటూ తిట్టారు. అయినా చలించలేదు సుచరిత. కూతురి తీరుకు ఏడుస్తున్న తల్లిని 'నన్నెవరు అర్థం చేసుకోకపోయినా పర్లేదు నువ్వు అపార్థం చేసుకోవడమే పెయిన్‌గా ఉందమ్మా! బాగా చదువుకోవాలి, నీ కాళ్లమీద నువ్వు నిలబడాలి, కోట్ల ఆస్తి ఉన్న భర్త దొరికినా సరే.. నీకంటూ రూపాయి సంపాదించుకున్నప్పుడే నీకు ధైర్యం, గౌరవమని నువ్వు చెప్పిన మాటల్ని నువ్వే మరచిపోయావా? ఆ గోల్ కోసం నేను పడ్డ కష్టాన్ని నువ్వూ ఇగ్నోర్ చేయడమేంటమ్మా..' అంటూ బాధపడింది. అమ్మకు అర్థమైంది, అలాగని కూతురిని పూర్తిగా సమర్థించలేకపోయింది.



విడాకులకు కారణాలు..

మునుపటిలా ఆడవాళ్ల పని, మగవాళ్ల పనంటూ బాధ్యతలను జెండర్ కోణంలో చూడట్లేదు. ఇంటా, బయటా స్త్రీ, పురుషుల విధుల్లో మార్పులొచ్చాయి. మారిన ఈ విలువలను జీర్ణించుకోలేని కాపురాలు విడాకుల బాట పడుతున్నాయి. భార్యాభర్తల మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం, ఆర్థిక సమస్యలు, బంధంలో భావోద్వేగాల సమన్వయం లోపించడం, నమ్మకం లేకపోవడం, అభద్రత, అస్తవ్యస్త పనివేళలు, మద్యం, ధూమపానం మొదలైనవీ విడాకులకు ప్రధాన కారణాలే అంటున్నాయి అధ్యయనాలు.

◆◆◆

ఈ మధ్య కాలంలో ఢిల్లీ, బెంగళూరు, ముంబై, కోల్‌కతా, లక్నో వంటి నగరాల్లో విడాకుల దరఖాస్తులు మూడింతలయ్యాయి. పురుషాధిపత్య సమాజాలుగా పేరొందిన ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో విడాకుల సంఖ్య, వేరు పడిన సంసారాల సంఖ్యా తక్కువగా ఉన్నాయి.

ఎందుకంటే..

ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని చిన్నప్పటి నుంచీ నూరిపోసిన ఆ తల్లి ఆడపిల్లకు కాపురం కూడా అంతే ముఖ్యం, అవసరమైతే అంతకన్నా ముఖ్యమనే సంప్రదాయ విలువలకు కండిషనింగ్ అయి ఉంది. ఆ భావజాలం కూతురి నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించడానికి అడ్డం పడుతోంది. తన పెంపకం పట్ల అపరాధ భావాన్నీ కలిగిస్తోంది. ఆమే కాదు ఆడపిల్లల చదువును, ఉన్నతిని కాంక్షించి ఆ దిశగా వాళ్లను తీర్చిదిద్దిన చాలామంది తల్లిదండ్రులదీ అదే భావన. పెళ్లిని నిలుపుకోవడం కోసం చదువును, కెరీర్‌ను ఆడపిల్లలే పణంగా పెట్టాలనుకుంటారు. ఎందుకంటే ఎంతకాదన్నా మన దగ్గర పెళ్లి సఫరింగ్‌నే గ్లోరిఫై చేస్తోంది కాబట్టి అంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్లు. బాధ పడుతున్నా.. హింసను ఎదుర్కొంటున్నా, మానసిక దూరం పెరుగుతున్నా, భావోద్వేగాలు నిర్లక్ష్యం అవుతున్నా ఆలుమగలు కలిసి ఉండాలనే నేర్పుతోంది కుటుంబం.

కానీ..

చదువు, లోకజ్ఞానం, సాధికారత ఇచ్చిన ధైర్యంతో అలాంటి కాపురంలో కొనసాగడం కన్నా విడాకులతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటున్నారు సుచరితలాంటి అమ్మాయిలు. ఎమోషనల్ ఫుల్‌ఫిల్‌మెంట్ లేని పెళ్లిని పెళ్లిగానే చూడట్లేదు. విడాకులను పెద్దవాళ్లు పరువుప్రతిష్ఠలకు ముడిపెడతారు. ఆ భావన నుంచి బయటపడాలి.

భరిస్తూ కలిసి బతకడంలో అర్థం లేదు. విడిపోయినా ఆత్మగౌరవంతో బతకడంలోనే ఆనందముందని గ్రహించాలని కోరుకుంటున్నారు. అందుకే ఏమైనా సరే సహనంతో సర్దుకుపోవాలంటూ పిల్లలను బలవంత పెట్టకూడదని మానసిక, న్యాయ నిపుణులూ చెబుతున్నారు. ఇది సంప్రదాయాన్ని మంటగలుపుతున్న మార్పు కాదు. పరిణామ క్రమమని అంటున్నారు సామాజిక విశ్లేషకులు.

– సరస్వతి రమ



ai SPECIAL

టెక్నో ఉమెన్

ఆర్థిక భవిష్యత్‌కు అండగా...

రమ్య జోసెఫ్

ఇరవై ఏడు సంవత్సరాల వయసులోనే గోల్డ్‌మాన్ శాక్స్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా తనదైన ప్రత్యేకతను నిలుపుకుంది రమ్య జోసెఫ్. 'పెఫిన్' పేరుతో ప్రపంచంలోనే తొలి ఏఐ ఫైనాన్షియల్ అడ్వైజరీ కంపెనీ స్టార్ట్ చేసి విజయపథంలో దూసుకుపోతుంది.

కొలంబియా యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ, ఫైనాన్షియల్ ఇంజినీరింగ్ చేసింది రమ్య.

చదువు పూర్తయిన తరువాత మల్టీనేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ శాక్స్‌లో పనిచేసింది. స్వచ్ఛంద సంస్థ 'ది బ్రిడ్జ్ ప్రాజెక్ట్' ప్రాజెక్ట్ హెడ్‌గా పనిచేసింది. 'ది బ్రిడ్జ్'లో ఆటోమేషన్, ఫ్రాడ్ ప్రివెన్షన్ కోసం పూర్తిస్థాయి టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది.

రిటైర్‌మెంట్ తరువాత తన తల్లిదండ్రుల ఆర్థిక భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు రమ్యకు 'పెఫిన్' ఆలోచన వచ్చింది. 'పర్సనల్ ఫైనాన్స్ ఇంటెలిజెన్స్'ను 'పెఫిన్'గా సంక్షిప్తీకరించింది.

'ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి మా ప్లాట్‌ఫామ్ ఏఐ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. కస్టమర్‌లకు ఉపకరించే పర్సనలైజ్‌డ్, యాక్షనబుల్ ప్లానింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీలను అందిస్తాం' అంటుంది రమ్య.

ఏఐ-ఆధారిత పర్సనల్ ఫైనాన్స్ సెగ్మెంట్‌కు యువతలో మంచి ఆదరణ ఉంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సర్వే ప్రకారం జెన్-జెడ్, మిలీనియల్స్‌లో 41 శాతం మంది ఇన్వెస్ట్‌మెంట్స్ విషయంలో ఏఐ సలహాలు తీసుకుంటున్నారు.

'ఎంతైనా రోబో సలహాలే కదా!' అని ఏఐ బేస్ట్ టెక్నాలజీ గురించి తక్కువ చేసి మాట్లాడేవారు కూడా లేకపోలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని...

'మా సర్వీస్ సింపుల్‌గా, సులభంగా ఉంటుంది. ఎలాంటి గందరగోళమూ ఉండదు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తుంది. మీ ఆలోచనకు అనుగుణంగా పనిచేస్తుంది' అంటుంది రమ్య.

వెల్త్ మేనేజ్‌మెంట్ రంగంలో రోబో అడ్వైజర్‌లు మేజర్ ట్రెండ్‌గా మారారు. అయితే 'పెఫిన్' వాటి కంటే భిన్నమైనది అంటుంది రమ్య. 'కస్టమర్‌లకు సంబంధించిన మూడు నెలల స్పెండింగ్ డేటా తీసుకుంటుంది పెఫిన్. కస్టమర్‌ల అభిరుచుల గురించి తెలుసుకొని ఏది సరియైనదో, ఏది కాదో సూచిస్తుంది. మా నెట్‌వర్క్ కస్టమర్‌ల సందేహాలను తీర్చి ఎన్నో సలహాలు ఇస్తుంది. సరియైన దారి చూపుతుంది' అంటుంది రమ్య జోసెఫ్.

ఆర్థిక విషయాల గురించి మరింత అవగాహన కలిగించడానికి కస్టమర్‌లకు కంటెంట్ కూడా పంపుతుంది పెఫిన్.

అలా వచ్చిన ఆలోచన... పెఫిన్

నా తల్లిదండ్రులు రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నప్పుడు, వారి ఆర్థికభద్రతకు సంబంధించి రకరకాల మార్గాలు ఆలోచిస్తున్నప్పుడు ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ ఆలోచన వచ్చింది. నేను రిటైర్ కావాలనుకుంటున్నాను... అని ఎవరైనా అన్నప్పుడు వారికి సరియైన దారి కనిపించదు. ఒకవేళ ఫైనాన్షియల్ అడ్వైజర్‌ని కలవాలనుకుంటే అది ఖర్చుతో కూడిన పని. ఈ నేపథ్యంలో పెఫిన్ అన్నిరకాలుగా ఉపయోగపడుతుంది.

– రమ్య జోసెఫ్

క్రియేటివ్ వరల్డ్

కలలకు రెక్కలు ఇచ్చి...

'హాబీలు ఆనందం కోసమే' అనుకునేవారు కొందరు. 'హాబీలు ఆనందం కోసమే కాదు పై స్థాయికి చేరుకోవడానికి కూడా' అనుకునేవారు మరి కొందరు. రోషీన జెహ్రా రెండో కోవ. చిన్న రచనతో క్రియేటివ్ ఫీల్డ్‌లోకి అడుగు పెట్టిన రోషీన 'షార్టెడ్ ఇండియా' క్యూరేటర్, మేనేజింగ్ ఎడిటర్‌గా డిజిటల్ ప్రపంచంలో గెలుపు జెండా ఎగరేసింది. ఎంతోమంది సృజనాత్మకతకు పదును పెడుతోంది....



రోషీన జెహ్రా

పదిహేడు సంవత్సరాల వయసులో తొలి రచనతో సృజన రంగంలోకి అడుగు పెట్టింది రోషీన జెహ్రా. ఆ తరువాత 'మూన్' పేరుతో కథ రాసింది. కథల పోటీలో 'మూన్' మొదటి బహుమతి గెలుచుకుంది. 'డ్రీమ్ క్యాచర్' పేరుతో తొలి నవల రాసింది.

ప్రతి రచయితకు ఏదో ఒక సమయంలో 'రైటర్స్ బ్లాక్' ద్వారా రాయలేని స్థితి అంటూ ఒకటి వస్తుంది. 'రైటర్స్ బ్లాక్' నుండి బయటపడడానికి రోషీన ఎక్కువగా ప్రయాణం చేస్తుంది. కొత్తవ్యక్తులతో మాట్లాడుతుంది. టీవీ షోలు చూస్తుంది. ఇవేమీ పనిచేయకపోతే తన సన్నిహిత మిత్రులను 'ఎందుకు రాయలేక పోతున్నాను' 'ఏం చేయాలి?' అని అడుగుతుంది.

'రచన చేయడం అనేది నాకు ధ్యానం చేయడం లాంటిది. సమస్యలను, సమస్త విషయాలను మరచిపోతాను' అంటుంది రోషీన.

కథలు రాయడమే కాదు 'స్ట్రీట్ సెక్సువల్ హరాస్‌మెంట్'పై జర్నలిస్ట్‌గా వ్యాసాలు రాసింది.

షార్ట్‌ఫిల్మ్స్‌కు వేదిక అయిన 'షార్టెడ్ ఇండియా' మేనేజింగ్ ఎడిటర్‌గా తనలోని క్రియేటివిటీని మరోస్థాయికి తీసుకువెళుతోంది రోషీన జెహ్రా.

'ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కథ చెప్పే తీరును మార్చి వేశాయి. హుక్ ప్రాధాన్యత ఏమిటో చెప్పాయి. ఫిల్మ్‌లో మొదటి మూడున్నర సెకన్‌లు ముఖ్యం. ప్రతి ఫ్రేమ్, ప్రతి సౌండ్ ప్రేక్షకులను ఆకట్టుకోవాలి' అంటుంది రోషిన.

షార్టెడ్ ఇండియా '60 సెకండ్స్ చాలెంజ్' క్రియేటర్‌లకు కొత్త సవాలు విసిరింది. వారిలోని సృజనాత్మకతను రాబట్టింది. క్రియేటర్స్‌కు అవసరమైన సలహాలు ఇవ్వడంలో ఎప్పుడూ ముందుంటుంది రోషీన.

'లగాన్' సినిమా కథతో 'కట్టె-కొట్టె-తెచ్చే' స్టైల్లో '15-బీట్-స్ట్రక్చర్' గురించి సులభంగా వివరించింది.

'ప్రశంసల మాట ఎలా ఉన్నా... విమర్శను నిర్లక్ష్యం చేయకూడదు. విమర్శ ద్వారా మనల్ని మనం పదును పెట్టుకోవచ్చు' అంటుంది రోషీన జెహ్రా.

రీడ్.. రీడ్.. రీడ్!

రచయితలు రాయడమే కాదు బాగా చదవాలి. రీడ్, రీడ్, రీడ్! నా విషయానికి వస్తే నాన్-ఫిక్షన్ రాయడం అనేది కష్టం. ఎంతో పరిణతి కావాలి. నయన్ తార సెహగల్, కమలా దాస్, అనితా దేశాయ్, అరుంధతీరాయ్‌లాంటి ఎంతో మంది గొప్ప మహిళా రచయిత్రులు మనకు ఉన్నారు.

– రోషీన జెహ్రా

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 27న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,610
బంగారం (22 క్యారెట్లు)	90,456
వెండి	1,08,800
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,030
బంగారం (22 క్యారెట్లు)	89,850
వెండి	1,09,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,020
బంగారం (22 క్యారెట్లు)	89,850
వెండి	1,17,900
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,030
బంగారం (22 క్యారెట్లు)	92,550
వెండి	1,09,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,900
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,07,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,010
బంగారం (22 క్యారెట్లు)	89,850
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● పోస్ట్ రిటైర్‌మెంట్

సో స్ట్రాంగ్... బామ్మ

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన 79 సంవత్సరాల బామ్మకు నెటిజనులు నీరాజనాలు పలుకుతున్నారు. ఒకప్పుడు ఆమె ఇండియన్ ఆర్మీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసింది. రిటైర్‌మెంట్ తరువాత ఇండోర్‌లో 'ఫుడ్‌స్టాల్' ప్రారంభించింది.



వంటలు తన పాషన్. 'ఫుడ్‌స్టాల్'ను మిలిటరీ క్రమశిక్షణతో నడుపుతోంది. రకరకాల వంటలు చేయడంలో ప్రావీణ్యం సాధించిన బామ్మ 'ఫైన్ ఆర్ట్స్'లో డిగ్రీ చేసింది.

'పెళ్లి ఎందుకు చేసుకోలేదు?' అనే ప్రశ్నకు బామ్మ ఇచ్చిన జవాబు...

'నాకు ఎన్నో హాబీలు ఉన్నాయి. పెళ్లి వల్ల వాటికి ఆటంకం కలుగుతుంది అనుకున్నాను. నాకు ఇప్పటికీ ఎన్నో హాబీలు ఉన్నాయి'

'షీ ఈజ్ సో స్ట్రాంగ్' కాప్షన్‌తో బామ్మ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది ఫుడ్ వ్లోగర్ కషిష్ సోని.

'ఇండిపెండెన్స్‌కు అసలు సిసలు నిర్వచనం'... 'ఏది నచ్చుతుందో అది చేయడమే... అసలు సిసలు జీవితం' ఇలాంటి ప్రశంసలతో కామెంట్ సెక్షన్ నిండిపోయింది.

వంటిల్లు

న్యూడుల్స్



సాధారణంగా నూడుల్స్ అంటే మసాలాతోనో, చికెన్‌తోనో, గుడ్లతోనో కలుపుకుని తినడం తెలిసిందే. అయితే నూడుల్స్‌ని ఎప్పుడూ ఒకే విధంగా కాకుండా, విభిన్నమైన రుచులతో, వినూత్నమైన ఆకృతులలో ప్రయత్నిద్దామా?

నూడుల్స్ సమోసా



కావలసినవి: నూడుల్స్ – రెండు కప్పులు (ఉడికించినవి); **కూరగాయలు,** వెల్లుల్లి, ఉల్లిపాయ, క్యాబేజీ, క్యారెట్, క్యాప్సికమ్ – కొద్దికొద్దిగా (సన్నగా తరిగినవి); **సోయా సాస్, రెడ్ చిల్లీ సాస్** – కొద్దికొద్దిగా; **మసాలా, మిరియాల పొడి, మైదాపిండి, ఉప్పు, వాము, నూనె, నీళ్లు** – సరిపడా.

తయారీ: ముందుగా నూడుల్స్ ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఒక పాన్‌లో నూనె వేసి, వెల్లుల్లి తరుగు వేయించిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, క్యాబేజీ తరుగు, క్యారెట్ తరుగు, క్యాప్సికమ్ ముక్కలు వేసి దోరగా వేయించుకోవాలి. ఇప్పుడు సోయా సాస్, రెడ్ చిల్లీ సాస్, మిరియాల పొడి, వాము, ఉడికిన నూడుల్స్, ఉప్పు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని బాగా కలిపి, చల్లారనివ్వాలి. ఈలోపు ఒక పాత్రలో మైదా పిండి, ఉప్పు వేసుకుని కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ ముద్దలా కలుపుకోవాలి. 20 నిమిషాలు పక్కన పెట్టి, చపాతీలా చేసుకుని, త్రికోణాకారంలో కట్ చేసుకోవాలి. వాటిని సమోసాల్లా చుట్టి కొద్దికొద్దిగా నూడుల్స్ మిశ్రమంతో నింపుకుని క్లోజ్ చేసుకోవాలి. వాటిని నూనెలో దోరగా వేయించి సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.

గారెలు



కావలసినవి: నూడుల్స్ – రెండుం పావు కప్పులు (అందులో పావు కప్పు నూడుల్స్‌ని ముక్కలు ముక్కలుగా చేసి, పక్కన పెట్టుకోవాలి); **ఉల్లిపాయ** – ఒకటి పెద్దది (చిన్నగా లేదా సన్నగా తరగాలి); **పచ్చిమిర్చి** – 3 (చిన్నగా తరగాలి); **కరివేపాకు తరుగు** – కొద్దిగా; **అల్లం-వెల్లుల్లి పేస్ట్**– ఒక టీ స్పూన్; **మైదా పిండి**– 3 టేబుల్ స్పూన్లు (కొద్దిగా నీళ్లు పోసి గరిటజారుగా కలుపుకోవాలి); **కారం, ధనియాల పొడి**– అర టీస్పూన్ చొప్పున; **గరం మసాలా** – పావు టీస్పూన్; **ఉప్పు, నూనె**– సరిపడా.

తయారీ: ముందుగా రెండు కప్పుల నూడుల్స్ ఉడికించి చల్లారబెట్టాలి. ఇప్పుడు ఒక పెద్ద గిన్నెలో ఉడికించిన నూడుల్స్, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు తరుగు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, సరిపడా ఉప్పు వేసుకుని మెత్తగా బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని చేత్తోనే గారెల్లా చేసుకోవాలి. ఇప్పుడు మైదా పిండిలో ముంచి, అనంతరం నూడుల్స్ ముక్కలను గారెలకు పట్టించి, నూనెలో దోరగా వేయించాలి. వీటిని వేడివేడిగా ఉన్నప్పుడే సర్వ్ చేసుకుని తింటే భలే రుచిగా ఉంటాయి.

పిజ్జా



కావలసినవి: నూడుల్స్ – 3 కప్పులు; **మసాలా** – ఒక టీ స్పూన్ పైనే; **మిరియాల పొడి** – కొద్దిగా; **ఉప్పు** – తగినంత; **గుడ్లు** – 2 లేదా 3; **కూరగాయ ముక్కలు, మష్రూమ్స్** – కొద్ది కొద్దిగా (అభిరుచిని బట్టి); **మోజరెల్లా చీజ్** – పావు కప్పు పైనే; **పిజ్జా సాస్** – కొద్దిగా.

తయారీ: ముందుగా మసాలా జోడించి నూడుల్స్‌ని ఉడికించి, దానిలో గుడ్లు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని ఉపయోగించి, గుండ్రటి రింగ్ సాయంతో ఓవెన్‌లో, పిజ్జా బేస్‌ను తయారు చేసుకోవాలి. ఇప్పుడు ఆ బేస్ మీద నచ్చిన కూరగాయ ముక్కలు, మష్రూమ్ ముక్కలు, పిజ్జా సాస్ వేసుకుని.. ఆ పైన చీజ్ తురుము అద్దుకోవాలి. ఇప్పుడు ఓవెన్‌లో బేక్ చేసుకుంటే టేస్టీ టేస్టీ నూడుల్స్ పిజ్జా సిద్ధమవుతుంది.

– సన



సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 97

శనివారం 28-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కాన్వాయ్‌తోనే ప్రయాణించాలి

అమర్‌నాథ్ యాత్రకు కొత్త మార్గదర్శకాలు విడుదలయ్యాయి - 6లో



స్వర్ణం గెలిస్తే రూ.6 కోట్లు

క్రీడాకారులను ప్రోత్సహించటమే లక్ష్యంగా తెలంగాణ కొత్త క్రీడా విధానం - 13లో



చైర్‌పర్సన్ కాకండి..

8 గంటలకు మించి కూర్చునే వారికి అల్జీమర్స్ వంటి మెదడు సంబంధ సమస్యల ముప్పు ఎక్కువని వైద్య పరిశోధకులు చెబుతున్నారు.

- వివరాలు 2లో



నిర్మాణాత్మక రోడ్‌మ్యాప్..

భారత్, చైనా మధ్య నెలకొన్న సమస్యలను నిర్మాణాత్మక రోడ్‌మ్యాప్ ద్వారా పరిష్కరించుకుందామని రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించారు.

- వివరాలు 6లో



కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

సౌత్ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై కాలేజీలోనే అత్యాచారం జరిగింది. ఈ ఘటనపై బెంగాల్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

- వివరాలు 6లో



30 నుంచి సమ్మె చేస్తాం

తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 30 నుంచి సమ్మె చేస్తామని జూనియర్ డాక్టర్ల (జూడా) సంఘం హెచ్చరించింది.

- వివరాలు 3లో

సామాన్యుడి దగ్గరే రుబాబు.. బడా బాబుల దగ్గర బాబ్బాబు!



- ఏళ్ల తరబడి కరెంటు బిల్లులు చెల్లించని ప్రముఖ సంస్థలు
- ఎస్పీడీసీఎల్ పరిధిలోనే రూ.529.22 కోట్ల బకాయిలు
- జాబితాలో మార్గదర్శి చిట్‌ఫండ్స్, పలు స్టార్ హోటళ్లు, కార్పొరేట్ ఆస్పత్రులు - 13లో

భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం



- త్వరలోనే కుదుర్చుకుంటాం
- ఇండియాతో కలిసి పని చేయబోతున్నాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన - 6లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venky's CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	90 kg	Dressed with Skin	162 kg
₹ 76	Retail Live Bird	112 kg	Skin Less	185 kg

Conditions Apply

Issued in the interest of consumers

ఐఏఎంసీకి భూకేటాయింపు చెల్లదు..



కంపెనీల చట్టం కింద నమోదుకాని సంస్థకు ప్రభుత్వం నుంచి ఉచిత భూమి పొందే అర్హత లేదు

ఐఏఎంసీకి భూకేటాయింపుపై దాఖలైన పిల్‌లపై హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

- భూమిని ట్రస్టు విక్రయించుకోవచ్చున్న నిబంధన చట్ట విరుద్ధం
- అందువల్ల 3.70 ఎకరాల భూకేటాయింపును రద్దు చేస్తున్నాం.. జీవోను కొట్టేస్తున్నాం
- సెంటర్ పనితీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని వ్యాఖ్య
- సంస్థకు ప్రభుత్వ ఆర్థిక సాయం, కేసుల సూచన మాత్రం సమర్థనీయమేనని వెల్లడి
- భవిష్యత్తులో ఆడిట్ లేకుండా సాయం కొనసాగించొద్దని సర్కార్‌కు సూచన

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు 2021లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూకేటాయింపును హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ సర్వే నంబర్83/1లో 3.70 ఎకరాలను కేటాయిస్తూ జారీ చేసిన జీవో 126ను జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనా ధర్మాసనం కొట్టేస్తూ తీర్పు చెప్పింది. ఐఏఎంసీ ఒప్పందంలో భాగంగా ట్రస్టు బోర్డుకు ఆస్తులను విక్రయించే అధికా రం ఉంటుందంటూ ఒక ముఖ్యమైన నిబంధన క్లాజ్ 6 (డీ)ను చేర్చడాన్ని ఉన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. తెలంగాణ భూ రెవెన్యూ చట్టం 1317 ఫస్లీ, ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూమికి మార్కెట్ విలువ చెల్లింపును తప్పనిసరి చేసే ఏపీ ఏలియనేషన్ ఆఫ్ స్టేట్ ల్యాండ్స్ రూల్స్–1975ను ఈ భూ కేటా యింపు ఉల్లంఘించిందని స్పష్టం చేసింది. ఐఏఎంసీ చట్ట బద్ధమైన సంస్థగా కంపెనీల చట్టం కింద నమోదు కాలేదని.. అందువల్ల ఉచిత భూమికి అనర్హమైనదిగా పరిగణించాల్సిందేనని తేల్చిచెప్పింది. గత నాలుగేళ్లలో ఐఏఎంసీ పనితీరు ఆశాజనకంగా లేదంటూ సంస్థ భవిష్యత్తుపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరి 29 నాటికి 15 ఆర్బిట్రేషన్ కేసులనే ఐఏఎంసీ నిర్వహించిందని (అందులో 11 అనుకూలంగా)... 57 మధ్యవర్తిత్వ కేసుల్లో 17 మాత్రమే అనుకూలంగా నిర్వహించిందని హైకోర్టు అభిప్రాయ పడింది. అయితే ఐఏఎంసీకి నిర్వహణ ఖర్చుల నిమి త్తం ఏటా రూ. 3 కోట్ల మేర చెల్లింపులకు అనుమ తిస్తూ జారీ చేసిన జీవోలు 76, 365లను మాత్రం ధర్మాసనం సమర్థించింది. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగంగా ఐఏఎంసీ లాంటి కొత్త సంస్థకు ఆర్థిక సాయం అందించినా.. ఓ ప్రైవేట్ సంస్థకు అది శాశ్వతంగా ఉండకూడదని హితవు పలికింది. ఐదేళ్ల తర్వాత ఆర్థిక సాయాన్ని కొనసాగించాలా వద్దా? అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని తీర్పులో సూచించింది.

ప్రజాప్రయోజన వ్యాజ్యాలు ఇవీ..

ఐఏఎంసీ ట్రస్టుకు అత్యంత విలువైన ప్రాంతంలో రూ. వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని

మిగతా 12వ పేజీలో ▶

3 విడతల్లో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్



నేటి నుంచి మొదలు.. ఆగస్టు 23తో పూర్తి

- ఈసారి కొత్తగా మాక్ కౌన్సెలింగ్
- కౌన్సెలింగ్‌కు 176 ఇంజనీరింగ్ కాలేజీలు
- కొత్తగా పాలమూరు, శాతవాహన, హెల్త్ సైన్సెస్
- షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి మొదలు కానుంది. శనివారం నుంచే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 3 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు23 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని ఇంజనీరింగ్ ప్రవేశాల కమిటీ శుక్రవారం మండలి కార్యాలయంలో సమావేశమైంది. సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, మండలి వైస్ చైర్మన్లు ప్రొ. ఇటిక్యాల పురుషోత్తం, ప్రొ. ఎస్‌కే మహమ్మూద్, మండలి కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూహెచ్ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ. వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.

176 కాలేజీల్లో ప్రవేశాలు: రాష్ట్ర వ్యాప్తంగా 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ప్రభుత్వ

మిగతా 13వ పేజీలో ▶

వివస్త్రను చేసి.. జననాంగంలో జీడిపోసి..

- వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతో వివాహితను చితకబాదిన గ్రామస్తులు
- హనుమకొండ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన అమానవీయ ఘటన
- ఇంకా పోలీసులకు అందని సమాచారం.. వారి ఆచూకీ తెలియని పరిస్థితి

12లో





రోజులో గంటల తరబడి కూర్చుని ఉండేవాళ్లలో.. అల్జీమర్స్ వంటి మెదడు సంబంధ అనారోగ్య సమస్యలు వచ్చే ముప్పు చాలా ఎక్కువట. అమెరికాలోని వాండర్‌బిల్ట్ యూనివర్సిటీ మే నెలలో విడుదల చేసిన అధ్యయనం చెప్పిన విషయమిది. ఎక్కువసేపు కూర్చుని ఉండే ఐటీ ఉద్యోగుల్లో ఫ్యాటీ లివర్, ఊబకాయం సమస్యలు వస్తున్నాయని ఫిబ్రవరిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ పరిశోధన వెల్లడించింది. రోజులో 8 గంటలు అంతకుమించి ఎక్కువ సమయం కూర్చుని ఉండిపోయేవాళ్లు మానసిక అనారోగ్యాలు, గుండె జబ్బులు, కొన్ని రకాల కేన్సర్లు, ఒత్తిడి.. ఇంకా అనేక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అధ్యయనాలు చెబుతున్నాయి. మరీ ముఖ్యంగా.. ఎక్కువసేపు కూర్చోవడం అన్నది టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని దాదాపు రెట్టింపు చేస్తుందట.

- సాక్షి, స్పెషల్ డెస్క్



చైర్‌పర్సన్ కాకండి.. ఆరోగ్యానికి చేటండి!



8 గంటలకు మించి కూర్చుంటే ముప్పే

ఊబకాయం మొదలు కేన్సర్లూ రావొచ్చు

చిన్నచిన్న విరామాలు, నడక వంటివి మేలు

గంటల తరబడి.. కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేసే ఉద్యోగస్తులు, టీవీలకు అతుక్కుపోయే వాళ్లంతా పారాహుషార్. కూర్చున్నంతసేపూ సుఖంగానే ఉంటుంది కానీ.. తరువాత్తరువాత అనారోగ్యాలతో కష్టం తెలుస్తుంది అంటున్నారు వైద్య నిపుణులు, పరిశోధకులు. ఎక్కువసేపు కూర్చోవడం లేదా శారీరక కదలికలు బొత్తిగా లేకపోవటం అన్నవి శారీరకంగా, మానసికంగా అనేక అనారోగ్యాలకు దారి తీస్తున్నట్లు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా వైద్య పరిశోధకులు గుర్తించారు. ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల కేలరీలు కరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. దాంతో బరువు పెరుగుతారు. జీర్ణక్రియ మందగిస్తుంది. కొవ్వుల్ని, చక్కెరలను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేసి, శరీరానికి శక్తిని అందించే సామర్థ్యం తగ్గి అనారోగ్యాలు దరిచేరతాయి.

ఎక్కువసేపు కూర్చుంటే వచ్చేవి..

హృద్రోగాలు..: రక్త ప్రవాహం తగ్గడం, రక్త నాళాలలో కొవ్వు నిల్వలు పేరుకుపోవడం రక్తపోటుకు, కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి కారణమవుతాయి.

టైప్ 2 మధుమేహం..: మన శరీరంలోని క్లోమం తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవడం లేదా శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించలేకపోవడం లేదా ఈ రెండింటి వల్లా టైప్ 2 మధుమేహం వస్తుంది. దీనివల్ల దాహం, అలసట, మసక దృష్టి, పుండ్లు గాయాల వంటివి నెమ్మదిగా నయమవడం లాంటివి జరుగుతాయి.

మస్క్యులోస్కెలెటల్ (అస్థి-కండరాల నొప్పి)..: కోర్ (ఉదరం, వీపు కటిభాగం సహా ప్రధాన దేహం), నడుము, కాళ్ల కండరాలు బలహీనపడతాయి. శరీరంలో కదలికలు కష్టం అవుతాయి. వెన్ను, మెడ దృఢత్వాన్ని కోల్పోతాయి. వెన్నెముక అమరిక దెబ్బతింటుంది.

రక్త ప్రసరణ, రక్తనాళ సమస్యలు..: రక్త ప్రసరణ సాఫీగా జరగదు. దాంతో కాళ్లు, పాదాలలో రక్తం ఒక చోట చేరటం జరుగుతుంది. వాపు, కాళ్లలో ఉబ్బిన (వెరికోస్) సిరలు, రక్తం గడ్డకట్టటం లాంటివి సంభవించవచ్చు.

కేన్సర్ ప్రమాదం..: పెద్దపేగు, రొమ్ము, మహిళల్లో గర్భాశయ సంబంధ కేన్సర్ల వంటివి వచ్చే ప్రమాదం ఉంది. తగ్గిన రక్త ప్రసరణ, జీవక్రియ మందగమనం కణుతుల పెరుగుదలకు, వ్యాప్తికి దోహదం చేయవచ్చు.

మానసిక అనారోగ్యాలు..: ఎక్కువసేపు కూర్చోవటం అన్నది మొదట శరీరంపై ప్రభావం చూపి, మెల్లిగా మానసిక అనారోగ్యాల వైపు కూడా దారి తీయవచ్చు. మెదడు పరిమాణం తగ్గడం, (సెరిబ్రల్ ఎట్రోఫీ) మెదడు కుంచించుకుపోతుంది, మతిమరుపు వస్తుంది.

వ్యాయామం చేస్తే సరిపోదా?

సరిపోతుంది. అయితే అది కొంతవరకు మాత్రమే. ప్రతిరోజూ 60 నుంచి 75 నిమిషాలు తేలికైన లేదా కఠినమైన వ్యాయామం చేయగలిగిన వారు కూర్చోవడం వల్ల కలిగే అనారోగ్య ప్రమాదాలను కొంత వరకు తగ్గించుకోవచ్చు. అయితే ఇది వైద్యులు సాధారణంగా సిఫార్సు చేసే దానికంటే ఎక్కువ వ్యాయామం. చాలామంది అంత చేయలేరు కూడా. అంత మాత్రాన నిరాశ చెందనవసరం లేదు. రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయగలిగినా కూడా కూర్చోవటం వల్ల ముప్పిరిగొనే వ్యాధుల నుండి చాలావరకు తప్పించుకోవచ్చు. అయితే, అరగంట వ్యాయామం చేశాం కదా అని 6 గంటలపాటు కదలకుండా కూర్చుంటాం అంటే కుదరదు. రోజంతా కదులుతూ ఉండటం కూడా ముఖ్యమేనని పరిశోధకులు అంటున్నారు. అదే పనిగా కూర్చోకుండా మధ్యమధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. కనీసం అరగంటకోసారి లేచి నిల్చోవడం, కాసేపు నడవడం, ఫోన్ కాల్స్ సమయంలో నడుస్తూ మాట్లాడటం, ఒళ్లు సాగదీసుకోవడం వంటివి చేయాలి.

ఏ యూనివర్సిటీ ఏం కనుగొంది?

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) సంయుక్తంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐటీ ఉద్యోగుల మీద ఇటీవల ఒక అధ్యయనం నిర్వహించాయి. ఎక్కువసేపు కూర్చోవటం, అధిక పనిగంటలు, పని ఒత్తిడుల కారణంగా వారిలో ఊబకాయం, కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం (ఫ్యాటీలివర్ - ఎమ్‌ఏఎఫ్‌ఎల్‌డి) వంటి సమస్యలతో బాధపడుతున్నారట.

గంటల తరబడి కూర్చోవడాన్ని, అమెరికన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఏకంగా ధూమపానంతో సమానమని, ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువ ప్రమాదకరమని పేర్కొంది.

ఎక్కువసేపు కూర్చుంటే వచ్చే దుష్ప్రభావాలపై ప్రపంచవ్యాప్తంగా అధ్యయనాలు జరిగాయి. ఎలాంటి సమస్యలు వస్తాయని వారు చెప్పారంటే..

- యూనివర్సిటీ ఆఫ్ బెడ్‌ఫోర్డ్‌షైర్ (బ్రిటన్): హృద్రోగాలు, మధుమేహం
- యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో (అమెరికా) : చురుగ్గా ఉండే యువతలోనూ గుండె జబ్బులు, ఊబకాయం.
- హార్వర్డ్ టి.హెచ్. చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (అమెరికా): టైప్ -2 మధుమేహం, గుండె జబ్బులు, స్ట్రోక్
- యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ (బ్రిటన్) : టైప్ 2 డయాబెటిస్, గుండె జబ్బులు.
- ఘెంట్ యూనివర్సిటీ (బెల్జియం) : (12–14 ఏళ్ల పిల్లల్లో) నిద్ర సరిగ్గా పట్టకపోవడం, తక్కువ సేపు నిద్ర పోవడం
- యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌ల్యాండ్ (ఆస్ట్రేలియా) : ఊబకాయం, హృద్రోగాలు, టైప్ - 2 డయాబెటిస్, స్ట్రోక్, కొన్ని రకాల కేన్సర్లు

ఎన్ని గంటలు.. ఎంత ప్రమాదం?

రోజులో 4 గంటల వరకు కూర్చోవడం ఫర్వాలేదు. అంతకుమించి కూర్చుంటే మాత్రం జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

గంటలు	ప్రమాదం
4–8	మధ్యస్థం
8–11	ఎక్కువ
11 కంటే ఎక్కువ	చాలా ఎక్కువ

మంజీరా డ్యామ్ డేంజర్‌లో లేదు

పియర్లకు పగుళ్లు అనేది అవాస్తవం..

డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న అప్రాన్ కొంచెం దెబ్బతిన్నది

డ్యామ్ పరిశీలన అనంతరం ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా



మంజీరా డ్యామ్‌ను పరిశీలిస్తున్న రాహుల్‌బొజ్జా

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మంజీరా డ్యామ్ డేంజర్‌లో లేదని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా స్పష్టం చేశారు. పియర్లకు పగుళ్లు వచ్చాయన్నది అవాస్తవమన్నారు. డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న అప్రాన్ మాత్రం కొంచెం దెబ్బతిన్నదని చెప్పారు. కొంత కొట్టుకుపోయిన అప్రాన్ మరమ్మతు కోసం రూ.3 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామన్నారు. జంట నగరాలకు తాగునీరు అందిస్తున్న మంజీరా డ్యామ్ డేంజర్‌లో ఉందని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌ఓ) నివేదిక ఇటీవల బయటకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం రాహుల్‌బొజ్జా సంగారెడ్డి మండలంలో ఉన్న ఈ మంజీరా డ్యామ్‌ను సందర్శించారు. పియర్లు, అప్రాన్‌లు, గేట్ల తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పియర్లకు పగుళ్లు ఉన్నాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పలేదని వ్యాఖ్యానించారు. డ్యామ్ ఎర్త్‌బండ్ కొంచెం సున్నితంగా తయారైందని, మెయిన్‌బండ్‌కు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కొట్టుకుపోయిన అప్రాన్‌కు మరమ్మతులు చేస్తామని చెప్పారు. డ్యామ్ గేట్లు ఎలా పనిచేస్తున్నాయో స్టడీ చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

జూరాల గేట్ల రోప్‌లు ఫెయిల్ అయ్యాయి

జూరాల ప్రాజెక్టులోని కొన్ని గేట్లకు రోప్‌లు ఫెయిల్ అయ్యాయని రాహుల్‌బొజ్జా పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్వహణ కోసం ఏటా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద బడ్జెట్ కేటాయింపులుంటాయన్నారు. ఈ నిధులతో చిన్నచిన్న రిపేర్లు చేస్తున్నామని చెప్పారు.

సంగమేశ్వర, బసవేశ్వరలు ప్రయారిటీ జాబితాలో లేవు

సంగారెడ్డి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు ప్రయారిటీ ప్రాజెక్టుల జాబితాలో లేవని రాహుల్‌బొజ్జా వ్యాఖ్యానించారు. కానీ పనులు మాత్రం చేస్తామని చెప్పారు. రాహుల్‌బొజ్జా వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ విభాగ అధికారులు మాణిక్యం, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

డ్యామ్‌ల నిర్మాణం, రైతు సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్

జూరాలలో ఒక్క రోప్ తెగిపోతే రాజకీయం చేస్తారా: మంత్రి వాకిటి శ్రీహరి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

నారాయణపేట: 'జూరాల డ్యామ్ పగిలేందుకు..కూలేందుకు కాళేశ్వరం కాదు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. డ్యామ్‌లు నిర్మించి ఏళ్లు అవుతున్నా, ఒక్క రాయి ఇంచు కూడా కదలలే. డ్యామ్‌లు నిర్మించడం, రైతు సంక్షేమం అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్'అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జూరాల డ్యామ్‌లో ఒక రోప్ తెగిపోతేనే.. డ్యామ్ మొత్తం ప్రమాదంలో ఉందని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని దుయ్యబట్టారు. శుక్రవారం మక్తల్‌లోని తన స్వగృహంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. 2009లో రికార్డు స్థాయిలో 12 లక్షల క్యూసెక్కుల నీరు జూరాల డ్యామ్ నుంచి వదిలినప్పుడే ఎవరికీ ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని రికార్డులు చెబుతున్నాయని తెలిపారు. జూరాల డ్యామ్‌కు ఉన్న 64 గేట్లలో 8 రోప్‌లను రీప్లేస్‌మెంట్ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. నాలుగు రోప్‌లను సరిచేయగా, అంతలోనే ముందస్తుగా వరదలు రావడంతో మిగతా నాలుగు రోప్‌ల రీప్లేస్‌మెంట్ చేయడంలో ఆలస్యమైందే తప్ప.. ప్రభుత్వ తప్పిదం ఏమీ లేదని చెప్పారు. శనివారం జూరాల డ్యామ్‌ను ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించనున్నట్టు శ్రీహరి తెలిపారు.

ఆర్ అండ్ బీలో డిప్యూటీ ఈఈలకు పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈ) కు పదోన్నతులు కల్పించారు. రాష్ట్ర విభజన తర్వాత పదోన్నతులకు ఆటంకం ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతుండటంతో ఇటీవల మంత్రి కోమటిరెడ్డి తాత్కాలిక పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. ఏడుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు డిప్యూటీ ఎస్‌ఈలుగా, 57 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. 38 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను ఏఈఈలుగా, 118 మంది ఏఈఈలను డీఈఈలుగా, 72 మంది డీఈఈలకు ఈఈలుగా పదోన్నతులు కల్పించినట్టు మంత్రి చెప్పారు.

సాగు,తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో సర్కారు వైఫల్యం

- నిన్న జూరాల.. నేడు మంజీరా డ్యామ్‌కు డేంజర్ బెల్స్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు ప్రమాద ఘటన జరిగి 24 గంటలు గడవకముందే హైదరాబాద్ జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా డ్యామ్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తన చేతగానితనంతో ప్రమాదంలో పడేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం ఘోర వైఫల్యం వల్లే వరుసగా జూరాల, మంజీరా డ్యామ్‌ల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయన్నారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం ఈ ఏడాది మార్చి 22న డ్యామ్‌ను సందర్శించి సమర్పించిన నివేదికను పక్కన పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మంజీరా డ్యామ్‌పై వరద ఒత్తిడి పెరిగి దెబ్బతిందని ఎస్డీఎస్ఏ చెప్పినా సీఎం మొద్దునిద్ర వీడలేదన్నారు. మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరకు డ్యామ్ మరింత ప్రమాదంలో పడే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో చిల్లర రాజకీయాలు మానుకుని వెంటనే మరమ్మతులు చేయాలన్నారు.


వర్సిటీల్లో విద్యార్థులకు పట్టెడన్నం పెట్టడం లేదు

పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులకు భోజనం పెట్టడం లేదని వచ్చిన వార్తలపై కేటీఆర్ స్పందించారు. మిస్‌వరల్డ్ పోటీల్లో విందులకు ప్లేట్‌కు రూ.లక్ష, వేములవాడలో కాంగ్రెస్ సభకు ఆలయ ఆదాయంతో ప్లేట్ భోజనానికి రూ.36 వేలు, ఒక్కో పట్టు పంచెకు రూ.10 వేలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కానీ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కనీసం పట్టెడన్నం కూడా పెట్టే పరిస్థితిలో లేదని చెప్పారు.

'సాగర్ ప్రాజెక్టు నిర్వహణ' మాకే అప్పగించండి

కృష్ణా బోర్డును కోరిన తెలంగాణ

డిసెంబర్ దాకా రక్షణకు సీఆర్పీఎఫ్ అంగీకారం తెలిపిందన్న ఏపీ



సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను తమకు అప్పగించాలని తెలంగాణ కోరింది. శుక్రవారం కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఢిల్లీ నుంచి కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్ హాజరుకాగా, తెలంగాణ నుంచి ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంబర్ హుస్సేన్, ఏపీ నుంచి జలవనరుల శాఖ ఈఎన్‌సీ కె.నర్సింహామూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్ నిర్వహణను పూర్తిగా తమకే అప్పగించాలని, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులు తామే చూస్తామని.. డ్యామ్ నిర్వహణ, రక్షణ నేపథ్యంలో తమకే అప్పగించాలని మహ్మద్ అంజద్ హుస్సేన్ బోర్డును కోరారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) వెబ్‌సైట్ ప్రకారం కూడా తెలంగాణ నిర్వహణలోనే సాగర్ ఉండాలని ఉందని గుర్తు చేశారు. సాగర్‌పై 2018 నవంబర్ 29వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ నెలాఖరుదాకే సీఆర్పీఎఫ్ సాగర్ రక్షణ బాధ్యతలు చూడనుందని, ఆ తర్వాత తమకు అప్పగిస్తే తాము బలగాలను మోహరిస్తామని నివేదించారు. దీనికి అతుల్ జైన్ స్పందిస్తూ.. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇస్తానని బదులిచ్చారు. దీనిపై నర్సింహామూర్తి స్పందిస్తూ 2025 డిసెంబరు నెలాఖరుదాకా రక్షణ బాధ్యతలు చూడటానికి సీఆర్పీఎఫ్ సుముఖత చూపుతూ సమాచారం ఇచ్చిందని, ఈ నేపథ్యంలో యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. డిసెంబరు తర్వాత సాగర్ నిర్వహణపై చర్చిద్దామని ఏపీ స్పష్టం చేసింది. ఇక కృష్ణాబోర్డు ఉద్యోగులు ఇన్సెంటివ్ రూపంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేయరాదనే హైకోర్టు తీర్పుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇక ముందు ఇన్సెంటివ్ వర్తింపచేయబోమని ప్రకటించింది. ఇక తాము కూడా అంతర్రాష్ట్ర విభాగానికి ఇప్పటిదాకా ఇస్తున్న ఇన్సెంటివ్‌ను రద్దు చేస్తామని ఏపీ గుర్తు చేసింది.

ఇదం జగత్



సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

సంక్షోభంలో సాగునీటి రంగం

మాజీ మంత్రి హరీశ్‌రావు

- ప్రాజెక్టుల్లో ప్రమాదాలు కిషన్‌రెడ్డికి కనిపించడం లేదా?



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాగునీటి రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ రంగానికి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతనిచ్చి బాగు చేస్తే, ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఏపీకి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి మేడిగడ్డపై దుష్ప్రచారం మానుకోవాలని, ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అంటూ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు విమర్శించారు. 'ఖమ్మంలో పెద్దవాగు కొట్టుకుపోయింది. నల్లగొండలో సుంకిశాల కుప్ప కూలింది. పాలమూరులో వట్టెం పంప్ హౌస్ జలమయమైంది. నల్లగొండలో ఎస్ఎల్‌బీసీ కుప్పకూలింది. జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్స్ తెగిపోయాయి. మంజీర డ్యామ్ అప్రాన్ వరద ధాటికి కొట్టుకుపోగా, పియ్యర్స్‌లలో పగుళ్లు వచ్చాయి. కాంగ్రెస్ చేతగానితనం వల్లే ఈ ప్రమాదాలు జరిగినా ఎన్డీఎస్ఏకు కనిపించవు'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిన వెంటనే ఎన్డీఎస్ఏకు లేఖ రాసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ప్రమాదాలు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. బనకచర్ల ద్వారా ఏపీకి నీళ్లు తరలించే కుట్ర జరుగుతోందని అన్నారు. రాజకీయ ఎజెండాల కోసం తెలంగాణకు ప్రాణాధారం అయిన సాగునీటి రంగాన్ని బలి చేయొద్దని హరీశ్‌రావు హితవు పలికారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో జరిగిన 142 మంది ఆటో కార్మికుల ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని ఆయన విమర్శించారు. పటాన్‌చెరు ఆటోడ్రైవర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికుల జీవితం దయనీయంగా మారిందని వారు ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. సీఎం రేవంత్ ఆటో కార్మికులకు భద్రత కల్పించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

జూలై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్-11

వెల్లడించిన సీఐడీ అడిషనల్ డీజీ చారుసిన్హా

సాక్షి, హైదరాబాద్: తప్పిపోయిన, జాడ కనిపించకుండా పోయిన, అక్రమ రవాణాకు గురైన పిల్లలు, బాల కార్మికుల జాడ గుర్తించడం, రక్షించడం, పునరావాసం కల్పించడమే లక్ష్యంగా జూలై 1 నుంచి నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్-11 నిర్వహించనున్నట్టు సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం తెలంగాణ అంతటా 706 మంది పోలీసు సిబ్బందితో కూడిన మొత్తం 121 సబ్-డివిజినల్ పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ బృందాలు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమ కమిటీలు (సీడబ్ల్యూసీ)లు, జిల్లా శిశు రక్షణ యూనిట్లు (డీసీపీయూ), వివిధ ఎన్జీఓల సమన్వయంతో పనిచేస్తాయన్నారు. ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణపై రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ కన్వర్జెన్స్ సమావేశం సీఐడీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించినట్టు చెప్పారు.

దేవేందర్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ అదనపు బాధ్యతలు

జూలైలో ఫ్యూచర్ సిటీలో మరిన్ని నియామకాలు



సాక్షి, హైదరాబాద్: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అదనపు పట్టణ ప్రణాళిక డైరెక్టర్‌గా డీటీసీపీ ఎస్.దేవేందర్ రెడ్డిని నియమిస్తూ మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఇలంబరితి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవేందర్ రెడ్డి శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. జూలై నెలలో ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో నియామకాలు ఊపందుకోనున్నాయని సమాచారం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ నుంచి లేఔట్ అనుమతులు, ప్లానింగ్, డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పట్టున్న సీనియర్ అధికారులను నియమించే ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే, ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ తదితర కీలక అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

ముగిసిన మూడు నెలల రేషన్ పంపిణీ


ఇంకా తీసుకెళ్లని వారికి 30వ తేదీ వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒకే సారి మూడు నెలల రేషన్ పంపిణీ కార్యక్రమం దాదాపు ముగిసింది. మే నెలలో పాకిస్తాన్‌తో ఘర్షణ వాతావరణం, మరో పక్క వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్‌ను ఒకేనెలలో ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. యుద్ధ మేఘాలు తొలిగిపోయినప్పటికీ, ముందుగా నిర్ణయించిన ప్రకారమే మూడు నెలల రేషన్ సరఫరాను ఈనెల 1వ తేదీ నుంచే ప్రారంభించారు. ఎవరైనా లబ్ధిదారులు ఇంకా బియ్యం తీసుకోకపోతే ఈ నెల 30వ తేదీ లోపు తీసుకునే అవకాశం ఉందని పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి. బియ్యం తీసుకెళ్లని వారు శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణం నుంచయినా పోర్టబిలిటీ కింద తమ కోటా బియ్యాన్ని తీసుకెళ్లవచ్చని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు. కాగా జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ బియ్యం పంపిణీ ఉండదని పౌరసరఫరాల వర్గాలు వెల్లడించాయి.


10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా జూరాల సేఫ్

బీఆర్ఎస్ నేతలకు పనీపాటా లేక తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జీఎమ్మార్, తూడి మేఘారెడ్డి



మధుసూదన్‌రెడ్డి



తూడి మేఘారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కట్టిన జూరాల ప్రాజెక్టుకు ఇప్పుడు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని, 30 ఏళ్లయినా ప్రాజెక్టులోని ఏ భాగమూ చెక్కు చెదరలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి చెప్పారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాజెక్టుకు ఏమీ కాదని అన్నారు. ప్రాజెక్టులోని 62 గేట్లు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. వీటిలోని 8 గేట్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా, నాలుగింటికి పూర్తయ్యాయని వెల్లడించారు. పనీపాటా లేని బీఆర్ఎస్ నేతలు జూరాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు విమర్శించారు. జూరాల కూలిపోతోందని కేటీఆర్ ట్వీట్లు చేస్తూ హడావుడి చేస్తున్నారని, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. జూరాల మరమ్మతుల కోసం రూ.11 కోట్లకు టెండర్లు పిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం .. నిధులే విడుదల చేయలేదని మేఘారెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కంగుతిన్న బీఆర్ఎస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గుండుసున్నా ఖాయమని ఎద్దేవా చేశారు.

బీసీ రిజర్వేషన్ల ఖరారు తర్వాతే స్థానిక ఎన్నికలు

ఎమ్మెల్సీ మధుసూదనాచారి డిమాండ్



మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలసి మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు 42% రిజర్వేషన్ల పెంపు అంశం సహా కాంగ్రెస్ పార్టీకి ఏ విషయంలోనూ చిత్తశుద్ధి లేదన్నారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్తానని శాసనమండలి సాక్షిగా హామీ ఇచ్చిన రేవంత్ మాట తప్పారన్నారు. తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ బిల్లు ఆమోదం కోసం ప్రధాని మోదీతో చర్చించడం లేదని విమర్శించారు. బీసీ బిల్లు ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు.


గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తాం

- త్వరలో మంత్రివర్గానికి గిగ్ వర్కర్ల చట్టం
- కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేస్తామని కార్మిక శాఖమంత్రి జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం గిగ్ వర్కర్స్ చట్టం తయారీలో భాగంగా గిగ్ వర్కర్స్ అసోసియేషన్స్‌తో పాటు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన కార్మికశాఖ కార్యదర్శి ఎం.దాన కిశోర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గిగ్ వర్కర్ల హక్కుల కోసం కొత్త చట్టం తీసుకొస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్నారు. దానికి అనుగుణంగా ఇప్పటికే చట్టం డ్రాఫ్ట్ విడుదల చేసి సలహాలు, సూచనలు స్వీకరించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 66 సలహాలు ప్రభుత్వానికి అందాయన్నారు. చట్టానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, వీటిని త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో సమర్పిస్తామని, తర్వాత అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదింపజేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4.5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రతి బిల్లులో 1 నుంచి 2 శాతం సెస్ మాదిరి వసూలు చేసేలా నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.





టెన్త్ సప్లిమెంటరీలో 73.35 శాతం ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 28415 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్ష ఫలితాలను టెన్త్ పరీక్షల విభాగం శుక్రవారం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 13 వరకూ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు 42834 మంది నమోదు చేసుకున్నారు. వీరిలో 38741 మంది పరీక్షలు రాయగా.. 73.35 శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 17034 మంది, బాలికలు 11381 మంది ఉత్తీర్ణులయ్యారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం జూలై 7లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ.కృష్ణారావు తెలిపారు.



30 నుంచి సమ్మె చేస్తాం

జూనియర్ డాక్టర్ల హెచ్చరిక

- ఆరు సమస్యలు పరిష్కరించాలని డీఎంఈకి వినతి పత్రం

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 30 నుంచి సమ్మె చేస్తామని జూనియర్ వైద్యుల (జూడా) సంఘం హెచ్చరించింది. ఈ మేరకు డీఎంఈ నరేందర్ కుమార్‌కు శుక్రవారం సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందించారు. అనంతరం జూడాల సంఘం అధ్యక్షుడు న్యూటన్, కార్యదర్శి అజయ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ఆరు సమస్యల పరిష్కారానికి ఆరోగ్య కార్యదర్శి, డీఎంఈలకు వినతి పత్రం అందించామన్నారు. 'ప్రతి నెలా 10వ తేదీలోగా స్టైపెండ్ ఇవ్వాలని గత ఏడాది నుంచి వినతులు ఇస్తున్నాం. అలాగే ఇస్తామన్నారు. క్రమంగా పదోతేదీ, 15, 20వ తేదీ వరకు స్టైపెండ్ బ్యాంకు ఖాతాలో పడేది. కానీ రెండు మూడు నెలల నుంచి బాగా ఆలస్యం అవుతోంది. ఈ నెల 27 వచ్చింది. ఇప్పటి వరకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు' అని వారు చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, రెండేళ్లకు ఒక దఫా ఇచ్చే ఇంక్రిమెంట్ జనవరి నుంచి పెండింగ్‌లో ఉందని, బకాయిలతో కలిపి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అలాగే ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వడంలేదని వారు చెప్పారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏటా జాబ్ కేలండర్ విడుదల చేయాలని, కళాశాలల్లో విద్యార్థుల కోసం బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు.

రాజ్‌భవన్‌లో పీవీ చిత్రపటావిష్కరణ



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని.. ఆయన చిత్రపటాన్ని శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. అనంతరం పీవీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు, పండితుడని కొనియాడారు. మరో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటాన్ని కూడా కార్గిల్ విజయ దివస్ సందర్భంగా జూలై 26న రాజ్‌భవన్‌లో ఆవిష్కరించనున్నట్లు గవర్నర్ వెల్లడించారు. కార్గిల్ యుద్ధ వీరులను సన్మానించేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పీవీ సంస్కరణలే ఆర్థిక వృద్ధికి కారణాలు

- పీవీ జయంతి సందర్భంగా స్మరించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారతదేశం 5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చెందేందుకు కారణమయ్యాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. విప్లవాత్మక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పీవీకి దక్కుతుందని కొనియాడారు. బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్ ఆయన్ను స్మరించుకున్నారు.

పీవీ భారతదేశ ఆణిముత్యం: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బిడ్డగా, పరిపాలనాదక్షుడుగా, భారతదేశానికి ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించి, క్లిష్టపరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్ది, జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు భారతదేశ ఆణిముత్యమని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు కొనియాడారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన కృషిని స్మరించుకున్నారు.

ఇంటర్‌లో మరోసారి ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ కాలేజీల్లో ప్రవేశాలకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ తెలిపింది. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఈనెల 31 నుంచి ఇంటర్ కాలేజీల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అన్ని కాలేజీలు విద్యార్థుల ప్రవేశ అవకాశాలివ్వాలని సూచించారు.

విద్యావేత్త కృష్ణమూర్తి కన్నుమూత



ఫిలింనగర్ (హైదరాబాద్): ప్రముఖ విద్యావేత్త ఎం.కృష్ణమూర్తి (86) శుక్రవారం తెల్లవారుజామున 4.15 గంటలకు జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ స్థాపనకు, ఆ పాఠశాల అత్యున్నత పురోగతికి ఆయన అహర్నిశలు కృషి చేశారు. కృష్ణమూర్తి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శిగా కూడా విశిష్ట సేవలందించారు. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటని జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్, కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్ కాంచనవల్లి, పాఠశాల సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలియజేశారు.





ఎవరు నన్ను ఏ విధముగా భావించి పూజించుచున్నారో,
అట్లే వారు నా అనుగ్రహము పొందుచుందురు.
మనుజులు ఎన్నో రకములుగ నన్నారాధించు చుందురు.
- హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 28 జూన్ 2025

నాటో ఆయుధ పూజ!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గత ఏలుబడి నుంచీ నాటో కూటమిపై తెస్తున్న ఒత్తిళ్లు ఫలించాయి. గత డెబ్బయి ఆరేళ్లుగా తమ భద్రతను అమెరికాకు అప్పగించి నిష్పూచీగా ఉంటున్న ఆ దేశాలు ఎట్టకేలకు రక్షణ బడ్జెట్‌లను పెంచాలని తీర్మానించాయి. ఈ వ్యయం ఏటా పెరుగుతూ వాటి జీడీపీల్లో 5 శాతానికి చేరుకుంటుంది. ప్రస్తుతం ఆ దేశాల వ్యయం 2 శాతం మాత్రమే. ఇన్నాళ్లూ ట్రంప్‌ను పెద్దగా లెక్కచేయని ఆ దేశాలు బుధవారం నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో శిఖరాగ్ర సదస్సు నిర్వహించి ఆయన్ను ఆకాశానికెత్తేశాయి. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్ అయితే 'డాడీ' అంటూ సంబోధించి, కేవలం ఆయన వల్లనే ఇన్నాళ్లకు వాస్తవ పరిస్థితులను గ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రశంసించారు. 12 దేశాలతో మొదలైన నాటో కూటమి ఇప్పుడు 32 సభ్య దేశాలతో కిక్కిరిసింది. అందరికందరూ అమెరికానూ, ట్రంప్‌నూ పొగడ్తలతో ముంచెత్తారు. ఇరాన్‌కు తన స్థానమేమిటో తెలియజెప్పి ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఆపిన శాంతిదూతగా అభివర్ణించారు. ఈ ప్రహసనమంతా గమనిస్తే – నాటో దేశాల పరాధీనత, తమ ఆత్మగౌరవం పట్ల లేశమాత్రమైనా పట్టింపు లేని నిస్సహాయత కనబడతాయి. కానీ సదస్సు పొడవునా గంభీర వదనంతో ఉండిపోయిన ట్రంప్ ప్రశంసలకు పొంగిపోయినట్టు కనబడలేదు. రష్యాపై పోరాడుతున్న ఉక్రెయిన్‌కు సాయం అందిస్తామని ఒక్క మాటైనా అనలేదు. తమ వంతుగా నాటో దేశాలు కూడా దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఉమ్మడి ప్రకటనలో రష్యా వల్ల దీర్ఘకాలిక బెడద ఉంటుందనీ, ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగుతుందనీ ఒక వాక్యంలో ప్రస్తావించి ఊరుకున్నారు. అంతకుమించితే ట్రంప్‌కు ఆగ్రహం కలుగుతుందన్న భయం ఉన్నట్టుంది. కూటమి తరపున దృఢంగా నిలబడతామని ట్రంప్ ఇచ్చిన హామీ ఒక్కటే కాస్త ఉపశమనం కలిగించే మాట.

సమష్టి భద్రత కోసం రక్షణ వ్యయాన్ని జీడీపీలో 5 శాతానికి తీసుకెళ్లటం తమ ఉక్కు సంకల్పమని ఉమ్మడి ప్రకటన అభివర్ణించటం బాగానేవున్నా దాన్ని పరిపూర్తి చేయటానికి ఆ దేశాల ప్రజానీకం చాలా 'త్యాగాలు' చేయాల్సి ఉంటుంది. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ అన్నట్టు పింఛన్లకూ, సంక్షేమ పథకాలకూ కత్తెరేయాలి. ఇది తమకు అసాధ్యమని కుండబద్దలు కొట్టారు. ప్రశంసల ప్రవాహంలో ఆయనొక్కడిదే భిన్నస్వరం. అందుకే సాంచెజ్‌పై ట్రంప్ విరుచుకు పడ్డారు. సుంకాలతో అంతకంతా వసూలు చేస్తానని హెచ్చరించారు. అటు తర్వాత బెల్జియం, స్లోవేకియాలు సాంచెజ్‌తో గొంతు కలిపాయి. ఈ మూడు దేశాలకు మాత్రమే కాదు... నాటోలోని ఇతర దేశాలకు సైతం జీడీపీల్లో 5 శాతం లక్ష్యాన్ని చేరటం ప్రాణాంతకం. కోతలపై, పొదుపు చర్యలపై పౌరుల నిరసనలు మిన్నంటుతాయి. నాటో దేశాలు ఇంత కాలమూ రక్షణ రంగం కన్నా వైద్య, విద్యారంగాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. ట్రంప్‌కిచ్చిన హామీ నెరవేర్చాలంటే ఇకపై పాఠశాలల కన్నా ఆయుధాలకే అధిక వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈ సీజన్‌లో అమెరికాతోపాటు యూరప్ దేశాల్లో కూడా ఎండలు మండిపోతున్నాయి. 1950 తర్వాత ఈ స్థాయి ఉష్ణోగ్రతలు లేవని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మున్ముందు ఇంకా పెరుగుతాయంటున్నారు. కానీ ఈ దేశాలు రక్షణ వ్యయం పెంచటానికి పర్యావరణ పరిరక్షణ నిధులకు సైతం కోతపెట్టాల్సి వస్తుంది.

అసలు రష్యా రేపో మాపో దాడికి దిగుతుందని ఊదరగొడుతున్న నాటో... ఆ భయాందోళనలకు ప్రాతిపదికేమిటో ఇంతవరకూ చెప్పలేదు. ఇన్ని దశాబ్దాల నాటో చరిత్రలో ఒక్కసారి కూడా రష్యా పూర్వరూపమైన సోవియెట్ ఏనాడూ దండెత్తిరాలేదు. అది 1956లో హంగెరీ, 1968లో చెకొస్లోవేకియా, 1979లో అఫ్గానిస్తాన్‌లలో దురాక్రమణలకు పూనుకున్నది. నాటోలో భాగమైన పశ్చిమ యూరప్ దేశాలపైగానీ... ఆ మాటకొస్తే ఫిన్లాండ్, స్వీడన్, స్విట్జర్లాండ్, యుగోస్లేవియా, ఆస్ట్రియా వంటి తటస్థ దేశాల జోలికిగానీ పోలేదు. పైగా అప్పట్లో పశ్చిమ జర్మనీ ఛాన్సలర్‌గా ఉన్న విలీ బ్రాంట్ సోవియెట్ ఛత్రఛాయలో ఉన్న తూర్పు యూరప్ దేశాలతో సఖ్యతకు ప్రయత్నించారు. అంతేకాదు... స్వీడన్ ప్రధాని ఓలోఫ్ పామే ఆధ్వర్యంలో 1982లో ఒక కమిషన్ నియమించారు. రెండు యూరప్‌లూ విన్యాసాల సమయంలో అవతలి వారికి ముందస్తు సమాచారమీయటం, నిరంతరం సంభాషించుకుంటూ పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవటం చేయాలని ఆ కమిషన్ సిఫార్సు చేసింది. ఈ శాంతి యత్నాలకు మెచ్చి విలీ బ్రాంట్‌కు 1971లో నోబెల్ శాంతి బహుమతి ఇచ్చారు. ఆ బహుమతి కోసం వెంపర్లాడుతున్న ట్రంప్‌కు ఈ చరిత్ర తెలిస్తే మంచిది.

ఆయుధాలు పోగేస్తూ పోతే భద్రత భేషుగ్గా ఉంటుందని నాటోకు ఎవరు నూరిపోస్తున్నారోగానీ... అందువల్ల ఆయుధ బేహారులు మాత్రమే బాగుపడతారు. నిరుడు నాటో రక్షణ వ్యయం 1.47 లక్షల కోట్ల డాలర్లు. ఇందులో అమెరికా వాటా 93,500 కోట్ల డాలర్లు. మిగిలిన 53,500 కోట్ల డాలర్లు యూరప్ దేశాలది. నాటోలో సభ్యత్వం లేని ఉక్రెయిన్ తరపున దౌత్యం నెరపి, రష్యాకు నచ్చజెబితే ఈ మాత్రం కూడా ఖర్చయ్యేది కాదు. భద్రత, రక్షణ చర్చల ద్వారా సాధ్యం తప్ప రక్షణ వ్యయం పెంచుకుంటూ పోవటం ప్రత్యామ్నాయం కాదు. వాస్తవానికి అమెరికాతో కలిసి అఫ్గానిస్తాన్, ఇరాక్, సిరియా తదితర దేశాలపై... సొంతంగా బోస్నియా, హెర్జెగోవినా, లిబియాలపై దాడులు చేసి విధ్వంసం సృష్టించింది నాటోయే! సురక్షితమైన, భద్రమైన ప్రపంచాన్ని సృష్టించటం ... వాతావరణ సంక్షోభాలను అధిగమించటం వర్తమాన యుగ అవసరం. అందుకు భిన్నంగా ఆయుధ పూజకు పూనుకుంటే నాటో దేశాలతోపాటు ప్రపంచమంతా నష్టపోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.తదియ ప.12.22 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** పుష్యమి ఉ.9.30 వరకు తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.10.22 నుండి 11.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.31 నుండి 7.14 వరకు, **అమృతఘడియలు:** రా.10.20 నుండి 11.55 వరకు

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అక్రమ యుద్ధాయుధం... క్రిప్టో!

విశ్లేషణ



శ్రీనాథ్ శ్రీధరన్

"నేనేం బిట్ కాయిన్‌కు లేదా మరే ఇతర క్రిప్టో కరెన్సీలకు అభిమానిని కాదు. నియంత్రణ లేని క్రిప్టో ఆస్తుల వల్ల చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పెరుగుతాయి." 2019లో ఇదీ డోనాల్డ్ ట్రంప్ అభిప్రాయం. కేంద్ర బ్యాంకులు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్థిక నేరాల నిపుణులు వ్యక్తం చేస్తున్న ఆందోళనతో అప్పుడాయన ఏకీభవించారు. క్రిప్టో అనేది సాంకేతికమైన ఒక నూతన ఆవిష్కరణ. ఈ కరెన్సీకి ఎలాంటి వాస్తవిక విలువ, ప్రభుత్వాల గుర్తింపూ లేవు. నల్ల ధన నిరోధక చర్యలను ఇది దెబ్బతీస్తుంది.

మారిన ట్రంప్ ధోరణి

2025 వచ్చేసరికి పరిస్థితి మారింది. క్రిప్టో కరెన్సీ లాబీ నుంచి ఎన్నికల ప్రచారానికి లభించిన మద్దతు, తన కుటుంబానికి బహుమతులుగా అందిన పెట్టుబడులు... ట్రంప్ అవగాహనను మార్చేశాయి. ఇటీవలే ఆయన తన నూతన అవగాహనతో ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ఒకప్పుడు తప్పనిసరి అవసరం అనుకున్న నియంత్రణలు ఒక్క కలం పోటుతో తునాతునకలు అయ్యాయి. ఆ తర్వాత, ట్రంప్ కుటుంబం క్రిప్టో వ్యాపారంలోకి ప్రవేశించింది. టెర్రరిజాన్ని పెంచిపోషిస్తున్న, తెరచాటు లావాదేవీలతో టెర్రరిస్టులకు నిధులను మళ్లిస్తున్న పాకిస్తాన్... స్వయంగా ఈ కుటుంబానికి ఒక వ్యాపార భాగస్వామిగా ఉంది. మరి అమెరికా నేతలే ప్రైవేటు కరెన్సీలు నడుపుతుంటే ఇండియా దాన్ని ఎలా భావించాలి? మాజీ ఖైదీలకు పునరావాసమా అన్నట్లు వారిని తన అధికారిక క్రిప్టో కౌన్సిళ్లకు వ్యూహాత్మక సలహాదారులుగా నియమించుకున్న దేశం గురించి ఎలాంటి అభిప్రాయానికి రావాలి?

చాన్గ్‌పెంగ్ ఝావో(చైనాలో పుట్టిన కెనడియన్) 'బైనాన్స్' కంపెనీకి మాజీ సీఈవో. మనీ లాండరింగ్ నేరాలకు పాల్పడినందుకు యూఎస్ అతడిని జైల్లో పెట్టింది. తర్వాత 430 కోట్ల డాలర్లు చెల్లించి సెటిల్మెంటు చేసుకున్నాడు. హమాస్ వంటి గ్రూపులకు నిధులు చేరవేసే అక్రమ లావాదేవీలకు బైనాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజ్ వీలు కల్పించింది. బైనాన్స్ గూడుపుఠాణీ బట్టబయలుతో ఝావో ఆర్థికంగా అంతమై ఉండాల్సింది. కానీ పాకిస్తాన్ అధికారిక 'క్రిప్టో టాస్క్ ఫోర్స్'కు సలహాదారు అయ్యాడు. అలాగే జస్టిన్ సన్ (చైనా మూలాలున్న సెయింట్ కిట్స్ పౌరుడు) ట్రంప్ సంబంధిత 'వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్'లో 3 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టాడు. ఈ వ్యాపారవేత్త మీద అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఒక సివిల్ ఫ్రాడ్ కేసులో దర్యాప్తు జరిపింది. అలాంటిది రాజకీయ విరాళాల సేకరణ కార్యక్రమాలకు ఇప్పుడతడు ముఖ్య అతిథి.

అక్రమ లావాదేవీలకు మార్గం

అమెరికాలో పలుకుబడి సంపాదించుకోవడానికి క్రిప్టో లావాదేవీలు సరికొత్త మార్గంగా మారుతున్నాయి. అర్హత లేని వ్యక్తులకు, ధూర్త దేశాలకు, వాటి పాలకులకు ఇదో గేట్ వేగా మారినట్లు కనబడుతోంది. ఈ దారిలో వారు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జొరబడుతున్నారు. ఇలాంటి వారి పట్ల ఒకప్పుడు కఠినంగా ఉండే వ్యవస్థాగత



నియంత్రణ నేడు బలహీనపడింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలపు షాడో ఫైనాన్సింగ్ (నియంత్రణ పరిధిలో ఉండని మధ్యవర్తుల ద్వారా బ్యాంకింగ్ కార్యకలాపాలు) కొత్త రూపంలో మళ్లీ తెర మీదకు వచ్చింది. నేరుగా బ్యాంకుల ద్వారా కాకుండా, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో అక్రమ ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటున్నాయి. శుద్ధమైన పాలన అంటూ ప్రపంచ దేశాలకు ఉపన్యాసాలిచ్చే అగ్రరాజ్యానికి ఇవేవీ పట్టవా? ఆర్థిక పారదర్శకతకు మంగళం పాడుతున్న క్రిప్టో టెక్నాలజీని ఇన్నోవేషన్ అంటూ రీబ్రాండింగ్ చేస్తున్నారు. భౌగోళిక రాజనీతి ఈ ముసుగులో కొత్త రూపం ధరిస్తోంది.

విచ్చలవిడిగా ప్రైవేటు క్రిప్టో కరెన్సీలను ఆమోదించడం వల్ల ప్రభుత్వాల ద్రవ్య సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. దీని వల్ల అక్రమ లావాదేవీలు వ్యాప్తి చెందుతాయనీ, వర్ధమాన దేశాల్లో విదేశీ పెట్టుబడుల రాకపోకలపై నియంత్రణ బలహీనమై కరెన్సీ మార్కెట్లు ఒడుదొడుకులకు గురవుతాయనీ ఆందోళన చెందుతోంది. ఎల్ సాల్వడార్, నైజీరియా, లెబనాన్‌లలో ఇదే జరిగింది. ఈ దేశాలు క్రిప్టో కరెన్సీతో ప్రయోగాలు చేసి చేతులు కాల్చుకున్నాయి.

ముఖ్యంగా టెర్రరిస్ట్ గ్రూపులు బ్యాంకుల కళ్లు గప్పేందుకు క్రిప్టో కరెన్సీలను వాడుకుంటున్నాయి. 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' (ఎఫ్ఏటీఎఫ్) పదేపదే ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. అయినా సరే పాకిస్తాన్‌కు ఈ సంస్థ క్లియరెన్స్ లభించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న ఇండియాకు ఇది నిజంగా ముప్పు. క్రిప్టోతో 'ఇ-హవాలా' వాడుకలోకి వచ్చింది. సరిహద్దులతో సంబంధం లేకుండా రియల్ టైమ్‌లో గోప్యంగా నగదు బదిలీ చేయడం, 'ఇ-హవాలా' ద్వారా సాధ్యమవుతోంది.

ఇండియా కఠినంగా ఉండాలి!

సర్వసత్తాక, సార్వభౌమాధికారం గల ఏ దేశమైనా ప్రైవేటు కరెన్సీ చలామణీని ఏ రూపంలోనూ అంగీకరించకూడదు. భారతీయ రిజర్వు బ్యాంకు ఈ విషయంలో కఠిన వైఖరి అవలంబించడం హర్షణీయం. క్రిప్టో కరెన్సీకి ససేమిరా అనడాన్ని పిరికితనం అనో, టెక్నోఫోబియా అనో భావించడం తగదు. వర్తమాన ప్రపంచంలో పెట్టుబడుల ప్రవాహాలను ఆయుధంగా వాడుకుని ఒక దేశ ఆర్థిక

- క్రిప్టో ఒక టెక్ ఇన్నోవేషన్. దీన్ని చట్టబద్ధం చేయాలని ట్రంప్ యోచిస్తున్నారు. అయితే, దుష్టశక్తుల చేతిలో ఇది దురుపయోగం అయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టెర్రరిస్ట్ గ్రూపులు బ్యాంకుల కళ్లుగప్పేందుకు క్రిప్టో కరెన్సీలను వాడుకుంటున్నాయి. ఒక దేశ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచే ఆయుధంగానూ ఇది మారుతుంది.

- ఆర్థిక రంగం భవిష్యత్తు అంతా డిజిటల్ లోనే ఉండవచ్చు. అయినా కరెన్సీ జారీ చేసే తన సార్వభౌమాధికారాన్ని ఇండియా కాపాడుకుని తీరాలి. క్రిప్టోను ఆయుధంగా చేసుకుని దేశాన్ని అస్థిరత్వం పాల్జేసే ముప్పు ఎదురైతే, దాన్ని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలి.

వ్యవస్థను దెబ్బ తీయడం సాధ్యమే. కాబట్టి ఇది జాతీయ భద్రత అంశం. ఇలాంటి ఆర్థిక అస్త్రాల నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఆర్బీఐ జాగ్రత్తలు తీసుకుంటోంది. అయితే, ఆర్బీఐని లొంగదీయడానికి తీవ్రంగా ఒత్తిడి వస్తోంది. ఫైనాన్షియల్ టెక్నాలజీలో ఇదో ఇన్నోవేషన్ అని చెబుతూ, దీనిపై ఆంక్షలను సడలించాలని ప్రపంచ క్రిప్టో వేదికలు కోరుతున్నాయి. క్రిప్టో కరెన్సీ లాభాల మీద ప్రస్తుతం ఆర్బీఐ అధిక పన్నులు విధిస్తోంది. దీనివల్ల క్రిప్టో పెట్టుబడులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించాలని, ఇందుకోసం క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ తగ్గించాలని దేశీయంగా లాబీ జరుగుతోంది. పాత పద్ధతిలో భద్రతాపరమైన లోపాలు లేవా అంటూ వారు వాదిస్తున్నారు. ఇందులో హేతుబద్ధత లేదు. ఇది ప్రమాదకరమైన వాదన. మరోవైపు అమెరికా కూడా దౌత్యమార్గాల్లో ఒత్తిడి చేస్తోంది. ఇండియా ఎట్టి పరిస్థితిలోనూ తలొగ్గకూడదు.

క్రిప్టో కరెన్సీని అడ్డుకునేందుకు ఇండియా వ్యవస్థాగత నిబంధనలను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలి. నిఘా, ఫోరెన్సిక్ దర్యాప్తు సామర్థ్యాలు, డిజిటల్ అస్త్రాలు సంసిద్ధం చేసుకోవాలి. క్రిప్టోను అడ్డు పెట్టుకుని 'ట్రోజన్ హార్స్' తరహాలో ఆర్థిక వ్యవస్థ మీద దాడి జరిగితే, రక్షించుకోవడానికి సర్వసన్నద్ధంగా ఉండాలి.

ఆర్థిక రంగం భవిష్యత్తు అంతా డిజిటల్‌లోనే ఉండవచ్చు. అయినా ఈ రంగంలో మన ఉజ్వల భవితకు అవసరమైన ప్రణాళికలు మన ప్రభుత్వమే రచించుకోవాలి. విదేశీ మార్కెట్ల పటాటోపం మీద ఆధారపడకూడదు. క్రిప్టో యుగంలో మన సార్వభౌమత్వాన్ని రక్షించుకోవడమే ప్రధానం. సరిహద్దులు, సముద్రాలు, గగనతలం, సైబర్ స్పేస్ రక్షణకు ఎలాంటి వ్యూహాత్మక చతురతను అవలంబిస్తామో అలాంటి తీరులోనే ఈ ఆర్థిక రక్షణ వ్యూహాలు ఉండాలి. క్రిప్టో ప్రస్తుతం ఒక భౌగోళిక రాజకీయ ఆయుధం. వ్యూహాత్మకంగా హాని చేయగల శక్తి దానికి ఉంది. దాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా మన ఆర్థిక వ్యవస్థను దుర్భేద్యంగా నిర్మించుకోవాలి.

వ్యాసకర్త కార్పొరేట్ అడ్వైజర్, 'ఫ్యామిలీ అండ్ ధంధా' రచయిత ('ద లైవ్‌మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఆయుధ శాంతి



నోబెల్ శాంతి బహుమతికి నిధులు సమకూర్చే కుటుంబం 19, 20 శతాబ్దాల్లో అన్ని దిశలా ఆయుధాలు, పేలుడు పదార్థాలు అమ్మడం ద్వారా సంపద పోగేసుకుంది. క్రిమియన్ యుద్ధ సమయంలో రష్యన్లకు, తర్వాత బ్రిటిష్, ఫ్రెంచ్ వారికి, అటుపై 'తటస్థ' స్వీడన్‌కు ఆయుధాలు అమ్మారు. కేవలం 'డైనమైట్' కాదు, పెద్ద గన్స్, అన్నట్టూ, ఆల్ఫ్రెడ్ నోబెల్ కంపెనీ ఇప్పటికీ ఉంది – బోఫోర్స్. ఊరికే చెబుతున్నా.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

వాళ్లేంటి ఇచ్చేది?



మీకు తెలుసా? ప్రపంచ గుర్తింపునిచ్చే యోగా టీచర్ సర్టిఫికెట్ ఇప్పుడు యూఎస్ నుంచి వస్తోందని! 'ప్రపంచ గుర్తింపు' ఉన్న ఆ సర్టిఫికెట్ కోసం ఇక ఇండియా యోగా టీచర్లు అమెరికాకు పరుగెడుతున్నారు. ఆహా! మూర్ఖులు, తమను తామే ఓడించుకునే జనాలు ఎవరైనా చరిత్రలో ఉన్నారంటే– వాళ్లు భారతీయులే!

– హిందోళ్ సేన్‌గుప్తా, హిస్టారియన్

మూడూ వేరు!



హార్ట్ ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్, కార్డియాక్ అరెస్ట్ – ఈ మూడూ ఒక్కటి కావు. అయినా ఈ మూడు మాటలను వార్తల్లో మార్చి మార్చి వాడుతుంటారు. ముఖ్యంగా ఎవరైనా సెలబ్రిటీ చనిపోయినప్పుడు! నిజమేమిటంటే, ప్రతి ఒక్కరూ కార్డియాక్ అరెస్ట్‌తోనే చనిపోతారు. అంటే గుండె ఆగిపోయిందని! ఈ మూడింటినీ కచ్చితత్వంతో, బాధ్యతతో వాడటం అవసరం.

– డా॥ ఎస్.పి. కాలంత్రి, మెడికల్ సూపరింటెండెంట్

ఓడిందెవరు?



ఇజ్రాయెల్, ఇరాన్, యూఎస్ – మూడూ విజయాన్ని ప్రకటించుకున్నాయి. జనం ఒకప్పుడు యుద్ధంలో ఎవరూ విజేతలు ఉండరని చెబుతుండేవారు. చూస్తుంటే ఇప్పటి యుద్ధంలో పరాజితులు కూడా ఉన్నట్టు లేరు.

– హూ పిజిన్, చైనా సంపాదకుడు

కలిపేందుకే భాషలు



నా కెరీర్‌కు సహాయపడిన భాషలు– మరాఠీ, హిందీ, ఇంగ్లిష్. నేను ఈ మూడు భాషల్లో రాయగలను, మాట్లాడగలను. ఇక గుజరాతీ, సింధీ, కచ్ఛీ, కొంకణి (పొరుగువారి పుణ్యం), అస్సామీస్ (సహోద్యోగుల వల్ల), పంజాబీ, ఇంకా కొంచెం మలయాళం (మరిది వల్ల) కూడా నాకు అర్థమవుతాయి. భాషలు కలుపుతాయి. విభజన రాజకీయాలకు బలికావొద్దు.

– స్మితా దేశ్‌ముఖ్, కమ్యూనికేషన్స్ ఎక్స్‌పర్ట్

జాయ్ రైడ్



ఇతర దేశాల్లో కార్లను అద్దెకు తీసుకున్నట్టుగానే, శ్రీలంకలో మీరు ఒక ఆటోను అద్దెకు తీసుకుని మీకు మీరే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లొచ్చు.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

అది కష్టమా?



గ్లోబల్ నార్త్ దేశాలన్నీ గ్లోబల్ సౌత్ ప్రభుత్వాల మార్పిడి మీద చూపుతున్నంత ఆసక్తి, వాతావరణ మార్పుల మీద చూపడం లేదు.

– నితిన్ సేఠీ, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సంస్కరణలకు ఆద్యుడు

పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ) 1921 జూన్ 28న ఒక సామాన్య కుటుంబంలో జన్మించి భారత రాజకీయాలలో దాదాపుగా ఐదు దశాబ్దాల పాటు శాసనసభ్యునిగా, ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, దేశానికి 9వ ప్రధానమంత్రిగా (1991–96) పనిచేశారు. ప్రధాని పదవి అధిష్ఠించిన మొట్టమొదటి దక్షిణ భారతీయుడూ ఆయనే. కాంగ్రెస్‌కు లోక్‌సభలో తగిన సంఖ్యాబలం లేనప్పటికీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించినటువంటి రాజకీయ చాణక్యుడు.

1991లో మన విదేశీ మారక ద్రవ్యం నిలువలు కేవలం బిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉన్నాయి. విదేశీ అప్పులు కొండలా పేరుకుపోయాయి. దీనికి తోడు ద్రవ్యోల్బణం రెండు అంకెలకు చేరింది. ఈ సమయంలో దేశ ప్రధానిగా పీవీ చేపట్టినటువంటి సంస్కరణలు మన దేశం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేశాయి. ముఖ్యంగా 1991లో నూతన పారిశ్రామిక విధానం తీసుకురావడం పీవీ చేసినటువంటి పెద్ద ఆర్థిక సంస్కరణ. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల ద్వారా లైసెన్సులను సులభతరం చేశారు. కొన్ని ప్రాధాన్యతా రంగాలు మినహా... అన్ని పరిశ్రమలలో ప్రైవేటు వ్యక్తులను పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించడం, పన్నుల్లో సంస్కరణలు తేవడం, ఎగుమతులను ప్రోత్సహించడం వంటి ఆర్థిక సంస్కరణ కారణంగా దేశ అభివృద్ధి వేగం పుంజుకుంది.



పీవీ నరసింహారావు

ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని తీసుకువచ్చి తనకున్నటువంటి వందలాది ఎకరాల భూమిని వదులుకోవడం చేసి ఆదర్శంగా నిలిచారు. బహుభాషావేత్త పీవీ 2004 డిసెంబర్ 23న కన్నుమూశారు. 2024లో భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'తో గౌరవించింది. ఆయనను నేటి యువత, రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవలో నిమగ్నం కావాలి.

– డా॥ చింత ఎల్లస్వామి । అసిస్టెంట్ ప్రొఫెసర్ (నేడు పీవీ జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

అసలు బాధితులు... సామాన్య ప్రజలే!

అభిప్రాయం



సైనాల గోవర్ధన్

కాళేశ్వరం మూడు బ్యారేజీలలో జరిగిన అవినీతిపై విచారిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి పినాకినీ చంద్రఘోష్, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును విచారించారు. ఈ విచారణలో కేసీఆర్ యూటర్న్ ఎందుకు తీసుకున్నారు అనేది చర్చనీయాంశంగా మారింది.

నాడు తుమ్మిడిహెట్టి దగ్గర నీటి లభ్యత లేదని... ప్రాజెక్టును 'రీ డిజైనింగ్, రీ ఇంజినీరింగ్' పేరుతో అక్కడి నుంచి కాళేశ్వరానికి మార్చి... అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అంతా తానై వ్యవహరించింది కేసీఆర్ అనే సంగతి అందరికీ తెలిసిందే. అటువంటి ఆయన తుమ్మిడిహెట్టి దగ్గర కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిలువ చేయాలన్న నిర్ణయం అంతా అధికారులదే అనీ, తనకేం సంబంధం లేదనీ చంద్రఘోష్ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. పంపు హౌస్ హెడ్‌కు తాకేంతవరకు నీటిని నిలువ చేయమని తాను ఆదేశాలు ఇవ్వలేదని తప్పించుకున్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం తమ ప్రభుత్వ హయాంలో రూ. 280 కోట్ల నిధులు విడుదల జరిగిందనీ, వినియోగించే అధికారాలు వారికే ఇచ్చామనీ చెప్పారు. ప్రభుత్వ ఆమోదంతోనే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామన్నారు. బ్యారేజీల కోసం స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికంగానే జరిగిందని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం కోసం నిధులు సమీకరించేందుకే ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేశామనీ, ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే నిధులతో ఆ రుణాలను తిరిగి చెల్లించాలనుకున్నామనీ వివరించారు. కానీ, వివిధ కారణాల వల్ల అది సాధ్యం కాలేదన్నారు.

'తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదు' అనే సీడబ్ల్యూసీ పత్రం బీఆర్ఎస్-బీజేపీ పవిత్ర మైత్రిలో భాగంగా సృష్టించబడింది. ప్రతిఫలంగా బీఆర్ఎస్ రాష్ట్రపతి ఎన్నిక, వ్యవసాయ చట్టాలు, నోట్ల రద్దు తదితర బిల్లులకు మద్దతునిచ్చింది. వీరి బంధం 2022 వరకు సాగింది. ఈ బంధం తెగిన (2022)



తర్వాత 'కాళేశ్వరం కేసీఆర్ కుటుంబపు ఏటీఎం' అని మోదీ, అమిత్ షాలు, రాష్ట్ర నాయకులు అన్న మాటల తూటాలు మర్చిపోలేము.

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనేది ఎంత కల్పితమో కాళేశ్వరం బ్యారేజీల అవినీతి అక్రమాలపై చీల్చి చెండాడిన ఎన్డీఎస్ఏ నివేదిక నిగ్గు తేల్చింది. 2022-23లో మేడిగడ్డ నుండి విడుదలైన నీరు 4,628 టీఎంసీలు. 2019-20లో 2,046 టీఎంసీలు. 2021-22లో 2,671 టీఎంసీలు. 2023-24 మేడిగడ్డ ఐదు అడుగులు కుంగి, మూడు అడుగుల వెడల్పుతో నిట్టనిలువునా, అడుగు నుండి పైవరకు చీలిన సంవత్సరం 1,942 టీఎంసీల నీరు విడుదలైంది. పై ఐదేళ్లలో మొత్తం 13,151 టీఎంసీల నీటిని మేడిగడ్డ విడుదల చేసింది. ఇందులో 85-90 శాతం నీరు తుమ్మిడిహెట్టి-ప్రాణహిత నుండి వచ్చిందే! ప్రాణహిత నది లేకపోతే మేడిగడ్డ వద్ద బ్యారేజీ అనే ఆలోచన కేసీఆర్‌కు వచ్చేది కాదు.

వ్యాప్ కోస్ లైడార్ సర్వే మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉందని నిర్ణయించగా, ఆ నివేదిక ఆధారంగా బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తీసుకున్నామని కేసీఆర్ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. వ్యాప్ కోస్ సీఎండీ రాజిందర్ గుప్తా ఇంట్లో 38 కోట్ల రూపాయలను, నోయిడా, తదితర ప్రాంతాలలో విలువైన రియల్ ఎస్టేట్ భూములు, విల్లాల రిజిస్ట్రేషన్ పత్రాలు, భారీ బంగారం నగలను, సీబీఐ 2023 మే 3న దాడులు చేసి జప్తు చేసి ఆయన్ని జైల్లో పెట్టింది నిజం కాదా? ఈ డబ్బంతా ఎక్కడిది? తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనే సాకుతో బ్యారేజీ స్థలాన్ని మేడిగడ్డకు మార్చేందుకు పొందినదే అనేది విమర్శకుల అనుమానం.


ప్రతి ఇంజనీర్‌కూ బ్యారేజీకు, డ్యామ్‌కు ఉన్న తేడా తెలుసు. వాటిని ఎలా నిర్వహించాలో తెలుసు. బ్యారేజీలో 2.5 టీఎమ్‌సీల కంటే ఎక్కువ నీళ్ల నిలపకూడదు. ఎక్కువైన నీళ్లన్నీ నదికైనా లేదా కాలువకైనా వెళ్లాలి. మరి, మేడిగడ్డలో 16, అన్నారంలో 12, సుందిళ్లలో 8 టీఎంసీలు నిల్వ చేయాలని ఆదేశించింది ఎవరు?

కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్న రుణాలు, ఆ ప్రాజెక్టు వినియోగం ద్వారా సమకూరే లాభాలతో, ఆ రుణాలను చెల్లించడం అసాధ్యం. అప్పులిచ్చిన బ్యాంకులు, కేంద్ర సంస్థలు... అసలు, వడ్డీలు పొందుతుండగా; ప్రజల సేవలకు, భారీగా కోత పడింది. చివరకు అసలు, వడ్డీలు నెల నెలా చెల్లించేది కోట్లాది సామాన్య ప్రజలే అనేది వాస్తవం.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త, నీటిపారుదల ప్రాజెక్టుల విశ్లేషకులు

బసవ బోధ

సమాజంలో నెలకొన్న దురాచారాలను, మూఢ విశ్వాసాలను సమూలంగా నిర్మూలించి జనులను సన్మార్గంలో నడిపించి ఉద్ధరించాలని తపించి ఆ ప్రయత్నంలోనే తనువులను బాసిన మహనీయులెందరో! వారిలో బసవేశ్వరుడు ఒకరు. బసవేశ్వరుడు క్రీ.శ. 1131లో కర్ణాటకలో జన్మించాడు. ఆయనకు ఎనిమిదేళ్ళ వయసులో ఉపనయనం చేయదలచిన తల్లితండ్రులతో, 'అక్కకు లేని ఉపనయనం నాకెందుకు?' అని ప్రశ్నించాడు. సదాచారం, సత్ప్రవర్తన లేని జీవితం వ్యర్థమనీ, చిత్త శుద్ధి దైవ సాక్షాత్కారాన్ని కల్గిస్తుందనీ చాటి చెప్పాడు. బసవేశ్వరుని అపారమైన మేధను గమనించి కల్యాణ కటకాన్ని పాలించే ఆనాటి రాజు బిజ్జలుడు ఆయనను తన రాజ్యంలో మహామంత్రిగా నియమించాడు. కేవలం శాసించటానికే పరిమితమైన రాజసభను ప్రజాసమస్యలను పరిష్కరించే వేదికగా 'అనుభవ మంటపం'గా ఆయన తీర్చిదిద్దాడు. 'కాయకమే కైలాసం' అనే సిద్ధాంతాన్ని బోధించి ప్రజలను కార్యకర్తలుగా, కార్యదక్షులుగా మలిచాడు. తాము చేసే పనిని శ్రద్ధతో చేయటమే అసలైన పూజ అని తెలియజెప్పాడు.



మానవులంతా సమానమే, శివుడే సత్యం, ఆయన నిరాకారుడు, ఖరీదైన ఆలయాలు, అలంకారాలు వద్దు, వాస్తు – జ్యోతిషాలు అసత్యాలు, భక్తి కన్నా సత్ప్రవర్తన మిన్న అని పదేపదే గొంతెత్తి చెప్పాడు. వేటగాడైన కన్నప్ప, పారిశుద్ధ్యపు పని చేసిన మేదర చెన్నయ్య, అంటరాని వాడైన సిరియాళుడు ఎలా ముక్తి పొందగలిగారో వివరించాడు. కులాంతర వివాహాలను, సహపంక్తి భోజనాలను బసవేశ్వరుడు ఆనాడే ప్రోత్సహించి సంఘ సంస్కరణకు పూనుకొన్నాడు. ఇలాంటివి నచ్చని సంప్రదాయవాదులు కుట్ర పన్నారు. అయినా వాటిని ఎదుర్కొంటూ ఆయన తన కార్యక్రమాలను కొనసాగిస్తూనే శివైక్యం చెందాడు.

– రాచమడుగు శ్రీనివాసులు


DMart®
Daily Discounts Daily Savings
మీ కాలేజీ చదువును స్టైల్‌గా ప్రారంభించండి
షాప్ ఆన్‌లైన్
DMart ready
Google Play
Download on the App Store
కాలేజీ మర్చండైజ్
ఎంఆర్‌పిపై 15%-35% తగ్గింపు బ్రాండెడ్ లాంగ్‌బుక్ మరియు నోట్‌బుక్‌లు
₹ 275* మాత్రమే జెకె కాపీయర్ పేపర్ ఎ4 (21 సెం.మీ x 29.7 సెం.మీ) 70 జీఎస్ఎమ్ 500 షీట్‌లు ఎంఆర్‌పి ₹ 355
JK EASY COPIER
కనీసం 20% ఎంఆర్‌పిపై తగ్గింపు పెన్నులు
₹ 299**# నుంచి కాలేజీ బ్యాగు
₹ 399**# నుంచి ల్యాప్‌టాప్ బ్యాగు
₹ 199**# మాత్రమే ఎగ్జిక్యూటివ్ ఫోల్డర్ 12 పాకెట్ ఫైల్ ఎంఆర్‌పి ₹ 290
₹ 49**# నుంచి పర్సులు
₹ 249**# నుంచి బాస్కెట్‌బాల్
₹ 129**# మాత్రమే స్టెల్లో ప్యూరో స్పోర్ట్ బాటిల్ 720 ఎమ్ఎల్ ఎంఆర్‌పి ₹ 205
₹ 149**# నుంచి స్టీల్ బాటిల్
₹ 399**# మాత్రమే జెబ్రానిక్స్ హెడ్ ఫోన్స్ ఎంఆర్‌పి ₹ 799
₹ 359**# నుంచి ట్రిమ్మర్
₹ 399**# నుంచి హెయిర్ డ్రైయర్
₹ 149**# నుంచి బెల్ట్
₹ 99**# నుంచి సన్ గ్లాసెస్
₹ 379**# మాత్రమే ఫుట్‌బాల్ ఎంఆర్‌పి ₹ 470
మాన్సూన్ స్పెషల్
₹ 349**# నుంచి గొడుగు
₹ 449**# నుంచి జీల్ రెయిన్ సూట్
₹ 149**# మాత్రమే పోంచో ఎంఆర్‌పి ₹ 199
₹ 799**# నుంచి స్పిన్ మాప్
₹ 49* నుంచి క్లాత్ క్లిప్ 12 పీసెస్
₹ 229**# నుంచి పురుషుల షూస్
₹ 359**# నుంచి బాటా లేడీస్ బెల్లీ షూస్
డైలీ ఎసెన్షియల్స్ అండ్ గ్రోసరీ
₹ 369* మాత్రమే బెల్లా వీటా పురుషుల / లేడీస్ యునిసెక్స్ పెర్ఫ్యూమ్ గిఫ్ట్ ప్యాక్ 4 ఎన్ x20 మి.లీ ఎంఆర్‌పి ₹ 649
కొనండి 1 పొందండి 1 ఉచితంగా స్టేఫ్రీ సెక్యూర్ నైట్ కాటన్ కంఫర్ట్ XXL ప్యాడ్స్ 40 U ఎంఆర్‌పి ₹ 330*
₹ 524*/₹ 460* మాత్రమే సర్ఫ్ ఎక్సెల్ మాటిక్ ఫ్రంట్/ టాప్ లోడ్ లిక్విడ్ డిటర్జెంట్ పౌచ్ 4 లీ ఎంఆర్‌పి ₹ 799 / ₹ 718
₹ 250* మాత్రమే పారాచూట్ కొకనట్ ఆయిల్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹ 346
₹ 215* మాత్రమే పాండ్స్ బ్రైట్ బ్యూటీ క్రీమ్ 50 గ్రాములు ఎంఆర్‌పి ₹ 330
కొనండి 1 పొందండి 1 ఉచితంగా నివియా బాడీ మిల్క్ నరిషింగ్ లోషన్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹ 760*
కొనండి 1 పొందండి 1 ఉచితంగా ట్రేసమే కేరాటిన్ స్మూత్ షాంపూ 580 మి.లీ ఎంఆర్‌పి ₹ 1,016*
₹ 360* మాత్రమే డవ్ మాయిశ్చరైజింగ్ క్రీమ్ సోప్ 4x125 గ్రాములు ప్రతి ఎంఆర్‌పి ₹ 522
₹ 99* మాత్రమే డాక్టర్ ఓట్కర్ ఫన్‌ఫుడ్స్ డిలైట్ వెజ్ మయోన్నైస్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹ 189
₹ 380* మాత్రమే కెల్లాగ్స్ మ్యూస్లీ ఫ్రూట్ అండ్ నట్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹ 525
₹ 349* మాత్రమే నటెల్లా ఫెర్రెరో 350 గ్రాములు ఎంఆర్‌పి ₹ 399
₹ 429* మాత్రమే నట్‌రాజ్ క్యాలిఫోర్నియా ఆల్మండ్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 599
₹ 280* మాత్రమే డాబర్ హనీ స్క్వీజీ ప్యాక్ 400 గ్రాములు ఎంఆర్‌పి ₹ 420
₹ 365* మాత్రమే రెడ్ బుల్ ఎనర్జీ డ్రింక్ బాక్స్ 4x250 మి.లీ ప్రతి ఎంఆర్‌పి ₹ 480
₹ 43* మాత్రమే లూస్ చక్కెర 1 కిలో
₹ 44* మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ రైస్ 1 కిలో
₹ 33* మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹ 99* మాత్రమే లూస్ తాండూర్ కంది పప్పు 1 కిలో
₹ 39* మాత్రమే లూస్ రవ్వ 1 కిలో
₹ 75* మాత్రమే లూస్ శనగపిండి 1 కిలో
₹ 51* మాత్రమే లూస్ అటుకులు 1 కిలో
₹ 119* మాత్రమే లూస్ వేరుశనగ 1 కిలో
₹ 419* మాత్రమే బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 621
₹ 489* మాత్రమే కాజు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹ 704
దుస్తులు
₹ 199**# నుంచి లేడీస్ క్యాజువల్ టాప్‌లు
₹ 199**# నుంచి లేడీస్ ఎత్నిక్ షార్ట్/లాంగ్ కుర్తా
₹ 499**# నుంచి లేడీస్ డ్రెసెస్
₹ 249**# నుంచి లేడీస్ సాండిల్స్
₹ 279**# నుంచి లేడీస్ షూస్
₹ 199**# నుంచి లేడీస్ క్యాజువల్ షర్ట్
₹ 349**# నుంచి లేడీస్ జెగ్గింగ్
₹ 199**# నుంచి లేడీస్ క్యాజువల్ లోయర్
₹ 449**# నుంచి పురుషుల కాటన్ చినోస్
₹ 199**# నుంచి పురుషుల క్యాజువల్ షూస్
₹ 99**# నుంచి పురుషుల ఫ్యాన్సీ టి-షర్ట్
₹ 199**# నుంచి పురుషుల క్యాజువల్ ఫార్మల్ షర్ట్
₹ 349**# నుంచి పురుషుల ఫార్మల్ ట్రౌజర్/జీన్స్
₹ 149**# నుంచి పురుషుల ఫ్యాషన్ షార్ట్స్
ఎంఆర్‌పిపై కనీసం 25% తగ్గింపు అన్ని బ్రాండెడ్ పురుషుల అండర్ గార్మెంట్స్
ట్రెండింగ్ వార్డ్రోబ్ లుక్స్
పురుషుల క్యారెక్టర్ టి-షర్ట్‌లు @ ₹ 299**# నుంచి
పురుషుల క్యాజువల్ షర్ట్‌లు @ ₹ 499**# నుంచి
పురుషుల ఫ్యాషన్ జీన్స్ @ ₹ 799**# నుంచి
లేడీస్ ఫ్యాషన్ టి-షర్ట్‌లు టాప్‌లు @ ₹ 199**# నుంచి
లేడీస్ క్యాజువల్ బాటమ్ వేర్ @ ₹ 299**# నుంచి
లేడీస్ డెనిమ్ @ ₹ 349**# నుంచి
లేడీస్ కుర్తా సెట్ @ ₹ 599**# నుంచి
కనీసం 6%
రామంతాపూర్: 040-27032906 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి, తెలంగాణ డీమార్ట్: 040-29331007 • బండ్లగూడ: 040-29556703 • సనత్‌నగర్ (మైహోమ్): 040-69014700 • బాలానగర్: 040-23075362 • మూసాపేట: (పిఎస్ఆర్): 040-29568367/65
కొంపల్లి: 040-27165371 • అంబర్‌పేట్: 040-27428335 • బాదర్‌గూడ (హిమాయత్‌నగర్): 040-23298560 • కాచీగూడ: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆర్‌సి పురం: 0845-5297917 • నల్లగండ్ల: 040-29568265 • బాఫీజీపేట్: 040-49024270 • కూకట్‌పల్లి
(ఎన్ఎస్ఎల్): 040-29568182 • షేక్‌పేట్ (టోలి చౌక్): 7207851375 • కావూరి హిల్స్: 040- 43730255 • ఉప్పర్‌పల్లి (అత్తాపూర్): 040-29705890 • బోయనపల్లి: 040-46014924 • ఎస్.డి. రోడ్డు (సికింద్రాబాద్): 040 27718041 • కుషాయిగూడ: 040-49884386 • సాఫిల్‌గూడ: 040-27130123
వనస్థలిపురం: 040-29882485 • చంపాపేట: 7207268492 • మలక్‌పేట: 040-68234900 • ఎల్.బి నగర్: 040-69019809 • ఖుత్బేసర్: 7382054232 • సూర్యాపేట: 8684-293301 • నిజాంపేట: 040-29370013 • నార్సింగి: 8333905810 • మిర్యాలగూడ: 8500259852 • సన్‌సిటీ, గంధంగూడ: 7569890228
1 ఎన్
Impulse/06/25

8 రోజులు.. 5 దేశాలు!

త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 2వ తేదీ నుంచి 8 రోజులపాటు ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. బ్రెజిల్‌లోని రియోడీజనిరోలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్రంలో పాల్గొననున్న ప్రధాని మోదీ ఆ తర్వాత.. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియాల్లో పర్యటించనున్నారని విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. మొదటగా జూలై 2, 3వ తేదీల్లో ఆఫ్రికా దేశం ఘనా వెళ్తారు. ఈ దేశంలో ప్రధాని మోదీ మొట్టమొదటి పర్యటన ఇదే కాగా, మన ప్రధాని ఒకరు అక్కడ పర్యటించడం దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఇదే ప్రథమం. ఘనా నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు వెళ్తారు. అక్కడ జూలై 3, 4వ తేదీల్లో పర్యటించనున్నారు. 1999 తర్వాత భారత ప్రధాని ఒకరు అక్కడికెళ్లడం ఇదే మొదటిసారి. అనంతరం, జూలై 4, 5వ తేదీల్లో అర్జెంటినా వెళ్తారు. జూలై 5 నుంచి 8 వరకు జరిగే 17వ బ్రిక్స్ సమిట్‌లో పాల్గొంటారు. చివరగా ప్రధాని మోదీ నమీబియా చేరుకుంటారు. మోదీ నమీబియాలో పర్యటించే మూడో భారత ప్రధాని కావడం గమనార్హం.

అత్యంత ప్రాచీన రాతి శిలలు

416 కోట్ల ఏళ్ల నాటివి ● కెనడాలో గుర్తించిన పరిశోధకులు

న్యూయార్క్: ఇవేమిటో తెలుసా? భూమిపైనే అత్యంత ప్రాచీనమైన రాతి శిలలు. తూర్పు కెనడాలో క్విబెక్ ప్రావిన్స్‌లో హడ్సన్ బే తీరంలోని నువాగిటిక్ గ్రీన్‌స్టోన్ బెల్ట్‌లో వీటిని గుర్తించారు. అయితే వీటి వయసు ఎంతన్నది సైంటిస్టుల నడుమ తీవ్ర భేదాభిప్రాయాలకు కారణమైంది. ఈ బూడిద రంగు రాళ్లు 400 కోట్ల ఏళ్ల కంటే ముందే ఏర్పడినట్లు తొలుత అంచనా వేశారు. కాదు, 308 కోట్ల ఏళ్ల క్రితం నాటివేనని మరికొందరు సైంటిస్టులు చెప్పుకొచ్చారు. ఎక్కువమంది మాత్రం 370 కోట్ల ఏళ్లనాటివన్న వాదనను అంగీకరించారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రాళ్ల వయసు లెక్కగట్టి, దాదాపు 416 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడ్డాయని తేల్చారు. అంటే భూమి శైశవ దశలో ఉన్నప్పుడే రూపుదాల్చాయన్నమాట. భూగోళంపై ఇంతకంటే పురాతన రాళ్లు ఎక్కడా లేవని సైంటిస్టులు స్పష్టం చేస్తున్నారు. భూమి పుట్టుక, చరిత్రను అంచనా వేయడానికి ఈ పరిశోధన తోడ్పడుతుందని భావిస్తున్నారు. ''భూమి తొలినాళ్లకు చెందిన హడియన్, ఆర్కియన్ యుగాలకు సంబంధించి మనకిప్పటిదాకా తెలియని ఎన్నో విశేషాలు ఈ శిలల అధ్యయనం ద్వారా వెలుగులోకి వస్తాయి. భౌగోళిక మార్పుల వల్లే ఈ శిలలు ఏర్పడ్డాయి. కాకపోతే ఇప్పటిదాకా చెక్కుచెదరకుండా నిలిచి ఉండడం అద్భుతమే'' అని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ అధ్యయన వివరాలను జర్నల్ సైన్స్‌లో ప్రచురించారు.



వెలుగు చూసిన అతి ప్రాచీన శిలలు (ఇన్‌సెట్లో) శిలల క్లోజప్

భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం

- త్వరలోనే కుదుర్చుకుంటాం
- ఇండియాతో కలిసి పని చేయబోతున్నాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



వాషింగ్టన్: భారత్‌తో త్వరలో భారీ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చాలారోజులుగా కొనసాగుతున్న చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చారు. ట్రంప్ గురువారం శ్వేతసౌధంలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. త్వరలో గొప్ప ఒప్పందాలు పట్టాలెక్కబోతున్నాయని, వాటిలో ఒక ఒప్పందం బహుశా ఇండియాతోనే కావొచ్చని పేర్కొన్నారు. అది భారీగానే ఉంటుందని ఉద్ఘాటించారు. వ్యాపారం, వాణిజ్యం విషయంలో ఇండియాతో కలిసి పని చేయబోతున్నామని వివరించారు. ప్రతి దేశంతోనూ తమకు చక్కటి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ప్రతి దేశం ఆసక్తి చూపుతోందని అన్నారు. ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకొనే పనిలో తమ ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైందని తెలిపారు. అయితే, ప్రతి ఒక్కరితో ఒప్పందాలకు రావాలన్న ఉద్దేశం తమకు లేదన్నారు.

2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు వాణిజ్యం

అమెరికాతో తదుపరి వాణిజ్య చర్చల కోసం భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ బృందం గురువారం వాషింగ్టన్‌కు చేరుకుంది. మధ్యంతర ట్రేడ్ డీల్‌ను వచ్చే నెల 9వ తేదీ కల్లా ఖరారు చేసుకొనేందుకు ఇరుదేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇండియా ఉత్పత్తులపై ఏప్రిల్ 2న విధించిన అధిక టారిఫ్‌లను జూలై 9 దాకా ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. గడువులోగా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు వ్యవసాయం, పాడి పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తులపై సుంకాలను చాలావరకు మినహాయించాలని అమెరికా కోరుతుండడం భారత్‌కు ఇబ్బందికరంగా మారింది. ఎలక్ట్రిక్ వాహనాలు, మద్యం, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, కొన్ని రకాల పండ్లు, జన్యుమార్పిడి పంటలపై సుంకాలు భారీగా తగ్గించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. వస్త్రాలు, వజ్రాలు, బంగారు అభరణాలు, తోలు ఉత్పత్తులు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటి పండ్లపై సుంకాల్లో కోత విధించాలని అమెరికాను భారత్ కోరుతోంది. వాణిజ్య ఒప్పందంలో ఇరుదేశాల డిమాండ్లకు ఏమేరకు ప్రాధాన్యం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ ప్రస్తుతం 191 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి దీన్ని ఏకంగా 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని ఇరుదేశాలు పట్టుదలతో ఉన్నాయి.

చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం

అమెరికా, చైనా మధ్య కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఈ ఒప్పందం వివరాలు బహిర్గతం చేయలేదు. రెండు రోజుల క్రితమే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ తాజాగా స్పష్టంచేశారు. అమెరికాతో ఒప్పందం కుదిరిన మాట నిజమేనని చైనా వాణిజ్య శాఖ సైతం ధ్రువీకరించింది. చైనాలోని అరుదైన ఖనిజాలను అమెరికా కంపెనీలు సులభంగా పొందడానికి వీలుగా ఒప్పందానికి రాబోతున్నట్లు రెండు వారాల క్రితం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ, తాజా ఒప్పందంలో ఈ అంశాన్ని చేర్చారా? లేదా? అనేది బయటపెట్టలేదు. అమెరికా కాలేజీల్లో చదువుకుంటున్న చైనా విద్యార్థుల వీసాలను రద్దుచేసే ప్రక్రియను నిలిపివేస్తామని అమెరికా ఇప్పటికే హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో రెండు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది.

సమస్యల పరిష్కారానికి 'నిర్మాణాత్మక రోడ్‌మ్యాప్'

- భారత్, చైనా మధ్య స్నేహ సంబంధాలు బలోపేతం కావాలి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్ష
- చైనా రక్షణ శాఖ మంత్రి జున్‌తో భేటీ



రాజ్‌నాథ్‌తో చైనా రక్షణ మంత్రి డాంగ్ జున్

ఖింగ్‌డావో/న్యూఢిల్లీ: భారత్, చైనా మధ్య నెలకొన్న సంక్లిష్టమైన సమస్యలను నిర్మాణాత్మక రోడ్‌మ్యాప్ ద్వారా పరిష్కరించుకుందామని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. ఆయన చైనా రక్షణ శాఖ మంత్రి డాంగ్ జున్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గించుకోవడం, వివాదాలకు తావులేకుండా స్పష్టమైన సరిహద్దులను గుర్తించడానికి ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పునరుత్తేజితం చేయడం వంటి చర్యలతో స్నేహ సంబంధాలు బలోపేతం చేసుకుందామని చెప్పారు. చైనాలో ఖింగ్‌డావో నగరంలో షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా గురువారం రాజ్‌నాథ్ సింగ్, డాంగ్ జున్ ప్రత్యేకంగా సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రధానంగా వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద శాంతియుత పరిస్థితులను కొనసాగించడంపై చర్చించారు. పరస్పర ప్రయోజనాల పరిరక్షణ కోసం భారత్, చైనా కలిసి పనిచేయాలని, 'చక్కటి పొరుగుదేశం'గా ఇరుదేశాలు సహకరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్‌నాథ్ అభిప్రాయపడ్డారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో జరిగిన ఘర్షణ తర్వాత నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించుకోవడానికి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. చైనాతో తాము ఎలాంటి ఘర్షణ కోరుకోవడం లేదన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు బలోపేతం కావాలన్నదే తమ ఆకాంక్ష అని వివరించారు. ఆపరేషన్ సిందూర్ గురించి రాజ్‌నాథ్ చైనా రక్షణ మంత్రికి వివరించారు. సరిహద్దుల్లో సైన్యాన్ని, ఉద్రిక్తతలు తగ్గించుకోవడమే లక్ష్యంగా వేర్వేరు స్థాయిల్లో సంప్రదింపులు కొనసాగించాలని రాజ్‌నాథ్, డాంగ్ జున్ నిర్ణయించుకున్నారు. డాంగ్ జున్‌కు రాజ్‌నాథ్ 'ట్రీ ఆఫ్ లైఫ్' అనే మధుబని పెయింటింగ్‌ను బహూకరించారు.

'సుఖోయ్' ఆధునీకరణ

ఖింగ్‌డావో సిటీలో రాజ్‌నాథ్ సింగ్ రష్యా రక్షణ శాఖ మంత్రి ఆంద్రీ బెలోసోవ్‌తో భేటీ అయ్యారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిణామాలు, సీమాంతర ఉగ్రవాదం, ఇండో–రష్యా రక్షణ సంబంధాలు, పరస్పర సహకారంపై వారు అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్యంగా సుఖోయ్–30ఎంకేఐ యుద్ధ విమానాల ఆధునీకరణపై చర్చించారు. గగనతలానికి ప్రయోగించే క్షిపణుల తయారీ, ఎస్–400 మిస్సైల్ వ్యవస్థ రెండో బ్యాచ్ పంపిణీపై చర్చలు జరిపారు. భారత వైమానిక దళం వద్ద రష్యా అందజేసిన 260 సుఖోయ్–30 ఎంకేఐ ఫైటర్ జెట్లు ఉన్నాయి. వీటిని రష్యా సహకారంతో అప్‌గ్రేడ్ చేయాలని భారత రక్షణ శాఖ నిర్ణయించింది. ఇదే అంశాన్ని రష్యా రక్షణ మంత్రి వద్ద రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

మమ్దానీ పౌరసత్వం రద్దు చేయాలి

రిపబ్లికన్ పార్టీ నేతల డిమాండ్

వాషింగ్టన్: అమెరికాలో న్యూయార్క్ నగర మేయర్ పదవికి పోటీపడుతున్న భారత సంతతి నాయకుడు జోహ్రాన్ మమ్దానీ చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. ఆయన ఇప్పటికే డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో నెగ్గిన సంగతి తెలిసిందే. ఇండియన్-అమెరికన్ సినీ దర్శకురాలు మీనా నాయర్ కుమారుడైన మమ్దానీ పౌరసత్వంపై ప్రభుత్వం దర్యాప్తు జరపాలని, ఆయనను దేశం నుంచి వెళ్లగొట్టాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ, దాని అనుబంధ గ్రూప్‌లు డిమాండ్ చేస్తున్నాయి. ఆయన అమెరికా పౌరుడు కాదని వాదిస్తున్నాయి. మమ్దానీకి 2018లో అమెరికా పౌరసత్వం లభించింది. 2021 నుంచి న్యూయార్క్ చట్టసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన ముస్లిం మతస్తుడు కావడంతో కొన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మమ్దానీ పౌరసత్వాన్ని రద్దు చేయాలని టెన్నెస్సీ రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఆండీ ఓగ్లెస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీకి లేఖ రాశారు. మమ్దానీ తప్పుడు ఆధారాలతో అమెరికా పౌరసత్వం పొందారని ఆరోపించారు. ఉగ్రవాదానికి మద్దతిచ్చారని, పైగా ఆ విషయం దాచిపెట్టారని ధ్వజమెత్తారు. రాడికల్ జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్‌ను నాశనం చేస్తానంటే అంగీకరించే ప్రసక్తే లేదని స్థానిక యంగ్ రిపబ్లికన్ క్లబ్ తేల్చిచెప్పింది. మమ్దానీ వంద శాతం కమ్యూనిస్టు పిచ్చోడని ట్రంప్ దుయ్యబట్టడం తెలిసిందే.

'గుజరాత్'పై మమ్దానీ వీడియో వైరల్

ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన 2002లో గుజరాత్‌లో జరిగిన ఘర్షణలపై మమ్దానీ చేసిన వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్కడ ముస్లింలను అంతం చేసేందుకు కుట్ర జరిగిందని, చాలామందిని హత్య చేశారని మమ్దానీ ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులా మోదీ కూడా యుద్ధ నేరస్తుడేనంటూ మండిపడ్డాడు. మమ్దానీ వ్యాఖ్యలపై పలువురు భారతీయులతో పాటు అమెరికాలోని ప్రవాస భారతీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పురి క్షేత్రంలో విశ్వవిఖ్యాత జగన్నాథ వార్షిక రథయాత్ర శుక్రవారం కన్నులపండువగా కొనసాగింది. దేశ నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. బలభద్రుడు, సుభద్ర, జగన్నాథ స్వామి రథాలు రథాలు లాగి పారవశ్యానికి లోనయ్యారు.

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

లా కాలేజీ స్టూడెంట్‌పై సామూహిక అత్యాచారం!

- కోల్‌కతాలో మరో దారుణం
- ముగ్గురి అరెస్ట్, ఐదు రోజుల రిమాండ్
- ఒకరి అఘాయిత్యం, ఇద్దరి సహకారం
- ఫిర్యాదులో పేర్కొన్న బాధితురాలు
- ప్రధాన నిందితుడు తృణమూల్ నేత



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

కోల్‌కతా: దేశమంతటా సంచలనం సృష్టించిన ఆర్‌జీ కర్ కాలేజీ మెడికోపై హత్యాచార ఘటనను మరవకముందే కోల్‌కతాలో అలాంటిదే మరో దారుణం జరిగింది. సౌత్ కలకత్తా లా కాలేజీ విద్యార్థిపై కాలేజీలోనే అత్యాచారం జరిగింది. అదే కాలేజీకి చెందిన మాజీ విద్యార్థి ఇద్దరు ప్రస్తుత విద్యార్థులతో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురినీ పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై పశ్చిమబెంగాల్ అంతటా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షకు సంబంధించిన పత్రాలను నింపేందుకు బాధితురాలు (24) బుధవారం మధ్యాహ్నం కాలేజీకి వెళ్లింది. విద్యార్థి సంఘం గదిలో కూర్చుని పత్రాలు నింపుతుండగా అధికార తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన ఛాత్ర పరిషత్ (టీఎంసీపీ) జిల్లా ప్రధాన కార్యదర్శి మోనోజిత్ మిశ్రా (31) అక్కడికి వచ్చాడు. ఆమెతోపాటు మరో ఆరుగురు విద్యార్థులను కూర్చోబెట్టి టీఎంసీపీ గురించి, తన అధికారాల గురించి మాట్లాడాడు. బాధితురాలిని కళాశాల విద్యార్థిని విభాగం కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించాడు. సాయంత్రం దాకా ఆమెను ఒక్కదాన్నే ఆ గదిలో కూర్చోమని చెప్పాడు. అనంతరం జరిగిన పరిణామాలను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ''మోనోజిత్ గదిలోకి వచ్చి, ఉన్నట్టుండి తనను పెళ్లి చేసుకోవాలంటూ ప్రతిపాదించాడు. దాంతో విస్తుపోయా. ఇంకొకరితో ప్రేమలో ఉన్నానంటూ అందుకు నిరాకరించా. దాంతో ఒక్కసారిగా ఆగ్రహించాడు. కాలేజీ మెయిన్ గేట్‌కు తాళం వేయాల్సిందిగా అక్కడి వారిని ఆదేశించాడు. నన్ను పక్కనే ఉన్న సెక్యూరిటీ గార్డు రూంలోకి బలవంతంగా లాక్కెళ్లాడు. మా కాలేజీలో ఫస్టియర్ చదువుతున్న జయిబ్ అహ్మద్ (19), ప్రమీద్ ముఖర్జీ (20)తో కలిసి నాపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే అడ్డుకుని చేయిచేసుకున్నాడు. బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని, వదిలేయాలని కాళ్లు పట్టుకుని బతిమాలినా కనికరించలేదు. ఈ దారుణాన్ని జయిబ్, ప్రమీద్ ఫోన్లలో చిత్రీకరించారు. ఆ వీడియోను నా బంధుమిత్రులకు పంపుతామని బెదిరించారు. కాలేజీ గార్డు కూడా నన్ను కాపాడేందుకు ప్రయత్నించలేదు. బుధవారం రాత్రి 7.30 నుంచి 10.50 మధ్య ఈ దారుణం జరిగింది. దీని గురించి ఎవరికైనా చెబితే దారుణ పరిణామాలుంటాయని మోనోజిత్ బెదిరించాడు. నా బోయ్‌ఫ్రెండ్‌ను హాని తలపెడతామని, తల్లిదండ్రులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని భయపెట్టాడు'' అని వాపోయింది. ''క్రూరమైన లైంగిక దాడిలో తీవ్రంగా గాయపడ్డా. ఒక దశలో శ్వాస కూడా అందలేదు. ఆస్పత్రికి తీసుకెళ్లమని ప్రాధేయపడ్డా మోనోజిత్ పట్టించుకోలేదు. పైగా హాకీ స్టిక్ చూపించి, కొడతానని బెదిరిస్తూ వెళ్లిపోయాడు'' అని వివరించింది. ''ప్రధాన నిందితునికి మిగతా ఇద్దరు సహకరించారు. గది బయట కాపలాగా ఉన్నారు'' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ముగ్గురు నిందితులకు కోర్టు ఐదు రోజుల రిమాండ్ విధించింది. ప్రధాన నిందితునికి సహకరించడం కూడా అత్యాచారానికి పాల్పడటంతో సమానమేనని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఉన్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ''బాధితురాలు మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలమిచ్చింది. ఘటన జరిగిన గార్డు గదితోపాటు పక్కనే ఉన్న విద్యార్థి సంఘం గదిని సీజ్ చేసి, ప్రత్యక్ష సాక్షులను విచారించాం'' అని పోలీసులు తెలిపారు.

అతనో క్రిమినల్ లాయర్

ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా అదే లా కాలేజీలో చదివాడు. 45 రోజుల కాంట్రాక్టుపై ప్రస్తుతం కాలేజీలో బోధనేతర విధుల్లో పనిచేస్తున్నాడని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నైనా చటర్జీ చెప్పారు. అంతేగాక అలీపోర్ పోలీస్ అండ్ సెషన్స్ కోర్టులో క్రిమినల్ లాయర్‌గా చేస్తున్నట్టు కాలేజీ వర్గాలు తెలిపాయి. టీఎంసీకి చెందిన పలువురు నేతలతో మోనోజిత్‌కు దగ్గర సంబంధాలున్నట్లు సమాచారం. ఘటనపై వామపక్ష విద్యార్థి విభాగం, కాంగ్రెస్ శ్రేణులు కస్బా పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగాయి.

తృణమూల్ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

అత్యాచారోదంతంపై తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''యువతులు తాము ఎలాంటి వారితో కలిసి తిరుగుతున్నామో చూసుకోవాలి. రాష్ట్రంలో ప్రతి చోటా మహిళలకు పోలీసులు రక్షణ కల్పించడం సాధ్యం కాదు'' అన్నారు. ఈ ఉదంతంపై నిరసనలు పెరిగి పెద్దవవుతుండటంతో తృణమూల్ కాంగ్రెస్ స్పందించింది. ప్రధాన నిందితుడు మోనోజిత్‌తో పార్టీకి సంబంధం లేదని ప్రకటించింది. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొంది. కానీ తృణమూల్ ప్రకటనను బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ ఖండించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీతో పాటు పలువురు ప్రముఖ తృణమూల్ నేతలతో పాటు మోనోజిత్ ఎన్నోసార్లు వేదికలపై కన్పించినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. మమతకు సీఎంగా కొనసాగే అర్హత లేదని రాష్ట్ర బీజేపీ చీఫ్ సువేందు అధికారి మండిపడ్డారు.

ఇరాన్‌పై దాడులను... మాపై అణుబాంబులతో పోలుస్తారా?

ట్రంప్‌పై జపాన్ ఆగ్రహం

టోక్యో: ఇరాన్‌పై ఇటీవల దాడులు జరిపిన అమెరికా, వాటిని రెండో ప్రపంచ యుద్ధాన్ని ముగించిన హిరోషిమా, నాగసాకిపై జరిగిన అణు బాంబు దాడులతో పోల్చడాన్ని జపాన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అణుబాంబు వేయడాన్ని సమర్థించినట్లుగా ఉన్నాయని నాగసాకి మేయర్ షిరో సుజుకి ఆక్షేపించారు. బాంబు దాడికి గురైన నగరవాసులుగా తాము చాలా విచారిస్తు న్నట్టు చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మిమాకి తోషియుకి అన్నారు. అణు బాంబు దాడి నుంచి బయటపడిన వారిలో ఆయన ఒకరు. ట్రంప్ ప్రక టనను ఉపసంహరించుకోవా లంటూ నాటి అణు బాంబు దాడుల నుండి బయటపడినవారు హిరోషి మాలో నిరసనకు దిగారు. ట్రంప్ ప్రకటన లను తిరస్కరిస్తూ హిరోషి మాలో చట్టసభ సభ్యు లు తీర్మానం ఆమోదించారు. సాయుధ పోరాటా లను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పిలుపు నిచ్చారు. ''ఇరాన్‌పై అమెరికా దాడి వల్లే యుద్ధా నికి తెరపడింది. హిరోషిమా, నాగసాకి ఉదాహ రణను నేను ఉపయోగించాలనుకోవడం లేదు. కానీ తప్పడం లేదు'' అని ట్రంప్ పేర్కొనడం తెలిసిందే. ప్రపంచంలో అణు దాడికి గురైన ఏకైక దేశం జపాన్. 1945 ఆగస్టులో దక్షిణ జపాన్‌లోని రెండు నగరాలపై అమెరికా వేసిన అణు బాంబులు 1.4 లక్షల మందిని బలిగొ న్నాయి. ప్రాణాలతో బయటపడినవారు నేటికీ నానా శారీరక, మానసిక వ్యాధులతో బాధపడు తున్నారు. అణ్వాయు ధాలకు జపాన్ వ్యతిరేకమని సూచించే శాంతి జ్వాల హిరోషిమాలో ఇప్పటికీ వెలుగుతూ ఉంటుంది. ప్రపంచంలోని చివరి అణు దాడి జరిగి ఎన్ని రోజులో తెలిపే గడియారం కూడా యుద్ధ మ్యూజి యం ప్రవేశద్వారం ఉంటుంది. శాంతి పట్ల తమ నిబద్ధత తెలియజేసేందుకు హిరోషిమాను సందర్శించే ప్రపంచ నాయకులతో కాగితపు క్రేన్లను తయారు చేయించే సంప్రదాయముంది.

కాన్వాయ్‌లతోనే ప్రయాణించాలి

అమర్‌నాథ్ యాత్రికులకు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రికులకు రాష్ట్ర పోలీస్ శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. భక్తులు వేర్వేరుగా కాకుండా తప్పనిసరిగా భద్రతా బలగాల కాన్వాయ్‌లతో కలిసి ప్రయాణించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉధంపూర్ మీదుగా సాగే అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 9వ తేదీతో ముగియనుంది. ఒకరోజు ముందుగానే జూలై 2న జమ్మూలోని భగవతీనగర్ యాత్రికుల నివాసం నుంచి మొదటి బ్యాచ్ బయలుదేరనుంది. భద్రతా కాన్వాయ్‌లతో కలిసి ప్రయాణిస్తేనే యాత్రికులకు పూర్తి భద్రత ఉంటుందని జమ్మూ పోలీస్ ఐజీ భీంసేన్ టూటీ తెలిపారు. అలాకాకుండా, సొంతంగా ఎవరికి వారుగా ప్రయాణిస్తే యాత్ర మార్గంలో ఎన్నో చెక్ పాయింట్లలో తనిఖీల కోసం ఆగాల్సి ఉంటుందని, భద్రతకు ముప్పు కూడా ఉంటుందని భీంసేన్ వివరించారు. కనీసం 60% మంది యాత్రికులు తమ సొంతంగా అమర్‌నాథ్ యాత్రకు వస్తారని, గతేడాది 31% మాత్రమే భద్రతా సిబ్బంది కాన్వాయ్‌లతో ప్రయాణించారని అనధికార వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ఏడాది మాత్రం యాత్రికులు తప్పనిసరిగా భద్రతా సిబ్బంది కాన్వాయ్‌లతో కలసి ప్రయాణించాల్సి ఉంటుంది. యాత్రకు భద్రత కోసం 180 కంపెనీల పారా మిలటరీ బలగాలను మోహరించనున్నారు.

ఐరాస సాయం తిరస్కరించిన భారత్

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తులో సాయం చేస్తామన్న ఐక్యరాజ్యసమితి విమానయాన దర్యాప్తు సంస్థ ప్రతిపాదనను భారత్ తిరస్కరించింది. కీలకమైన బ్లాక్ బాక్స్ డేటాను విశ్లేషించడంలో జాప్యం జరుగుతోందని భద్రతా నిపుణులు అంటుండటం తెలిసిందే. జూన్ 13న స్వాధీనం చేసుకున్న కంబైన్డ్ బ్లాక్ బాక్స్ యూనిట్ స్థితి, జూన్ 16న దొరికిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌తో సహా దర్యాప్తు గురించి సమాచారం లేకపోవడాన్ని వారు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో దర్యాప్తులో సాయం చేసేందుకు ఐరాస సంస్థ ముందుకొచ్చింది. భారత్‌లో ఉన్న తమ అధికారికి పరిశీలకుడి హోదా ఇవ్వాలని కోరింది. అందుకు భారత్ తిరస్కరించింది. 2014లో మలేషియా విమాన ప్రమాదం, 2020లో ఉక్రేనియా జెట్‌లైనర్ కూలిపోయిన ఘటనల్లో దర్యాప్తులకు సాయపడేందుకు ఆ దేశబూల విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ పరిశోధకులను నియమించింది. ప్రమాదం జరిగిన రెండు వారాల తర్వాత దర్యాప్తు అధికారులు ఫ్లైట్ రికార్డర్ డేటాను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు పౌర విమానయాన శాఖ గురువారం తెలిపింది.

చైనా నేవీ చీఫ్‌కు ఉద్వాసన

అత్యున్నత అణు శాస్త్రవేత్తకు సైతం

బీజింగ్: చైనాలో శక్తివంతమైన రక్షణ, భద్రతా విభాగాల్లో ప్రక్షాళన కొనసాగుతోంది. తాజాగా ఉద్వాసనకు గురైన వారిలో, నేవీ చీఫ్, అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్త ఉన్నారు. చైనా సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ(పీఎల్‌ఏఎన్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ లి హన్‌జున్, చైనా నేషనల్ న్యూక్లియర్ కార్పొరేషన్ డిప్యూటీ చీఫ్ లియు షిపెంగ్‌లకు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) సభ్యత్వాలను రద్దు చేశారు. శుక్రవారం ముగిసిన ఎన్‌పీసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా, సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ)సభ్యుడిగా ఉన్న టాప్ జనరల్ మియావో హువా అధికారాలకు సైతం కత్తెరవేశారు. చైనా మిలటరీ అత్యున్నత నిర్ణాయక విభాగం సీఎంసీ. దీనికి బాస్ అధ్యక్షుడు జిన్‌పింగ్ కావడం గమనార్హం. చైనా మిలటరీలో చిన్న వయస్సులోనే ఉన్నత స్థాయికి చేరుకున్న మియా తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అధికార కమ్యూనిస్ట్ పార్టీపై పూర్తిస్థాయి పట్టు కలిగిన అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవలి కాలంలో ఇద్దరు రక్షణ మంత్రులను సైతం తొలగించి, తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

విమానం రెక్కలో ఇరుక్కున్న గడ్డి

5 గంటలాగిన ఎయిరిండియా విమానం



ముంబై: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం ఈ నెల 25న ముంబై విమానాశ్రయంలో దాదాపు 5 గంటలపాటు నిలిచిపోయింది. విమానం ఒక రెక్క దిగువ భాగంలో గడ్డి ఇరుక్కుపోయి ఉండటమే ఇందుకు కారణమని ఎయిరిండియా వర్గాలు తెలిపాయి. గమనించిన వెంటనే తొలగించి, విమానం టేకాఫ్‌కు క్లియరెన్స్ ఇచ్చామంది. అయితే, ఆ విమానం ఏ రకానిది? అందులోని ప్రయాణికులు, సిబ్బంది సంఖ్య ఎంత? టేకాఫ్ షెడ్యూల్ సమయం? ప్రయాణికులు ఎంతసేపు విమానంలో ఉండిపోయారు? వంటి వివరాలను టాటా గ్రూప్ సారథ్యంలోని ఎయిరిండియా వివరించలేదు. రెక్క దిగువ భాగంలో గడ్డి ఎలా చేరిందని విషయాన్ని సైతం తెలపలేదు. అయితే, ముంబైలో ఉదయం 7.45 గంటలకు టేకాఫ్ తీసుకోవాల్సిన ఏఐ 2354 విమానం మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరినట్లు ఫ్లైట్‌రాడార్24. కామ్ ట్రాక్ రికార్డును బట్టి తెలుస్తోంది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 28 । జూన్ । 2025



ఆరోగ్యానికి 'సున్నం'
మాదాపూర్‌లోని సున్నం చెరువు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అందులోని నీరు మరిగించినా తొలగిపోని కారకాలతో నిండిపోయింది. -8లో



లైఫ్ ఆఫ్ అరుణ్..
టైమ్స్ స్క్వేర్ వేదికగా ఈ నెల 24 నుంచి 26 తేదీల్లో ఎన్ఎఫ్‌టీఎన్‌వైసీ- 2025 జరిగింది. నలిమెల అరుణ్ కుమార్ తీసిన 3 ఫొటోలు ఇందులో ప్రదర్శితమయ్యాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0/23.0
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



సికింద్రాబాద్‌లో జగన్నాథ రథయాత్ర కోలాహలం



ఇందిరా పార్కు వద్ద భక్తుల కోలాటం



బంజారాహిల్స్‌లో జగన్నాథ రథయాత్ర

నేత్రపర్వంగా జగన్నాథ రథయాత్ర

శ్రీకృష్ణ పరమాత్ముడి నామస్మరణతో నగరం పులకరించింది. జగన్నాథ రథయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేసింది. బంజారాహిల్స్ హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్, అబిడ్స్, సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా సాగింది. హరే కృష్ణ.. హరే రామ భజనలు, నృత్యాలతో భక్తులు పారవశ్యం చెందారు.



సికింద్రాబాద్‌లో యువతుల నృత్యాలు

అడుక్కోవద్దు!

మరోసారి బెగ్గర్ ఫ్రీ సిటీ!!

- గతంలో విఫలం
- ఇప్పుడు మళ్లీ ప్రారంభం
- చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ
- నాలుగు రోజులుగా ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో మరోసారి బెగ్గర్ ఫ్రీ సిటీ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ఇబ్బందులు కలిగిస్తున్న యాచకులను గుర్తించి షెల్టర్ హోంలకు లేదా సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు బల్దియా ప్రకటించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలమేరకు ఇప్పటికే అన్ని సర్కిళ్లలో.. ప్రధానంగా బషీర్ బాగ్, సెక్రటేరియట్, నాంపల్లి, బేగం బజార్ తదితర ప్రాంతాల్లోని జంక్షన్లలోని యాచకులు, ఫుట్‌పాత్‌లపై ఉండేవారిని గుర్తించి జీహెచ్ఎంసీ షెల్టర్ హోంలకు తరలిస్తున్నారు. మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తమ సొంత ఊళ్లకు, నివాసాలకు పంపిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, మతపరమైన ప్రదేశాలలో భిక్షాటన చేసే వారి గురించి సమాచారం అందుకొని, వారిని వైద్య పరీక్షల తర్వాత పోలీసుల సహకారంతో జీహెచ్ఎంసీ షెల్టర్ హోంలకు తరలిస్తున్నారు.

నకిలీలే అధికం..

గ్రేటర్‌లో ఇరవై వేల మందికి పైగా ఈ వృత్తిలో ఉండగా, వీరిలో కేవలం పదిశాతం మాత్రమే నిజంగా అశక్తులు. బిహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన యువకులు కూడా వీరిలో ఉన్నారు. జంక్షన్లు, ప్రార్థనా మందిరాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు వీరి అడ్డాలు. వీరిలో చాలామందికి మద్యం, ఇతరత్రా మత్తుపదార్థాల వ్యసనం ఉంది. ఈ ఊబిలో బందీలుగా ఉన్న బాలలు రోజుకు సగటున రూ. 500 వరకు ఆర్జిస్తున్నారు. ఈ పని చేస్తున్న మహిళల్లో కొందరు పగటి పూట యాచన చేస్తూ, రాత్రి వేళల్లో సెక్స్ వర్కర్లుగా మారుతున్నారు. యాచకుల్లో 90 శాతానికి పైగా పునరావాసం కల్పిస్తామన్నా, వృద్ధాశ్రమాలు/విద్యాసంస్థలు/ ఆశ్రమాలు/ అనాథ శరణాలయాల్లో చేరుస్తామన్నా నిరాకరిస్తున్నట్లు వివిధ సర్వేల్లో వెల్లడైంది.



221 మంది గుర్తింపు..

ఇప్పటి వరకు 221 మందిని గుర్తించారు. వీరిలో 173 మంది పురుషులు, 37 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో 19 మందిని జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న షెల్టర్ హోంలకు తరలించగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారివారి కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. యాచకులు, ఫుట్‌పాత్‌లపై ఉండేవారిని షెల్టర్ హోంలకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు తరలించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ యూసీడీ అధికారులు తెలిపారు.

ఈ ప్రాంతాల్లో ఎక్కువగా..
తాజాగా నాంపల్లి మెట్రోస్టేషన్,ఎస్సార్‌నగర్ మెట్రో జంక్షన్, శిల్పారామం, హైటెక్ సిటీ, మాదాపూర్ ప్రాంతాల్లో ఎక్కువ మందిని గుర్తించారు.

సాగేనా.. ఆగేనా?
నగరాన్ని బెగ్గర్ ఫ్రీ చేయడమనేది ప్రహసనంగా మారింది. గతంలోనూ ప్రయత్నాలు చేసినా మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. వాటిని ఒకసారి పరిశీలిస్తే.. 2017 నవంబర్‌లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న (ప్రస్తుతం సైతం ఆయనే) డొనాల్డ్ ట్రంప్ కుమార్తె నగరానికి వచ్చే ముందు యాచకులు లేకుండా చేశారు. మున్ముందు బిచ్చగాళ్లు అనేవాళ్లు లేకుండా చేస్తామని ప్రకటించి కొన్ని నెలల వరకు కొనసాగించారు. ఎల్‌బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో యాచన చేస్తున్న వారిని నగర శివార్లలోని చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమానికి తరలించారు. ఈ వృత్తిని నిర్మూలిస్తామని అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ సైతం ప్రకటించారు. వారిలో చాలామంది ఫేక్ అని, దాదాపు మూడువేల మంది పసిపిల్లలతో దందా నడిపిస్తున్నారని, దాన్ని అరికడతామన్నారు. నిజంగా యాచన తప్ప ఏపనీ చేయలేని అసహాయులను అన్నివిధాలా ఆదుకుంటామని, పనిచేసే శక్తి ఉన్న వారికి అవసరమైన వారికి తగిన శిక్షణ నిప్పించి ఉపాధి కల్పిస్తామన్నారు. కానీ.. అమలు కాలేదు. ఇప్పుడు మరోసారి బెగ్గర్ ఫ్రీ నగరంగా మార్చేందుకు చర్యలు ప్రారంభించారు. ఏమవుతుందో కొన్నాళ్లయితే కానీ తెలియదు.

రూ. 300 కోట్లకు పైగా సంపాదన
వివిధ సర్వేల మేరకు నగరంలోని యాచకులు ఏటా రూ. 300 కోట్లకు పైగా సంపాదిస్తున్నారు.

పరువు పోతుందని ప్రాణాలు తీసుకున్నాడు

పంచాయితీ భయంతో యువకుడి ఆత్మహత్య



భానుచందర్ (ఫైల్)

కుషాయిగూడ: వరుసకు కోడలయ్యే యువతితో సన్నిహితంగా ఉన్నాననే విషయం బయట పడిందనే భయంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి–భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లికి చెందిన పంగా భానుచందర్ (30) బతుకు దెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి పెయింటింగ్ వర్క్ చేస్తున్నాడు. దమ్మాయిగూడకు చెందిన పెయింటింగ్ కాంట్రాక్టర్, వరుసకు బావ అయ్యే వ్యక్తి వద్ద పని చేస్తూ చర్లపల్లి ఐజీ కాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బావ కూతురితో పరిచయం పెరిగి ఆమెకు సన్నిహితమయ్యాడు. విషయం తెలిసిన బాధితురాలి తండ్రి, అతడి భార్య గురువారం రాత్రి భానుచందర్‌కు ఫోన్ చేసి మందలించారు. ఈ విషయమై శుక్రవారం పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టామని భార్యాభర్తలిద్దరూ హాజరు కావాలని చెప్పినట్లు మృతుడి భార్య పోలీసులు అందించిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో భానుచందర్ శుక్రవారం పిల్లలను స్కూల్ పంపి పంచాయితీకి వెళ్దామంటూ భార్యకు చెప్పడంతో ఆమె స్నానానికి వెళ్లింది. దీంతో బాత్రూం బయట నుంచి గడియ పెట్టిన భానుచందర్.. నలుగురిలో తన పరువు పోతుందన్న భయంతో ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బాత్రూం తలుపులు ఎంతకీ తెరుచుకోకపోవడంతో గట్టిగా అరిచింది. ఆమె అరుపులు విన్న ఇరుగు పొరుగు ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా భానుచందర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న భానుచందర్‌ను కిందికి దింపి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణాలు వదిలాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పీజేఆర్ ఫ్లైఓవర్‌పై.. రయ్ రయ్

నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

- రూ.182.72 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 1.2 కి.మీ మేర శిల్పా లేఔట్ ఫేజ్- 2 ఫ్లైఓవర్
- వాహనదారులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

గచ్చిబౌలి:

ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇంధనం, సమయం ఆదా చేయడానికి నిర్మించిన మరో ఫ్లైఓవర్ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. పీజేఆర్ ఫ్లైఓవర్ శనివారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మాదాపూర్ ప్రాంతం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి వెళ్లడానికి మార్గం సుగమమవుతుంది. ట్రాఫిక్ కష్టాలు తొలగడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

ఫ్లైఓవర్ విశిష్టతలు..

- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మాదాపూర్, శంషాబాద్ వెళ్లేందుకు ట్రాఫిక్ కష్టాలు ఉండవు.
- శిల్పా లేఔట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ కాగా.. దీనికి పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేశారు
- ప్రాజెక్టు మొత్తం వ్యయం 446.13 కోట్ల అంచనా
- ఇందులో ఫేజ్–2 ఫ్లైఓవర్ పూర్తి అంచనా వ్యయం రూ.182.72 కోట్లు
- ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డు వరకు 630 మీటర్లు
- ఆబ్లిగేటరీ స్పాన్ (స్టీల్) 450 మీటర్లు
- త్రీ లేన్, వెడల్పు 24 మీటర్లు
- క్యారెజ్ వే 6 లైన్ల బై డైవర్షనల్
- కొండాపూర్ వైపు డౌన్ ర్యాంప్ రెండు వైపులా 165 మీటర్లు
- వెడల్పు 12 మీటర్లు
- ఆరు లేన్ల ఫ్లైఓవర్‌గా నిర్మాణం

ఉపయోగాలు ఇలా..

- మోహిదీపట్నం, మాదాపూర్, జూబ్లీహిల్స్ వైపు నుంచి వచ్చే వాహనాలతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌కు ఉపశమనం
- ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు వాహనాలు అంతరాయం లేకుండా వెళ్లొచ్చు
- ఉదయం, సాయంత్రం వేళల్లో హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య మెరుగైన కనెక్టివిటీ
- గచ్చిబౌలి జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో దాదాపు 10.5 నిమిషాలు ఆదా
- ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి జంక్షన్, సైబరాబాద్ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌లకు వేగంగా చేరుకునే వీలు గణనీయమైన ఇంధన ఆదా



పీజేఆర్ ఫ్లైఓవర్



ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఫ్లైఓవర్ పరిశీలన..
శుక్రవారం పీజేఆర్ ఫ్లైఓవర్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, అధికారులతో కలిసి పరిశీలించారు. వీరి వెంట వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు, ప్రాజెక్ట్ సీఈ భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఈఈ, ఇతర అధికారులు ఉన్నారు.

మరో ప్రాజెక్టు అందుబాటులోకి రావడం హర్షణీయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) కింద మరో ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుండటం సంతోషంగా, గర్వంగానూ ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం పీజేఆర్ (శిల్పా లే ఔట్ ఫేజ్–2) ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్స్ వేదికగా ఫ్లై ఓవర్ వీడియోను శుక్రవారం ఆయన షేర్ చేశారు. ఎస్సార్‌డీపీలోని 42 ప్రాజెక్టుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం 36 ప్రాజెక్టులను పూర్తి చేసిందని గుర్తు చేశారు.

సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు



పీజేఆర్ సతీమణి ఇందిర

శిల్పా లేఅవుట్ రెండో దశ ఫ్లై ఓవర్‌కు దివంగత నేత పి.జనార్దన్ రెడ్డి పేరు పెడుతున్నట్లు జీఓ విడుదల చేయడంతో ఆయన సతీమణి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి వచ్చి సీఎం, మంత్రులకు నేరుగా కృతజ్ఞతలు చెప్పాలని ఉందని, ఆరోగ్యం సహకరించకపోవడంతో రాలేకపోతున్నానని ఆమె తెలిపారు.

ఔటర్‌లో అడ్రస్ ఉంటేనే ఆటో

కొత్త వాహనాలకు విధి విధానాలు

- ఒకడ్రైవర్‌కు ఒక పర్మిట్ మాత్రమే..
- నకిలీ చిరునామాలపై డీలర్లదే బాధ్యత
- గ్రేటర్‌లో 65 వేల కొత్త పర్మిట్లకు మార్గం సుగమం

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో నివాసం ఉండే డ్రైవర్లు కొత్త ఆటోలను కొనుగోలు చేసుకొనేందుకు మార్గం సుగమమైంది. కొత్త ఆటో రిక్షాలపై ఆంక్షలను ఎత్తివేస్తూ 65 వేల పర్మిట్‌లను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. వీటిలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు, 10 వేల ఎల్పీజీ ఆటోలు, మరో 10 వేల సీఎన్‌జీ ఆటో పర్మిట్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 25వేల ఎల్పీజీ, డీజిల్, పెట్రోల్ ఆటోలను రిట్రోఫిట్‌మెంట్‌లు అమర్చు,కొని ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు కొత్త ఆటో పర్మిట్‌లపై రవాణా కమిషనర్ కె.సురేంద్ర మోహన్ తాజాగా విధివిధానాలు విడుదల చేశారు.

డాక్యుమెంట్‌లు తప్పనిసరి...
ఆటో కొనుగోలు చేసే వ్యక్తి ఔటర్ పరిధిలో తన అడ్రస్‌ను నిర్ధారించే రెండు డాక్యుమెంట్‌లను తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. కొనుగోలుదార్ల అడ్రస్ నిర్ధారణ బాధ్యత డీలర్లదేనని తెలిపారు. దరఖాస్తుదారు పూర్తి వివరాలతో పాటు ఆటో లేదా కారు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, పుట్టిన తేదీ, ఔటర్ పరిధిలో రెండు అడ్రస్ ధ్రువీకరణ పత్రాలతో ఆటోరిక్షా డీలర్లను సంప్రదించాలి. ఈ మేరకు డీలర్లు సీఎఫ్ఎస్‌టీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తుదారుల వివరాలను ఆర్టీఏకు అందజేయాలి. ఇలా డాక్యుమెంట్‌లతో సహా తమకు అందిన దరఖాస్తులను పరిశీలించి 24 గంటల్లో ఆర్టీఏ అధికారులు అనుమతులు అందజేస్తారు. అనుమతుల ఆధారంగా డ్రైవర్లు 60 రోజుల్లో కొత్త ఆటోను కొనుగోలు చేయవచ్చు. ఈ గడువు ప్రకారం కొనుగోలు చేయలేకపోతే ఆ అనుమతులకు చెల్లుబాటు ఉండదని కమిషనర్ తెలిపారు. కొత్తగా 65 వేల పర్మిట్లను విడుదల చేసిన దృష్ట్యా పాత పర్మిట్‌లను రద్దు చేశారు. ఈ మేరకు పాత ఎల్పీజీ, డీజిల్, సీఎన్జీ పర్మిట్‌లపై కొత్త ఆటోలను కొనుగోలు చేసేందుకు వీలులేదని ఆయన పేర్కొన్నారు.



బ్లాక్ మార్కెట్‌కు తెరపడేనా?
ఆటో పర్మిట్‌లు నగరంలోని ఫైనాన్షియర్‌లకు కాసులు కురిపిస్తున్నాయి. సుమారు 80 వేల పాత ఆటో పర్మిట్‌లను తమ గుప్పిట్లో పెట్టుకున్న వ్యాపారులు ఒక్కో పర్మిట్‌ను రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పాత పర్మిట్‌లపైనే ఆటోడ్రైవర్లు కొత్త ఆటోలను కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ మేరకు ఏటా భారీ ఎత్తున అక్రమ వ్యాపారం సాగుతోంది. ప్రభుత్వం ఈసారి ఏకంగా 65 వేల కొత్త ఆటోలకు అనుమతినిచ్చిన దృష్ట్యా ఇప్పటికైనా ఫైనాన్షియర్‌ల దోపిడీ ఆగిపోవాలని ఆటో సంఘాలు ఆకాంక్షిస్తున్నాయి.

'అన్నపూర్ణ' పేరును తొలగించొద్దు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

సాక్షి, సిటీబ్యూరో: అనాథలు, అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ కేంద్రాల పేరును తొలగించవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. మానవతామూర్తిగా నిలిచిన అన్నపూర్ణ కేంద్రాల పేరును ఇందిరా క్యాంటీన్‌లుగా మార్చాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆయన ఈ డిమాండ్ చేశారు. అన్నపూర్ణ కేంద్రాల పేరు మారుస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనబరుస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అందరి నమ్మకం, విశ్వాసంతో కూడిన అన్నపూర్ణ పేరును తొలగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. పేదల పాలిట దేవత అయిన అన్నపూర్ణ తల్లి పేరును తొలగించి కొత్త పేరు పెట్టాలనుకోవడం ఘోర అపరాధం, సామాజిక నేరమని ఎక్స్ వేదికగా శ్రవణ్ పోస్ట్ చేశారు.

చిన్నారిని చిదిమేసిన టిప్పర్ లారీ

- తల్లి కళ్లెదుటే ఆరేళ్ల బాలుడి దుర్మరణం
- కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్తుండగా ప్రమాదం



అభిమన్యు రెడ్డి (ఫైల్)

దుండిగల్: రెప్పపాటు క్షణంలో ఆరేళ్ల బాలుడు ప్రాణాలు వదిలాడు. తన కళ్లెదుటే కుమారుడు విగత జీవిగా మారడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించడం స్థానికుల హృదయాలను కలచివేసింది. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా కేశవాపూర్ ప్రాంతానికి చెందిన రాజురెడ్డి, నిహారిక రెడ్డి దంపతులు కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి మల్లంపేటలోని ఆకాశ్ లేఅవుట్‌లో నివాసముంటున్నారు. రాజురెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా నిహారిక రెడ్డి గృహిణి. వీరికి అభిమన్యురెడ్డి (6), మరో చిన్నారి సంతానం. అభిమన్యు రెడ్డి బౌరంపేటలోని గీతాంజలి స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే నిహారిక శుక్రవారం ఉదయం 8 గంటలకు కుమారుడిని స్కూల్ వద్ద దింపేందుకు స్కూటీపై బయలుదేరింది. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిహారిక ఎడమ వైపు పడగా.. అభిమన్యు కుడి వైపు రోడ్డుపై పడడంతో టిప్పర్ లారీ వెనుక టైరు బాలుడి తలపై నుంచి వెళ్లింది. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబీఆర్ పార్కు సమీపంలో రాక్ గార్డెన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కేబీఆర్ పార్కు వాక్‌వే దగ్గరలో, శిల్పాలు, సుందర ఆకృతులతో కూడిన పార్కు రానుంది. నగర సౌందర్యాన్ని పెంచడంతోపాటు పార్కుకు వచ్చేవారికి సామాజిక బాధ్యత తెలిపేలా సందేశాత్మక వాక్యాలు, శిల్పాలతో పార్కును ఏర్పాటు చేసేందుకు కృష్ణకృతి ఫౌండేషన్ చేసిన విజ్ఞప్తి ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ పార్కులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా సహజసిద్ధంగా లభించే వాటితోనే సుందరంగా ఏర్పాటు చేయనున్నారు. స్థల పరిశీలన, కళాకారుల ఎంపిక, సీఎస్సార్ ద్వారా వివిధ సంస్థల నుంచి అవసరమైన నిధుల సేకరణ వంటి కార్యక్రమాలను కృష్ణకృతి ఫౌండేషన్ నిర్వహించనుంది. స్థలం, డిజైన్లు, శిల్పాలతో పాటు పార్కులో ఏర్పాటు చేయబోయే అన్నింటినీ జీహెచ్ఎంసీ ఆమోదించాల్సి ఉంటుంది. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలకు విద్యా సంబంధ విషయాలతో పాటు ప్రజలకు సామాజిక స్ఫూర్తి కలుగజేయాలనే లక్ష్యంతో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

26 రోజులు.. 3,353 కేసులు!

'నిషా'చరులపై ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే 'నిషా'చరులపై ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెలకు సంబంధించి గురువారం (26వ తేదీ) వరకు చేపట్టిన తనిఖీల్లో మొత్తం 3,353 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కినట్లు ట్రాఫిక్ విభాగం సంయుక్త సీపీ జోయల్ డెవిస్ శుక్రవారం వెల్లడించారు. అంతకు ముందు చిక్కిన వారితో కలిపి మొత్తం 5,321 మందిపై కోర్టుల్లో అభియోగపత్రాలు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో 133 మందికి న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని, బుధవారం ఒక్క రోజే ఏకంగా 38 మంది జైలుకు వెళ్లారని జోయల్ డెవిస్ తెలిపారు. మొత్తం 133 మందిలో ముగ్గురికి 14 రోజులు, ఇద్దరికి పది రోజులు, 128 మందికి ఒక రోజు నుంచి ఆరు రోజుల వరకు జైలు శిక్షలు పడ్డాయని వివరించారు. ఈ ఉల్లంఘనులకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరుపర్చనున్నామని ఆయన పేర్కొన్నారు. జైలుకు వెళ్లిన వారితో సహా మొత్తం అందరికీ కలిపి కోర్టు రూ.1,14,87,600 జరిమానా విధించినట్లు జోయల్ డెవిస్ వెల్లడించారు.



9999 @ రూ.12 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. శుక్రవారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టీజీ 09 ఎఫ్ 9999 నెంబర్‌కు కీస్టోన్ ఇన్ ఫ్రా సంస్థ ఏకంగా రూ.12 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే టీజీ09 0001 నంబర్‌కు రూ.5.60 లక్షలు, టీజీ 09 జి 0009 నంబర్‌కు రూ.5.25 లక్షలు, టీజీ 09జీ 0006 నెంబరు కు రూ.3.92 లక్షలు చొప్పున చెల్లించి వాహన యజమానులు ఆయా నంబర్లను దక్కించుకున్నారు. మొత్తం నంబర్ల పైన రూ.42.10 లక్షల ఆదాయం లభించినట్లు జేటీసీ రమేష్ తెలిపారు.


9వ వర్ధంతి
కీ.శే. కొలన్ భూపాల్ రెడ్డి గారు
జననం : 09.06.1970. మరణం : 28.6.2016
కొలన్ రాఘవేంద్రరెడ్డి - మధువారెడ్డి
J.C. రామ్ భువిత్ రెడ్డి

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
డిస్కౌంట్
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

ఆరోగ్యానికి 'సున్నం'!

- కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా సున్నం చెరువు
- ప్రమాదకర స్థాయిలో సీసం, కాడ్మియం, నికెల్
- దీని సమీపంలోనే వెలిసిన అనేక అక్రమ బోర్లు
- అక్రమంగా నీళ్లు తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయం

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని సున్నం చెరువు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అందులోని నీరు మరిగించినా తొలగిపోని కారకాలతో నిండిపోయింది. ఈ చెరువు చుట్టూ అక్రమ బోర్లు వేసిన కొందరు నీటిని తోడి అమ్మేస్తున్నారు. ఈ నీరు వినియోగిస్తున్న సమీప ప్రాంతాల వాసులు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) గుర్తించింది. నమూనాలు సేకరించి, కాలుష్య నియంత్రణ మండలితో (పీసీబీ) పరీక్షలు చేయించి మరీ నిర్ధారించింది.

పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన...

సున్నం చెరువు శేరిలింగంపల్లి–కూకట్‌పల్లి మండలాల సరిహద్దులో ఉన్న గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య 32.60 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ప్రస్తుతం కాలుష్య కాసారంలా మారిన ఈ చెరువు సమీపంలోకి వెళ్లినా భరించ లేని దుర్వాసన ఉంటోంది. ఈ ప్రాంతంలో బోర్లు వేసి దరు ఆ నీటిని తాగునీటిగా పేర్కొంటూ ట్యాంకర్ల ద్వారా పరిసరాల్లోని విక్రయిస్తున్నారు.

పునరుద్ధరణ చర్యల్లో భాగంగా పరీక్షలు...

నగరంలోని తమ్మిడికుంట, బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, బుమ్రకుద్దీన్ దౌలా చెరువులతో పాటు సున్నం చెరువు పునరుద్ధరణకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. సున్నం చెరువులో మంచి నీరు నిలువ ఉండేలా చేయడానికి దాదాపు రూ.10 కోట్లు వెచ్చిస్తూ అభివృద్ధి చేస్తోంది. ఆ చర్యల్లో భాగంగా హైడ్రా అధికారులు అక్కడి భూగర్భ జలాల నమూనాలు సేకరించి, పీసీబీ ద్వారా పరీక్షలు చేయించింది. తాగునీరుగా ట్యాంకర్లు సరఫరా చేస్తున్న నీటి నమూనాలకూ పరీక్షలు చేయించింది. ఈ నేపథ్యంలోనే ఆ నీటిలో నికెల్, కాడ్మియం. సీసం లోహాల మోతాదు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు బయటపడింది. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పీసీబీ స్పష్టం చేసింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఈ లోహాలు ఉండాల్సిన మోతాదులో కాకుండా.. 2 నుంచి 12 రెట్లు అధికంగా ఉన్నట్లు పీసీబీ నివేదిక రూపొందించింది.

ప్రమాదకర స్థాయిలో సీసం...

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో సీసం 0.01 మిల్లీ గ్రాముల వరకు ఉండచ్చు. సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీటిలో ఇది 0.073 నుంచి 0.122 వరకు ఉన్నట్టు పీసీబీ తేల్చింది. ఇలాంటి నీరు పిల్లల మెదడు చురుకుదనంపై ప్రభావం చూపి, వారి జ్ఞాపిక శక్తిని తగ్గిస్తుందని, రక్తహీనతకు కారణం అవుతుందని హైడ్రా స్పష్టం చేసింది.

- లీటరు నీటిలో కాడ్మియం 0.003 మిల్లీ గ్రాముల వరకు ఉండచ్చు. సున్నం చెరువు పరిసరాల్లోని బోర్ల నీటిలో ఇది 0.007 నుంచి 0.010 మిల్లీ గ్రాముల వరకు ఉన్నట్టు వెల్లడైంది. ఇలా అధిక మొత్తంలో ఉన్న కాడ్మియం మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది.
- లీటరు నీటిలో 0.02 మిల్లీగ్రాముల వరకు నికెల్ ఉండొచ్చు. ఈ నీటిలో ఇది 0.038 నుంచి 0.046 మిల్లీ గ్రాముల వరకు ఉంది. దీనివల్ల చర్మ సంబంధిత వ్యాధులతో పాటు కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది.


సున్నం చెరువు చుట్టూ నిర్మాణాలు


అక్రమంగా వేసిన బోర్లు..

మరగబెట్టినా ఫలితం ఉండదు...

సాధారణంగా నీటిని మరగబెట్టి, చల్లార్చి తాగితే అందులో ఉండే ప్రమాదకర బ్యాక్టీరియాలతో పాటు కొన్ని కాలుష్య కారకాలు పోతాయి. అయితే సున్నం చెరువు చుట్టూ ఉన్న బోర్ల నుంచి వచ్చే నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రమాదమే అని వైద్యులు చెప్తున్నారు. మరగటం వల్ల అందులోని సూక్ష్మక్రిములు పోయినా... సీసం, కాడ్మియం, నికెల్ లోహాలు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితులు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్న హైడ్రా సున్నం చెరువు వద్ద బోర్ల ద్వారా అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

■ కార్ అమ్మాలనుకుంటున్నారా? మేము అన్ని రకముల కార్లు కొంటాము. మీ ఇంటికి వచ్చి మీ కారుని సరైన ధరకు కొని స్పాట్ క్యాష్ ఇస్తాము. Ph: 9908000076 [HA-15939]

Real Estate

■ Kukatpally, KPHB 3 BHK Pent Houses for Sale at Reasonable Price Located near Lodha,. Call: 7660018347 [HA-34747]

FLAT FOR SALE

■ Deluxe Pent Houses for 3 BHK Flat Sale at Reasonable Price Located near Lodha, KPHB. Please Contact : 91829 78658 [HA-34748]

■ 3 BHK for Sale at KPHB Colony, Reasonable Price Located near Lodha, Please Contact - 8686961254 [HA-34746]

HOUSE FOR SALE

■ Gajularamaram Mahadevpuram 4km to KPHB INDP House 70 Sq yds G+1 Pent House (41k rent present)1Cr price. 9703292209 [SCA25005556]

LAND FOR SALE

■ 33.50 ఎకరముల ఫామ్ ల్యాండ్ అమ్మకం @ హైదరాబాద్ to విజయవాడ హైవే, చిట్యాల టౌన్‌కు 2 KM పరిధిలో, ZP రోడ్డుకు ఆనుకొని శ్రీగంధం, మామిడి, జామ, సీతాఫలం & కొబ్బరిచెట్లు, డ్రిప్ సిస్టం & ల్యాండ్ చుట్టూ జాలీ ఫెన్సింగ్ కలదు. ✆ 96668 88540 [B-660]

■ Commerical Mumbai H/W Face, 200 Feet Road N/E Corner 600 Yds, N/F, 500 Yds & 2nd Bit 600 Yds, 2 Bits @ Kothur-D, 9100203631/ 8297771369 [HA-255]

LEASE

■ Fully Furnished 24,000 SFT 400 Seater Office Space For Lease @ Financial District. Grade A Building, Central AC, Grand Atrium. Agents Welcome! Ph: 9347576914. [HA-262]

PLOT FOR SALE

■ కొంపల్లి దగ్గరలో ఓపెన్ ప్లాట్స్ & విల్లా ప్లాట్స్ 99 లక్షలకే 167 గ.లలో G+1 విల్లా కట్టి ఇవ్వబడును లిమిటెడ్ ఆఫర్. Ph: 9849497236 [SCA25005508]

■ గుడ్ న్యూస్. ORRకి అతి దగ్గరలో HMDA ప్లాట్స్ తక్కువ రేటుకే & జనగామ వద్ద ఫామ్ ల్యాండ్ లాంచింగ్ ఆఫర్. 1999/–కే. 6304914366 [SCA25005220]

■ గుడ్ న్యూస్. జనగామ దగ్గర్లో వడిచెర్లలో ఫామ్‌ల్యాండ్ లాంచింగ్ ఆఫర్లో గ॥ 1999/– & RRR HMDA లిమిట్స్ చీమలకొండూరులో తక్కువ రేటుకే. 6304914366 [SCA25005221]

■ VJA, మంగళగిరి, బందరు రోడ్డు, మచిలీపట్నం, బెంజిసర్కిల్‌కి 6 కిమీ, గన్నవరం ఎయిర్ పోర్టు, కంచికచర్లలో DTCP & AP CRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥గ॥ 2,900/- నుండి 13,900/- సంప్ర॥ 99085 66079 [B-51]

TO-LET

■ 25000 Sft G+6 Floors Building at Hitech City 54 Rooms, Class Rooms, Dining & Kitchen, Building ideal for Collage, Hostel, Co-living, set up. Contact: No : 9989312210 [HA-00939]

Services

BUSINESS SERVICE



■ మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించిమార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214 [H-783418]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800534]

PERSONAL CARE



CHANGE OF NAME

■ I, MUKAPALLI RAMESH S/o. MUKAPALLI EASHWAR,R/o, H.no 19-60/9, AsifNagar, Venkatapuram , Alwal, Secunderabad, T.G-15, My Son original name, EVAN RAFEAL S/o SURESH I, intended to change my Son name and my name as MUKAPALLI SAI GANESH S/o. MUKAPALLI RAMESH. [SCA25005546]

■ I, Saahithya Dadi, W/o Dadi Srinivas, R/o H.No. 5-82/11, BSR Colony, Patelguda–502319, have changed my name to Saahithya Kaluva for all future purposes. [UA-57095]

LOST

■ I, Bogi Bhoopal S/o Late B. Mallesh R/o H. no. 9-1-296/1/1 Haridaspura, LongerHouse, Hyderabad. 26.06.2025 While Iam travelling LongerHouse Lost my Original Registered Gift Deed Doc No.2616 of 1981 Dated 17-12-1981 sub Register office Hyderabad (South). If found 9951583091 [SSP25000053]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చిర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 9391039990, 6281125552 [H-783378]

Wanted

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో DTCP & ఫామ్ ల్యాండ్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం, ఉత్సాహంగల టీం లీడర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్/ టెలి కాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం & కమీషన్ ఇవ్వబడును. 9014409667 [SCA25005551]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-3]

■ గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10సం॥ల నుండి 15సం॥ల అనుభవం కలిగి హై ఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర॥ 9133399257 [G-125]

■ సికింద్రాబాద్‌లో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్ (పు) Q: డిగ్రీ, శానిటేషన్ సూపర్ వైజర్స్ & వర్కర్స్, ప్లంబర్స్, వెల్డర్స్ కావలెను. ఫోన్: 9346800433, 8555031103 [HA-1201]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం(TG No.1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్‌కై M/F వర్కర్స్ కా॥ భో+వ+జీ: 16–18 వేలు. 9515119570, 9553461177 [SCA25005422]

■ అర్జెంటుగా ఫిష్ (Fish) కటింగ్–ఉప్పల్ & హౌస్ కీపింగ్ (స్త్రీ), ఆఫీస్ బాయ్స్ (కొంపల్లి) కావలెను. రూం/ భోజనం సౌకర్యం కలదు. ఫోన్: 8330903739, 8639110999 [HA-15936]

■ Wanted Female Telecaller, No Consultancy, Direct Job, Qualification: Degree, Office Address: Ameerpet. Contact: 9849537518 [HA-15942]

■ Wanted Male Marketing Staff Class Room Incharges and Receptionists Qualification any Degree. Age Limit: 25 to 45 years. Salary: 12,000/- to 20,000/- Working Location: Master Minds College, Dilshuknagar, L.B.Nagar, Hyderabad. Contact: 9248733362, 9248733346 [G-6074]

FACULTY TEACHERS

■ Anjani School, Narapally Requires Lower Class English, Higher Class Hindi And Incharge. Ph: 9347521899,8019601899 [SCA25005516]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జీపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

రేపు మహోన్నత సంగీత నృత్య మహోత్సవం

పంజగుట్ట: హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న యూసూఫ్‌గూడ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 'మహోన్నత సంగీత, నృత్య మహోత్సవం' నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు డి.వి.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ ఆహ్వాన పత్రికను ప్రధానకార్యదర్శి డి.నిర్మల, కోశాధికారి పి.నాగ శిరోమణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారి సేవలో శ్రీ చక్ర పూజ, వందమంది మహిళలతో లలితా పారాయణం, సౌందర్య లహరి పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల పాకిస్తాన్‌పై మన సైనికులు వీరోచితంగా పోరాడి గెలుపొందిన నేపథ్యంలో పరమవీర గౌరవ వందనం పేరుతో రిటైర్డ్ కల్నల్ పులిపాక కృష్ణమూర్తికి, మాడుగుల నాగఫణి శర్మకు ఘన సన్మానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్స్‌పై నిషేధం వట్టిదేనా?

పంజగుట్ట: తెలంగాణలో ఆన్‌లైన్, రియల్ మనీ గేమ్స్‌పై పూర్తిస్థాయిలో నిషేధం విధించి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా ఇంకా ఇంకా దాదాపు 87 శాతం మంది గేమ్స్ ఆడుతున్నారని, క్యాసినో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారని పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్ (ప్రహార్) జాతీయ కన్వీనర్ అభయ్ రాజ్ మిశ్రా పేర్కొన్నారు. తెలంగాణలో విధించిన బ్యాన్ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని, తమిళనాడు తరహాలో కొన్ని ఆంక్షలు విధించి కొంత సమయం వరకు గేమ్ ఆడే అవకాశం కల్పిస్తే వినియోగదారులు ఎక్కువ మోసాలకు గురికాకుండా ఉంటారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ ఇండియా కన్వీనర్ మగేశ్వరన్, తెలంగాణ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, భారతితో కలిసి ఆయన మాట్లాడుతూ .. తెలంగాణలో 2017లో అన్ని ఆలన్‌లైన్, రియల్ మనీ ఆటలపై నిషేధం విధించినప్పటికీ చట్టపరమైన, చట్ట విరుద్ధమైన ఆటల మధ్య ఒక హద్దు ఏర్పరచలేకపోవడంతో ఆ బ్యాన్ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

నకిలీ నగలు అమ్మేందుకు యత్నించి..

కుషాయిగూడ: నకిలీ బంగారు నగలను అసలు బంగారంగా నమ్మించి విక్రయించేందుకు యత్నించిన ముగ్గురు పోలీసులకు చిక్కారు. ఈ సంఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ ఆగ్రాకు చెందిన దేవేందర్‌కుమార్, రవి, నాగ్‌పూర్ తాజ్‌బాగ్‌కు చెందిన గంకుబాయ్ శుక్రవారం చక్రిపురం చౌరస్తాలో ఓ డెంటల్ క్లినిక్‌కు వెళ్లారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రియాంకకు తమ వద్ద కిలో బంగారం ఉందని, రూ.4 లక్షలకు అమ్ముతామని చెప్పి కొన్ని గొలుసులను చూపించారు. అనుమానం కలిగిన వైద్యురాలు వాటిని చెక్ చేయగా నకిలీ అని తేలింది. దీంతో ఆమె కుషాయిగూడ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నకిలీ బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు


స్వాధీనం చేసుకున్న నకిలీ బంగారు నగలు

తెల్లవారుజాము వరకు కొనసాగిన ఏసీబీ సోదాలు

ఉప్పల్: ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఉప్పల్ రవాణా శాఖలో ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ వెల్లడించారు. అనుమానం ఉన్న అధికారులు పలు కోణాల్లో విచారించినట్లు తెలిసింది. మొత్తం ఏడుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.ఆరు వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏజెంట్ల ఫోన్ పే, గూగుల్ పే లావాదేవీలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. దాని ఆధారంగా విచారిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద పెద్దమొత్తంలో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర డాక్యుమెంట్లు లభ్యమయినట్లు తెలిపారు. కార్యాలయాలకు రాకుండా సెలవు పెట్టిన అధికారులపైనా నిఘా ఉంచి వారిని సైతం విచారించనున్నట్లు తెలిపారు. కాగా ఏసీబీ సోదాలతో ఆర్టీఏ అధికారులు హడలిపోయినట్లు తెలిసింది. కొందరికి ముందే తెలిసి సెలవు పెట్టారని, శుక్రవారం కూడా కార్యాలయానికి రాలేదని తెలిసింది.

జులై 1 నుంచి ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ నిర్వహణలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహాన్ని నిర్వహిస్తున్నామని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన గానసభ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. జులై 1 నుంచి 7వతేదీ వరకు రోజుకొక అంశంపై చర్చా కార్యక్రమం, పుస్తకావిష్కరణలు ఉంటాయని, ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు కళాసుబ్బారావు కళావేదికలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన వివరించారు.

స్కాలర్ షిప్‌లకు ఆన్‌లైన్ టెస్ట్

లక్డీకాపూల్: రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గనిర్దేశం చేస్తున్న ఆర్య జనని సంస్థ యువతకు స్కాలర్ షిప్పులు అందించేందుకు మరోసారి ముందుకు వచ్చింది. ఇందుకోసం 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాతీయస్థాయిలో ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనుంది. స్వామి వివేకానంద ప్రాక్టికల్ వేదాంత, జ్ఞానయోగ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన 'నాలెడ్జ్ స్ట్రెంత్' అనే పుస్తకంపై జులై 20న ఈ టెస్ట్ నిర్వహిస్తారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్న వారు ఆర్యజనని వెబ్‌సైట్ https://aaryajananicontests.org/ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డాక్టర్ అనుపమ రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 8977863881 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు.

సహకార సంఘాన్ని సందర్శించిన విద్యార్థులు


విద్యార్థుల బృందంతో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేషన్–2025ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్‌లో ఇంటర్న్‌షిప్‌లో ఉన్న నిజాం కళాశాల, బేగంపేట్ డిగ్రీ కళాశాల విద్యార్థుల బృందం శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించింది. సంఘం రైతుల కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పని విధానాన్ని ఈ సందర్భంగా విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి పలు విషయాలపై చర్చించారు. కొహెడలోని గోదాములను పరిశీలించిన అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీఓ సుధాకర్, సహకార యూనియన్ ఫ్యాకల్టీ ఆర్.సురేఖా రాణి, వై.పరిమళా దేవి, బి.నాగేశ్వరరావు, సీఈఓ వై.రాందాసు పాల్గొన్నారు.

జిల్లా పశువైద్యాధికారిగా డాక్టర్ మధుసూదన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ మధుసూదన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఆర్‌జేడీ బాబుబేరిపై పలు ఆరోపణలు రావడం, ఉన్నతాధికారులు ఆయన్ను ఆ స్థానం నుంచి తప్పించి, ఆ స్థానంలో మధుసూదన్‌ను నియమించడం తెలిసింది. దీంతో ఆయన జిల్లా పశు వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపరిశ్రమ అభివృద్ధికి కోసం పాటు పడుతానని తెలిపారు. పశు వైద్య సిబ్బంది అంతా బాధ్యతగా పనిచేయాలన్నారు.

జేఈఈలో క్వాలిఫై కాలేదని.. మెట్రోస్టేషన్ పైనుంచి దూకి..

విద్యార్థి ఆత్మహత్య

చైతన్యపురి: జేఈఈలో క్వాలిఫై కాలేదని మనస్తాపంతో ఓ యవకుడు మెట్రో స్టేషన్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు..నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ప్రభావతి పిల్లలతో కలిసి మీర్‌పేటలో నివసిస్తోంది. ఈమె కుమారుడు హర్షిత్ (17) ఇటీవల విడుదలైన జేఈఈ పరీక్షలో క్వాలిఫై కాలేదు. దీంతో కొద్దిరోజులుగా మనస్తాపంతో ముభావంగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం కోచింగ్‌కు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో హర్షిత్ తల్లికి ఫోన్ చేసి తాను డిప్రెషన్‌లో ఉన్నా..తట్టుకోలేక పోతున్నా అని చెప్పి కాల్ కట్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత సరూర్‌నగర్ పోలీసులు ఫోన్ చేసి హర్షిత్ కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ నుంచి దూకి చనిపోయాడని సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి..తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


హర్షిత్ (ఫైల్)

నగరంలో నేడు

- మిసిమి ఆధ్వర్యంలో ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యానారాయణ రచించిన బహుముఖ బనారస్ పుస్తకావిష్కరణ సమావేశం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో జరుగుతుంది.
- మాదాపూర్ హైటెక్స్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సూత్ర ఆధ్వర్యంలో ఫ్యాషన్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం పక్కన గ్రౌండ్‌లో 'బోనాలు– చేతి వృత్తుల మేళా' ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవాటెల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో–2025 అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నడుచుకుంటూ వెళ్తుండగా వాహనం ఢీకొని..

నాగోలు: నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ కాలనీకి చెందిన చిప్ప మల్లేశం(55) తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలో నివాసం ఉండే అతని కుమారుడు అనిల్‌కుమార్‌ను కలవడానికి శుక్రవారం నగరానికి వచ్చాడు. ఈ మేరకు ఉదయం తట్టిఅన్నారం అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని..కుమారుడికి సమాచారం ఇచ్చి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి యాక్టివా వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వేగంగా నడిపి మల్లేశంను వెనుక నుండి ఢీ కొట్టారు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కుమారుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్‌: సైఫాబాద్‌ డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ సబ్‌స్టేషన్ల మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ తెలిపారు. ఏసీ గార్డ్స్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఏసీ గార్డ్స్‌, మహావీర్‌ హాస్పిటల్‌, డీలక్స్‌ హోటల్‌ ఏరియా, నూరి ట్రావెల్స్‌, ఏసీ గార్డ్స్‌ బడీ మజీద్‌, అడ్వకేట్‌ కాలనీ, లుంబినీ పార్క్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో అంబేద్కర్‌ స్టాచ్యూ లిబర్టీ, లిబర్టీ పెట్రోల్‌ పంప్‌, సాగర్‌ వ్యూ, ఏపీ టూరిజం బోట్స్‌ క్లబ్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పీ ఆఫీస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో రాంలీలా గ్రౌండ్‌, వీర్‌ నగర్‌, ఏసీ గార్డ్స్‌ రాక్‌ చర్చ్‌, ఏసీ గార్డ్స్‌ ప్రభుత్వ హాస్పిటల్‌, చింతలబస్తీ కొంత భాగం, దోబీఘాట్‌, జెడ్పీ ఆఫీస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఆనంద్‌నగర్‌ ఎస్‌బిఐ బ్యాంక్‌, ఆనంద్‌నగర్‌ ఎస్‌బిఐ బ్యాంక్‌, ట్రయాంగిల్‌ చమాన్‌, పోస్ట్‌ ఆఫీస్‌ ఏరియా, ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను ఉండదని తెలిపారు.

వెంగళరావునగర్‌ : ఎస్‌ఆర్‌ఆర్‌పురం, మెథడిస్ట్‌ కాలనీ 11కెవీ ఫీడర్లు మోతీనగర్‌, కుందన్‌బాగ్‌ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్‌ఆర్‌ఆర్‌పురం, సైట్‌-1, రాజీనగర్‌, మెథడిస్ట్‌ కాలనీ, రైల్వేట్రాక్‌, సెయింట్‌ ఫ్రాన్సిస్‌ కాలేజీ, రాక్‌ గార్డెన్స్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ శుక్రవారం తెలిపారు. బంజారానగర్‌, రామారావునగర్‌, ట్రాన్స్‌ సిస్ట్‌ హాస్టల్‌, సోమాజిగూడ, ఎస్‌బీఐ స్టాఫ్‌ కాలేజీ 11కెవీ ఫీడర్లు, బోరబండ, కందన్‌బాగ్‌, గ్రీన్‌లాండ్స్‌ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంజారానగర్‌, ఎస్‌ఆర్‌టీనగర్‌, వినాయకరావునగర్‌, శివాజీనగర్‌, ఆర్‌కె నగర్‌, రామారావునగర్‌, శివాజీనగర్‌, ఉమానగర్‌, వైట్‌హౌస్‌, కుందన్‌బాగ్‌, మాటీవీ బిల్డింగ్స్‌ లైన్‌, హిందూ ప్రెస్‌, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్స్‌, ఎస్‌బీఐ స్టాఫ్‌ కాలేజీ మెయిన్‌రోడ్డు, అమృత విల్లా ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలిపిన మోదీ

శ్రీనగర్‌కాలనీ: ప్రపంచదేశాలు భారతదేశాన్ని అగ్రగామి దేశంగా చూస్తున్నారని ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ నేత లంకల దీపక్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడలో శుక్రవారం ప్రధాని మోదీ 11ఏళ్ళ పాలనను తెలుపుతూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు తాతా రవి నేతృత్వంలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిలో తీసుకెళ్తూ ఆర్థికవ్యవస్థలో ప్రపంచంలో నాలుగోస్థానంలో నిలిపి, అగ్రరాజ్యాలు కూడా మోదీయే నాయకుడని కీర్తిస్తున్నారని ఆయన కొనియాడారు.





కనుల పండువగా జగన్నాథ రథయాత్ర

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నెంబర్‌ 12లోని జగన్నాథ టెంపుల్‌లో శుక్రవారం జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరిగింది. బంజారాహిల్స్‌ రహదారులన్నీ భక్తజన సందోహంతో నిండిపోయాయి. రథయాత్రను తిలకించేందుకు నగర నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చారు. ఉదయం జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను రథాల్లోకి చేర్చిన అనంతరం మధ్యాహ్నం రథయాత్ర ముందుకు సాగింది. వందలాది మంది భక్తులు రథాన్ని లాగుతుండగా జగన్నాథ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రోడ్లకు రెండువైపులా స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీళ్లతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల విగ్రహాలను సమీపంలోని కనకదుర్గ ఆలయంలో ఉంచారు. జూలై 7వ తేదీన తిరుగు యాత్ర ప్రారంభం కానుంది.







నిరసనల మధ్య ఆలయ చైర్మన్‌ ఎన్నిక వాయిదా

- గైర్హాజరైన దేవాదాయ శాఖ అధికారులు
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ట్రస్ట్‌ బోర్డు సభ్యులు..



సమావేశానికి హాజరైన శ్రీనగర్‌కాలనీ టెంపుల్‌ ట్రస్ట్‌ బోర్డు సభ్యులు..

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌ బోర్డు సభ్యుల సమావేశానికి, చైర్మన్‌ ఎన్నిక కార్యక్రమానికి ఆలయ అధికారులు ఎవరూ పాల్గొనకపోవడంతో చైర్మన్‌ ఎన్నిక తీవ్ర నిరసనల మధ్య వాయిదా పడింది. ఈ నెల 27వ తేదీన ఆలయ ట్రస్ట్‌ బోర్డు చైర్మన ఎన్నిక ఉంటుందని సమాచారం ఇవ్వడంతో 14 మంది సభ్యుల్లో 10 మంది శుక్రవారం ఆలయానికి వచ్చారు. ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ అందుబాటులో లేకపోవడంతో వచ్చిన సభ్యులంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా చైర్మన్‌ ఎన్నిక కార్యక్రమానికి హాజరు కావాల్సిన సికింద్రాబాద్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ సంధ్యారాణి, ఇన్‌స్పెక్టర్‌ మధు కూడా గైర్హజర్‌ అయ్యారు. వీరంతా కావాలనే గైర్హాజర్‌ అయ్యారని, చైర్మన్‌ ఎన్నికను ఆపేందుకు పథకం ప్రకారం దూరంగా ఉన్నారని సమావేశానికి హాజరైన బోర్డు సభ్యులు చీపిరి అర్జున్‌యాదవ్‌, జి.కళ్యాణి, కటకం రాజేష్‌, వై.జగదీష్‌, ఎం.విజయ్‌ కుమార్‌, కే లక్ష్మణ్‌రావు, జి.శరత్‌బాబు, కొంటి నర్సింగరావుయాదవ్‌, ఎస్‌.దినేష్‌కుమార్‌లు ఆరోపించారు. ఈ 10 మంది సభ్యులతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడు మురళీధర్‌శర్మ కూడా హాజరయ్యారు. 10 మందిలో మెజార్టీ సభ్యులు సూచించిన వారిని చైర్మన్‌గా ఎన్నుకునేందుకు అవకాశం ఉన్నా అధికారులు లేకపోవడంతో సమావేశం రసాబాసగా ముగిసింది. హాజరైన 10 మంది సభ్యులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశారు. తమకు సమాచారం ఇచ్చి అధికారులు ఎందుకు హాజరుకాలేదని నిలదీశారు. తాము ఫోన్లు చేస్తే అధికారులెవరూ స్పందించడం లేదని దుయ్యబట్టారు.

30 లోపు మూడు నెలల రేషన్‌ తీసుకోండి..

- తీసుకోకుంటే తరువాత రెండు నెలల రేషన్‌ను కూడా కోల్పోతారు
- ఖైరతాబాద్‌ రేషనింగ్‌ సర్కిల్‌ ఏఎస్‌ఓ జ్యోతి

బంజారాహిల్స్‌: తెలంగాణ ప్రభుత్వం సూచనల మేరకు లబ్ధిదారులు రేషన్‌ సరుకులను వెంటనే తీసుకోవాలని ఖైరతాబాద్‌ రేషనింగ్‌ సర్కిల్‌-7 ఏఎస్‌ఓ జ్యోతి విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్‌లోని రేషనింగ్‌ సర్కిల్‌ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జూన్‌, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్‌ సర్కిల్‌ పరిధిలోని ఆహార భద్రతా కార్డుదారులు అందరూ తమ రేషన్‌ సరుకులను జూన్‌ 30వ తేదీ లోగా తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుత పంపిణీ విధానం ప్రకారం రేషన్‌ డీలర్లు జూన్‌ నెలలోనే మూడు నెలల సరుకులను అందిస్తారని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు కేటాయించిన రేషన్‌ సరుకులను నిర్ణీత గడువు లోగా తీసుకోవాలని సూచించారు జులై, ఆగస్టు నెలల్లో చౌక ధరల దుకాణాలు మూసివేయబడతాయని చెప్పారు. ఒకవేళ లబ్ధిదారులు జూన్‌ 30వ తేదీ లోపు రేషన్‌ తీసుకోని పక్షంలో ఈ నెలతో పాటు తదుపరి రెండు నెలల పాటు రేషన్‌ పొందే అవకాశం కోల్పోతారన్నారు.

29న మాగంటి సంస్మరణ సభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్‌, కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌

వెంగళరావునగర్‌: ఈనెల 29న జూబ్లీహిల్స్‌ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ సంస్మరణసభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్‌, స్థానిక కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ తెలిపారు. ఈ మేరకు మధురానగర్‌కాలనీలో శుక్రవారం సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిద్ధార్థనగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో సాయంత్రం 6 గంటలకు సంస్మరణసభ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

నేషనల్‌ సిల్క్‌ ఎక్స్‌పో ప్రారంభం



శ్రీనగర్‌కాలనీ: భారతీయ పట్టుకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, చేనేతకారులను ప్రోత్సహించాలని నటి వణ్య అగర్వాల్‌ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో బోనాలను పురస్కరించుకొని నేషనల్‌ సిల్క్‌ ఎక్స్‌పో పేరిట ఏర్పాటుచేసిన వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ ప్రదర్శన జులై 2 వరకూ కొనసాగుతుంది.

ప్రైవేట్‌ రంగలో రిజర్వేషన్‌ బిల్లును ఆమోదించాలి

హిమాయత్‌నగర్‌: ప్రైవేట్‌ రంగలో రిజర్వేషన్‌ బిల్లును జూలై 21 నుంచి జరిగే పార్లమెంట్‌ వర్షాకాల సమావేశాల్లో తక్షణమే పెట్టాలని సోషలిస్ట్‌ కూటమి జాతీయ కార్యదర్శి ఎల్‌.జై బాబు డిమాండ్‌ చేశారు. స్వేచ్ఛ సమానత్వాలకు, రాజ్యాంగ ఉల్లంఘనలు లేకుండా చట్టం చేయాలన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో జరిగిన తెలంగాణ కూటమి రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు డిమాడ్లతో కూడిన బ్రోచర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా వివిధ పార్టీల ఎంపీలు, ప్రైవేట్‌ రిజర్వేషన్‌ బిల్లుపై పట్టు పట్టినా తిరస్కరణకు గురైందన్నారు.

రిజర్వేషన్లు అడ్డుకునే కుట్రలు తిప్పి కొడతాం

హిమాయత్‌నగర్‌: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌ గౌడ్‌ ఆరోపించారు. ఈ కుట్రలు తిప్పి కొట్టేందుకు బీసీలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో బీసీ మేధావుల ఫోరం చైర్మన్‌, రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చిరంజీవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయస్థానం నెల రోజుల్లో రిజర్వేషన్లను నిర్ణయించి, ఎన్నికల సంఘానికి నివేదించాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వెంగళరావునగర్‌: కార్మిక వ్యతిరేక విధానాలతో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్‌ కోడ్‌లను నిరసిస్తూ జులై 19న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షులు జె.కుమారస్వామి పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ వెంగళరావునగర్‌ డివిజన్‌ మధురానగర్‌లోని మెట్రోస్టేషన్‌ వద్ద కార్మికులనుద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. మోదీ చేపట్టిన నాలుగు లేబర్‌ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. శిశువిహార్‌ ఆయమ్మలకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా అధికారులు పనులు చేయాలంటూ బెదిరించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి వెంకటేష్‌, జూబ్లీహిల్స్‌ నాయకులు అశోక్‌, శ్యామల, సుశీల తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బంజారాహిల్స్‌: కాంగ్రెస్‌ పార్టీ వైఫల్యాలతో విసుగుచెందిన పలువురు మళ్ళీ బీఆర్‌ఎస్‌ వైపు చూస్తున్నారని ఖైరతాబాద్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌ నియోజక వర్గంలోని పలు పార్టీలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మళ్ళీ కేసీఆర్‌ సీఎం కావడం ఖాయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ మన్నె కవితారెడ్డి, సీనియర్‌ నేత విప్లవ్‌కుమార్‌, గజ్జెల ఆనంద్‌, కిరణ్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రహమత్‌నగర్‌: బస్తీల్లో సదుపాయాల కల్పనకు మొదట ప్రాధాన్యత ఇస్తామని కార్పొరేటర్‌ సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌ ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.

ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలి

రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌ ఖబరస్థాన్‌కు స్థలం కేటాయించాలని ముస్లింలు ఆందోళనబాట పట్టారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం వారు ఖబరస్థాన్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కోఆర్డినేటర్‌, ఓవర్సీస్‌ వైస్‌చైర్మన్‌ మహ్మద్‌ నూమాన్‌ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ఏర్పాటైన రహమత్‌నగర్‌ ఖబరస్థాన్‌లో ఖననం చేసేందుకు స్థలం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న జనాబాకు అనుగుణంగా స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూబ్లీహిల్స్‌ ముస్లిం యూత్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సయ్యద్‌ మీనాజ్‌ హుస్సేన్‌ ,ప్రధాన కార్యదర్శి అక్బర్‌ పాల్గొన్నారు.

నిమ్స్‌ ప్రొఫెసర్లకు పదోన్నతులు

లక్డీకాపూల్‌ : నిజాం ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(నిమ్స్‌)లో ఎనిమిది మంది ప్రొఫెసర్లకు పదోన్నతులు లభించాయి. ఆస్పత్రిలోని ఎనిమిది మంది ప్రొఫెసర్లను సీనియర్‌ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఎగ్జిక్యూటివ్‌ బోర్డు తీర్మానించింది. రోషిణి పాల్‌, శాంత్‌వీర్‌ జీ ఉప్పిన్‌, జీ.కే. పరంజ్యోతి, టి. గంగధార్‌, రాజు అయ్యంగార్‌, నిర్మల, ఆషిమా శర్మ, రాహుల్‌ దేవ్‌రాజ్‌లు సీనియర్‌ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు.

ఎఫ్‌సీఐ వర్కర్స్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌గా వెంకటరాయుడు



నియామక పత్రం అందుకుంటున్న జీఎన్‌. వెంకట రాయుడు...

బంజారాహిల్స్‌: ఫుడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా వర్కర్స్‌ ఫెడరేషన్‌ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా జీఎన్‌. వెంకటరాయుడు నియమితులయ్యారు. శుక్రవారం ఫిలింనగర్‌లోని ఫిలింనగర్‌ కల్చరల్‌ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆల్‌ ఇండియా ఫుడ్‌ కార్పొరేషన్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌ అర్నాబ్‌ ఛటర్జీ, ఆల్‌ ఇండియా ఫుడ్‌ అండ్‌ డ్రింక్స్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ డాక్టర్‌ బిశ్వప్రియ రాయ్‌ చౌదరి చేతుల మీదుగా జీఎన్‌. వెంకటరాయుడుకు నియామక పత్రం అందజేశారు.

JOB VACANCY
MOTINAGAR CO-OPERATIVE HOUSING SOCIETY LIMITED (TA-290)
Motinagar, Hyderabad is inviting applications for the post of ACCOUNTS MANAGER
Required Qualification : Commerce Graduate, with experience in Computer Accounting (TALLY), Taxation, & Office, Administration may apply.
Last date for receipt of applications-05/07/2025.
Ph : 9391000630, 9849833400



మెరుగైన సేవలందించాలి



శ్రీనగర్‌కాలనీ: విద్యుత్‌సిబ్బంది మెరుగైన సేవలందించాలని బంజారాహిల్స్‌ సబ్‌డివిజన్‌ ఎస్‌ఈ కరుణాకర్‌ బాబు కోరారు. శుక్రవారం కళ్యాణ్‌నగర్‌ విద్యుత్‌ సెక్షన్‌లో బంజారాహిల్స్‌ సబ్‌డివిజన్‌ ఆధ్వర్యంలో విద్యుత్‌ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. విద్యుత్‌ అధికారులు, సిబ్బంది వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. జాగ్రత్తలను తప్పనిసరి పాటించాలని, ముఖ్యంగా వర్షాకాలంలో మరింతగా సేవలందించడానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అమీర్‌పేట ఏడీఈ బాలకృష్ణ, ఏఈ సాంబశివరావు, ఏఈ జాన్‌ పీటర్‌, ఏఈ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.


బదిలీలు చేపట్టిన తర్వాతే ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

హిమాయత్‌నగర్‌: ప్రభుత్వ గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుల బదిలీలు చేపట్టిన తరువాతే స్కూల్‌ అసిస్టెంట్లకు ఖాళీగా ఉన్న గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ స్టేట్‌ గెజిటెడ్‌ హెడ్‌ మాస్టర్స్‌ అసోసియేషన్‌ (టీఎస్‌ జీహెచ్‌ఎంఏ) విజ్ఞప్తి చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షులు ఆర్‌.రాజ గంగా రెడ్డి మాట్లాడారు. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుల పోస్టు మల్టీ జోన్‌ స్థాయిలోకి చేర్చారన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌.గిరిధర్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. కిలో టమాట రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 23, క్యాప్సికం 67, పచ్చి కాకరకాయ 45, పందిరిబీర 35, క్యాబేజీ 21, క్యారెట్‌ 40, దొండకాయ 28, గుండు బీన్స్‌ 95, గింజచిక్కుడు 55, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్‌ 22, ఉల్లిగడ్డ 25, ఆలుగడ్డ 25, చామగడ్డ 28, మొరంగడ్డ 23, కందగడ్డ 45, క్యాలిఫ్లవర్‌ 23, సొరకాయ 10, పొట్లకాయ 23, అరిటికాయ 11, మునగకాయ 4, మామిడికాయ 23, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 45. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

గుడ్‌బై అంటూ వాట్సప్‌ స్టేటస్‌.. యువకుడి అదృశ్యం



సురేంద్ర ..

పంజగుట్ట: స్నేహితురాలితో పాటు మాల్‌కు వచ్చిన వ్యక్తి ఆమెకు చెప్పకుండా అక్కడనుండి వెళ్లిపోయి కొద్దిసేపటికి వాట్సప్‌ స్టేటస్‌లో గుడ్‌బై అని పెట్టుకుని కనిపించకుండా పోయాడు. పంజగుట్ట పోలీసులు తెలిపిన మేరకు.. హరియాణకు చెందిన సురేంద్ర (30) బెంగళూరులో యోగా ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. నగరంలో ఉన్న తన స్నేహితురాలిని కలిసేందుకు ఈ నెల 22న నగరానికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం సురేంద్ర,స్నేహితురాలు కలిసి పంజగుట్ట నెక్స్‌గలేరియా మాల్‌కు వచ్చారు. అక్కడున్న బర్గర్‌కింగ్‌లో ఫుడ్‌ ఆర్డర్‌ చేశారు. సడెన్‌గా అక్కడ నుండి వెళ్లిపోయిన సురేంద్ర కనిపించకుండా పోయాడు. ఎంత ఫోన్‌ చేసినా తియ్యలేదు. కొద్దిసేపటికే వాట్సాప్‌ స్టేటస్‌లో అందరికీ గుడ్‌బై అని పెట్టి ఫోన్‌ స్విచ్‌ఆఫ్‌ చేసుకున్నాడు. అతని కోసం అన్ని చోట్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో లగేజీ మాయం

వెంగళరావునగర్‌: రాత్రి బస్సు ఎక్కి ఉదయం బస్సు దిగేలోగా లగేజీ మాయమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుంటూరుకు చెందిన షేక్‌ గౌస్‌ బుధవారం రాత్రి గుంటూరులో బస్సెక్కి గురువారం ఉదయం మైత్రీవనం వద్ద దిగుతూ తన లగేజ్‌ చూసుకున్నాడు. అయితే లగేజీ కనిపించలేదు. చుట్టుపక్కల వారిని, బస్సు ఉద్యోగులను అడిగినప్పటికీ ఫలితం లేదు. దాంతో శుక్రవారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్‌: పార్కులోనికి వెళ్ళి వచ్చేలోగా ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన సయ్యద్‌ నజీర్‌ బోయిన్‌పల్లిలో వ్యాపారం చేసుకుంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తన స్నేహితురాలితో కృష్ణకాంత్‌పార్క్‌ వచ్చి సాయంత్రం బయటకు వచ్చి చూసేలోగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు వివిధ ప్రాంతాల్లో వెదికి శుక్రవారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం...

వెంగళరావునగర్‌: విధులకు వెళ్ళిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. ఎస్‌.కల్లమ్మ కుటుంబం గత కొంత కాలంగా కార్మికనగర్‌లో ఉంటున్నారు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 20వ తేదీ విధుల నిమిత్తం వెళ్ళి రాలేదు. దాంతో శుక్రవారం తల్లి మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ప్రతిష్టాత్మక న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వైభవం మరోసారి ఘనంగా ప్రదర్శితమైంది. టైమ్స్ స్క్వేర్ వేదికగా ఈ నెల 24 నుంచి 26 తేదీల్లో జరిగిన ఎన్ఎఫ్‌టీఎన్‌వైసీ 2025 కార్యక్రమంలో భాగంగా తెలంగాణకు చెందిన ప్రముఖ ట్రావెల్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ నలిమెల అరుణ్ కుమార్ తీసిన మూడు ఫొటోలు ప్రదర్శితమయ్యాయి. ఇది ఒక ఫొటోగ్రాఫర్‌గా తనకే కాదు.. రాష్ట్రానికి కూడా గర్వకారణమే. టైమ్స్ స్క్వేర్‌లోని ప్రముఖ డిజిటల్ బిల్‌బోర్డ్‌లపై తన ఫొటోలు ప్రదర్శితమవ్వడం ఇది రెండో సారి కావడం మరో విశేషం. తన ట్రావెల్ ఫొటోగ్రఫీలో భాగంగా ఏకంగా రెండు సార్లు దేశం మొత్తం చుట్టొచ్చిన అరుణ్ తన ప్రయాణాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

లైఫ్ ఆఫ్ అరుణ్..

న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో తెలంగాణ ఫొటోలు



- ప్రముఖ ట్రావెల్ అరుణ్ కుమార్ తీసిన మూడు ఫొటోల ప్రదర్శన
- మిస్ ఇండియా నందినీ గుప్తా రామప్ప దేవాలయ సందర్శన ఫొటో ఎంపిక
- అంతర్జాతీయ వేదికపై గుర్తింపు.. మన్‌కీ బాత్‌లో ప్రశంసలు
- ట్రావెల్ ఫొటోగ్రఫీలో భాగంగా రెండు సార్లు దేశాన్ని చుట్టొచ్చిన అరుణ్








ఇటీవల ప్రతిష్టాత్మకంగా జరిగిన మిస్ వరల్డ్ 2025 నేపథ్యంలో మిస్ ఇండియా నందినీ గుప్తా.. తెలంగాణలోని ప్రాచీన కాకతీయుల శిల్పకళకు ప్రతిరూపంగా నిలిచిన రామప్ప ఆలయాన్ని సందర్శించింది. ఆ సమయంలో అరుణ్ క్లిక్‌మనిపించిన రెండు ఫొటోలు టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శించారు. దీంతో పాటు తెలంగాణ ఆత్మగా పిలుచుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా తీసిన మరో ఫొటో కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే వేదికపై గతేడాది రాజస్థాన్ పుష్కర్‌లోని కేమల్ ఫేర్‌లో తాను తీసిన ఒక అమ్మాయి ఫొటో ప్రదర్శించడం విశేషం. 2019 నుంచి పూర్తి స్థాయి ఫొటోగ్రాఫర్‌గా మారిన అరుణ్ కుమార్ ఇప్పటికే రెండు సార్లు దేశం చుట్టి అనేక ప్రకృతి, పల్లె, వారసత్వ, స్ట్రీట్‌లైఫ్ చిత్రాలను తన లెన్స్‌లో బంధించారు. అరుణ్ కుమార్ సొంతంగా నేర్చుకున్న ఫొటోగ్రఫీ విద్యతోనే ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచారు. బీబీసీ ఎర్త్, నట్ జియో ఇండియా, సోనీ ఆల్ఫా, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ వంటి ప్రముఖ సంస్థలలో ఆయన ఫొటోలు ఫీచర్ కావడం గర్వకారణం. అంతేకాదు, దేశ విదేశాల్లో అనేక ప్రదర్శనల్లో పాల్గొనడమే కాక, 2023లో ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో కూడా ఆయన పనిని ప్రశంసించడం విశేషం.

నా ప్రయాణానికి సాక్ష్యాలు..

ఇది నా వ్యక్తిగత ప్రయాణంలో ఒక గొప్ప మలుపు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వేదికపై నేను తీసిన రామప్ప దేవాలయ చిత్రం ప్రదర్శించబడటం సంతోషంగా ఉంది. ప్రతి ఏడాది జరిగే ఈ ఎన్ఎఫ్‌టీఎన్‌వైసీకి నా ఫొటోగ్రఫీలో భాగంగా తీసిన కొన్ని ఫొటోలు పంపించాను. ఇదేకాకుండా గతేడాది వన్ ప్లస్ ఇంటర్నేషనల్ మొబైల్ కాంపిటీషన్‌లో నేను తీసిన ఫొటో 2వ స్థానంలో అవార్డ్ పొందింది. గతంలో దేశంలోని టాప్ 10 ఐకానిక్ ఇమేజెస్‌లో సైతం నా ఫొటోలు ఎంపిక కావడం ఎప్పటికీ మరచిపోలేని అనుభూతి. నా ప్రయాణంలో చూసిన ఎన్నో అనుభవాలు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి. దీనికి సాక్ష్యంగా నా ఫొటోలు నిలవడం మిక్కిలి సంతోషంగా ఉంది. - అరుణ్ కుమార్

ఫేసెస్-ఎమోషనల్ మిర్రర్స్ : అరుణ్

ప్రపంచవ్యాప్తంగా న్యూయార్క్, మలేసియా, పోర్చుగల్, చైనా, ఇండోనేషియా, దుబాయ్, ఢిల్లీ వంటి చోట్ల ఆయన చిత్ర ప్రదర్శనలు జరిగాయి. సమకాలీన డిజిటల్ ఆర్ట్‌లో, ప్రత్యేకంగా ఎన్ఎఫ్‌టీ ఫొటోగ్రఫీలో ఆయన దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తోంది. టైమ్స్ స్క్వేర్ ప్రదర్శనతోపాటు, జూన్ 25–27 మధ్య మారియట్ మార్క్విస్- ఎన్‌వైసీలోని ఓ ప్రముఖ గ్యాలరీలోనూ ఆయన చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. తన ప్రయాణంలో భాగంగా పలు ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ అవార్డులు అందుకున్నారు. సోనీ ఆల్ఫా, ఎర్త్‌డాట్ ఆర్గనైజేషన్ వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి గౌరవాలు లభించాయి. ఆయన తీసిన 'షీ ఈజ్ ది ఫైర్', 'ఫేసెస్-ఎమోషనల్ మిర్రర్స్' వంటి ఫొటోలు ఆలోచింపజేసే విధంగా ఉంటాయి. ఇవన్నీ ఆయనకు 'ఫొటోగ్రఫీ ఓ మేధో యాత్ర' అనే దానికి ఉదాహరణలు. తన కెమెరాతో కేవలం చిత్రాలు తీయడం కాదు, తన అంతరంగాన్ని ప్రపంచానికి చూపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ప్రతి ఫ్రేమ్ నా ఆలోచనలకు ప్రతిబింబం' అనే ఆయన మాటలు నిజంగా ప్రతి యువ కళాకారునికీ ప్రేరణగా నిలుస్తున్నాయి.



అమెజాన్‌లో మిల్లెట్ స్టోర్..



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల్లో చిరుధాన్యాల పట్ల పెరుగుతున్న అవగాహన ఆన్‌లైన్ విపణిని కూడా ప్రభావితం చేస్తోంది. నగరవ్యాప్తంగా ఆర్గానిక్ బజార్లు ఇప్పటికే జోరందుకోగా, ఈ డిమాండ్‌ను ఆన్‌లైన్ వేదికలు సైతం అందిపుచ్చుకుంటున్నాయి. ప్రముఖ ఆన్‌లైన్ వేదిక అమెజాన్ ఫ్రెష్ మిల్లెట్ స్టోర్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించినట్టు తెలిపింది. అల్పాహారం నుంచి డిన్నర్ వరకూ కేవలం చిరుధాన్యాలను మాత్రమే స్వీకరించే వారికోసం ప్రొటీన్, ఫైబర్, సహజమైన ప్రీబయోటిక్స్ పుష్కలంగా ఉండేలా వెరైటీ ఫుడ్ ఐటమ్స్‌ను అందిస్తున్నామని, పుష్కలంగా ప్రొటీన్ కలిగిన బనానా పాన్ కేక్ మిక్స్, మిల్లెట్ నూడుల్స్, మిల్లెట్ మ్యూజ్లి తదితర ఫుడ్ వెరైటీలను ప్రొటీన్స్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, తదితరాల వివరాలతో సహా అందుకోవచ్చని వివరించింది.

కథలే సమాజ మార్పునకు ప్రేరణ

'దిశ' పుస్తకావిష్కరణలో సినీనటి హెబ్బా పటేల్



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత సమాజంలో మహిళలకు తాము ఎదుర్కొంటున్న విభిన్న రకాల సమస్యలకు పరిష్కారం చూపే రచనలు రావాల్సిన అవసరం ఉందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ న్యాయవాది, రచయిత డాక్టర్ ధరనీకోట సుయోధన్ రచించిన నవల దిశ ఆవిష్కరణ నగరంలోని టీ హబ్‌లో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో నటి హెబ్బా పటేల్ మాట్లాడుతూ సామాజిక మార్పుకు కథలు ప్రేరణ అందిస్తాయని 'దిశా' కథానాయిక మహిళల గొంతుని బలంగా వినిపించిందని ప్రశంసించారు. ప్రసిద్ధ గైనకాలజిస్ట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.మంజుల ఆనగానీ మాట్లాడుతూ వ్యవస్థల్లో మహిళలు ఎదుర్కొనే సవాళ్లను నిజాయితీగా ప్రతిబింబించే రచనలు సమాజాన్ని మరింత చైతన్యం చేస్తాయన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు గిరిజా శంకర్, పి.వెంకటరామిరెడ్డి, కన్నన్ పరమేశ్వరన్ పాల్గొన్నారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు

- ఏడు స్వర్ణాలతో మెరిసిన లేషా కిరణ్
- పోటీల్లో పాల్గొన్న 1200 మంది షూటర్లు



సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న 11వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో షూటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మహిళల విభాగాల్లో లేషా కిరణ్ ఎనిమిది విభాగాల్లో పోటీ పడి ఏకంగా ఏడు స్వర్ణాలు సాధించారు. సూర్య కృష్ణ చిత్రూర్ ఐదు పతకాలు, అందులో రెండు స్వర్ణాలు, సంగేమ్ తన్వీ ఏడు పతకాలు (వెండితో అధికంగా) గెలిచి ఈ పోటీల్లో సత్తా చాటింది. నాగ సాయి తరుణ్ పచ్చరపల్లి నాలుగు స్వర్ణాలతో పిస్టల్ విభాగాల్లో రాణించగా, మేక జే గురు సింహ ప్రతాప్ అప్పారావు ట్రాప్, డబుల్ ట్రాప్ విభాగాల్లో రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ పోటీల్లో 1200 మందికి పైగా షూటర్లు పాల్గొన్నారు. సాట్స్ చైర్మన్ శివ సేనారెడ్డి, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షులు అమిత్ సంఘీ పాల్గొన్నారు.

అలరించిన నృత్య నీరాజనం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నక్షత్ర నాట్య నిలయం ఆధ్వర్యంలో నృత్య నీరాజనం పేరిట శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కూచిపూడి నృత్య మహోత్సవం అహూతులను ఆకట్టుకుంది. శాస్త్రీయ సంగీత కళలు మన వారసత్వ సంపదని, అటువంటి సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. ఈ కళలను యువతరానికి అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అంతకు ముందు నృత్య గురువు డాక్టర్ వసంత కిరణ్ శిష్య బృందం వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం పలువురు నాట్య గురువులను సత్కరించి, కళాకారులను అభినందించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగం శాస్త్రి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వనజ ఉదయ్, విద్యాశాఖ అధికారి రాజా గంగారామ్, నాట్య తపస్వి వ్యవస్థాపకులు సీహెచ్ పద్మావతి, సంస్థ వ్యవస్థాపకురాలు కే.శిరీష, డైరెక్టర్ శకుంతల పాల్గొన్నారు.

సుందరం.. సుమధురం

శిల్పారామంలో ఆకట్టుకుంటున్న తోలుబొమ్మలాట మ్యూజియం

శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో సందర్శకుల తాకిడి

ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ అందుబాటులో ప్రదర్శన

రామాయణం, సుందరకాండ సన్నివేశాలతో కూడిన 61 చిత్రాలు




తోలుబొమ్మలాట అనేది కేవలం నాటక ప్రదర్శన మాత్రమే కాదు. మన సంస్కృతి, వారసత్వానికి నిదర్శనం. ఇప్పుడంటే టీవీలు, సినిమాలు ఉన్నాయికానీ.. ఒకప్పుడు పురాణాలు, నీతికథలు, జానపద జ్ఞానం తోలుబొమ్మల ద్వారానే ప్రజలకు చేరాయి. పూర్వం గ్రామాల్లో ప్రజలందరికీ వినోదంగా ఉండే ఈ కళ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలుబొమ్మలాట, కర్ణాటకలో తొగలుగొంబె, తమిళనాడులో ఛాయానాటక అనే పేర్లతో ఈ కళారూపాలు ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం మాదాపూర్‌లోని శిల్పారామంలో సందర్శకులను ఆకట్టుకునేందుకు.. సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా తోలుబొమ్మల మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. నగరవాసులతో పాటు యువత అధిక సంఖ్యలో పాల్గొని మ్యూజియం విశేషాలను అడిగి తెలుసుకుంటున్నారు.

కాళింగుడు, హనుమంతుడు, శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, అశోకచెట్టు, భరతుడు, నారదుడు, బంగారక్క, జుట్టుపోలిగాడు, కేతిగాడు తదితర పాత్రల చిత్రాలు.. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పురాణ గాథలు.. ఇవి ప్రస్తుతం నగరంలోని శిల్పారామంలో తోలుబొమ్మల రూపంలో సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా బొమ్మలకు సంబంధించిన సన్నివేశాలను నిర్వాహకురాలు రమణకుమారి వివరిస్తుంటే.. సుందరం.. సుమధురం అన్న అనుభూతిని పొందుతున్నారు సందర్శకులు.. కనుమరుగవుతున్న అలనాటి ప్రాచీన కళను ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా తోలుబొమ్మల మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు.

- మాదాపూర్





నాటక రూపంలో ఆడించడం..

తోలుబొమ్మలాట అంటే మూడు పదాల కలయిక. తోలు(ఎండిన జంతువుల చర్మం) బొమ్మ (ప్రతిమ) ఆట (నాటకం లేదా నాట్యరూపం). ఎండిన తోలుతో తయారు చేసిన బొమ్మల ద్వారా ప్రదర్శించే నాటకాన్నే తొలుబొమ్మలాట అంటారు. ఆయా పురాణ ఇతిహాసాలకు సరిపోలిన పాత్రలను తయారుచేసి వాటిని తెరపై లయబద్ధంగా కదిలిస్తారు. తోలుబొమ్మలాటలో ప్రధానంగా రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పురాణ గాథలను ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యం.

దీపం వెలుతురులో...

తెర వెనుక నుంచి దీపం వెలుతురులో తోలు బొమ్మలను కదిలిస్తుంటారు. దీనిని ఛాయానాటకం అని కూడా అంటారు. పూర్వం గ్రామీణ సముదాయాల్లో ప్రధాన వినోద సాదనం ఇదే. ప్రత్యేకించి జాతరులు, పండుగలు వంటి సందర్భాల్లో ప్రదర్శించేవారు. బొమ్మల కదలికలకు అనుగుణంగా కథ చెబుతారు. హార్మోనియం, మృదంగం, తంబురవంటివి సంగీతానికి వాడతారు. కథల నడుమ పాటలు, హాస్యరస ప్రదర్శనలు, పౌరాణిక సన్నివేశాలు ఉంటాయి. ఈ కళను దేశ విదేశాల్లోనూ ప్రదర్శించారు. భారత ప్రభుత్వం పలువురు కళాకారులకు పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ వార్డులను అందజేసింది.





సాక్షి రియల్టీ
శనివారం
28-06-2025

యువ కొనుగోలుదారులు



మార్కెట్‌లోకి మూడోతరం కొనుగోలుదారులు
హైరైజ్, అల్ట్రా లగ్జరీ గృహాలే వీరికి ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: నగర స్థిరాస్తి మార్కెట్‌లోకి థర్డ్ జనరేషన్ కస్టమర్లు ఎంట్రీ ఇస్తున్నారు. ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ)లు తిరిగి స్థానిక ప్రాంతాలలో స్థిర పడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మార్కెట్‌లోకి వస్తున్న కొత్తతరం కస్టమర్లకు విదేశాల్లో తరహా ఆధునిక వసతులు, విస్తీర్ణమైన అపార్ట్‌మెంట్లను కోరుకుంటున్నారు. వీరి అభిరుచికి తగినట్టుగానే చాలామంది గ్రేడ్-ఏ డెవలపర్లు అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు, హైరైజ్ ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు.

ప్రధాన నగరంలో కష్టమే..

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాల్లోని నివాసితుల రెండు, మూడో తరం వారసులు కూడా సిటీకి వస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లో లగ్జరీ ఇండిపెండెంట్ హౌస్‌లు దొరకడం కష్టం. దీంతో హైరైజ్, అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గు చూపక తప్పని పరిస్థితి. అలాగే విదేశాల్లో స్థిరపడిపోయిన ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్‌ఎన్‌ఐ)లు తిరిగి స్థానిక ప్రాంతాలకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు ఎన్నారైలు ఇప్పటికే స్థానికంగా ఉన్న స్థిరాస్తులను విక్రయించి, లగ్జరీ ప్రాపర్టీలకు అప్‌గ్రేడ్ అవుతున్నారు. అలాగే ఇన్నాళ్లు భార్య, భర్తలిద్దరి సంపాదనతో ఇళ్లు కొనుగోలు చేసిన కస్టమర్లు.. ఇప్పుడు వారి పిల్లలు సంపాదన కూడా తోడైంది. 3-4 ఏళ్లుగా ఈ మూడోతరం సంపాదనతో నగరంలో ప్రాపర్టీలు కొనుగోలు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొత్తగా స్థలాలు కొనే వారి కంటే ఉన్న భూమిని విక్రయించి, వచ్చిన సొమ్ముతో నగరంలో ప్రాపర్టీ కొనేందుకే ఆసక్తి చూపిస్తారని, దీంతో ప్రాపర్టీలకు మరింత డిమాండ్ ఉంటోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.


భూముల ధరలు ఆకాశంవైపు..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ(కేపీహెచ్‌బీ)లో నిర్వహించిన బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. దేశంలో అత్యంత డిమాండ్ ఉన్న నగరాలలో హైదరాబాద్ ఒకటిగా నిలిచింది. కేపీహెచ్‌బీలో చదరపు గజం ధర రూ.2.98 లక్షలకు అమ్ముడుపోయింది. ఐటీ హబ్‌కు చేరువలో ఉండటం వల్లే ఈ భూములకు అత్యధిక డిమాండ్ ఉందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. నగరంలో ఐటీ నిపుణులు, సంస్థలను ఆకర్షిస్తూనే ఉంది. గృహాలు, ఆఫీసు స్థలాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. అయితే ఇన్వెంటరీ, అందుబాటుకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. హైటెక్ సిటీ నుంచి 40 నిమిషాల ప్రయాణ వ్యవధిలో ఉన్న ప్రాంతాలలో బ్రాండెడ్ డెవలపర్లు కానీ ప్రాజెక్ట్‌లలో కూడా అపార్ట్‌మెంట్ల ధరలు రూ.1.2 కోట్ల నుంచి రూ.1.5 కోట్ల మధ్య ఉన్నాయంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

మెరుగైన మౌలిక వసతులు

మౌలిక సదుపాయాల విస్తరణ, కనెక్టివిటీ, కొత్త మెట్రో లైన్లు, ఎక్స్‌ప్రెస్ వేస్, ఐటీ పార్క్‌లతో నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. దీంతో నగరంలో స్థిరాస్తి పెట్టుబడి అవకాశాలు బాగా పెరిగాయి. ప్రధాన వాణిజ్య కేంద్రాలకు చేరువలో ఉన్న ప్రాంతాలలో, మెరుగైన కనెక్టివిటీ ఉన్న ప్రాంతాలలో భూముల ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. అలాగే ప్రణాళికాబద్ధమైన కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. నగరం శివారు ప్రాంతాల వైపు విస్తరిస్తుండటంతో కాలనీ, గేటెడ్ కమ్యూనిటీలు పెట్టుబడులను ఆకర్షించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.





నిర్మాణం మరింత భారం

ఏటేటా పెరుగుతున్న నిర్మాణ వ్యయం

సాక్షి, సిటీబ్యూరో: అధిక రుణాలు, నిధుల లేమితో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న దేశీయ డెవలపర్లకు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల మరొక గుదిబండలా మారింది. నిర్మాణ వ్యయంలో అధిక వాటా ఉండే సిమెంట్, స్టీల్ ధరలు ఏడాది కాలంలో 20 శాతం మేర పెరిగాయి. దీంతో నిర్మాణ వ్యయం 10-12 శాతం పెరిగిందని కొల్లియర్స్ రీసెర్చ్ తెలిపింది. టోకు ధరల ద్రవ్యోల్బణం, మెటీరియల్ ధరలు రెండంకెల పెరుగుదలను నమోదు చేస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్మాణ వ్యయం అదనంగా 8-9 శాతం మేర పెరగొచ్చని అంచనా వేసింది. కరోనా మహమ్మారి నేపథ్యంలో రవాణా పరిమితులు, ఇంధన వనరుల ధరలు పెరుగుదల కారణంగా ఇన్‌పుట్ కాస్ట్ పెరిగాయి. 2024 మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో స్టీల్ ధరలు 30 శాతం, సిమెంట్ 22 శాతం, కాపర్ 40 శాతం, అల్యూమినియం 44 శాతం, ఇంధన వనరుల ధరలు 70 శాతం మేర పెరిగాయి. దీంతో గతేడాది మార్చిలో నివాస సముదాయల నిర్మాణ వ్యయం చ.అ.కు రూ.2,060గా ఉండగా.. ఈ ఏడాది మార్చి నాటికి రూ.2,300లకు, అలాగే ఇండస్ట్రియల్ నిర్మాణ వ్యయం గతేడాది రూ.1,900ల నుంచి ఈ ఏడాది మార్చి నాటికి రూ.2,100లకు పెరిగిందని వివరించారు. ఇప్పటికే తక్కువ మార్జిన్లతో నిర్మాణ పనులను చేపడుతున్న అందుబాటు, మధ్య స్థాయి గృహ నిర్మాణ డెవలపర్లకు తాజాగా పెరిగిన నిర్మాణ వ్యయం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని చెప్పారు. వ్యయ భారం నుంచి కాసింత ఉపశమనం పొందేందుకు డెవలపర్లు ప్రాపర్టీ ధరలను పెంచక తప్పని పరిస్థితి అని పేర్కొన్నారు.

REALITY మార్కెట్ పుంజుకోవాలంటే?

- వేగవంతమైన నిర్ణయాలు, పాలసీలతోనే మళ్లీ జోరు
- గృహ కొనుగోళ్లకు సరైన సమయమిదే..
- ధర, వసతులలో బిల్డర్లతో బేరసారాలకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం, హైడ్రా దూకుడు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం కారణాలేమైనా కొంతకాలం వరకూ స్థిరాస్తి మార్కెట్ స్తబ్దుగా ఉంది. ఇటీవల ప్రభుత్వ ప్రోత్సాహకర నిర్ణయాలు, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు అభివృద్ధి ప్రణాళికలు తదితరాలతో మార్కెట్ మళ్లీ గాడిలో పడుతోంది. ఇలాంటి సమయంలో గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలంటే వేగవంతంగా విధానపరమైన నిర్ణయాలతో పాటు వాటిని కార్యరూపంలోకి తీసుకురావాలి. అప్పుడే మార్కెట్ లో సానుకూల వాతావరణం ఏర్పడి, క్రయవిక్రయాలు పెరుగుతాయి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

మౌలిక వసతులపై దృష్టి..


మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిరంతరం దృష్టి పెడుతూనే పెట్టుబడిదారులకు మరింత సానుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని స్థిరాస్తి సంఘాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక పాలసీ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ సుందరీకరణ, ఫార్మా క్లస్టర్లు, సెమీ కండక్టర్ల పాలసీ, ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ సిటీ వంటి ఏదైనా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకొని వాటి అమలుకు చర్యలు చేపట్టాలి. ఈ విషయాన్ని ప్రజలకు చేరవేసి ఒక సానుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో తీసుకురావాలి. ఆరోగ్యం, పర్యాటక రంగాలకు విశేష ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహించాలి. ప్రభుత్వం దార్శనికతతో ప్రణాళికలు రూపొందిస్తే ఎన్నెన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇవన్నీ రియల్టీ రంగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి.

ఎన్నో అనుకూల పరిస్థితులు

హైదరాబాద్‌లోని భౌగోళిక వాతావరణం, వనరులు, మౌలిక సదుపాయాలు, దేశ, విదేశీ సంస్థల కార్యాలయాలు.. ఇలా ఎన్నెన్నో అనుకూల పరిస్థితులు హైదరాబాద్‌కు ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే ఇప్పటికీ హైదరాబాద్‌లో గృహాల ధరలు, అద్దెలు, భూముల రేట్లు అందుబాటులోనే ఉన్నాయి. కాస్మోపాలిటన్ కల్చర్, తక్కువ జీవన వ్యయం వంటివి నగరానికి అదనపు అంశాలు. దీంతో పెట్టుబడులు వస్తూనే ఉంటాయి. ఏమాత్రం అలసత్వం ఉండదు. దీంతో భవిష్యత్తులో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కు ఢోకా ఉండదు.

కొనుగోళ్లకు ఇదే రైట్ టైం..

ప్రతీ ఎన్నికల సమయంలో మార్కెట్ స్తబ్దుగా ఉండటం సహజమే. కానీ, ఈసారి ఎన్నికల వాతావరణంతో పాటు ప్రభుత్వం మారడం కూడా స్థిరాస్తి మార్కెట్‌పై ప్రభావం చూపిస్తోంది. ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 8 నెలలుగా స్థిరాస్తి మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉందని, మరో ఆరేడు నెలల పాటు ఇదే పరిస్థితి కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఇలాంటి స్తబ్దతే గృహ కొనుగోళ్లకు కరెక్ట్ టైమ్ అని సూచిస్తున్నారు. ఎందుకంటే ఈ ప్రతికూల వాతావరణంలోనే ధరలు, వసతుల విషయంలో కస్టమర్లకు బిల్డర్లతో బేరసారాలకు అవకాశం ఉంటుంది. నగదు లభ్యత కావాలి కాబట్టి డెవలపర్లూ అంగీకరించే వీలుంటుంది.





రియల్టీ బ్యాక్

హైదరాబాద్‌లో మెరుగైన స్థిరాస్తి రంగం

- 2025 క్యూ1లో 10,741 యూనిట్ల లాంచింగ్
- నానక్‌రాంగూడ, రాజేంద్రనగర్, బాచుపల్లి ప్రాంతాలు హాట్‌స్పాట్స్
- 18.2 లక్షల చ.అ. నికర కార్యాలయ స్థల లావాదేవీలు
- మాదాపూర్, గచ్చిబౌలిలోని ఆఫీసు స్పేస్‌లకు డిమాండ్
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పట్టాలెక్కింది. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ తదితర అభివృద్ధి ప్రణాళికలతో నగర స్థిరాస్తి రంగం పుంజుకుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో నగరంలో 10,741 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే కేవలం 3 శాతం తగ్గుదల కనిపించింది. గృహ కొనుగోలుదారులు ప్రీమియం, హైఎండ్ లగ్జరీ గృహాలకే మొగ్గు చూపిస్తుండటంతో అందుబాటు, మధ్యస్థాయి గృహాల లాంచింగ్స్ స్వల్పంగా తగ్గాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో

1 హాట్‌స్పాట్ ప్రాంతాలివే..


లాంచింగ్స్‌లో పశ్చిమ హైదరాబాద్ ఆధిపత్యాన్ని చలాయిస్తోంది. మొత్తం లాంచింగ్స్‌లో ఈ జోన్ వాటా ఏకంగా 51 శాతంగా ఉంది. వెస్ట్ హైదరాబాద్‌లో నానక్‌రాంగూడ ప్రధాన హాట్‌స్పాట్‌గా నిలిచింది. లాంచింగ్స్‌లో ఉత్తర హైదరాబాద్ వాటా 18 శాతంగా ఉండగా.. ఈ జోన్‌లో బాచుపల్లి హాట్‌స్పాట్‌గా ఉంది. ఇక, దక్షిణ హైదరాబాద్ వాటా 17 శాతంగా ఉండగా.. రాజేంద్రనగర్ హాట్‌స్పాట్‌గా ఉంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి పశ్చిమ హైదరాబాద్ చోదకశక్తిగా ఉన్నప్పటికీ.. రెండేళ్లుగా క్రమంగా తగ్గుతోంది. ఇదే సమయంలో భూమి లభ్యత, అందుబాటు ధరల కారణంగా ఉత్తర, తూర్పు, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాలు క్రమంగా వృద్ధి చెందుతున్నాయి. శివారు ప్రాంతాలలో గృహ నిర్మాణాలు పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం.

2 హైఎండ్ లగ్జరీదే ఆధిపత్యం..

2025 క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాలలో లాంచింగ్స్‌లో అత్యధికంగా 83 శాతం హైఎండ్ లగ్జరీ యూనిట్లు హైదరాబాద్ లోనే లాంచింగ్ అయ్యాయి. నగరంలో 2024 క్యూ1లోని లాంచింగ్స్‌లో ప్రీమియం ఇళ్ల వాటా 34 శాతంగా ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 70 శాతానికి పెరిగింది. నానక్‌రాంగూడ, గండిపేట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో ప్రీమియం ఇళ్లకు అత్యధిక డిమాండ్ ఉంది. లాంచింగ్స్‌లో మధ్యస్థాయి విభాగం గృహాల వాటా 17 శాతంగా ఉంది. అత్యధికంగా బాచుపల్లిలో ఈ తరహా ఇళ్లకు గిరాకీ ఉంది. తూర్పు హైదరాబాద్‌లో ఎక్కువగా ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

3 పెరిగిన ఇళ్ల అద్దెలు..

నగరంలో గృహాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 7 శాతం పెరిగాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి, కోకాపేట ప్రాంతాల్లోని అద్దె ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఐటీ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, ఇతర ఉన్నతస్థాయి వర్గాలు ఆయా ప్రాంతాలలో నివసించేందుకు ఆసక్తి చూపిస్తుండటమే అద్దెల పెరుగుదలకు ప్రధాన కారణం.




4 ఆఫీసు స్పేస్ అదరహో..

నగరంలో 2025 క్యూ1లో 18.2 లక్షల చ.అ. నికర ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. లక్ష చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైన ఆఫీసు లీజులు అత్యధికంగా జరిగాయి. హెల్త్‌కేర్, ఫార్మా, బ్యాంకింగ్ రంగాలలో కంపెనీల విస్తరణల కారణంగా లావాదేవీలలో వృద్ధి నమోదైంది. 2025 క్యూ1లోని ఆఫీసు స్పేస్ లీజులలో అత్యధికంగా 32 శాతం హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగాలది కాగా.. ఆ తర్వాత ఐటీ-బీపీఎం విభాగం 21 శాతం, బ్యాంకింగ్ అండ ఫైనాన్షియల్స్ విభాగం వాటా 11 శాతంగా ఉంది. మాదాపూర్ (81 శాతం), గచ్చిబౌలి (16 శాతం) ప్రాంతాల్లోని ఆఫీసు స్పేస్‌కు ఎక్కువ డిమాండ్ ఉంది.

5 సప్లయి 13.2 లక్షల చ.అ.

ఇక నగరంలో 2025 క్యూ1లో కొత్తగా మార్కెట్‌లోకి 13.2 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి అయింది. అయితే గతేడాది క్యూ1తో పోలిస్తే మాత్రం ఇది 55 శాతం తగ్గుదల. ఆఫీసు స్పేస్ ప్రాజెక్ట్‌ల అనుమతుల జారీలో జాప్యమే ఈ తగ్గుదలకు ప్రధాన కారణం. నగరంలో కార్యాలయ స్థలాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 13 శాతం మేర పెరిగాయి. అత్యధికంగా మాదాపూర్‌లో అద్దెలు పెరిగాయి. ఈ ప్రాంతంతో పోలిస్తే గచ్చిబౌలిలో కిరాయిలు 20-25 శాతం తక్కువగా ఉన్నాయి. మెట్రో ఫేజ్-2, హెచ్-సిటీ రోడ్ల విస్తరణ వంటి మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళికలతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. దీంతో దీర్ఘకాలంలో ఆఫీసు అద్దెలు మరింత వృద్ధి చెందుతాయి.



గిడ్డంగులు భళా!

- 51 లక్షల చ.అ. వేర్‌హౌస్ స్థలాలు
- మేడ్చల్ క్లస్టర్‌లో ఫుల్ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో గిడ్డంగుల స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. గతేడాది నగరంలో 51 లక్షల చ.అ. వేర్‌హౌస్ స్పేస్ లావాదేవీలు జరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. ఆన్‌లైన్ షాపింగ్‌కు పెరుగుతున్న ఆదరణ, లాస్ట్‌మైల్ డెలివరీ ఆవశ్యకత నేపథ్యంలో గిడ్డంగుల విభాగానికి దీర్ఘకాలిక డిమాండ్ ఉంటుందని తెలిపింది. వేర్‌హౌస్ లావాదేవీలలో తయారీ రంగం హవా కొనసాగుతోంది. 2024లో జరిగిన గిడ్డంగుల లీజులలో మ్యానుఫాక్చరింగ్ విభాగం వాటా 39 శాతం కాగా.. 3 పీఎల్ 21 శాతం, ఈ-కామర్స్ 17 శాతం, రిటైల్ రంగం 14 శాతం, ఎఫ్‌ఎంసీజీ 5 శాతం, ఎఫ్ ఎంసీడీ 1 శాతం వాటాలను కలిగి ఉన్నాయి.

మేడ్చల్ క్లస్టర్ హవా..

నగరంలో మూడు క్లస్టర్లలో గిడ్డంగుల స్థలాలున్నాయి. మేడ్చల్ క్లస్టర్‌లో మేడ్చల్, దేవరయాంజాల్-గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, యెల్లంపేట్, శామీర్‌పేట్, పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియా, రుద్రారం, పాశమైలారం, ఎదులనాగులపల్లి, సుల్తాన్‌పూర్, ఏరోట్రోపోలిస్, శ్రీశైలం హైవే, బొంగ్లూరు, కొత్తూరు, షాద్‌నగర్.. ఆయా ప్రాంతాలలో గ్రేడ్-ఏ గిడ్డంగుల అద్దె చ.అ.కు రూ.19-21గా, గ్రేడ్-బీ అయితే రూ.16-19గా ఉంది.

- మేడ్చల్ క్లస్టర్‌లో వేర్‌హౌస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023 ఆర్థిక సంవత్సరంలోని గిడ్డంగుల లావాదేవీలలో ఈ క్లస్టర్ వాటా 60 శాతం ఉండగా.. 2024 నాటికి 61 శాతానికి పెరిగింది. శంషాబాద్ క్లస్టర్‌లో క్షీణత, పటాన్‌చెరు క్లస్టర్లలో స్వల్ప వృద్ధి కనిపించింది. ఏడాది సమయంలో శంషాబాద్ వాటా 30 శాతం నుంచి 27 శాతానికి తగ్గగా.. పటాన్‌చెరు క్లస్టర్ వాటా 10 శాతం నుంచి 11 శాతానికి పెరిగింది.

డిమాండ్ ఎందుకంటే..

హైదరాబాద్ అనేక రంగాలు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్(పీఎల్‌ఐ) స్కీమ్ కింద అనుమతులు పొందాయి. ప్రధానంగా సెల్‌ఫోన్ల తయారీ, ఆటో అనుబంధ రంగానికి చెందిన సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవటంతో గిడ్డంగుల స్థలాలకు డిమాండ్ ఏర్పడిందని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదికలో తెలిపింది.



ప్రయాణికులు.. ప్రమాదానికి బాధ్యులా?



కారులో ప్రయాణిస్తున్న వారిపై కేసు ఎలా పెడతారు?
మాజీ సీఎం వైఎస్ జగన్ తదితరులపై ఎలాంటి కఠిన చర్యలొద్దు

- సింగయ్య మృతి ఘటనలో నల్లపాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం
- భారీ సంఖ్యలో జనం ఉన్నప్పుడు కొన్నిసార్లు జరుగుతుంటాయి
- కుంభమేళా లాంటి చోట్ల ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి
- కారు కింద పడిన ఆ వ్యక్తిని అలా చావనివ్వండంటూ వదిలేసి వెళ్లరు కదా!
- అలాంటి ఉద్దేశం కారులో ఉన్న వారికి ఉంటుందా?
- పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు.. విచారణ మంగళవారానికి వాయిదా

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా సింగయ్య మృతి చెందిన ఘటనకు సంబంధించి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర పార్టీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని హైకోర్టు తీవ్రస్థాయిలో ప్రశ్నించింది. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న వారిపై కేసు ఎలా నమోదు చేస్తారని విస్మయం వ్యక్తం చేసింది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సాధారణంగా ఆ వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తారే గానీ కారులో ప్రయాణిస్తున్న వారిపై కేసు నమోదు చేయరని గుర్తు చేసింది. ప్రమాదానికి కారులో ఉన్న వారిని ఎలా బాధ్యులను చేస్తారని సూటిగా ప్రశ్నించింది. భారీ సంఖ్యలో జనం ఉన్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా కొన్నిసార్లు అనుకోకుండా ప్రమాదాలు జరుగుతుంటాయని, కుంభమేళా లాంటి చోట్ల కూడా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. సింగయ్య మృతికి సంబంధించి నమోదైన కేసులో వైఎస్ జగన్, ఇతర నేతలు వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడుదల రజిని తదితరులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ కేసు కొట్టివేయాలంటూ పిటిషన్లు...

సింగయ్య మృతికి సంబంధించి నల్లపాడు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి తదితరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై తేలేంతవరకు తదుపరి చర్యలన్నీ నిలిపివేయాలని తమ పిటిషన్లలో హైకోర్టును అభ్యర్థించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు తాజాగా విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్య శ్రీరాం, చిత్తరవు రఘు, న్యాయవాదులు యర్రంరెడ్డి నాగిరెడ్డి, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, ఆర్.యల్లారెడ్డి, కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఎస్పీ మొదట వేరే కారు అని చెప్పారు

ఆ తరువాత మాట మార్చారు...
మొదట పొన్నవోలు వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు కారులో ప్రయాణిస్తున్న వారు మాత్రమేనని, సింగయ్య మృతితో వీరికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వాస్తవానికి ప్రమాదం జరిగిన రోజు గుంటూరు ఎస్పీ స్పందిస్తూ ఏపీ 26 సీఈ 0001 నెంబర్ కారు ప్రమాదానికి కారణమని స్వయంగా చెప్పారని పొన్నవోలు న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. సరిగ్గా మూడు రోజుల తరువాత అదే ఎస్పీ మాట మార్చారన్నారు. ప్రమాదానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ప్రయాణించిన వాహనమే కారణమంటూ మీడియా ముఖంగా చెప్పారని నివేదించారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ప్రమాదానికి వాహనంలో కూర్చున్న వ్యక్తులను ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించారు.

వాహనంలో ఉన్న వారిని ఎలా విచారిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని చెప్పారు. పిటిషనర్లు ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్నారు. ప్రమాదం తరువాత సింగయ్యను రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారన్నారు. ఓ వ్యక్తి మరణానికి కారణమై ఇప్పుడు ఏమీ జరగలేదంటూ చెబుతున్నారన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ వాహనంలో ప్రయాణిస్తున్న వారిని ఎలా విచారిస్తారని ప్రశ్నించారు.

ప్రయాణికులకు ఏం పాత్ర ఉంటుంది..?

వేల మంది సమూహంగా ఉన్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతుంటాయని న్యాయస్థానం పేర్కొంది. కుంభమేళా లాంటి భారీ జన సమూహాలు ఉన్న చోట ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా ప్రమాదాలు జరిగాయని గుర్తు చేసింది. వాహన ప్రమాదంలో.. ఆ వాహనంలో ఉన్న ప్రయాణికులకు ఏం పాత్ర ఉంటుందని విస్మయం వ్యక్తం చేసింది. అంత భారీ జన సమూహంలోని ఓ వ్యక్తి వాహనం కింద పడితే.. ఆ వ్యక్తిని అలా చావనివ్వండి అని ఎవరైనా పక్కన పడేసి వెళ్లిపోరుగా? అలాంటి ఉద్దేశం వాహనంలో ఉన్న వారికి ఉంటుందా? అని పోలీసులను సూటిగా ప్రశ్నించింది. దీనిపై అన్ని ఆధారాలున్నాయని, సమయం ఇస్తే వాటిని కోర్టు ముందుంచుతామని ఏజీ దమ్మాలపాటి నివేదించడంతో.. విచారణ మంగళవారానికి వాయిదా వేస్తామని, అప్పటి వరకు పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. ఈ సమయంలో పొన్నవోలు స్పందిస్తూ అప్పటి వరకు స్టే ఇవ్వాలని కోరగా ఆ అవసరం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు.

వైఎస్ జగన్ భద్రతపై పోలీసుల నిర్లక్ష్యం..

వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఓ మాజీ ముఖ్యమంత్రి కార్యక్రమంలో భద్రతాపరంగా తీవ్ర లోపాలున్నా పోలీసులు కనీస స్థాయిలో కూడా పట్టించుకోలేదని న్యాయస్థానానికి నివేదించారు. దీనిపై తాము న్యాయపరంగా పోరాటం చేస్తున్నామన్నారు. మొదట బీఎన్ఎస్ సెక్షన్ 106 కింద పెట్టిన కేసును పోలీసులు తరువాత 105 (కల్పబుల్ హోమిసైడ్) కిందకు మార్చారని కోర్టు దృష్టికి తెచ్చారు. వైఎస్ జగన్ భద్రత, జన సమూహాలను నియంత్రించే విషయంలో పోలీసులు తీవ్ర ఉదాశీనత ప్రదర్శిస్తున్నా రన్నారు. భద్రత కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించారని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. 'ప్రభుత్వాన్ని పూర్తి ఆధారాలు కోర్టు ముందుంచనివ్వండి... ఈలోపు మీకు కావాల్సింది రక్షణే కదా? మీకు రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులిస్తా..' అని తెలిపారు. అనంతరం శ్రీరామ్ స్పందిస్తూ.. తదుపరి విచారణ వరకు తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తూ, అప్పటివరకు పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
టెండరు కోరుతూ ప్రకటన
TTD ప్రింటింగ్ ప్రెస్‌కు 3 కేటగిరీల పబ్లికేషన్స్ యొక్క ప్రింట్ మరియు సరఫరా కొరకు ఇ-టెండరు కోరబడుతున్నది. టెండరు ప్రకటన & వివరాల కోసం NIT. Roc. No. TTD-44021(36)/3/2023-PRESSను చూడవలెను. వెబ్‌సైట్ **http://www.tirumala.org** మరియు **https://tender.ap.eprocurement.gov.in** కు లాగాన్ కావలెను. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి: 0877-2264355 (లేదా) 0877-2264292.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.118) Dt: 27-06-2025 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం పరిధిలో టెండరు నోటీసు నం. 08/2025-26, తేది : 21.06.2025 (5వ పిలుపు) మరియు టెండరు నోటీసు నం. 30/2025-26, తేది : 26.06.2025 పనులకు సంబంధించిన అంచనా విలువ మొత్తం: **రూ.95.22 లక్షలకు** టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు **తేది: 26.06.2025 సా. 04.30 గం. నుండి తేది : 03.07.2025 సా. 04.30 గం.వరకు** లభించును. గమనిక : మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ **www.tender.telangana.gov.in**లో చూడగలరు.
సం/- టి.ఎస్.ఎస్. రవి కుమార్, యం.టెక్, యం.ఐ.ఇ,
సూపరింటెండింగ్ ఇంజినీరు, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం
DIPR RO No.4236-PP/CL/Advt/1/2025-26, Dt. 27.06.2025

పురపాలక సంఘ కార్యాలయము, మణికొండ, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
నోటీసు నెం. ఇ1/498/2025-26, **తేది: 26.06.2025**
మణికొండ మున్సిపాలిటీ,రంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నం. ఇ1/498/2025-26, తేది :26.06.2025, **రూ.390.00 లక్షలు** (2) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in** నుండి టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది : **05.07.2025, మ.3.30 గం.వరకు.**
సం/- మున్సిపల్ కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ
DIPR RO No.4222-PP/CL/Advt/1/2025-26, Dt:27.06.2025

పురపాలక సంఘ కార్యాలయము, తెల్లాపూర్,సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
నోటీసు నెం. ఇ1/12/2025-26, **తేది: 26.06.2025**
1) తెల్లాపూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నం. ఇ1/12/2025-26, తేది :26.06.2025, **రూ.100.00 లక్షలు** ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in** నుండి టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది : **28.06.2025, మ.3.30 గం.వరకు.**
సం/- మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ
DIPR RO No.4229-PP/CL/Advt/1/2025-26, Dt:27.06.2025

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం, 2008లోని సెక్షన్ 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(Lr. No.SML0060035141695/CLU/Plg/TG-iPASS/HMDA/2025, తేది : 22.05.2025)
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (3) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని, G.O.Ms.No. 33, MA & UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లోని భూమి వినియోగానికి దిగువ మార్పులు చేసేందుకు ప్రతిపాదించడమైనది. G.O.Ms.No.33, MA & UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లో జనరల్ డెవలప్‌మెంట్ ప్రమోషన్ జోన్ (GDPZ) కొరకు ప్రస్తుతం కేటాయించబడిన రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం (M), కొంగరకలాన్ (V) వద్ద గల సర్వే నం.357/p మరియు 358/pలోని 19189.02 చ.మీటర్ల విస్తీర్ణం గల స్థలాన్ని ఇపుడు 'ఆరెంజ్' కేటగిరీ క్రింద స్వీకరించిన, ప్రింటెడ్ బాక్సుల యూనిట్ నెలకొల్పుట కొరకు తయారీ వినియోగ జోన్‌గా నిర్దేశించుటకు ప్రతిపాదించడమైనది. పై వాటి యొక్క వివరాలు వెబ్‌సైట్లు **http://gazette.telangana.gov.in//** మరియు **http://hmda.gov.in//**లో లభిస్తాయి. సదరు ప్రతిపాదనలకు ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ నుండి అభ్యంతరాలు / సూచనలు పరిశీలించబడతాయి. వారు అభ్యంతరాలను / సూచనలను వ్రాతపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **ఏడు (7) రోజులలోగా** మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA గారికి లేదా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD డిపార్ట్‌మెంట్, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ గారికి సమర్పించవచ్చును.
సం/- ప్లానింగ్ ఆఫీసర్ (RC), HMDA
DIPR RO No. 4260-PP/CL/ADVT/1/2025-26, Dt.: 27.06.2025

ఐఏఎంసీకి భూకేటాయింపు చెల్లదు..

▶ మొదటి పేజీ తరువాయి
కేటాయిస్తూ 2021 డిసెంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో 126 విడుదల చేసింది. అలాగే నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ. 3 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు జీవోలు 76, 365లను, కేసుల కేటాయింపునకు జీవో 6ను జారీ చేసింది. ఏఐఎంసీని 2021 డిసెంబర్ 18న నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభించారు. అయితే ఆ జీవోలను కొట్టేసి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొనేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాదులు ఎ.వెంకట్రామిరెడ్డి, వ్యక్తిగత హోదాలో కోటి రఘునాథరావు వేర్వేరుగా 2023లో ప్రజాప్రయోజన వ్యాజ్యాల (పిల్)ను దాఖలు చేశారు. ఓ ప్రైవేట్ ఆర్బిట్రేషన్ సెంటర్‌కు అత్యంత విలువ చేసే భూమిని ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. ఇది తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఐఏఎంసీకి నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ. 3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడం ప్రజాధనాన్ని వృథా చేయడమే అవుతుందని.. ప్రభుత్వ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ పిల్‌లపై జనవరిలో వాదనలు ముగించిన జస్టిస్ కె.లక్ష్మణ్, కె.సుజనా ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

వాదనలు సాగాయిలా..

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'రూ. 350 కోట్లకుపైగా విలువైన 3.70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా ఐఏఎంసీకి కేటాయించడం రాష్ట్రానికి తీరని నష్టం. ఓ ప్రైవేట్ ట్రస్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా నిధులు కేటాయించడమే కాకుండా నిర్వహణ పేరిట ఏటా రూ. 3 కోట్ల నిధులు కేటాయించడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే. నిబంధనలకు, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ప్రైవేట్‌సంస్థకు భూకేటాయింపు జరిపారు' అని పేర్కొన్నారు. ఐఏఎంసీ తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వం భూమి, నిధులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ 'ఐఏఎంసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుంది. ఇలాంటి వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా బయట కూడా చేసుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయి. ఐఏఎంసీతో వివాదాలు పరిష్కారమైతే కోర్టులపైనా భారం తగ్గుతుంది. ఇందులో ప్రజాహితం ఉన్నందునే ప్రభుత్వం భూమి, నిధులు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంది. ఐఏఎంసీ ట్రస్ట్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయశాఖ మంత్రితోపాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ట్రస్టీలుగా ఉన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయీ దుర్వినియోగం కాలేదు' అని నివేదించారు.

ఐఏఎంసీ తనను తాను నిలబెట్టుకోలేకపోయిందన్న ధర్మాసనం

'ప్రభుత్వాల నుంచి నిరంతర ఆర్థిక సాయం పొందుతున్నప్పటికీ ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఐసీఏడీఆర్) తన లక్ష్యాలను నెరవేర్చడంలో ఎలా విఫలమైందో మేము ఎత్తి చూపాలనుకుంటున్నాం. దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి 1995లో కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా ఐసీఏడీఆర్ ఒక రిజిస్టర్డ్ సొసైటీగా ఏర్పడింది. దాని ప్రారంభం నుంచి ఐసీఏడీఆర్ 49 మధ్యవర్తిత్వ కేసులనే స్వీకరించిందని ఉన్నతస్థాయి కమిటీ నివేదిక పేర్కొంది. ఆర్థిక సహాయం ఉన్నా కేసుల పరిష్కారం నామమాత్రంగానే ఉన్నందున ఐసీఏడీఆర్‌ను స్వాధీనం చేసుకోవాలని.. దానికి మంజూరు చేసిన శాశ్వత లీజును రద్దు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ఐఏఎంసీ అలా మారదని మేము ఆశిస్తున్నాము. అయితే మూడేళ్లుగా ఏటా రూ. 3 కోట్ల ఆర్థిక సాయం, ఉచిత కార్యాలయ స్థలాన్ని అందించినా ఐఏఎంసీ తనను తాను నిలబెట్టుకోలేకపోయింది. ప్రభుత్వం ఆశించిన మేరకు భవిష్యత్తులో ఆర్థికంగా నిలదొక్కుకునే సంకేతాలను చూపించలేకపోయింది. ఐఏఎంసీ ప్రారంభానికి మద్దతు సమర్థనీయమే. కానీ అలాంటి సంస్థలకు నిరంతర, శాశ్వత ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకం కాకపోవచ్చు. ఐఏఎంసీ పనితీరును ఏటా సమీక్షించి, దాని ఖాతాలను తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) లేదా మరే ఇతర సమర్థ అధికారి ద్వారా ఆడిట్ చేయించుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. గత ఒప్పందం మేరకు ఐదేళ్ల తర్వాత ఐఏఎంసీ పనితీరుకు లోబడి నిధుల విడుదల ఉండేలా ప్రభుత్వం చూసుకోవాలి' అని ధర్మాసనం పేర్కొంది.

నిధుల కేటాయింపునకు పనితీరే కొలమానం..

'ప్రభుత్వ వివాదాలన్నీ ఐఏఎంసీలోనే పరిష్కరించుకునేలా ఇచ్చిన జీవో సమర్థనీయమే అయినా.. పలు సూచనలు చేయాల్సి ఉంది. రూ. 3 కోట్లకుపైగా విలువైన అన్ని వివాదాలను ఐఏఎంసీకి మధ్యవర్తిత్వం కోసం సూచించాలనే ప్రభుత్వ నిర్ణయం విధానపరమైనది. అయితే ప్రజాధనంతో ఈ అంశం ముడిపడి ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రభుత్వం కేసులను ఐఏఎంసీకి సూచించడం, దానికయ్యే ఖర్చులను పరిశీలించాల్సి ఉంటుంది. ఐఏఎంసీ ద్వారా మధ్యవర్తిత్వ ఖర్చు ఎక్కువగా ఉందని.. ఖజానాపై గణనీయమైన భారం పడుతున్నట్లు గురిస్తే ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవచ్చు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తర్వాత పిల్‌లను పాక్షికంగా అనుమతిస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది.

మధ్యవర్తిత్వాన్ని బలోపేతం చేయాలి..

'కేంద్ర న్యాయ శాఖ జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి దేశంలో సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని సాధించడానికి ఐసీసీ కోర్టు, సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఎస్ఐఏసీ), లండన్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ (ఎల్‌సీఐఏ), హాంకాంగ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (హెచ్‌కెఐఏసీ)ల మాదిరిగానే మధ్యవర్తిత్వ సేవలను అందించే సంస్థలను స్థాపించాలని సిఫార్సు చేసింది. సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వ మద్దతు ప్రాముఖ్యతను వివరించింది. ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో సమగ్ర మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు సులభతరం చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. మధ్యవర్తిత్వ సంస్థల నిర్వహణకు ప్రారంభ మూలధనం అవసరమని.. దాన్ని ప్రభుత్వం అందించవచ్చని పేర్కొంది. మధ్యవర్తిత్వ సంస్థలకు ప్రభుత్వాలు మద్దతివ్వడం సంతృప్తికరమే' అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది.

పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖ
విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
राष्ट्रीय ई-पुस्तकालय
రాష్ట్రీయ ఇ-పుస్తకాలయ
ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతూ ప్రకటన
పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖ, విద్యామంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ద్వారా అమలు చేయబడుతున్న **రాష్ట్రీయ ఇ-పుస్తకాలయ,** పిల్లలు మరియు కౌమార దశలోని వారి కొరకు **ఒక ఉచిత నేషనల్ డిజిటల్ లైబ్రరీ,** ప్లాట్‌ఫారంపై బుక్స్ సేకరణ పెంపొందించేందుకు రాష్ట్రీయ ఇ-పుస్తకాలయ కొరకు ఇ-బుక్స్ ఎంపిక మరియు సేకరణ కొరకు **పబ్లిషర్స్ యొక్క ఎంప్యానెల్‌మెంట్ కొరకు ఆసక్తి వ్యక్తీకరణ** కోరుచున్నది.
పిల్లలలో చదువుట అనే అలవాటును గ్రహించేందుకు మరియు నేర్పుటకు విద్యా సంబంధం కాని పుస్తకాలను (ఇబుక్స్) దిగువ భాషలలో సేకరించాలని ఉద్దేశిస్తోంది : **అస్సామీస్, బెంగాలీ, బోడో, డోగ్రి, గుజరాతి, హిందీ, కన్నడ, కశ్మీరీ, కొంకణి, మలయాళం, మణిపురి, మరాఠి, మైథిలి, నేపాలి, ఒడియా, పంజాబీ, సంస్కృతం, సంతాలి, సింధి, తమిళం, తెలుగు, ఉర్దూ మరియు ఇంగ్లీషు.**
డౌన్‌లోడ్ చేయుటకు స్కాన్ చేయండి
వివరమైన ప్రక్రియ మరియు మార్గదర్శకాల కొరకు అర్హత గల, ఆసక్తిగల బుక్ పబ్లిషర్స్ దర్శించండి : https://www.nbtindia.gov.in/

దాఖలు విధానం	ఆన్‌లైన్ ద్వారా https://eprocure.gov.in/eprocure/app
దాఖలు ప్రారంభ తేది	23.06.2025
దాఖలు ముగింపు తేది	14.07.2025, 17.00 గం.కు


EOI దాఖలు కొరకు ఏవైనా మార్పులు / పొడిగింపులు పైవెబ్‌సైట్లపై మాత్రమే ప్రచురించబడతాయి.
పబ్లిషర్ల ఎంప్యానెల్‌మెంట్ మరియు ఇ-బుక్స్ సేకరణపై రాష్ట్రీయ ఇ-పుస్తకాలయ సెక్రటేరియట్ యొక్క సమర్థ అధికారి యొక్క నిర్ణయం తుదిగా ఉంటుంది మరియు దానికి కట్టుబడి ఉండాలి.
ఏవైనా విచారణలను పబ్లిషర్లు rashtriyaepustakalaya@gmail.comకు పంపవచ్చు
Implementing Agency
NATIONAL BOOK TRUST, INDIA
CBC 21103/12/0010/2526

వివస్త్రను చేసి.. జననాంగంలో జీడిపోసి..

- వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతో వివాహితను చితకబాదిన గ్రామస్తులు
- హనుమకొండ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన అమానవీయ ఘటన

వరంగల్ క్రైం: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో ఐదు రోజుల కిందట జరిగిన ఓ అమానవీయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం కొనసాగిస్తోందంటూ కొందరు వ్యక్తులు ఓ వివాహితను వివస్త్రను చేసి జననాంగంలో జీడిరసం పోసి విచక్షణారహితంగా దాడి చేశారు. 'సాక్షి'కి విశ్వసనీయంగా తెలిసిన సమాచారం ప్రకారం.. తాటికాయల గ్రామానికి చెందిన ఓ యువతిని పదేళ్ల క్రితం ములుగు మండలం బోలోనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు పిల్లలు. అయితే సమీప బంధువైన ఓ వివాహితతో అతను వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. సుమారు పది రోజులు ఆమెతో కలిసి గ్రామం విడిచి వెళ్లిపోయాడు. దీంతో అతని భార్య స్వగ్రామమైన తాటికాయలకు వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో వారు ఆ ఇద్దరినీ వెతికి పట్టుకొని ఐదు రోజుల క్రితం తాటికాయల గ్రామానికి తీసుకువచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికీ గుండు గీయించారు. ఆ మహిళను ఓ మంచానికి కట్టేసి వివస్త్రను చేసి.. జననాంగంపై జీడి (పూర్వకాలంలో నొప్పి తగ్గించేందుకు వాడేవారు. అదేవిధంగా శరీరంలోని సున్నిత అవయవాలపై పోస్తే పుండ్లు అవుతాయి) పోశారు. 'తప్పు చేశాను.. క్షమించండి' అంటూ బాధిత మహిళ వేడుకున్నా వినకుండా దాడి చేశారు. జననాంగంలోనుంచి తీవ్ర రక్తస్రావమవుతున్నా వదల్లేదు. ఆ తరువాత ఆ ఇద్దరినీ ఏం చేశారో ఇప్పటివరకు ఆచూకీ తెలియడం లేదు. ఈ ఘటన జరిగి ఐదు రోజులు గడుస్తున్నా పోలీసులకు సమాచారం లేదని తెలిసింది. అసలు ఆ ఇద్దరూ ప్రాణాలతో ఉన్నారో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

రైలులో గర్భిణికి నొప్పులు


నైనిక, ఆమె బిడ్డతో పారిశుద్ధ్య కార్మికులు

మధిర: రైల్లో ప్రయాణిస్తున్న గర్భిణికి మార్గమధ్యలో పురిటినొప్పులు రావడంతో ఖమ్మం జిల్లా మధిర స్టేషన్‌లో అత్యవసర హాల్టింగ్ ఇచ్చారు. అక్కడి మహిళా పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. టాటానగర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (18111) రైల్లో గర్భిణి నైనిక ప్రయాణిస్తోంది. ఆమె జార్ఖండ్‌లోని చక్రధర్‌పూర్ నుంచి.. సికింద్రాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్తోంది. రైలు శుక్రవారం విజయవాడ స్టేషన్ దాటాక ఆమెకు పురిటినొప్పులు మొదలయ్యాయి. కానీ ఈ రైలుకు ఖమ్మం వరకు హాల్టింగ్ లేదు. దీంతో ఆమె సహాయకులు ఈ విషయాన్ని టీటీకి చెప్పారు. ఆయన రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబుకు, ఆపై మధిర రైల్వేస్టేషన్ మాస్టర్ సుధీర్‌బాబుకు సమాచారం ఇచ్చి.. మధిర స్టేషన్‌కు చేరుకోగానే రైలుకు హాల్టింగ్ ఇచ్చారు. వెంటనే మధిర రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు గద్దల కృష్ణవేణి, మేరి, జ్యోతి, కంభంపాటి దివ్య రైల్లో నైనికకు సాధారణ కాన్పు అయ్యేలా సహకరించారు.

ఆదివాసీలకోసం నిలబడతాం

- మా మూలాలను ఎప్పుడూ మరచిపోలేదు
- మావోయిస్టు పార్టీ లేఖపై స్పందించిన మంత్రి సీతక్క



ఏటూరునాగారం: తాను నిత్యం ప్రజా క్షేత్రంలోనే ఉంటానని, కానీ బీఆర్ఎస్ పార్టీలో దీనిని జీర్ణించుకోలేని వారు ఎంతో మంది ఉన్నారని మంత్రి సీతక్క అన్నారు. ఎస్టీ వర్గాల్లో కూడా కొందరు వ్యక్తులు దీనిని సహించలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ విడుదల చేసినట్లుగా భావిస్తున్న లేఖపై శుక్రవారం ఆమె స్పందించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, '48 జీవో వచ్చిందని తెలియగానే వెంటనే ఆదివాసీ బిడ్డగా ట్రైబల్ ఎమ్మెల్యేలందరం కలసి మీటింగ్ పెట్టు కున్నాం. ఆదిలాబాద్ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడే ఈ జీవో రావడం వల్ల ఇది ఆదివాసీలను దెబ్బతీసే విధంగా ఉందని, అటవీశాఖ పీసీసీఎఫ్‌తో కూడా మాట్లాడాం. అధికారుల వద్దకు ఏదైనా సమస్య వస్తే వెంటనే రిపోర్టు తెప్పించుకొని పరిష్కరిస్తున్నాం'అని అన్నారు. 48 జీవోను వెంటనే రద్దు చేయాలని కూడా ప్రభుత్వానికి చెప్పామన్నారు. ఇటీవల శంకరాజుపల్లిలో ఆదివాసీలపై జరిగిన దాడులపై నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. అలాగే భద్రాద్రిలో కూడా ఆదివాసీలకు ఎలాంటి హానీ చేయొద్దని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కూడా మాట్లాడామన్నారు. 'అడవిలోని పోడు భూముల్లో పాతది వదిలేది లేదని, కొత్తది కొట్టేది లేదని గతంలో చెప్పినం, ఇప్పుడు కూడా అదే చెబుతున్నాం'అని స్పష్టం చేశారు. తాము ఆదివాసీలకోసం, అట్టడుగు వాళ్ల కోసం నిలబడుతామన్నారు. ఏ మూలాలనుంచి వచ్చామనే విషయాన్ని విస్మరించకుండా ప్రజల సేవ కోసమే పనిచేస్తామన్నారు.

బీసీ బిల్లుల ఆమోదానికి చొరవ తీసుకోండి

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు ఎమ్మెల్సీ కవిత వినతి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసి రాష్ట్రపతికి పంపించిన బిల్లులను త్వరగా ఆమోదించేలా చొరవ తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రిని కవిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి చేస్తున్న బీసీ ఉద్యమం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించారు. అనంతరం ఆమె బీసీ బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా చొరవ తీసుకోవాలని వినతి పత్రం అందించారు. స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం వారి జనాభా ప్రాతిపదికన లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. సమాన అవకాశాల కోసం ఓబీసీలు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సుదీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారని, బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు. కవిత వెంట జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యూనైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ బొల్ల శివశంకర్ ఉన్నారు.

పెద్దపల్లి ఆర్‌వోబీ పనుల్లో విరిగిన గడ్డర్

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం


కూనారం-పెద్దపల్లి మధ్య పగుళ్లు చూపిన (విరిగిన) నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ గడ్డర్

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శివారులోని పెద్దపల్లి-కూనారం మార్గంలో గల రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. శుక్రవారం ఉదయం పనులు చేస్తుండగా వంతెన కోసం ఏర్పాటు చేసిన గడ్డర్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన పరికరం పగుళ్లు చూపి విరిగింది. వెంటనే అప్రమత్త మైన కాంట్రాక్టర్ రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆ వెంటనే విద్యుత్ సరఫరా నిలిపి వేయించారు. దీంతో కాజీపేట-బల్లార్షా సెక్షన్ల మధ్య రెండు వైపులా రైళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గంటల తరబడి రైళ్లు ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాఘవాపూర్ రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, జమ్మికుంటలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్, ఉప్పల్‌లో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, కొలనూర్‌లో అనువ్రత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులు ఆటోల్లో, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. మధ్యాహ్నం వరకు మరమ్మతులు పూర్తిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఒకవైపు పనులు కొనసాగుతుండగానే కాజీపేట వైపు ఉదయం 11.30 గంటలకు విద్యుత్ సరఫరా ప్రారంభించి రైళ్లను నడిపించారు. బల్లార్షా వైపు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు.

సామాన్యుడి దగ్గరే రుబాబు | బడా బాబుల దగ్గర బాబ్బాబు!

ఏళ్ల తరబడి కరెంటు బిల్లులు చెల్లించని ప్రముఖ సంస్థలు

- దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనే రూ.529.22 కోట్ల బకాయిలు
- బిల్లులు అడిగితే క్రాస్ సబ్సిడీ పేరుతో కిరికిరి
- జాబితాలో మార్గదర్శి చిట్‌ఫండ్స్, పలు స్టార్ హోటళ్లు, కార్పొరేట్ ఆస్పత్రులు
- వసూళ్లకు ప్రత్యేక బృందాలు: దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ



సాక్షి, హైదరాబాద్: సామాన్యులు కరెంట్ బిల్లు కట్టడం ఒక్క రోజు ఆలస్యమైనా కనెక్షన్ కట్ చేసే విద్యుత్ అధికారులు.. బడాబాబులు రూ.కోట్లలో బకాయి పడ్డా వారి జోలికి వెళ్ల డం లేదు. ఏళ్ల తరబడి బిల్లులు పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే లేడు. ధైర్యం చేసి ఎప్పుడైనా బిల్లు కోసం వెళ్తే బడా సంస్థలు 'కడతాం లే'అంటూ విద్యుత్ అధికారులను గేటు బయట నుంచే పంపేస్తున్నాయి. పలు సంస్థలు కొన్నేళ్లుగా బిల్లులు చెల్లించకపోవటంతో ఇప్పుడు ఆ బకాయిలు ఏకంగా రూ.529.22 కోట్లకు చేరాయి. ఇది దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోది మాత్రమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే హైదరాబాద్ పరిధిలోని 725 కనెక్షన్ల మొండి బకాయిల రికార్డు ఇది. బకాయి పడ్డ సంస్థలన్నీ మామూలువేం కాదు. కార్పొరేట్ ఆస్పత్రులు, కోట్లలో వ్యాపారం చేసే టెలి సర్వీసెస్ కంపెనీలు, స్టార్ హోటళ్లు, పెద్దపెద్ద రిసార్టులు... మార్గదర్శి వంటి ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీలు విద్యుత్ బిల్లులు బకాయి పడ్డ సంస్థల జాబితాలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లుంటే, హైదరాబాద్‌లోనే 1.20 లక్షలున్నాయి. అంతేకాదు 1,700 హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్లు హైదరాబాద్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో వాడే వ్యవసాయేతర విద్యుత్‌లో 70 శాతం జంట నగరాల్లోనే వినియోగిస్తున్నారు. ఇందులోనూ బడాబాబుల చేతుల్లో ఉన్న సంస్థలే దాదాపు 50 శాతం విద్యుత్ వాడుతున్నాయి.

గట్టిగా మాట్లాడితే కోర్టుకెళ్తాం

బకాయిల వసూళ్లపై దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ఎండీ ముషారఫ్ ఆలీ ఫారూఖీ ప్రత్యేక దృష్టి పెట్టారు. అన్ని జోన్ల విద్యుత్ అధికారులతో ఇటీవల ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బకాయిల వసూళ్లలో ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌టీ కనెక్షన్లకు నిర్ణీత విద్యుత్ ఛార్జీలు ఉంటాయి. కొన్నిసార్లు ఇవి పెరుగుతుంటాయి. డిస్కమ్‌లు వివిధ సంస్థల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తాయి. కొన్నిసార్లు ముందుగా వేసిన అంచనాల కన్నా ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఈ మొత్తాన్ని గృహ విద్యుత్ వినియోగదారులపై వేయడం భారంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్రాస్ సబ్సిడీ పేరుతో హెచ్‌టీ కనెక్షన్‌దారుల నుంచి పెరిగిన విద్యుత్ భారాన్ని వసూలు చేస్తారు. విద్యుత్ ఆదాయ, అవసరాల నివేదికలోనూ దీన్ని పేర్కొంటారు. బకాయిలు పడ్డ సంస్థలు ఈ వాదనతో ఏకీభవించడం లేదు. క్రాస్ సబ్సిడీని సవాల్ చేస్తూ అవి కోర్టుకు వెళ్తున్నాయి. దీన్ని అడ్డుపెట్టుకుని బకాయిలు చెల్లించడం లేదని క్షేత్రస్థాయి విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మే నెల వరకు దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఉన్న ఈ కేసులపై న్యాయ పరమైన చిక్కులను పరిష్కరించేందుకు సీఎండీ కృషి చేస్తున్నారు. కంపెనీ న్యాయవాదులతో ఆయన ఇటీవల సమావేశమై జాతీయ స్థాయిలో క్రాస్ సబ్సిడీపై కోర్టులు ఇచ్చిన తీర్పులు, ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు.

ప్రత్యేక దృష్టి పెట్టాం



మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎంత పెద్దవాళ్లయినా వదిలే ప్రసక్తే లేదు. ప్రభుత్వం నుంచి మాకు పూర్తి మద్దతు ఉంది. రూ.కోట్ల వ్యాపారం చేసే వ్యక్తులే బిల్లులు కట్టకపోతే ఎలా? బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. న్యాయపరమైన చిక్కులను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలోనే బకాయిల వసూళ్లలో పురోగతి సాధిస్తాం. ఇప్పటికే కొన్ని సంస్థల నుంచి సగం వరకు బకాయిలు వసూలు చేశాం.

- ఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ.



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ వినోద్‌కుమార్ తదితరులు

675 రోజుల్లో 5,375 కేసుల పరిష్కారం

జస్టిస్ రాధారాణి సేవలను కొనియాడిన ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్... పదవీ విరమణ చేసిన జస్టిస్ రాధారాణి

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ రాధారాణి హైకోర్టు న్యాయమూర్తిగా 675 రోజుల్లో 5,375 కేసులను పరిష్కరించారని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ కొనియాడారు. న్యాయమూర్తిగానే కాక.. న్యాయవాదిగాను పలు కేంద్ర, రాష్ట్ర విభాగాల్లో ఆమె సేవలందించారన్నారు. పదవీ విరమణ పొందిన జస్టిస్ రాధారాణికి హైకోర్టు ఫుల్ బెంచ్ శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. న్యాయమూర్తిగా జస్టిస్ రాధారాణి చేసిన సేవలను వివరించారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ రాధారాణి 675 రోజుల్లో 5,375 మెయిన్ కేసులే కాకుండా 6,818 మిస్లీనియస్ కేసులను కూడా పరిష్కరించారన్నారు. జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. తమ కుటుంబంలో ఉన్నత చదువులు చదివిన తొలి వ్యక్తిని తనేనన్నారు. చట్టం పాత్ర అనేది ఒక న్యాయసూత్రం కాదని, అది సమాజానికి ఆత్మలాంటిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులతో పాటు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు జగన్, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

3 విడతల్లో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

▶ మొదటి పేజీ తరువాయి

యూనివర్సిటీలకు చెందిన కాలేజీలు 19 ఉన్నాయి. మొత్తం 175 కాలేజీలు గత ఏడాది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. ఈ ఏడాది రెండు ప్రైవేటు కాలేజీలు మూసివేత కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అయితే, కొత్తగా పాలమూరు, శాతవాహన, కొత్తగూడెం హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. ఈ లెక్కన ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 176 కాలేజీలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటాయి. గత సంవత్సరం కన్వీనర్ కోటా కింద 89,970 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొత్త యూనివర్సిటీలు రావడంతో ఈసారి స్వల్పంగా సీట్లు పెరిగే అవకాశం ఉంది. వచ్చే నెల 6వ తేదీ నాటికి అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల జాబితాతోపాటు, అందులో సీట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2022లో నిర్ణయించిన ఫీజులే ఈ ఏడాది కూడా వసూలు చేయాలని ఇప్పటివరకు నిర్ణయం జరిగిందని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈసారి జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన జోసా కౌన్సెలింగ్ తరహాలో మాక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కౌన్సెలింగ్ ముఖ్య తేదీలు

మొదటి విడత	
28-6-25 - 7-7-25	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
1-7-25 - 8-7-25	ధ్రువపత్రాల పరిశీలన
6-7-25 - 10-7-25	ఆప్షన్ల ఎంపిక
13-7-25	మాక్ కౌన్సెలింగ్
14-7-25 - 15-7-25	మాక్ కౌన్సెలింగ్‌ను బట్టి ఆప్షన్లు మార్చుకోవడం
18-7-25	సీట్ల కేటాయింపు
18-7-25 - 22-7-25	సెల్ఫ్ రిపోర్టింగ్
రెండో విడత	
25-7-25	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
26-7-25	ధ్రువపత్రాల పరిశీలన
26-7-25 - 27-7-25	ఆప్షన్ల ఎంపిక
30-7-25	సీట్ల కేటాయింపు
30-7-25 - 1-8-25	సెల్ఫ్ రిపోర్టింగ్
తుది విడత	
5-8-25	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
6-8-25	ధ్రువపత్రాల పరిశీలన
6-8-25 - 7-8-25	ఆప్షన్ల ఎంపిక
10-8-25	సీట్ల కేటాయింపు
10-8-25 - 12-8-25	సెల్ఫ్ రిపోర్టింగ్
11-8-25 - 13-8-25	వివిధ దశల్లో బ్రాంచీ మార్చుకుంటే కాలేజీలో రిపోర్టు చేయాలి
18-8-25 - 19-8-25	స్లైడింగ్ (కాలేజీలో బ్రాంచీ మార్చుకోవడం)
22-8-25	స్లైడింగ్ తర్వాత సీట్ల కేటాయింపు
22-8-25 - 23-8-25	కొత్తగా కేటాయించిన సీటుకు కాలేజీలో రిపోర్టు చేయాలి
23-8-25	స్పాట్ అడ్మిషన్లు



డిప్యూటీ సీఎం భట్టిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు మారం జగదీశ్, ఏలూరి శ్రీనివాస్ తదితరులు

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఉద్యోగ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయడంపై తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తదితరులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ బిల్లులతో పాటు ఉద్యోగుల డీఏ పెంపు ఉత్తర్వులు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రణాళిక శాఖలో కేడర్ స్ట్రెంత్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం, ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ ఇన్సూరెన్స్ పథకం, ప్రమోషన్లకు సంబంధించి వివిధ శాఖల్లో డీపీసీల ఏర్పాటు వేగవంతం చేసినందుకు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఈజేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు, ప్రతినిధులు చావా రవి, జి.సదానంద గౌడ్, ముజీబ్, కస్తూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

8న వైఎస్సార్ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం

వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్‌రెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా వచ్చే నెల 8వ తేదీన ఆయన అభిమానులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో ఆయన వైఎస్సార్ అభిమానులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదాపూర్‌లోని బుట్టా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్స్ విభాగం ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య, ఏపీ రెడ్డి, పి.ఎస్.కృష్ణ మోహన్‌రెడ్డి, డాక్టర్ బీఎంకే రెడ్డి, వి సురేష్‌రెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్తకు అంతర్జాతీయ గౌరవం

ఐయూఎన్‌ఎస్ సభ్యుడిగా డాక్టర్ సుబ్బారావు

సాక్షి, హైదరాబాద్: ఐసీఎంఆర్-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావు పోషకాహార శాస్త్రాల్లోచేసిన గణనీయమైన కృషికి గుర్తింపుగా అంతర్జాతీయ పోషకాహార శాస్త్రాల సంఘం (ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ న్యూట్రిషన్ సైన్సెస్-ఐయూఎన్ఎస్) సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఐయూఎన్ఎస్ అనేది పోషకాహార శాస్త్రాల్లో పురోగతి, అంతర్జాతీయ సహకారం ద్వారా పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహిస్తూ, పోషకాహార శాస్త్రవేత్తలు, వృత్తిపరమైన సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే ఒక ప్రపంచ సంస్థ. 2025 ఆగస్టులో పారిస్‌లో జరిగే ఐయూఎన్ఎస్-ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ న్యూట్రిషన్‌లో డాక్టర్ సుబ్బారావు నియామక పత్రం అందజేస్తారు. ప్రస్తుతం ఈయన ఎన్ఐఎన్‌లోని న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ (ఎన్ఐసీహెచ్ఈ) విభాగానికి అధిపతిగా పనిచేస్తున్నారు.

టీవీ యాంకర్ ఆత్మహత్య



చిక్కడపల్లి (హైదరాబాద్): నగరంలోని ఒక వార్తా చానల్‌లో పనిచేస్తున్న యాంకర్ స్వేచ్ఛ బలవన్మరణానికి పాల్పడ్డారు. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలివి. యాంకర్ స్వేచ్ఛ నాలుగేళ్లుగా రాంనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో నివసిస్తున్నారు. ఆమె శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న చిక్కడపల్లి పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. స్వేచ్ఛకు ఒక కుమార్తె ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని సర్జికల్ వార్డులో భవనం పైకప్పు శుక్రవారం పెచ్చులూడి పడింది. ఆ సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. - ఎంజీఎం

ఒలింపిక్ స్వర్ణం గెలిస్తే రూ.6 కోట్లు

- రజతానికి రూ.4 కోట్లు.. కాంస్యానికి రూ.2.5 కోట్లు... ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు తెచ్చేవారికి కూడా..
- రాష్ట్ర క్రీడాకారులను ప్రోత్సహించటమే లక్ష్యం
- తెలంగాణ కొత్త క్రీడా విధానంలో ప్రోత్సాహకాల వివరాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం కొత్త క్రీడా విధానాన్ని రూపొందించింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపారు. కొత్త పాలసీ ప్రకారం ఇకపై ఒలింపిక్స్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచే తెలంగాణ క్రీడాకారులకు రూ.6 కోట్లను ప్రోత్సాహకంగా అందజేస్తారు. రజత పతకానికి రూ.4 కోట్లు, కాంస్యం గెలిచినవారికి రూ.2.5 కోట్లు ఇస్తారు. పతకాలు గెలవకపోయినా.. ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఆటగాళ్లకు కూడా ప్రభుత్వం రూ.15 లక్షల చొప్పున అందజేస్తుంది. ఒలింపిక్స్ తర్వాత రెండో ప్రాధాన్యతగా ఆసియా క్రీడల్లో పతకాలు సాధించేవారికి వరుసగా రూ.3 కోట్లు, రూ.1.5 కోట్లు, రూ.75 లక్షల చొప్పున దక్కుతాయి. ఆ తర్వాత కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ, రజత, కాంస్యాలు నెగ్గేవారికి రూ.1.5 కోట్లు, రూ.75 లక్షలు, రూ.50 లక్షల చొప్పున అందజేస్తారు. ప్రతి క్రీడాంశంలో జరిగే జాతీయ, అంతర్జాతీయ ప్రధాన టోర్నమెంట్లతోపాటు పారాలింపిక్స్, స్పెషల్ ఒలింపిక్స్, డెఫ్ క్రీడలు, అంధుల క్రికెట్ వరల్డ్‌కప్‌లో విజయం సాధించే వారికి అందించే నగదు ప్రోత్సాహకాల గురించి కొత్త క్రీడా విధానంలో స్పష్టంగా ప్రకటించారు. క్రీడాకారులు పతకాలు సాధించేలా శిక్షణ ఇచ్చే కోచ్‌లకు కూడా నగదు పురస్కారాలు ఉంటాయి. ప్రత్యేక శిక్షణ, టోర్నీల్లో పాల్గొనే విషయంలో ప్రభుత్వం నుంచి ఆర్థికపరమైన సహకారం అందించే విషయంలో అర్హులను గుర్తించేందుకు ఐదుగురు సభ్యులతో స్క్రూటినీ కమిటీ, 12 మంది సభ్యులతో అప్రూవల్ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మున్సిపల్ ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారు..ఎందుకు ఆలస్యం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలు తెలుసుకొని తమ ముందు ఉంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 11కు వాయిదా వేసింది. ఈ ఏడాది మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పాలకవర్గ కాలపరిమితి ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ నిర్మల్ నటరాజ్ నగర్‌కు చెందిన రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. సర్కార్, ఎస్‌ఈసీ తీరు చట్టవిరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 యూ, 243 జెడ్ఏలను ఉల్లంఘించేదిగా ఉందన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం -2019లోని నిబంధనలను ప్రభుత్వం పాటించకపోవడం, మూడు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ప్రభుత్వానికి సమయం ఇవ్వకుండా ఎలా ఆదేశాలిస్తామని న్యాయమూర్తి ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ పాత్ర ఉంటుందా అని అడిగారు. ఎస్‌ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎస్‌సీఐ పాత్ర ఉండదన్నారు. వార్డుల రిజర్వేషన్లు సహా అన్ని అంశాలు పూర్తి చేసిన తర్వాతే కమిషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తుందని చెప్పారు. దీనిపై ఏజీపీ సౌమ్య స్పందిస్తూ.. సర్కార్ నుంచి సూచనలు తీసుకొని చెప్పేందుకు రెండు వారాలు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీంతో న్యాయమూర్తి.. విచారణను వాయిదా వేస్తూ, ఆ లోగా వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి, నిర్మల్ కలెక్టర్, కమిషనర్, ఎస్‌ఈసీలకు నోటీసులు జారీ చేశారు.

ఆధారాలు ఇచ్చేవారిని పక్కన పెడుతున్నారు

ఇది గాంధీభవన్ పంచాయితీ, సిట్ పంచాయితీ, బీఆర్‌ఎస్ వాళ్ల పంచాయితీలా ఉంది : ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: 'దుబ్బాక ఉపఎన్నిక సమయంలోనే ఫోన్ ట్యాపింగ్ మొదలైంది. అప్పటి డీజీపీకి అని ఆధారాలు ఇచ్చాం. సిట్ విచారణకు నన్ను పిలవడంలో ఉన్న ఇబ్బంది ఏంటీ ? ఎవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయో తేల్చాలని అడుగుతున్నా. ఇదీ కేవలం గాంధీభవన్ నుంచి జూబ్లీహిల్స్ మధ్యే నడుస్తుంది. ఇంకెప్పుడు నిందితులను అరెస్ట్ చేస్తారు'అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆధారాలు ఇచ్చేవారిని పక్కకు పెట్టి గాంధీభవన్ పంచాయితీ, సిట్ పంచాయితీ, బీఆర్‌ఎస్ వాళ్ల పంచాయతీ అంటూ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రఘునందన్‌రావు ఉదయం సిట్ అధికారులపై మండిపడగానే.. రాత్రి ఆయన స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేయడం గమనార్హం.

ఇందిరమ్మ పేరు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది

ఐదు రూపాయలకు అన్నం.. అన్నపూర్ణ పథకానికి ఇప్పుడు పేరు మార్చి ఇందిరమ్మ పేరు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని రఘునందన్‌రావు ప్రశ్నించారు. 'ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే వస్తున్నాయా? ఇళ్లు లేని వారికి ఇళ్లు వచ్చాయా..? కాంగ్రెస్ వాళ్లకే వచ్చాయా..? అనేది ఒక ఊరిని శాంపిల్‌గా చెక్ చేయండి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన సరే. అది మీ పని తీరుకు నిదర్శనం అవుతుంది. భారతీయ జనతా పార్టీ ఏ నాయకుడైనా, ఏ కార్యకర్త అయినా ఎవరో ఎవరి పేరు మీదో ఫోన్ చేసి బెదిరిస్తే భయపడేటోళ్లు ఎవ్వరూ లేరు'అని రఘునందన్‌రావు అన్నారు.

ఐదేళ్లకు కరెంట్ ఎంత కావాలి?

అంచనాలు సిద్ధం చేయండి.. విద్యుత్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఐదేళ్లలో ఏర్పడే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. కొత్తగా నియమించిన విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో) డైరెక్టర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. 2023లో మార్చి నెలలో 15,497, 2025 మార్చిలో వచ్చిన 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైందని, దీనిని దృష్టిలో ఉంచుకొని 2029-30 నాటికి డిమాండ్ ఏ విధంగా పెరుగుతుందనే అంచనా అవసరమన్నారు. భవిష్యత్ అవసరాలకు డిమాండ్‌ను గుర్తించాలని, ఇందుకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యం పెంచాలని సూచించారు. అంచనాల సమయంలో ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవనం, పెరుగుతున్న పరిశ్రమలు, వ్యవసాయ వినియోగం, మారిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెరగనున్న విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. 50 సంవత్సరాల క్రితం నిర్మించిన రామగుండం, కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ల స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. అందరి దృష్టి ప్రస్తుతం తెలంగాణ రెడ్కో పైనే ఉందని, దేశానికి రోల్ మోడల్‌గా నిలవాలని డిప్యూటీ సీఎం సమావేశంలో ఆకాంక్షించారు. ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా పనిచేసేందుకు రెడ్కోకు కావాల్సిన సిబ్బందిపై సవివరంగా ఓ నివేదిక సమర్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీశ్, రెడ్కో సీఎండీ అనిలా తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు కేసీఆర్, కేటీఆర్‌లే కారకులు

మీడియాతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంజారాహిల్స్(హైదరాబాద్): ఫోన్ ట్యాపింగ్ కేసులో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సిట్ ఎదుట తన వాంగ్మూలం ఇచ్చారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి ఆయన వెళ్లారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి ప్రధాన కారకులు. వారిద్దరూ జైలుకు వెళ్లాల్సిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇచ్చాను. మునుగోడు, దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల సందర్భంలో నా ఫోన్ ట్యాప్ అయినట్టు సిట్ అధికారులు చూపించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక నా ఫోన్ ట్యాప్ అయినట్టు నిర్ధారణ అయ్యింది. నా ఆఫీసులో వారెంట్ లేకుండా వచ్చి కొందరు అధికారులు దౌర్జన్యం చేసి ఫోన్ ట్యాప్ చేశారు. గత డీజీపీ మహేందర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేయించారు. నా స్నేహితుడి వద్ద రూ.72 కోట్లు పట్టుకొని అవి నా డబ్బులు అన్నట్టు ఫోన్ ట్యాప్ మొదలుపెట్టారు. నా భూమి అమ్మితే కొన్న వ్యక్తి డబ్బులు ఇచ్చాడు. అతన్ని హింసించి రూ.13 కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ రాయించారు. ఈటల రాజేందర్‌కు డబ్బులు ఇచ్చినట్టు నిందలు వేశారు. నేను ఈటలకు ఎన్నికల సమయంలో సపోర్ట్ చేశాను కానీ డబ్బులు ఇవ్వలేదు. నా భార్య సంగీత ఫోన్ సైతం ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును పార్లమెంట్‌లో లేవనెత్తుతా' అని తెలిపారు.

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట వాంగ్మూలం ఇవ్వడానికి ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ హాజరయ్యారు. గంటపాటు ఆయన సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఎంపీ రఘునందన్‌రావు నుంచి సిట్ శుక్రవారం వాంగ్మూలం తీసుకుంది. ఆయన అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో రఘునందన్‌రావు వద్దకే వెళ్లిన పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

భూభారతిలో 'డిజిటల్' సమస్య

సిబ్బంది అవగాహనలేమితో కొత్త ఇబ్బందులు

- డిజిటల్ సంతకాలు చేసే విషయంలో గందరగోళం
- పాత పట్టాదారు పేరు మీదనే డిజిటల్ సంతకాలు వస్తున్న వైనం
- ఐదు రోజులుగా నెమ్మదిగా సాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- నాలుగు రోజుల్లో సర్దుకుంటుందంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: భూభారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ప్రారంభమయ్యాయి. వీటికి తోడు కొన్ని సమస్యలకు పరిష్కారం చూపడంలో సిబ్బంది అవగాహన లేమి ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. వ్యవసాయ భూములపై కోర్టులు ఇచ్చే తీర్పులు అమలు చేసే సమయంలో ఎంచుకోవాల్సిన ఆప్షన్ల విషయంలో కొందరు రెవెన్యూ అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసినా పాత పట్టాదారు పేరు మీదనే డిజిటల్ సంతకాలు వస్తున్నాయని తెలుస్తోంది. ఈ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా తహసీల్దార్ల డిజిటల్ సంతకం వరకు సాఫీగానే సాగుతోందని, ఆ తర్వాత జరగాల్సిన అప్‌డేషన్ జరగడం లేదని సమాచారం. రికార్డుల్లో పేరు మార్పు జరగడం లేదని చాలా కాలంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని చాలా చోట్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. అయితే, ఈ కోర్టు కేసుల అమలు విషయంలో డిజిటల్ సంతకాలు చేసే సమయంలో ఆర్డీఓలు ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుందని, పట్టాదారు మారుతున్నాడనే ఆప్షన్‌ను ఎంచుకుంటేనే కొత్త పట్టాదారుకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం వస్తుందని, లేదంటే పాత పట్టాదారు పేరు మీదనే ప్రక్రియ పూర్తయినట్టు చూపిస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన భూభారతి సదస్సుల్లో 20 వేలకు పైగా కోర్టు కేసులు/పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. కోర్టు కేసులను పరిష్కరించే లాగిన్ ఉన్న ఆర్డీఓలు డిజిటల్ సంతకాలు చేసే సమయంలో ఆప్షన్లను సరిగా ఎంచుకోవాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు..

గత ఐదు రోజులుగా భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. స్లాట్ బుకింగ్ సవ్యంగానే జరుగుతున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు సర్వర్ నెమ్మదిగా సాగుతోందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. డిజిటల్ సంతకాలు, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసే సమయంలో ఎక్కువ సమయం తీసుకుంటోందని.. దీంతో 15-20 నిమిషాల్లో పూర్తయ్యే ప్రక్రియకు 40-45 నిమిషాలు పడుతోందని చెబుతున్నారు. ఈ విషయంపై హైదరాబాద్‌లోని మెయిన్ సర్వర్ కార్యాలయాన్ని సంప్రదించగా సాంకేతిక సమస్య ఉందని, నాలుగైదు రోజుల్లో సర్దుకుంటుందని చెబుతున్నారు. పోర్టల్ అప్‌డేట్ అవుతున్న సందర్భంలో కొన్ని సమస్యలు వస్తాయని, వాటంతట అవే సర్దుకుంటాయని చెబుతున్నట్లు సమాచారం.

మడిసన్నాక కాపింత కళాపోషనుండాల అన్నట్టు గట్టిగా అనుకోవాలే కానీ చారెడు మట్టినేల లేకున్నా కోరుకున్న పంట పండించవచ్చని నిరూపించింది కేరళకు చెందిన అంజు కార్తీక. తన ఇంటి మిద్దె తోటలో ఆమె 600 రకాల గులాబీలను విరబూయించి రోజాపూల ప్రేమికుల గుండెలను గులాబీ సౌరభాలతో నింపేసింది.



600 వెరయిటీలు

రోజ్ హౌస్

కేరళలోని కయాంకుళానికి చెందిన యాభై రెండు సంవవత్సరాల అంజు కార్తీకకు చిన్నప్పటినుంచి పువ్వులంటే ఎనలేని ప్రేమ. అందులోనూ గులాబీలంటే ప్రాణం. స్కూల్‌లో చదివేటప్పుడే ఆమెలో గులాబీలపైన ప్రేమ బీజం నాటుకుని మొలకెత్తింది. అది ఆమెతోపాటే పెరిగి పెద్దదై కొమ్మలు రెమ్మలుగా విస్తరించింది. ఆమెకు పూలంటే ఉన్న మక్కువ మట్టిగా... ఆమె కృషి, పట్టుదలలే నీరు, ఎరువులుగా మారి ఆమె కోరుకున్నన్ని రకాల గులాబీ బాలలయ్యాయి.

కార్తీకకు పదవ తరగతి విద్యార్థినిగా ఉన్నప్పటినుంచే స్నేహితుల తోటల నుంచి గులాబీల అంట్లు తీసుకొచ్చి తన ఇంటిలో వాటిని పెంచే ప్రయత్నాలు చేసేది. తోటి వారందరూ ఆటపాటలలో బిజీగా ఉన్నప్పుడు ఆమె నిశ్శబ్దంగా తన మొక్కల ప్రపంచంలో పడి వాటిని పెంచడంలో విసుగూ విరామం లేకుండా గంటలు గంటలు గడిపేది. తాను అంటుకట్టిన గులాబీ అందమైన మొగ్గ తొడిగినప్పుడు ఆమె గుండెల్లో ఆనందం ఉప్పొంగేది. గులాబీల పెంపకం పట్ల గల ఆమె అభిరుచి ఆమె టీనేజ్ దాటిన తరువాత వయసుతో పాటే పెరుగుతూ వచ్చింది. 2013లో ఆమె బ్రెజిల్, థాయిలాండ్‌లలో పెరిగే టేబుల్ గులాబీ రకాల గురించి తెలుసుకున్నటినుంచి మరింతగా వికసించింది. 15 రకాల గులాబీ మొక్కలను సేకరించి తన టెర్రస్‌పై రకరకాల కంటైనర్లలో పెంచడం ప్రారంభించింది. వాటి పోషణలో... సంరక్షణలో ఆమె కృషి ఫలించింది. ఈ వాతావరణంలో కూడా అక్కడి గులాబీ రకాలు అభివృద్ధి చెంది రోజుకో రకం మొక్క, పూటకో రకం పువ్వు అన్నట్టు విచ్చుకోనారంభించాయి. ఆమె సేకరించి పెంచుతున్న గులాబీల సౌరభాలు క్రమేణా కేరళ దాటి పొరుగు రాష్ట్రాలకు, అక్కడి నుంచి విదేశాలకు కూడా చేరాయి. అలా ఒక ప్రయోగం ఫలించగానే మరో ప్రయోగం చేస్తూ వచ్చింది. చెన్నై, పూణెలలోని రకరకాల నర్సరీల నుంచి కొత్తరకాల గులాబీ అంట్లను తెప్పించేది. పరాగ సంపర్కాన్ని ఉపయోగించి ఆమె అంటుకట్టిన గులాబీ రకాలు మావిచిగురు, నారింజ, వంకాయ రంగు, ఊదా రంగు.. ఇంకా రకరకాల రంగులలో రూపాలలో ఊపిరి పోసుకుని వివిధ రకాల ఆకృతులలో విచ్చుకోసాగాయి. ఆమె తన ఇంటి మిద్దెనే ప్రయోగశాలగా మార్చుకుని చేసిన వినూత్న ప్రయోగాలు ఆమెకు ఆదాయ మార్గాలుగా కూడా మారాయి. ఫేస్‌బుక్‌లో ఆమె తాను పెంచుతున్న గులాబీ రకాలను అందమైన ఫొటోలు తీసి పోస్ట్ చేసేది. వాటిని చూసి మైమరచి పోయిన ఆమె స్నేహితులు, బంధువులు తమకు కావాలంటే తమకు కావాలంటూ ఆమెకు ఆర్డర్లు పంపసాగారు. అలా అందుకున్న ఆర్డర్ల ద్వారా ఆమె రోజుకు కొన్ని వేల రూపాయల ఆదాయాన్ని కళ్ల జూసేది. ప్రస్తుతం ఆమె మిద్దెతోటలో లేని గులాబీ రకం లేదంటే అతిశయోక్తి కాదు. ఏవిధమైన ఏజెంట్లు కానీ, డిస్ట్రిబ్యూటర్లు కానీ లేకుండానే ఆమె తన నోటిమాటలు, ఫేస్‌బుక్ సమూహాల ద్వారా అడిగిన వారికి లేదనకుండా గులాబీ అంట్లను పంపుతూ వేల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తోంది.



చేయాలనే సంకల్పం, దానిని నెరవేర్చుకునేందుకు కావలసిన శ్రద్ధ, అంకిత భావం, పట్టుదల ఉంటే చాలు.. దేనినైనా సాధించి చూపవచ్చునన్నేందుకు నిదర్శనం అంజు కార్తీక గులాబీ తోట.



వంటల రాణికి గేమ్ చేంజర్ అవార్డు

పేస్ట్రీ గేమ్ చేంజర్ అవార్డు అందుకున్న మొట్టమొదటి ఇండియన్ చెఫ్‌గా పూజా ధింగ్రా పేరు రికార్డులకెక్కింది. సాధారణంగా వంట అనగానే ఆడవాళ్లు చేసేదే కదా అని అనుకుంటాం కానీ రోడ్డు పక్కన ఉండే చిన్నా చితక కాకా, పాకహోటళ్ల నుంచి బిల్లు కట్టాలంటే చుక్కలు చూపించే స్టార్ హోటళ్ల వరకు మగవాళ్లే చెఫ్‌లుగా ఉంటారు. అయితే ముంబైకి చెందిన పూజా ధింగ్రా ఆ సంప్రదాయాన్ని తిరగరాసింది. తనకెంతో ఇష్టమైన వ్యాపకమైన వంటలనే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని స్టార్ చెఫ్‌గా పేరు తెచ్చుకున్న పూజ భారతదేశపు మొట్టమొదటి మాకరోన్ దుకాణాన్ని ప్రారంభించి... బేకరీ చెయిన్ లీ 15 పాటిస్సేరీకి యజమానిగా... మహిళా వ్యాపారవేత్తగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఇవేమీ కొత్త విషయాలు కావనుకోండి...

ముంబాయ్ మాకరోనీ క్వీన్‌గా ఇప్పటికే మకుటం ఉన్న పూజా ధింగ్రాకు పేస్ట్రీ గేమ్ చేంజర్ అవార్డు అందులో మరో విలువైన రాయిగా ఒదిగిపోయింది. దాంతో ఆమె ఈ అవార్డు అందుకున్న మొదటి ఫీమేల్ చెఫ్‌గా కూడా రికార్డు సృష్టించింది.

ఇక్కడ మనం తెలుసుకోవలసిన విషయమేంటంటే... ఎప్పుడూ చేసే వంటలే కదా అనో. రోజూ తినే రుచులే కదా అనో చప్పరించేయడం కాదు... ఆ వంటలకు ఒక ప్రత్యేకతను తీసుకురావాలి. ఆ రుచులు చూడటంలో... అంటే రుచులను పసిగట్టడంలో కూడా నేర్పును సంపాదించాలి. టీ, కాఫీ, ఇతర పానీయాలను టేస్ట్ చూస్తూ... హాయిగా కంటి నిండా నిద్రపోతూ కూడా లక్షలు కాదు.. కోట్లు సంపాదించే వారున్నారన్నది జ్ఞాపకం చేసుకోవాలి.

● యోగా

ఏకాగ్రతను పెంచే త్రాటక

ముఖం కడుక్కోవడం, బ్రష్ చేసుకోవడం, స్నానం చేయడం మొదలైనవన్నీ పై శరీరాన్ని శుభ్రపరిచే క్రియలైతే యోగక్రియలు అంతర్గత అవయవాలనీ శుభ్రపరుస్తాయి. వాటిలో అతి ముఖ్యమైనది త్రాటక. యోగాసనాలు వేయడం పూర్తయ్యాక త్రాటక క్రియ సాధన చేస్తే శరీరం ప్రశాంతంగా మారుతుంది. మనసుకు శరీరానికి మధ్య శక్తివంతమైన వంతెనను సృష్టిస్తుంది. బరువు నియంత్రణలో ఉండటానికి కూడా ఈ సాధన ఉపయోగపడుతుంది.



సాధన చేయడమూ సులువే...

సౌకర్యవంతమైన ప్లేస్‌లో కూర్చోవాలి. ఎదురుగా టీపాయ్ లాంటి చిన్న టేబుల్‌పైన వెలుగుతున్న కొవ్వొత్తిని ఉంచాలి. విశ్రాంతిగా కూర్చొని, ప్రశాంతంగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేస్తూ దీపకాంతిని చూస్తూ ఉండాలి. రోజూ కొంత సమయం ఈ క్రియను సాధన చేస్తూ ఉండాలి.

ఈ అభ్యాసం వల్ల...

కంటి కండరాలను బలపరచడంతో పాటు చూపును మెరుగుపరుస్తుంది. భావోద్వేగ స్థిరత్వాన్ని కలిగిస్తుంది. ఒత్తిడి నిర్వహణకు ఒక విలువైన సాధనంగా పనిచేస్తుంది. కన్నీటి గ్రంథులను శుభ్రపరుస్తుంది. కళ్ళు ప్రకాశవంతం అవుతాయి. కంటిచూపు సామర్థ్యాన్ని బలపరుస్తుంది. నాడీ వ్యవస్థను సమతుల్యం చేస్తుంది. ఆందోళనను తగ్గిస్తుంది. నిద్రలేమి, నిరాశపూరితమైన ఆలోచనలు తగ్గిపోతాయి. ఓర్పు, సహన సామర్థ్యాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది.

మెరుగైన శక్తి

దృష్టిని మెరుగుపరచడం ద్వారా జ్ఞాపకశక్తికి కూడా దోహదపడుతుంది. నిలకడగా చూడటం అనే అభ్యాసం మనసుపై ప్రశాంత ప్రభావాన్ని చూపుతుంది. మనసును శాంతపరచడం వల్ల భావోద్వేగ స్థిరత్వం లభిస్తుంది. నిద్ర పట్టని వారికి ఇది మేలైన ఔషధం అని కూడా చెప్పవచ్చు. ముఖ్యంగా ఎక్కువ సేపు స్క్రీన్‌లను చూస్తూ గడిపే వారికి, ఈ అభ్యాసం కంటి ఒత్తిడి, అలసటను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ అభ్యాసం సంకల్ప శక్తి, స్వీయ-క్రమశిక్షణను పెంపొందించడంలో సహాయపడుతుంది.

– ఎస్.ఆర్.

వెయిట్ లాస్‌లో ఆహారం పాత్రే అధికం

బరువు తగ్గడానికి అయినా పెరగడానికి అయినా వ్యాయామాల పాత్ర 20 శాతం ఉంటే, ఆహారం పాత్ర 80 శాతం ఉంటుంది. సాధారణ మనిషికి రోజుకు 2,200 క్యాలరీస్ అవసరం. బరువు తగ్గాలి అనుకునే వారు క్యాలరీ లోటు లో ఉండాలి. మన శరీరం 2,200 కావాలి అంటే, ఒక 5 – 10 శాతం ఆహార క్యాలరీ లోటు తో మొదలుపెట్టాలి. అంటే రోజుకు 2000 క్యాలోరీలు ఇచ్చే ఆహారం తీసుకోవాలి. అది కూడా ఆరోగ్యకరమైన ఆహారం. కూరగాయలు, పళ్ళు, మాంసకృత్తులు, ఓట్స్ లాంటివి.



ఉదాహరణకు కేజీ బరువు తగ్గాలి అంటే దాదాపు 7500 క్యాలరీలు కరిగించాలి. అంటే ఈ విధంగా చేస్తూ ఉంటే, 3 వారాలకు ఒక కేజీ తగ్గుతారు అన్నమాట. నెమ్మదిగా తగ్గినా ఆరోగ్యంగా తగ్గుతారు ఈ విధంగా. కానీ ఒక మనిషిలో ఎదుటి వాళ్ళు గుర్తించగలిగే మార్పు రావాలి అంటే ఒక 3 కేజీలు అయినా తగ్గాలి. అలా తగ్గడానికి కనీసం 2 నెలలు పడుతుంది.



జామ ఆకూ ఔషధమే

● జామ ఆకుల్లో అధిక మొత్తంలో ట్యానిన్స్, ఆక్సలేట్స్ ఉంటాయి. అందువల్ల నోటి పూత, నోటిలో పుండ్లు, చిగుళ్ల వాపు, గొంతు నొప్పి వంటి నోటి సమస్యలతో బాధపడేవారు లేత జామ ఆకుల్ని నమిలినా లేదా లేత ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటితో పుక్కిట పట్టినా మంచి ఫలితాలను పొందవచ్చు. ● జామ ఆకులు జుట్టుకి దివ్యౌషధంలా పని చేస్తాయి. జుట్టు రాలడాన్ని నివారించడంతో పాటు జుట్టు పెరగడానికి దోహదపడతాయి. సరిపడా జామ ఆకుల్ని శుభ్రం చేసుకుని తగినన్ని నీరు పోసి 15 నిముషాలసేపు మరిగించాలి. చల్లారాక ఆ నీటిని తలపై నెమ్మదిగా అప్లై చేస్తూ బాగా మర్దనా చేయాలి. గంట తరువాత తలస్నానం చేయాలి. తరచుగా ఇలా చేయడం వల్ల వెంట్రుకల కుదుళ్లు గట్టిపడి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.


సరికొత్త అనుభూతి



● నితిన్

నితిన్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రలు పోషించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. జూలై 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ''మా సినిమాకి సెన్సార్ సూచించిన కట్స్‌తో అయితే 'యు/ఎ' సర్టిఫికెట్ లభించేది. అయితే ప్రేక్షకులకు బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు ఎలాంటి కట్స్ లేకుండా 'ఎ' సర్టిఫికెట్ తీసుకున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కంప్లీట్ ఎంటర్‌టైనర్స్ లేదా సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాలకు మాత్రమే ప్రేక్షకులు థియేటర్స్‌కు వెళ్తున్నారని, ఈ క్రమంలోనే 'తమ్ముడు' ఒక కొత్త తరహా సినిమాటిక్ అనుభూతిని ప్రేక్షకులకు అందించేందుకు కట్స్ లేకుండా 'ఎ' సర్టిఫికెట్ తీసుకునేందుకే 'దిల్' రాజు మొగ్గుచూపారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

లైఫ్ అంటే ఫ్రెండ్సే కదా బ్రో..



● కిరీటి

'ఆఫర్ లెటరా... ఐయామ్ సెలెక్టెడ్.. ఫ్రెండ్‌షిప్ కోసం ఆఫర్ లెటర్ పంపావా... ఎవడ్రా నువ్వు' అంటూ నటుడు వైవా హర్ష చెప్పే డైలాగ్స్‌తో 'జూనియర్' సినిమా టీజర్ మొదలవుతుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. జెనీలియా కీలక పాత్రలో నటించగా, కన్నడ స్టార్ రవి చంద్రన్ ప్రధాన పాత్ర పోషించారు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ సినిమా జూలై 18న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'లైఫ్ అంటే ఫ్రెండ్సే కదా బ్రో... అందుకే నా లైఫ్‌లో తీసుకున్న ఫస్ట్ డెసిషన్ మిమ్మల్ని ఫ్రెండ్స్‌గా సెలెక్ట్ చేసుకోవడం', 'రేయ్... ఎవడన్నా పైకి వెళ్లాలనుకుంటే చాలు ఆపేయడానికి, లాగేయడానికి వచ్చేస్తారు కదరా' (కిరీటి రెడ్డి) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: కేకే సెంథిల్ కుమార్.

జాతరలో ప్రేమకథ

అంకిత్ కొయ్య, మానసా చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ జాతర'. 'సమ్మతమే' మూవీ ఫేమ్ గోపీనాథ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. యూజీ క్రియేషన్స్ బ్యానర్‌లో కంకణాల ప్రవీణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'లవ్ జాతర' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''కంప్లీట్ రోలర్ కోస్టర్ లవ్ ఎంటర్‌టైనర్‌గా 'లవ్ జాతర' రూపొందుతోంది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్దార్థ్, సంగీతం: చేతన్ భరద్వాజ్.



● అంకిత్, మానస

ఆస్కార్ కమిటీలో ఇండియన్ స్టార్స్

● కమల్‌హాసన్, ఆయుష్మాన్ ఖురానా, పాయల్ కపాడియాకి ఆహ్వానం

''ప్రపంచ సినిమాకి చెందిన నటీనటులను, సాంకేతిక నిపుణులను అకాడమీలోకి ఆహ్వానిస్తున్నందుకు మాకెంతో థ్రిల్‌గా, ఆనందంగా ఉంది. అంకితభావం, నిబద్ధతతో ప్రపంచ చలన చిత్ర పరిశ్రమ పురోగతికి కృషి చేస్తున్న ప్రతిభావంతులు వీరు '' అంటూ ఆస్కార్ అకాడమీ కమిటీ సీఈవో బిల్ క్రామర్, ప్రెసిడెంట్ జానెట్ యాంగ్ పేర్కొన్నారు. 98వ ఆస్కార్ అవార్డు వేడుక వచ్చే ఏడాది మార్చి 15 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 16)న లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో ఆస్కార్ అవార్డు కమిటీ ఈ వేడుకకు సంబంధించిన పనులు మొదలుపెట్టింది.

ఇందులో భాగంగా విజేతల ఎంపిక ఓటింగ్ కోసం అకాడమీలో సభ్యులుగా చేరాలంటూ దేశ, విదేశాలకు చెందిన సినిమా తారలకు ఆహ్వానం పంపింది కమిటీ. ఆ జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాది కొత్తగా 534 మందికి సభ్యత్వం ఇస్తున్నట్లుగా పేర్కొంది. వారిలో యాక్టింగ్ విభాగంలో ఇండియన్ స్టార్స్ కమల్‌హాసన్, ఆయుష్మాన్ ఖురానాలకు, దర్శకురాలు పాయల్ కపాడియా, సినిమాటోగ్రాఫర్ రణబీర్ దాస్, క్యాస్టింగ్ డైరెక్టర్ కరణ్, ఫ్యాషన్ డిజైనర్ మ్యాక్సిమా బసు, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ స్మృతీ ముంధ్రాలకు ఆహ్వానం పంపారు.



● పాయల్



● కమల్‌హాసన్



● ఆయుష్మాన్

ఆస్కార్ అవార్డు విజేతల ఎంపిక ప్రక్రియలో వీరికి ఓటు హక్కు లభిస్తుంది. నామినేషన్ల దశ నుంచి విజేతల ఎంపిక వరకూ సభ్యులు ఓటింగ్‌లో పాలు పంచుకోవాల్సి ఉంటుంది. కాగా కొత్తగా ఎంపిక చేసిన 534 మంది సభ్యుల్లో స్త్రీల సంఖ్య 41 శాతం ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జనవరి 12 నుంచి 16 వరకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుంది. నామినేషన్ దక్కించుకున్నవారి జాబితాను జనవరి 22న ప్రకటిస్తారు.

ఓర్పు ఆమె ఆయుధం



● రష్మికా మందన్న

హీరోయిన్ రష్మికా మందన్న ప్రధాన పాత్రలో 'మైసా' అనే కొత్త సినిమా రూపొందుతోంది. డైరెక్టర్ హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. హను రాఘవపూడి తెలుగు పోస్టర్‌ను, హీరో ధనుష్ తమిళ, నటుడు విక్కీ కౌశల్ హిందీ, హీరో దుల్కర్ సల్మాన్ మలయాళ, నటుడు శివరాజ్ కుమార్ కన్నడ పోస్టర్స్‌ని విడుదల చేశారు. రవీంద్ర పుల్లె మాట్లాడుతూ– ''గోండు తెగల ప్రపంచాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతున్న అద్భుతమైన ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. ఈ సినిమాలో రష్మిక ఒక గోండు మహిళగా కనిపిస్తారు. ఈ చిత్రానికి సంబంధించి కీలక సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అన్నారు. 'ఓర్పు ఆమె ఆయుధం... ఆమె గర్జన వినిపించేందుకు కాదు... భయపడించేందుకు. రష్మికని మైసా పాత్రలో చూడండి' అని చిత్రనిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది.

వినోదాల దీర్ఘాయుష్మాన్ భవ

కార్తీక్ రాజు, మిస్టీ చక్రవర్తి జంటగా ఎం. పూర్ణానంద్ దర్శకత్వం వహించిన చిత్రం 'దీర్ఘాయుష్మాన్ భవ'. ఆమని, నాగినీడు, కాశీ విశ్వనాథ్, పృథ్వీరాజ్, 'సత్యం' రాజేశ్ ఇతర పాత్రలు పోషించారు. వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. ఈ సినిమాని జూలై 11న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా వంకాయలపాటి మురళీకృష్ణ మాట్లాడుతూ– ''చక్కటి ఫ్యామిలీ కథతో రెండున్నర గంటల పాటు ప్రేక్షకులకు వినోదం అందించేందుకు ఈ సినిమా తీశాం. సోషియో ఫ్యాంటసీ ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రంలో గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యం ఇచ్చాం. యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది'' అని చెప్పారు. ''ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది. ఓ మంచి సినిమా చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది'' అన్నారు పూర్ణానంద్. ఈ సినిమాకి కెమేరా: మల్హర్ భట్ జోష్, సంగీతం: వినోద్ యాజమాన్య.



● మిస్టీ, కార్తీక్ రాజు

ఓటీటీ ఇది చూడొచ్చు

ఉత్కంఠభరితంగా... కళ్ళకు కట్టినట్లుగా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో అమెరికన్ మేన్ హంట్: ఒసామా బిన్ లాడెన్ వెబ్ సిరీస్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

9/11... అమెరికా చరిత్రలో ఇదో మరచిపోని సంఖ్య. నాటికి, నేటికి, రేపటి తరానికి గుర్తుండిపోయే దారుణ ఘటన ఈ 9/11. న్యూయార్క్ నగరంలోని రెండు పెద్ద ఆకాశ హార్మ్యాలను విమానాలతో నేలమట్టం చేసి దాదాపు 3000కి పైగా ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన అతి కిరాతక చర్యగా అమెరికా చరిత్రలో నిలిచిపోయింది. అత్యంత హేయమైన ఈ తీవ్రవాద దాడి 9/11కి సూత్రధారి బిన్ లాడెన్. అంతటి కరుడు గట్టిన తీవ్రవాదిని ఉత్కంఠభరితంగా మట్టుబెట్టాయి నిఘా సంస్థలు. ఇదే ఇతివృత్తంగా నాటి ఘటనలను సిరీస్ రూపంలో నేడు నెట్ ఫ్లిక్స్ మన ముందుకు తీసుకొచ్చింది. 'అమెరికన్ మేన్ హంట్: ఒసామా బిన్ లాడెన్' పేరుతో ఈ సిరీస్ మూడు భాగాలతో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది. తెలుగు భాషతో పాటు దాదాపు అన్ని భారతీయ భాషలలో ఈ సిరీస్‌ని విడుదల చేశారు.



ఇందులో గొప్ప విషయం ఏమిటంటే ... సిరీస్ మొత్తం అప్పుడు జరిగిన కొన్ని వాస్తవ సన్నివేశాలతో రూపకల్పన చేయడం. అంతేకాదు... అమెరికాలో ఈ ఆపరేషన్ గురించి అధికారులు ఎప్పటికప్పుడు అప్పటి ప్రెసిడెంట్‌కి బ్రీఫ్ చేయడం, అలాగే అప్పటి ఈ ఆపరేషన్‌కు సంబంధించిన కొందరు అధికారుల వీడియో బైట్స్‌ను కూడా చాలా చక్కగా ఎడిట్ చేసి, చూపించారు. నిజానికి ఈ సిరీస్ చూడడం మొదలుపెట్టిన కొద్ది సమయానికే మనం కూడా ఈ ఆపరేషన్‌లో వర్చ్యువల్‌గా ఇన్వాల్వ్ అయిపోతాం. మనకు 9/11 ఘటన గురించి తెలిసింది పిడికిలంత అయితే ఈ సిరీస్ ద్వారా కొండంత విషయాలు తెలుస్తాయి. 'అమెరికన్ మేన్ హంట్: ఒసామా బిన్ లాడెన్'... వర్త్‌ఫుల్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	303	84,089
నిఫ్టీ ▲	89	25,637

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,258	▲	90
డోజోన్స్	43,866	▲	480
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,799	▲	63
డాక్స్	24,033	▲	384
షాంఘై	3,424	▼	24
నికాయ్	40,151	▲	566

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.30	119.17
€	యూరో	ఎస్‌బీఐ	98.86	101.60
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.56	60.09
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.01	57.23
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.74	69.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.89	23.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.38	24.16
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.05	12.87

జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ చేతికి డ్యూలక్స్

మళ్లీ పడిన పసిడి

న్యూఢిల్లీ: బంగారంలో అమ్మకాలు మరోసారి వెల్లువెత్తాయి. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు సద్దుమణగడం, అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఒప్పందం దిశగా సానుకూల సంకేతాలతో ట్రేడర్లు బంగారంలో అమ్మకాలకు మొగ్గు చూపించారు. దీంతో ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 99.5 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.930 నష్టపోయి రూ.97,670 స్థాయికి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.850 నష్టంతో రూ.97,200 స్థాయికి చేరింది. ''తాజా భౌగోళిక ఉద్రిక్తతలు ఏవీ లేక పోవడంతో సురక్షిత సాధనంగా భావించే బంగారంలో లాభాల స్వీకరణ ధోరణి కొనసాగింది. కీలకమైన చమురు మౌలిక సదుపాయాలు, రవాణా మార్గాలు, ముఖ్యంగా హార్ముజ్ జలసంధిపై దాడులను నివారించడం ద్వారా ఇరాన్ సంయమనం పాటించడంతో ఆయిల్ ధరలు కూడా తగ్గాయి''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. ఉద్రిక్తతలు చల్లబడడంతో రిస్క్ ధోరణి తగ్గినట్టు చెప్పారు. అంతర్జాతీయ ఫ్యూచర్ మార్కెట్లోనూ ఔన్స్ బంగారం 60 డాలర్ల నష్టంతో 3287 డాలర్ల స్థాయికి దిగొచ్చింది.



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దేశీ గ్రూప్ జేఎస్‌డబ్ల్యూ తాజాగా డచ్ పెయింట్ల దేశీ దిగ్గజం అక్జో నోబెల్ ఇండియాను సొంతం చేసుకోనుంది. సజ్జన్ జిందాల్ గ్రూప్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ఇందుకు డ్యూలక్స్ బ్రాండ్ మాతృ సంస్థ అక్జో నోబెల్ ఎన్‌వీతో తప్పనిసరి ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా అక్జో నోబెల్ ఇండియాలో 74.76% వాటా కొనుగోలు చేయనుంది. డీల్ విలువ రూ. 8,986 కోట్లుకాగా.. అక్జో నోబెల్ దేశీయంగా లిస్టెడ్ కంపెనీకావడంతో సాధారణ వాటాదారుల నుంచి మరో 25 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు షేరుకి రూ. 3,417.77 ధరలో మరో రూ. 3,929 కోట్లు వెచ్చించనుంది. వెరసి డ్యూలక్స్ పెయింట్ల బిజినెస్‌ను రూ. 12,915 కోట్లకు చేజిక్కించుకోనుంది. 2019లోనే పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశించిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తాజా కొనుగోలుతో దేశీయంగా పెయింట్ల రంగంలో నాలుగో పెద్ద కంపెనీగా అవతరించనుంది. ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్‌తో పాటు, కన్సాయ్ నెరోలాక్ తొలి మూడు ర్యాంకులలో నిలుస్తున్నాయి. అయితే ప్రస్తుతం దేశీ సంస్థ చేతిలో ఉన్న లిక్విడ్ పెయింట్స్, కోటింగ్స్ విభాగం జేఎస్‌డబ్ల్యూ సొంతం కానుండగా.. పౌడర్ కోటింగ్స్ బిజినెస్, ఇంటర్నేషనల్ రీసెర్చ్ సెంటర్ మాత్రం పూర్తి స్థాయిలో అక్జో నోబెల్ చేతిలో మిగలనున్నాయి. ఈ అంశాన్ని డచ్ దిగ్గజం అక్జో నోబెల్ వెల్లడించింది.



పోటీ తీవ్రతరం

పెయింట్ల రంగంలో ఇప్పటికే దేశీయంగా ఏషియన్, బెర్జర్ పెయింట్స్‌సహా.. కన్సాయ్ నెరోలాక్, అక్జో నోబెల్, ఇండిగో, షాలిమార్, నిప్పన్ కార్యకలాపాలు విస్తరించగా.. గత 5–6 ఏళ్లలో మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించాయి. జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్‌తో పాటు.. ఒపస్ బ్రాండుతో ఆదిత్య బిర్లా గ్రూప్, పిడిలైట్(హాఠీషా), ఆస్ట్రల్ పైప్స్(జెమ్), జేకే సిమెంట్స్(ఆక్రో) సైతం పోటీకి సై అంటున్నాయి. ఈ నేపథ్యంలో అక్జో నోబెల్ ఇండియా విక్రయం ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశీ డెకొరేటివ్ బిజినెస్‌లో ప్రధానంగా పోటీ తీవ్రతరమవుతున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏబీ గ్రూప్ రూ. 10,000 కోట్ల పెట్టుబడులతో ఒపస్‌ను తీసుకువచ్చిన అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా.. పెయింట్లు, కోటింగ్స్ బిజినెస్ దేశీయంగా వేగవంత వృద్ధిలో ఉన్నట్లు జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ఎండీ పార్థ్ జిందాల్ పేర్కొన్నారు. ఈ రంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీలలో జేఎస్‌డబ్ల్యూ ఒకటని తెలియజేశారు.

- అక్జో నోబెల్ ఇండియా కొనుగోలు
- డీల్ విలువ రూ. 12,915 కోట్లు
- నాలుగో పెద్ద కంపెనీగా అవతరణ
- సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్
- షేరుకి రూ. 3,418 ధరలో కొనుగోలు

షేరు తీరిలా...

తాజా వార్తల నేపథ్యంలో అక్జో నోబెల్ ఇండియా షేరు బీఎస్‌ఈలో 7 శాతం జంప్‌చేసి రూ. 3,415 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 3,533 వద్ద గరిష్టాన్ని తాకింది.

2025లో డీల్స్ జోరు..

జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, డ్యూలక్స్ డీల్ 2025లో నమోదైన అతిపెద్ద లావాదేవీలలో ఒకటిగా నిలవనుంది. గత నెలలో జపనీస్ దిగ్గజం సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్ రూ. 13,483 కోట్లకు దేశీ సంస్థ యస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అంతక్రితం మార్చిలో బజాజ్ అలియెంజ్ లైఫ్‌తోపాటు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో జర్మన్ భాగస్వామి అలియెంజ్‌కున్న 26 శాతం వాటాను బజాజ్ గ్రూప్(బజాజ్ ఫిన్‌సర్వ్) మొత్తం రూ. 24,180 కోట్లకు సొంతం చేసుకుంది. ఇది అతి పెద్ద డీల్‌కాగా.. ఈ ఫిబ్రవరిలో అయానా రెన్యువబుల్ పవర్ కొనుగోలుకి రూ. 19,500 కోట్ల ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ గ్రీన్ డీల్ రెండో ర్యాంకులో నిలుస్తోంది. హల్దీరామ్స్‌లో 10 శాతం వాటా కొనుగోలుకి సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ టెమాసెక్ ఈ మార్చిలో రూ. 8,600 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. వీటితో పోలిస్తే జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్– అక్జో నోబెల్ డీల్ ఈ ఏడాది నమోదైన అతి పెద్ద డీల్స్‌లో ఒకటిగా నిలవనుంది.

84 వేల పైకి సెన్సెక్స్

- నిఫ్టీ లాభం 89 పాయింట్లు
- నాలుగోరోజూ లాభాల పరంపర



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో లాభాల పరంపర నాలుగో రోజూ కొనసాగింది. ట్రంప్ సుంకాల గడువు పొడిగింపు, విదేశీ పెట్టుబడులు కొనసాగొచ్చనే ఆశలు సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 303 పాయింట్లు పెరిగి 84 వేల స్థాయిపైన 84,089 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 25,637 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 333 పాయింట్లు బలపడి 84,089 వద్ద, నిఫ్టీ 105 పాయింట్లు ఎగసి 25,654 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. యూఎస్ ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో ఆయిల్ అండ్‌గ్యాస్ 1.21%, సర్వీసెస్ 1.17%, విద్యుత్ 1.14%, కమోడిటీస్ 1.11%, ఇంధన, వినిమయ, టెలికం సూచీలు 1% చొప్పున రాణించాయి.
- ఎఫ్‌ఐఐల పెట్టుబడులు కొనసాగొచ్చనే ఆశలు డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు పెరిగి 85.50 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, దలాల్ స్ట్రీట్ ర్యాలీ దేశీయ కరెన్సీ బలోపేతానికి దోహదపడ్డాయి.
- స్టాక్ మార్కెట్ వరుస ర్యాలీతో నాలుగు రోజుల్లో రూ.12.26 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ రూ.460 లక్షల కోట్ల (5.38 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది.

హెచ్‌డీబీ ఫైనాన్స్ ఐపీవో సక్సెస్

ప్రయివేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీవో సక్సెస్ అయింది. ఇష్యూ చివరి రోజు శుక్రవారానికల్లా 17 రెట్లు అధికంగా స్పందన లభించింది. షేరుకి రూ. 700–740 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా సంస్థ రూ.12,500 కోట్లు సమీకరించింది. ఐపీవోలో 13 కోట్లకు పైగా షేర్లను ఆఫర్ చేయగా.. 217.67 కోట్లు పైగా షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 55 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 10 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 1.4 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు.

బ్రోకరేజీ సేవలకు జియో రెడీ

సెబీ నుంచి తాజాగా అనుమతి

న్యూఢిల్లీ: సొంత అనుబంధ సంస్థ జియో బ్లాక్‌రాక్ బ్రోకింగ్ ప్రయివేట్‌కు సెక్యూరిటీ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి తాజాగా అనుమతి లభించినట్లు జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ పేర్కొంది. దీంతో బ్రోకరేజీ సంస్థగా సేవలు ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. తద్వారా జియో బ్లాక్‌రాక్ బ్రోకింగ్ పారదర్శక, చౌక ధరల్లో సర్వీసులు అందించనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఇన్వెస్టర్ల సామర్థ్యాలను పెంపొందించే విధంగా టెక్నాలజీ ఆధారిత సేవలు సమకూర్చనున్నట్లు తెలియజేసింది.

అదానీ గ్రూప్ విలువ జూమ్..



- వేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా గుర్తింపు
- బ్రాండ్ ఫైనాన్స్ లిస్టులో చోటు
- అత్యంత విలువైన బ్రాండ్ టాటా

న్యూఢిల్లీ: అత్యంత వేగంగా ఎదుగుతున్న భారతీయ బ్రాండుగా అదానీ గ్రూప్ నిల్చింది. 2025కి గాను బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ రూపొందించిన అత్యంత విలువైన భారతీయ బ్రాండ్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రిపోర్టు ప్రకారం అదానీ బ్రాండ్ విలువ 2024లో 3.55 బిలియన్ డాలర్లుగా ఉండగా తాజాగా 2.91 బిలియన్ డాలర్లు పెరిగి 6.46 బిలియన్ డాలర్లకు ఎగిసింది. ఓవరాల్‌గా గతేడాది 16వ స్థానంలో ఉండగా ఈసారి 13వ ర్యాంకుకు చేరింది. 82 శాతం బ్రాండ్ విలువ వృద్ధితో అదానీ గ్రూప్ అత్యంత వేగంగా ఎదుగుతున్న భారతీయ బ్రాండుగా నిల్చిందని రిపోర్ట్ పేర్కొంది. తాజా నివేదిక ప్రకారం..

- ఇండియా 100 జాబితాలోని మొత్తం సంస్థల బ్రాండ్ విలువ 236.5 బిలియన్ డాలర్లు.
- అత్యంత విలువైన భారతీయ బ్రాండుగా టాటా గ్రూప్ మరోసారి అగ్రస్థానంలో నిల్చింది. బ్రాండ్ విలువ 10 శాతం వృద్ధి చెంది 31.6 బిలియన్ డాలర్లకు చేరింది.
- 15 శాతం బ్రాండ్ విలువ (16.3 బిలియన్ డాలర్లు) వృద్ధితో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఈ జాబితాలో అత్యంత విలువైన రెండో భారతీయ బ్రాండుగా నిల్చింది. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ బ్రాండ్ విలువ 14.2 బిలియన్ డాలర్లకు చేరడంతో ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో నిల్చింది. ఎల్‌ఐసీ (13.6 బిలియన్ డాలర్లు) నాలుగో ర్యాంకు, హెచ్‌సీఎల్‌టెక్ (బ్రాండ్ విలువ 17 శాతం అప్, 8.9 బిలియన్ డాలర్లు) ఒక ర్యాంకు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరింది. ఎల్అండ్‌టీ గ్రూప్ (7.4 బిలియన్ డాలర్లు) తొమ్మిదో స్థానంలో, మహీంద్రా గ్రూప్ (7.2 బిలియన్ డాలర్లు) 10వ స్థానంలో నిల్చాయి.
- అత్యంత పటిష్టమైన భారతీయ బ్రాండుగా తాజ్ హోటల్స్ వరుసగా నాలుగో ఏడాదీ అగ్రస్థానాన్ని కాపాడుకుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
క్యూ4లో కరెంట్ ఖాతా మిగులు | జియో, ఎయిర్‌టెల్ జోరు



ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

మలోర్కా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో సీడ్ యూకీ–గాలోవే ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–గాలోవే జోడీ 6–1, 7–6 (7/4)తో గిడో ఆంద్రోజీ (అర్జెంటీనా)–థియో అరిబేజ్ (ఫ్రాన్స్) జంటపై విజయం సాధించింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–గాలోవే జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని యూకీ–గాలోవే ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో సాంటియాగో (మెక్సికో)–ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీతో యూకీ–గాలోవే జంట ఆడుతుంది. 2023లో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో కలిసి ఇదే టోర్నీలో యూకీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు.

శుభారంభం లక్ష్యంగా...

నేడు ఇంగ్లండ్‌తో భారత మహిళల తొలి టి20

- షఫాలీ వర్మపైనే అందరి దృష్టి
- రాత్రి గం. 7:00 నుంచి సోనీ స్పోర్ట్స్ చానెల్స్, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


స్మృతి మంధాన
షఫాలీ వర్మ

నాటింగ్‌హామ్: భారత పురుషుల క్రికెట్ జట్టు ఇంగ్లండ్ పర్యటనలో టెస్టు సిరీస్ ఆడుతుండగా... మహిళల క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌కు సిద్ధమవుతోంది. 5 టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య ఈరోజు తొలి మ్యాచ్ జరగనుంది. వచ్చే ఏడాది ఇంగ్లండ్ వేదికగా టి20 వరల్డ్ కప్ జరగనుండగా... దానికి ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడనుంది. గతేడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే వెనుదిరిగిన టీమిండియా... లోపాలను సవరించుకొని మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఈ పర్యటన దోహద పడనుంది. ఫామ్ కోల్పోయి జాతీయ జట్టుకు దూరమైన యువ ఓపెనర్ షఫాలీ వర్మ జట్టులోకి పునరాగమనం చేయడంతో భారత బలం పెరిగింది. ఈ సిరీస్‌లో రాణించడం ద్వారా... ఈ ఏడాది భారత్‌లోనే జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో పాల్గొనే టీమిండియాలోనూ చోటు దక్కించుకోవాలని షఫాలీ భావిస్తోంది. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ బౌలర్ శ్రీచరణి, క్రాంతి గౌడ్, సయాలీ వంటి పలువురు యువ ప్లేయర్లను పరీక్షించనున్నారు. ఇంగ్లండ్ పిచ్‌లపై కొత్త ఆటగాళ్లకు అవకాశాలిచ్చి... వారిని వచ్చే ఏడాది మెగా టోర్నీ కోసం సంసిద్ధం చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ ఏడాది భారత మహిళల జట్టుకు ఇదే తొలి టి20 సిరీస్ కాగా... హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగుతోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాన సిరీస్‌లకు ముందు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) జట్టుతో జరిగిన రెండు టూర్ మ్యాచ్‌ల్లోనూ టీమిండియా పరాజయం పాలైంది. వన్డే, టి20 ఫార్మాట్‌లలో జరిగిన ఈ మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగైన ప్రదర్శన చేసినా... గెలుపుగీత దాటలేకపోయింది.

సీనియర్లపైనే భారం

సుదీర్ఘ పర్యాటనలో టీమిండియా శుభారంభం చేయాలంటే... సీనియర్ ప్లేయర్లు రాణించాల్సిన అవసరముంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానతో పాటు షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ సత్తా చాటితేనే టీమిండియా ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు రెండోసారి టైటిల్ అందించిన హర్మన్‌ప్రీత్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అటు బ్యాటర్‌గా ఇటు సారథిగా ఆమె వాటిని అందుకుంటుందా చూడాలి. ఇక ఈ ఏడాది స్వదేశంలో వన్డే ప్రపంచకప్, వచ్చే ఏడాది టి20 వరల్డ్‌కప్ నేపథ్యంలో షఫాలీ వర్మ మునుపటి మెరుపులు మెరిపించాల్సిన అవసరముంది. ఓపెనర్‌గా వచ్చిన అవకాశాలను సద్వినియోగ పర్చుకోలేకపోయిన ఉమా ఛెత్రి స్థానంలో షఫాలీ తుది జట్టులోకి రావడం ఖాయమే. పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జ్యోత్ కౌర్, స్పిన్ ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. 2023 ఫిబ్రవరి తర్వాత తొలిసారి జాతీయ టి20 జట్టులో చోటు దక్కించుకున్న స్నేహ్ రాణా... ఇటీవల డబ్ల్యూపీఎల్‌లో మెరుగైన ఆటతీరు కనబర్చింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ స్నేహ్ ఆకట్టుకుంది. సీనియర్ పేస్ బౌలర్లు రేణుక సింగ్, పూజ గాయాల కారణంగా ఈ పర్యటనకు అందుబాటులో లేకుండా పోవడంతో... ఇలాంటి సమయంలో యువ క్రీడాకారిణులు జట్టును గెలిపించాలని టీమ్ ఆశిస్తోంది.

సొంతగడ్డపై బలంగా ఇంగ్లండ్.

మరోవైపు సీవర్ బ్రంట్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఇంగ్లండ్ జట్టు అన్ని రంగాల్లో పటిష్టంగా ఉంది. సొంతగడ్డపై సిరీస్ ఆడనుండటం ఆ జట్టుకు అదనపు ప్రయోజనం. అమీ జోన్స్, టామీ బ్యూమౌంట్, డానీ వ్యాట్, సోఫీ వంటి అనుభవం గల ప్లేయర్లు ఆ జట్టుకు ప్రధాన బలం కానున్నారు. మరోవైపు ఇస్సీ వాంగ్, అలీస్ కాప్సీ, సోఫియా డాంక్లీ వంటి యువ క్రీడాకారిణిలు కూడా తమదైన ముద్ర వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరి సుదీర్ఘ పర్యటనలో ఎవరు బోణీ కొడతారో చూడాలి!

200 ఈరోజు ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్ అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కు 200వ మ్యాచ్ కానుంది. ఇంగ్లండ్ (215), ఆస్ట్రేలియా (200) జట్ల తర్వాత 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకోనున్న మూడో జట్టుగా భారత్ నిలువనుంది. ఇప్పటి వరకు 199 టి20లు ఆడిన భారత్ 108 మ్యాచ్‌ల్లో నెగ్గి, 84 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఆరు మ్యాచ్‌లు రద్దు కాగా, ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది.

30 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన టి20 మ్యాచ్‌లు. 8 మ్యాచ్‌ల్లో భారత్, 22 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలుపొందాయి.

12 ఇంగ్లండ్ గడ్డపై ఇంగ్లండ్‌తో భారత్ ఆడిన టి20 మ్యాచ్‌లు. 4 మ్యాచ్‌ల్లో భారత్, 8 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించాయి.

చాంపియన్ ప్రజ్ఞానంద

లైవ్ రేటింగ్స్‌లో భారత నంబర్‌వన్‌గా తమిళనాడు గ్రాండ్‌మాస్టర్



తాష్కెంట్: అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న భారత యువ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద... ఉజ్‌చెస్ కప్ మాస్టర్స్ అంతర్జాతీయ టోర్నీలో చాంపియన్‌గా నిలిచాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీ శుక్రవారం ముగిసింది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత ప్రజ్ఞానందతోపాటు నొదిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్), జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్) 5.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు ఈ ముగ్గురి మధ్య టైబ్రేక్ గేమ్‌లను నిర్వహించారు.

తొలి రౌండ్ టైబ్రేక్ గేమ్‌ల తర్వాత ముగ్గురూ 2 పాయింట్లతో సమంగా నిలిచారు. దాంతో ఈ ముగ్గురి మధ్య రెండో రౌండ్ టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ఈసారి ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు. 1 పాయింట్‌తో సిందరోవ్ రన్నరప్‌గా నిలిచాడు. అర పాయింట్‌తో నొదిర్‌బెక్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. గురువారం ఎనిమిదో రౌండ్ ముగిశాక నొదిర్‌బెక్ 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో, సిందరోవ్ 5 పాయింట్లతో రెండో స్థానంలో, ప్రజ్ఞానంద 4.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. శుక్రవారం జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ప్రజ్ఞానంద 49 ఎత్తుల్లో నొదిర్‌బెక్‌ను ఓడించగా... పర్హామ్ మగ్సూద్ (ఇరాన్)తో జరిగిన గేమ్‌ను సిందరోవ్ 'డ్రా' చేసుకున్నాడు. దాంతో ఈ ముగ్గురూ 5.5 పాయింట్లతో ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో నిలిచారు. తెలంగాణకు చెందిన భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఐదు పాయింట్లతో నాలుగో స్థానంతో ఈ టోర్నీని ముగించాడు. విజేతగా నిలిచిన ప్రజ్ఞానందకు 20 వేల డాలర్లు (రూ. 17 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా విజయంతో 19 ఏళ్ల ప్రజ్ఞానంద లైవ్ రేటింగ్స్‌లో 2778.3 పాయింట్లతో భారత నంబర్‌వన్ చెస్ ప్లేయర్‌గా అవతరించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఈ తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ నాలుగో స్థానానికి ఎగబాకాడు. 2776.6 పాయింట్లతో దొమ్మరాజు గుకేశ్ ఐదో స్థానంలో, 2775.7 పాయింట్లతో అర్జున్ ఆరో స్థానంలో ఉన్నారు.

పోరాడి ఓడిన తరుణ్

క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్, తన్వీ శర్మ



అయోవా (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్, ప్రపంచ 54వ ర్యాంకర్ తరుణ్ మన్నేపల్లి పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో తరుణ్ 12–21, 21–13, 15–21తో ప్రపంచ 34వ ర్యాంకర్, భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టి చేతిలో పోరాడి ఓడిపోయాడు. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను కోల్పోయిన తరుణ్ వెంటనే తేరుకొని రెండో గేమ్‌లో గెలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో మాత్రం ఆయుశ్ ఆరంభంలో 4–0తో ఆధిక్యంలోకి వెళ్లి తుది వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ)తో ఆయుశ్ తలపడతాడు. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్ తన్వీ శర్మ క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తన్వీ శర్మ 21–18, 21–16తో 2023 ప్రపంచ జూనియర్ చాంపియన్ పిచామోన్ ఒపాట్‌నిపుత్ (థాయ్‌లాండ్)ను ఓడించింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఆకర్షి కశ్యప్ (భారత్) 17–21, 22–20, 13–21తో కరుపాతెవన్ లెట్షానా (మలేసియా) చేతిలో, ఐరా శర్మ (భారత్) 20–22, 21–11, 12–21తో పొలీనా బురోవా (ఉక్రెయిన్) చేతిలో, అన్‌మోల్ (భారత్) 21–23, 10–21తో లినె క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత జలపాతానికి శుక్రవారం పర్యాటకులు తరలివచ్చారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు పాయలుగా జలపాతంలో నీరు ప్రవహిస్తోంది. రెండు బస్సుల్లో బొగత సందర్శనకు వచ్చిన పర్యాటకులు ప్రకృతి రమణీయతని చూసి ముగ్ధులయ్యారు. జలపాతం వద్ద ఫొటోలు తీసుకుని సందడి చేశారు. -వాజేడు



విద్యా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విరమించుకోవాలి

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ధర్నాలో ప్రొఫెసర్ హరగోపాల్

కవాడిగూడ(హైదరాబాద్): ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విద్యా వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కార్పొరేట్, కేంద్రీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హరగోపాల్ హాజరుకాగా, తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.చక్రధర్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ సెక్రటేరియేట్ సభ్యులు కేపీ.రాంచందర్, హన్మేశ్, న్యూడెమోక్రసీ నేత సాధినేని వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ చదువులు ప్రభుత్వరంగం నుంచి ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోనే వెళ్లాక, మానవ విలువలు కనుమరుగయ్యాయని చెప్పారు. దీనికి ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాల్సింది పోయి వారే ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్, పందిరి మహేశ్, ధర్మేంద్ర, రవి, కృష్ణతో పాటు పలువురు రిటైర్డ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

డైరెక్టర్ గారూ.. వాట్ ఈజ్ దిస్?

జిల్లా ఇన్‌చార్జిగా తొలిసారిగా ఆదిలాబాద్ వచ్చిన ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. శుక్రవారం రిమ్స్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాలను పరిశీలించిన మంత్రి.. ఆసుపత్రిలో ఫ్లోరింగ్ పగిలిపోవడం, కిటికీలు బూజు పట్టడం, గోడలకు నాచు ఉండటంపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'డైరెక్టర్ గారూ.. వాట్ ఈజ్ దిస్'?.. అని ప్రశ్నించారు. పారిశుధ్య నిర్వహణలో మార్పు రాకుంటే కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్







Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం । 28-6-2025

బొగ్గుబాయిలో బకాయిల బూడిద

సింగరేణిని వెంటాడుతున్న బకాయిలు

- పేరుకుపోయిన రూ.26 వేల కోట్లు
- గత ప్రభుత్వ హయాంలో రూ.19 వేల కోట్లు
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రూ.7వేల కోట్లు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: దేశంలోని మహారత్న సంస్థలకు దీటుగా ముందుకు సాగుతున్న సింగరేణి బొగ్గు గనుల సంస్థను బకాయిల బెంగ వెంటాడుతోంది. సంస్థ వరుస లాభాలార్జిస్తూ ఆర్థికంగా బలోపేతమవుతోంది. సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. కానీ వినియోగదారుల నుంచి రావల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు సుమారు రూ.26 వేల కోట్ల వరకు నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు నగదు నిల్వలను తమ బ్యాంకుల్లో జమ చేయాలని బ్యాంకర్లు సింగరేణికి క్యూకట్టగా.. బకాయిల నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం తన అవసరాల కోసం ఇప్పుడు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

ఆర్థిక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి తెలంగాణకు గుండెకాయ లాంటిది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరించిన సింగరేణి బొగ్గు గనుల సంస్థ ప్రత్యక్షంగా సుమారు 42వేల మంది శాశ్వత ఉద్యోగులు, దాదాపు 25 వేల మంది ప్రైవేట్ కార్మికులు, పరోక్షంగా మరో లక్షమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. బొగ్గు ఉత్పత్తితో పాటు సౌర, థర్మల్ విద్యుదుత్పత్తిలోనూ అగ్రభాగాన నిలుస్తూ ఏటా లాభాలు సాధిస్తోంది. రాబోయే రోజుల్లో జలవిద్యుదుత్పత్తి చేసేందుకూ సన్నాహాలు చేస్తోంది. క్రిటికల్ మినరల్ అన్వేషణ ద్వారా కొత్త వ్యాపారంలోకి అడుగిడాలని చూస్తోంది. ఈక్రమంలో సంస్థకు ఆర్థిక వనరులు ఇబ్బందిగా మారుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.19 వేల కోట్లు బకాయి పడగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు దాదాపు ఏడాదిన్నరలోనే సుమారు రూ.7వేల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. మొత్తంగా సింగరేణి సంస్థకు సుమారు రూ.26 వేల కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిపాయి.

విస్తరణకు నిధుల కొరత..

ప్రస్తుతం సింగరేణి సంస్థ విస్తరణ తప్పనిసరిగా మారింది. కొన్ని గనుల్లో బొగ్గు నిల్వలు అడుగంటి పోతున్నాయి. మరికొన్ని గనులకు ఆధునిక సాంకేతికత అవసరం ఉంది. సంస్థకు రావలసిన బకాయిలు ఎప్పటికీ వసూలు కాకపోవడంతో సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తే విస్తరణకు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ క్రమంలో త్వరగా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

బకాయిల జాబితాలో విద్యుత్ సంస్థలు

సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసిన బొగ్గును రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు అందజేస్తోంది. అలా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు సరఫరా చేస్తోంది. ఈక్రమంలో సుమారు రూ.12వేల కోట్లు బొగ్గు బకాయిలే ఉన్నట్లు చెబుతున్నారు. రూ.14వేల కోట్ల విద్యుత్ బకాయిలు రావలసి ఉంది. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.వెయ్యి కోట్ల బకాయిలను చెల్లించినట్లు సింగరేణి యాజమాన్యం చెబుతోంది.

వెంటనే చెల్లించాలి


– సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

సింగరేణి సంస్థ భవిష్యత్ కోసం ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలి. బకాయిల ప్రభావం సంస్థ అభివృద్ధిపై పడుతోంది. తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తున్న సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ విషయంలో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ నేతలు చొరవ తీసుకోవాలి.

ఏడాదిన్నరలో రూ.7వేల కోట్లు


– మిర్యాల రాజిరెడ్డి, అధ్యక్షుడు, టీబీజీకేఎస్

గత ప్రభుత్వం పదేళ్లలో రూ.19వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఏడాదిన్నరలోనే రూ.7వేల కోట్లు నిలిపివేసింది. ఈ విషయంలో ప్రభుత్వం బకాయిలు వెంటనే చెల్లించి సంస్థ భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలి. దీనిద్వారా కొత్తగనుల ఏర్పాటు, సంస్థ విస్తరణకు అవకాశం ఉంటుంది.

రూ.వెయ్యి కోట్ల చెల్లింపు


– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల్లో రూ.వెయ్యి కోట్లు ఇటీవలే విడుదలయ్యాయి. మరికొన్ని త్వరలో రానున్నాయి. బకాయిలతో సంబంధం లేకుండా సంస్థ అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వం నుంచి సహకారం అందుతోంది. సంస్థ విస్తరణలో రాజీ లేకుండా ముందుకు సాగుతున్నాం.

రాజ్యాంగంలో ప్రియాంబుల్ అత్యంత కీలకం

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగంలో ప్రియాంబుల్ అత్యంత కీలకమైందని, అందులోని కీలకమైన సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆరోపించారు. భారతదేశ సార్వభౌమత్వానికి, అన్ని కులాలు, మతాలు, వర్గాల ప్రజలకు రాజ్యాంగంలోని ప్రియాంబుల్ రక్షణగా నిలుస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రియాంబుల్‌లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్లమెంటు ఆమోదంతో.. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చేర్చారని, అది దేశంలోని అన్ని కులాలు, మతాల వారికి రక్షణగా ఉందని వెల్లడించారు. దేశంలో అన్ని కులాలు, మతాల కుటుంబాలలో నిరుపేదలు ఉన్నారని, మధ్యతరగతి వర్గాలతో పాటు అపర కుబేరులకు సైతం ప్రియాంబుల్ రక్షణగా ఉందన్న వాస్తవాన్ని ఆర్ఎస్ఎస్ పెద్దలు గ్రహించాలని హితవు పలికారు.

బీజేపీ డ్రామాలు బంద్ చేయాలి

మాజీ ఎంపీ వి.హనుమంతరావు



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఒకప్పటి ఎమర్జెన్సీ విధింపు అంశంపై బీజేపీ ఆడుతున్న డ్రామాలను బంద్ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో ఎమర్జెన్సీ ఎందుకు విధించాల్సి వచ్చిందో ఇందిరాగాంధీ వివరణ ఇచ్చారని స్పష్టం చేశారు. ఆమె దేశ ప్రజలకు సర్దిచెప్పుకున్నారని, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇందిర పక్షాన నిలిచి అఖండ విజయం అందించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వీహెచ్ చెప్పారు.

కొనసాగుతున్న ప్రజా వినియోగ కార్యక్రమం

గాంధీభవన్‌లో దరఖాస్తులు స్వీకరించిన రియాజ్, రాయల

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచన మేరకు గాంధీభవన్‌లో ప్రజా వినియోగ కార్యక్రమం కొనసాగుతోంది. రోజూ ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండి.. ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు ప్రజా వినియోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన వినతిపత్రాలు స్వీకరించి.. వాటి పరిష్కారానికి పలువురు అధికారులతో మాట్లాడారు. కాగా, ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా వస్తున్న దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నామని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. వాటిని శాఖల వారీగా విడగొట్టి పంపుతున్నామని, ఎప్పటికప్పుడు వాటి పురోగతిని కూడా పర్యవేక్షిస్తున్నామని తెలిపాయి. త్వరలోనే ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ప్రజా వినియోగ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటారని స్పష్టం చేశాయి.

యూరియా బస్తాకు రూ.25 వసూలు వద్దు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ



సాక్షి, హైదరాబాద్: యూరియా రవాణా ఖర్చు కింద ప్రతి బస్తాకు రూ.25 రైతుల నుంచి వసూలు చేయా లన్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభు త్వం వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న యూరియాను కూడా సరిగ్గా సరఫరా చేయనప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకున్నట్టని ప్రశ్నించారు. కేంద్రానికి పేరు వస్తుందని ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయడం లేదని, రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తుంటే.. మరో వైపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మార్క్ ఫెడ్ నష్టాల్లో ఉందనడమేమిటని రాణి రుద్రమ ప్రశ్నించారు.



ఇటీవల నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో వేటగాళ్లకు చిక్కిన అలుగు. (ఇన్‌సెట్‌లో) అలుగు పొలుసులు

ఆపదలో అలుగు

అంతరించిపోతున్న అరుదైన జంతువు

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- డబ్బు కోసం హతమార్చుతున్న వేటగాళ్లు
- అడవుల్లో రక్షణ కరువైన అలుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అరుదైన జంతువు అలుగు (పంగోలిన్) ప్రమాదంలో పడింది. సంప్రదాయ వైద్యం, పలు ఉత్పత్తుల్లో వాడకం పేరుతో ఈ వన్యప్రాణిని వేటగాళ్లు హత మార్చుతుండడంతో అంతరించిపోతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ములుగు, ఏటూరు నాగారం, అమ్రాబాద్ టైగర్ రిజర్వుతో సహా పలు అటవీ ప్రాంతాల్లో గుట్టుగా వేటాడుతూ.. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. వైల్డ్ లైఫ్ ట్రస్టు ఆఫ్ ఇండియా (డబ్ల్యూటీఐ) సంస్థ, అటవీ అధికారులు తెలంగాణలో పలుచోట్ల రహస్యంగా మాటు వేసి నిందితులను పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అలుగులనే అత్యధికంగా వేటాడి అక్రమరవాణా చేస్తుండగా.. వీటి సంఖ్య క్రమంగా క్షీణిస్తోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ చర్యల్లో భాగంగా ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) ఈ వన్యప్రాణిని అంతరించిపోతున్న జాతుల్లో చేర్చింది.

వైవిధ్యం గల జీవి


శరీరంపై గట్టి పొలుసులు ఉండే అలుగు.. క్షీరదాల్లో ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంది. ఆకారంలో ముంగిస తరహాలో ఉంటుంది. ఎదురుగా ఏదైనా కనిపిస్తే వెంటనే బంతి ఆకారంలో ముడుచుకుపోతుంది. సిగ్గరిగా, మనుషులకు దూరంగా ఉంటుంది. ఎవరిపైనా ఎటువంటి దాడి చేయదు. కేవలం రాత్రి వేళ సంచరిస్తూ చెదలు, చీమలు, పురుగులను ఆహారంగా తీసుకుంటుంది. వాసన, వినికిడి శక్తి అధికంగా ఉంటుంది.

శాస్త్రీయంగా నిరూపణ లేకున్నా

చైనాతో సహా పలు దేశాల్లో ఈ జీవి శరీర భాగాలను సంప్రదాయ వైద్యంలో అనేక చికిత్సలకు వాడుతున్నారు. దీంతో అక్రమంగా అడవుల నుంచి రవాణా చేస్తూ పొలుసులు, మాంసాన్ని తరలిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా చాలామంది నాటు వైద్యులు.. ఈ జీవి శరీర భాగాలను మందులు, చికిత్సలో ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం అటవీ సమీప ప్రాంతాల వారికి డబ్బు ఆశ చూపిస్తూ.. అలుగును అక్రమ రవాణా చేస్తున్నారు. కొన్నిసార్లు మధ్యవర్తులతో ఇతర దేశాలకు రవాణా జరుగుతోంది. పలు చికిత్సల్లో వాడుతున్నప్పటికీ రోగ నివారణపై శాస్త్రీయంగా ఎటువంటి ఆధారాల్లేవని అటవీ, వైద్యరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మానవ స్వార్థం కోసం అరుదైన అడవి జంతువులను వేటాడొద్దని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు. ఇప్పటికే ఈ వన్యప్రాణుల సంఖ్య తగ్గి పోయిందని.. భవిష్యత్‌లో మరింత ముప్పును ఎదుర్కోబోతున్నాయని హెచ్చరిస్తున్నారు.

ఆగని అక్రమ రవాణా

గత మార్చిలో అలుగును వేటాడుతూ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట రేంజీలో ముగ్గురు పట్టుబడ్డారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో పలు చోట్ల అలుగు అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో ఏటూరునాగారం, మంచిర్యాల, కాగజ్‌నగర్ ప్రాంతాల్లో అలుగును అక్రమంగా తరలిస్తున్న ముఠాలు అటవీ అధికారులకు చిక్కాయి.




నిజాంసాగర్ ప్రాజెక్టు

సాగర్ గర్భం నిండా పూడిక

తగ్గిపోతున్న నిజాంసాగర్ నీటి నిల్వ సామర్థ్యం • హామీలకే పరిమితమైన పూడికతీత

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మంజీర నదిపై నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడికతో నీటి నిల్వ సామర్థ్యం పడిపోయింది. ఏళ్ల తరబడి పూడికతీత గురించి చర్చ నడుస్తోంది తప్ప అడుగులు పడడం లేదు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. 1923–31 సంవత్సరాల మధ్య కాలంలో నిజాం పాలకులు ప్రాజెక్టును నిర్మించారు. తెలంగాణ ప్రాంతంలోనే మొట్ట మొదటి బహుళార్థక ప్రాజెక్టుగా నిజాంసాగర్‌కు పేరుంది. నిజాం కాలంలో నీటి పారుదల శాఖ ముఖ్య ఇంజనీర్‌గా పనిచేసిన నవాబ్ అలీనవాజ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో.. నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. రెండున్నర లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు, బోధన్, నిజామాబాద్, బాన్సువాడ పట్టణాలకు తాగునీరందించేలా ప్రాజెక్టును రూపొందించారు. అప్పట్లో 1,400 అడుగులు, 29.5 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించారు. మంజీర నదిపై ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు.. వరదలతో పాటు మట్టి, ఇసుక కొట్టుకురావడంతో ప్రాజెక్టులో పూడిక చేరింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదలతో పాటు అదే తరహాలో మట్టి కొట్టుకు రావడంతో

దశాబ్ద కాలంలోనే ప్రాజెక్టు గర్భం నిండా పూడిక చేరింది. ఎగువ నుంచి వచ్చి చేరిన పూడిక మట్టితో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోయింది. ప్రాజెక్టు నీటి మట్టాన్ని తెలుసుకునేందుకు.. 1975 సంవత్సరంలో ఇంజనీరింగ్ అధికారులు జరిపిన పరిశీలనలో.. పూడిక మట్టి కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 11.89 టీఎంసీలకు చేరినట్లు నిర్ధారించారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం పడిపోవడంతో భవిష్యత్తులో ఆయకట్టుకు సాగునీరు, జిల్లా ప్రజలకు తాగునీరు అందని పరిస్థితులుంటాయని నిర్ధారించారు. ఎఫ్ఆర్ఎల్ స్థాయిని 4.5 అడుగులకు పెంచడానికి అవకాశమున్నట్లు గుర్తించారు. దాంతో 1978 సంవత్సరంలో ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ స్థాయిని 1,405 అడుగులకు పెంచడంతో.. 17.8 టీఎంసీల సామర్థ్యానికి చేరింది.

పూడిక తీస్తే పూర్వ వైభవం..

నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అప్పట్లో రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందేది. అయితే పూడిక నిండిపోయి.. కేవలం లక్షా 50 వేల ఎకరాలకే నీరు పారుతోంది. ప్రాజెక్టు పూడిక తీస్తే మరో లక్ష ఎకరాలకు సాగునీరందించి పూర్వ వైభవం తీసుకురావచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని అందించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే పనులు పూర్తి కాకపోవడంతో కొండపోచమ్మ సాగర్ ద్వారా నీటిని విడుదల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడిక పెరగడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎగువభాగాన భారీ వర్షాలు కురవని పరిస్థితుల్లో ప్రాజెక్టు ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారుతోంది. పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రెండు పంటలకు ఏ ఇబ్బందులు తలెత్తకుండా చూడవచ్చు.

ఉత్తమ్ హామీతో చిగురించిన ఆశలు...

ఇటీవల నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేయడానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు సింగూరులో పేరుకుపోయిన పూడిక తీస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఎన్నో ఏళ్లుగా మాటలకే పరిమితమైన పూడికతీత అంశంపై.. మంత్రి చేసిన ప్రకటనతో చర్చ మొదలైంది. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించి పూర్వ వైభవం తీసుకురావాలని రైతాంగం వేడుకుంటోంది.

క్లుప్తంగా...

వయో పరిమితి జీవో వచ్చే వరకూ రిటైర్మెంట్ ఆపండి

కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఆశా వర్కర్ల వినతి

సాక్షి, అమరావతి: ఆశా వర్కర్లకు వయో పరిమితి 60 నుండి 62 ఏళ్లకు పెంచుతూ జీవో విడుదల అయ్యే వరకు మార్చి ఒకటో తేదీ నుండి రిటైర్మెంట్ అయిన వారిని తిరిగి విధుల్లో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్‌ను కోరారు. మంగళగిరిలో శుక్రవారం ఆయనను కలిసిన ధనలక్ష్మి, ఆశా వర్కర్లకు వయో పరిమితి 60 నుండి 62 ఏళ్లకు పెంచుతామని సీఎం చంద్రబాబు ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన అసెంబ్లీలో ప్రకటించారని తెలిపారు. వయో పరిమితి పెంపుతో పాటు గ్రాట్యుటీ చెల్లింపు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవు అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై నేటికీ జీవోలు జారీ కాలేదన్నారు. తమ విజ్ఞప్తిని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని, త్వరలో జీవోలు వచ్చేలా కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ధనలక్ష్మి తెలిపారు.

మద్యం అక్రమ కేసులో శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన శ్రీధర్‌రెడ్డి ఏసీబీ కోర్టులో శుక్రవారం రెండోసారి బెయిల్ పిటిషన్ దాఖలుచేశారు. ఆయన తరఫున న్యాయవాది నగేష్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ, తదుపరి విచారణను న్యాయస్థానం 30వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి దాఖలు చేసిన ప్రత్యేక వసతుల పిటిషన్‌పై ఉత్తర్వులను 30న జారీ చేస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. కాగా, మద్యం అక్రమ కేసులో అరెస్టయిన ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ న్యాయమూర్తి భాస్కరరావు కొట్టివేశారు. మరోవైపు ఇదే కేసులో సాక్షిగా ఉన్న కసించాసల శ్రీనివాస్ వాంగ్మూలాన్ని (సీఆర్‌పీసీ 164 సెక్షన్ కింద) నమోదుచేసేందుకు సీఎంఎం కోర్టు అనుమతి ఇచ్చింది.

రాజధాని రైతులకు కౌలు చెల్లించండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల లేఖ

సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు కౌలు చెల్లించడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజధాని రైతులకు కౌలు చెల్లింపు, పలు సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు.

శ్రీనివాస కళార్చన పేరుతో మోసం!

తిరుమల : తిరుమలలోని శ్రీ శ్రీనివాస కళార్చన పేరుతో కొందరు మోసానికి పాల్పడిన వ్యవహారం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్, వరంగల్, నిర్మల్ ప్రాంతాల నుంచి 2,000 మంది భక్తులు తిరుమలకు నృత్యాలు చేసేందుకు వచ్చారు. కళాకారుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో ఈ కార్యక్రమాన్ని టీటీడీ నిలిపి వేసింది. శ్రీనివాస కళార్చన కార్యక్రమం కోసం అభిషేక్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు 1,200 మంది నృత్య ప్రదర్శనకు టీటీడీ అనుమతించింది. కానీ 2,000 మందిని తీసుకొచ్చారు. మిగిలిన 800 మంది నృత్య ప్రదర్శన ఆగిపోవడంతో ఆస్థాన మండపం వద్ద శుక్రవారం కళాకారులు బారులు తీరారు. తమ పిల్లలను నృత్య ప్రదర్శనకు అనుమతించాలని టీటీడీని తల్లిదండ్రులు విన్నవించారు. దీంతో టీటీడీ ప్రదర్శనకు అనుమతించింది.

'మత్స్య' విద్య ఎదురీత

నరసాపురంలోని ఏపీ ఫిషరీ యూనివర్సిటీకి నిర్లక్ష్యపు గ్రహణం

- కూటమి నిర్వాకం వల్ల ఏడాదిగా నిలిచిన వర్సిటీ నిర్మాణం
- రెండేళ్లుగా తాత్కాలిక భవనంలోనే కళాశాల నిర్వహణ
- సెకండ్ బ్యాచ్‌కు గదుల్లేక ఆర్‌బీకేలో తరగతులు
- హాస్టల్ వసతి లేక విద్యార్థుల ఇక్కట్లు

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంలో ఏర్పాటు చేసిన ఫిషరీ యూనివర్సిటీ వసతుల్లేక సతమతమవుతోంది. మత్స్య విద్య ఏటికేడు ఎదురీదుతోంది. దీనికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీని మంజూరు చేశారు. రాష్ట్రంలో ఇది రెండో ఫిషరీ యూనివర్సిటీ. యూనివర్సిటీ క్యాంపస్ కోసం నరసాపురం పక్కనే 40 ఎకరాల స్థలాన్ని గత ప్రభుత్వం కేటాయించింది. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కాలేజీ, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాల కోసం రూ.100 కోట్లు మంజూరు చేసింది.

రెండేళ్లుగా తాత్కాలిక భవనంలోనే

తొలుత ఏడాది కాలానికి నరసాపురంలోని తుపాను షెల్టర్ భవనంలో తాత్కాలికంగా 66 సీట్లతో 2023 జూన్‌లో నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ కోర్సును ప్రారంభించారు. 2024 నాటికి క్యాంపస్‌లో తరగతులు నిర్వహించాలన్న లక్ష్యంతో శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టారు. గత ఏడాది మార్చి నాటికే అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కళాశాల భవనాలు శ్లాబ్ దశకు చేరుకోగా, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాల పునాదులు పూర్తయ్యాయి. దాదాపు రూ.35 కోట్ల విలువైన పనులు గత ప్రభుత్వ హయాంలోనే జరగగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలను అటకెక్కించింది. నిధులివ్వకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా రెండేళ్ల నుంచి తాత్కాలిక భవనంలోనే తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



శ్లాబు దశలో నిలిచిన ఫిషరీస్ యూనివర్సిటీ భవన నిర్మాణాలు

ఆర్‌బీకేనే తర'గతి'..!



రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) నుంచి వస్తున్న వీరంతా రైతులు కాదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం కేంద్రంగా గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏపీ ఫిషరీ యూనివర్సిటీ విద్యార్థులు వీరు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడాది కాలంగా యూనివర్సిటీ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కళాశాల నిర్వహిస్తున్న తాత్కాలిక భవనంలో సెకండ్ బ్యాచ్ విద్యార్థులకు గదుల్లేవు. ఫలితంగా పక్కనే ఉన్న ఆబీకే భవనంలోని చాలీచాలని హాల్లోనే వీరికి తరగతులు నిర్వహించారు.

ఆర్‌బీకే భవనంలో సెకండ్ బ్యాచ్

ప్రస్తుత తాత్కాలిక భవనంలోని 12 గదులు 66 మంది స్టూడెంట్స్ కలిగిన ఒక బ్యాచ్‌కు మాత్రమే తరగతులు, ల్యాబ్ నిర్వహణకు సరిపోతున్నాయి. 2024 జూలై నుంచి మరో 66 మందితో సెకండ్ బ్యాచ్ మొదలు కావడంతో పక్కనే ఉన్న ఆర్‌బీకే భవనంలోని హాల్‌ను తరగతి గదిగా, స్టాఫ్ రూమ్‌ను కంప్యూటర్ ల్యాబ్‌గా వినియోగిస్తుండటం గమనార్హం.

ప్రైవేటు మెస్‌లు, అద్దె గదులే గతి!

క్యాంపస్ హాస్టల్ లేక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రైవేటు మెస్‌లు, అద్దె గదులను ఆశ్రయించాల్సి వస్తోంది. గదులను బట్టి ఒక్కో విద్యార్థికి నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతోంది. విద్యార్థినులు భద్రతాపరంగా ఆందోళన చెందుతున్నారు. కళాశాలకు వచ్చే వెళ్లే దారిలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. కళాశాల వద్ద క్రీడా మైదానం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

సెక్యూరిటీ లేదు



క్యాంపస్ హాస్టల్ సదుపాయం లేక బయట అద్దె గదుల్లో ఉండాల్సి వస్తోంది. భద్రతాపరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆకతాయిల బెడద ఉంటోంది.

– సి.ధరణి, కర్నూలు, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

హాస్టల్ వసతి కల్పించాలి



ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ చదువుకుంటున్నాం. క్యాంపస్ హాస్టల్ ఉంటే అన్ని విధాలా బాగుంటుంది. యూనివర్సిటీ భవనాలు వేగంగా పూర్తిచేయాలి. క్రీడా మైదానం, ల్యాబ్ వసతులు కల్పించాలి.

– దేవీ ప్రసాద్‌దొర, పార్వతీపురం, మొదటి సంవత్సరం విద్యార్థి

కొత్త బ్యాచ్ పరిస్థితి ఏమిటి?

సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ స్టూడెంట్స్ 132 మంది ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరానికి జూలై నుంచి 66 మందితో ఫస్ట్ ఇయర్ సీట్ల భర్తీ జరగనుంది. కొత్త బ్యాచ్‌కు అక్టోబరులో తరగతులు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో వీరికి క్లాసులు ఎక్కడ నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా ప్రైవేట్ విద్యాసంస్థలో తరగతుల నిర్వహణకు యత్నాలు జరుగుతున్నట్టు కళాశాల వర్గాలు చెబుతున్నాయి.

ముంచెత్తే మత్తు.. బతుకే చిత్తు

కూటమి అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ దందా గుంటూరు జిల్లాలో జోరుగా సాగుతోంది. యువత, కళాశాలల విద్యార్థులు, పాఠశాలల్లో చదువుకునే బాలలే లక్ష్యంగా మాదకద్రవ్యాల ముఠాలు చెలరేగిపోతున్నాయి. పాలకులకు రెడ్‌బుక్ పేరిట రాజకీయ కక్షలు సాధించడంతో సరిపోతోంది. దీంతో డ్రగ్స్ దెబ్బకు యువత బంగారు భవిష్యత్తు నాశనమవుతోంది.

కూటమి పాలనలో విచ్చలవిడిగా డ్రగ్స్ విక్రయాలు


- కళాశాలల యువతే లక్ష్యంగా అమ్మకాలు
- శివారు ప్రాంతాలలో జోరుగా సాగుతున్న దందా
- ఏడాదిలోనే 300 కేజీల గంజాయి స్వాధీనం
- కట్టడిలో పూర్తిగా విఫలమైన కూటమి సర్కార్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాలో గంజాయి, కొకైన్, మెత్, ఎండీఎం వంటి మాదకద్రవ్యాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విశాఖపట్నం, పాడేరు, అరకు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయి భారీగా సరఫరా అవుతోంది. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థులు, యువతే లక్ష్యంగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

విద్యార్థులే లక్ష్యంగా...

శివారు ప్రాంతాలలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్కడి నుంచి నగరంలోకి సిగరెట్స్, చాకెట్లు, చూయింగ్ గమ్, పౌడర్ రూపంలో తీసుకొస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని జోరుగా విక్రయాలు జరుపుతున్నారు. కేజీ గంజాయి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా గ్రాము చొప్పున క్రిస్టల్‌ను రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, మెత్‌ను రూ.5 వేలు నుంచి రూ.6 వేలు, ఎండీఎంఏను రూ.3 వేలు నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాకు మాదకద్రవ్యాలు చేరుతున్నాయి.



రాజధాని ప్రాంతంలోనే ఎక్కువ



మంగళగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క ఈ స్టేషన్ పరిధిలోనే గత సంవత్సరం ఆగస్టులో 231.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 234.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 38 మందిని అరెస్ట్ చేశారు. దీంతోపాటు మెత్, ఎండీఎంఏ 23 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మూడు కేసులు నమోదు చేయడంతో పాటు 17 మందిని అరెస్ట్ చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సుమారు వంద కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 20 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో వైపు అధిక ధర పెట్టి మద్యం కొనుగోలు చేయలేక చాలా మంది పేదలు, రోజువారీ కూలీలు తక్కువ ధరకు లభించే శానిటైజర్‌ను మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మత్తులో తేలుతున్నారు. ఆయా షాపుల్లో ఇలాంటివి విక్రయించడంపై నిబంధనలు కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది.

డిసెంబర్ తర్వాతే సాగర్ నిర్వహణపై చర్చ

కృష్ణా బోర్డుకు ఏపీ ప్రభుత్వం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణపై డిసెంబర్ తర్వాతే చర్చిద్దామని కృష్ణా బోర్డుకు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా బోర్డు ప్రత్యేక సమావేశం శుక్రవారం వర్చువల్ విధానంలో జరిగింది. ఢిల్లీ నుంచి కృష్ణా బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ సమావేశానికి హాజరుకాగా..ఆంధ్రప్రదేశ్ నుంచి ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ పాల్గొన్నారు. సాగర్ నిర్వహణను పూర్తిగా తెలంగాణకే అప్పగించాలని, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు రాష్ట్రమే చూస్తుందని, డ్యామ్ నిర్వహణ, రక్షణ నేపథ్యంలో తమకే అప్పగించాలని తెలంగాణ ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హుస్సేన్ కోరారు. ఈ నెలాఖరుదాకే సీఆర్పీఎఫ్ సాగర్ రక్షణ బాధ్యతలు చూడనుందని, ఆ తర్వాత తమకు అప్పగిస్తే తాము బలగాలను మోహరిస్తామని నివేదించారు. దీనిపై కృష్ణా బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ స్పందిస్తూ..ఈ అంశంపై కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇస్తానని చెప్పారు. కాగా ఏపీ ఈఎన్‌సీ కె.నర్సింహామూర్తి స్పందిస్తూ..2025 డిసెంబరు నెలాఖరు దాకా రక్షణ బాధ్యతలు చూడటానికి సీఆర్పీఎఫ్ సుముఖత చూపుతూ సమాచారం ఇచ్చిందని, ఈ నేపథ్యంలో యథాతథా స్థితిని కొనసాగించాలని కోరారు. డిసెంబరు తర్వాత సాగర్ నిర్వహణపై చర్చిద్దామని స్పష్టం చేశారు. ఇక కృష్ణా బోర్డు ఉద్యోగులు ఇన్సెంటివ్ రూపంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేయరాదనే హైకోర్టు తీర్పుకు బోర్డు ఆమోదం తెలిపింది.

సిరుల సీమలో మందుపాతర

- బిక్కుబిక్కుమంటూ ప్రజల జీవనం
- కేజీ బేసిన్‌లో బతుకు దుర్భరం
- నిర్లక్ష్యంగా పైప్‌లైన్లు, ట్రంక్‌లైన్ల నిర్వహణ
- బావుల కనెక్టింగ్ పాయింట్ల వద్ద లీకేజీలు
- నగరం విస్ఫోటానికి 11 ఏళ్లు



2014 నగరంలో గెయిల్ గ్యాస్ ట్రంక్ లైన్ పేలుడు



అడవిపాలెంలో గ్యాస్ లీక్ (ఫైల్)

మలికిపురం: నగరం ఆయిల్ రిఫైనరీ సమీపంలోని నివాస ప్రాంతాల మధ్య 11 ఏళ్ల కిందట సంభవించిన భారీ విస్ఫోటం ఎంతో మంది జీవితాలను కకావికలం చేసింది. నాటి ఘటన నేటికీ వారి కళ్ల ముందు మెదులుతూ, కాళరాత్రిని తలపిస్తూ నిద్ర లేకుండా చేస్తోంది. నాటి దుర్ఘటన ఆయిల్, గ్యాస్ వ్యాపార సంస్థలకు ఏమాత్రం గుణపాఠం నేర్పలేదని తరచూ సంభవిస్తున్న ఘటనలు రుజువు చేస్తున్నాయి. 2024 జూన్ 27 తెల్లవారుజామున సంభవించిన ఈ దుర్ఘటన 20 మందికి పైగా అమాయకుల ప్రాణాలను బలిగొంది. ఇటువంటి ఘటనలు జరుతాయని ముందే గ్రహించిన కొందరు మేధావులు కేజీ బేసిన్‌కు 40 ఏళ్ల క్రితం పెట్టిన పేరు 'మందుపాతర'. భూగర్భంలోని చమురు నిక్షేపాలను బయటకు తీస్తున్నామని సగర్వంగా ప్రకటించే ఆయా చమురు సంస్థలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ ఘటనకు ముందూ వెనుకా కూడా అనేక లీకేజీలు, బ్లో అవుట్ ఘటనలకు కోనసీమ జిల్లా నిలయమవుతోంది.

సమాచారం బదలాయింపు లేదు

నగరం పేలుడు అనంతరం కేజీ బేసిన్‌లో పైప్‌లైన్ల మార్పులు జరిగాయి. కోనసీమలో ఉప్పునీటి ప్రభావం అధికమైంది. ఈ నేపథ్యంలో పైప్‌లైన్లు దెబ్బ తింటున్నాయనే వాదన ఉంది. కేజీ బేసిన్‌లో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్)కు మొత్తం 900 కిలోమీటర్లు మేర గ్యాస్ పైప్‌లైన్లు విస్తరించి ఉన్నాయి. అలాగే కెయిర్న్, రిలయన్స్ సంస్థలకు చెందిన గ్యాస్ పైప్‌లైన్లూ ఉన్నాయి. గెయిల్ పైప్ లైన్లను కోనసీమతో పాటు ఇక్కడి నుంచి కొవ్వూరు, విజ్జేశ్వరం, వేమగిరి, కాకినాడ, విజయవాడ, కొండపల్లి, హైదరాబాద్ వరకూ ఏర్పాటు చేశారు. నగరంలో గెయిల్ పైప్‌లైన్ పేలుడు అనంతరం కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు పలు సర్వే సంస్థలతో పైప్‌లైన్ల నాణ్యతపై పరిశీలన జరిపించారు. అనంతరం 2014లో ఇచ్చిన నివేదిక ఆధారంగా కేజీ బేసిన్‌లో గెయిల్ గ్యాస్ పైప్‌లైన్లన్నీ అప్పటికే సుమారు 25 ఏళ్ల క్రితం వేసినవని, వీటిలో సుమారు 700 కిలోమీటర్ల లైన్లు మార్చాలని ఆయా సంస్థలకు సూచించారు. అప్పట్లో దూర ప్రాంతాలకు గ్యాస్ సరఫరా చేసే ట్రంక్ లైన్ల మార్పు జరిగింది. ఈ పనులు కూడా జరిగి 11 ఏళ్లవుతోంది. ప్రస్తుతం ఈ లైన్ల నాణ్యతపై ఓఎన్‌జీసీ – రెవెన్యూ అధికారుల మధ్య సమాచారం బదలాయింపు లేదు. ప్రమాదం జరిగితే తప్ప వీటిపై దృష్టి పెట్టడం లేదు. పరిశీలన అంతకంటే లేదు.

ఆయిల్ పైప్‌లైన్లు కూడా అంతే..

కోనసీమలోని వివిధ ప్రాంతాల్లోని సుమారు వందకు పైగా గ్యాస్ బావుల నుంచి తాటిపాక రిఫైనరీ వద్దకు నాలుగు అంగుళాల పైప్‌లైన్ల ద్వారా ఆయిల్ కం గ్యాస్ తరలిస్తారు. మరో వంద బావుల నుంచి కేశనపల్లి, అడవిపాలెం, కేశవదాసుపాలెం గ్యాస్ కలెక్షన్ స్టేషన్ల(జీసీఎస్)కు కూడా 4 అంగుళాల పైప్ లైన్లతో గ్యాస్, ఆయిల్ తరలిస్తారు. ఇవి ఓఎన్జీసీ పరిధిలో ఉంటాయి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల నివాసాల మధ్య ఉన్నాయి. ఈ లైన్లు సుమారు 5 వేల కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్నాయి. ఇవి కూడా శిథిలమై తరచూ పేలిపోతున్నాయి. అలాగే, బావుల వద్ద కూడా తరచూ లీకేజీలు వెలుగు చూస్తున్నాయి.

పొగమంచు చూసినా భీతిల్లుతున్న ప్రజలు

పొగమంచును చూసినా గ్యాస్ అని స్థానికులు భయపడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో ఆయిల్ బావుల వద్ద, గ్యాస్‌లైన్లు వెళ్లిన ప్రాంతాల్లోనూ పొగమంచు కనపడినా ప్రజలు భయపడిపోతున్నారు. లీకైన గ్యాస్ పొగమంచు మాదిరి అలముకోవడమే కారణం. ఇది నిప్పు తగిలితే అంటుకుంటుంది. దీంతో, తెల్లవారుజామున పొయ్యి వెలిగిద్దామన్నా కూడా ఆందోళన చెందాల్సిన దుస్థితి అక్కడి ప్రజలది.

నిక్షేపాల వెతికితీత ప్రారంభం నుంచే ప్రమాదాలు

- 1990లో కొమరాడ ఆయిల్ బావి బ్లో అవుట్.
- 1994లో అమలాపురం వద్ద బోడసకుర్రు బ్లో అవుట్ .
- 1995లో కొత్తపేట మండలం దేవరపల్లి బ్లోఅవుట్
- 2011లో రాజోలు మండలం కడలిలో పొన్నమండ నుంచి తాటిపాకకు వెళ్లే గెయిల్ పైప్‌లైన్ పేలుడు.
- 2012లో రాజోలు మండలంలో కాట్రేనిపాడు లంక బావి బ్లో అవుట్ కొద్దిపాటిలో తప్పింది. (రాత్రంతా కష్టపడి అరికట్టారు.)
- 2014లో నగరం గెయిల్ పైప్‌లైన్ విస్ఫోటం.
- 2014లో గొల్లపాలెం – కరవాకలో త్రుటిలో తప్పిన బ్లో అవుట్.
- 2015లో కేశవదాసుపాలెం జీసీఎస్‌లో ఆయిల్ పైప్‌లైన్ పేలుడు.
- 2016లో అడవిపాలెం వద్ద నగరం మాదిరి గ్యాస్ పైప్‌లైన్ పేలినా నిప్పు అంటుకోకపోవడంతో ఒక కాలనీకి త్రుటిలో తప్పిన ముప్పు.
- గ్రామాల్లో ఏటా రెండు నెలలకోసారి తరచూ గ్యాస్ లీకేజీలు.

నాణ్యత లోపం కూడా..

పైప్‌లైన్ల నిర్మాణంలో కూడా నాణ్యత లోపం చాలా ఉంటోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న పైప్‌లైన్ల నిర్మాణంలో బాధ్యతగా వ్యవహరించడం లేదు. ఇష్టానుసారం కాంట్రాక్టులు ఇచ్చి, నాణ్యత లేని పైప్‌లైన్లు వేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఓఎన్జీసీ, గెయిల్ అంటే ఆడిట్ లేని పద్దులు ఉంటాయని, ఇష్టానుసారం దోచుకోవచ్చనే విమర్శ ఉంది. దీనికి తగ్గట్టుగానే ఈ సంస్థల కాంట్రాక్టు పనులూ జరుగుతున్నాయి.

ఫాస్టాగ్ సేవలు మరింత విస్తృతం

- పెట్రోలు, ఈవీ చార్జింగ్, పార్కింగ్ ఫీజులు కూడా...
- హైవే ప్రయాణికులకు మరింత సౌలభ్యం
- ఎన్‌హెచ్‌ఏఐ ప్రణాళిక



సాక్షి, అమరావతి: జాతీయ రహదారులపై వాహన ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా ఫాస్టాగ్ సేవలను విస్తృత పరిచేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇప్పటివరకు టోల్ ఫీజుల చెల్లింపునకే పరిమితమైన ఫాస్టాగ్ ద్వారా మరిన్ని లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతించాలని భావిస్తోంది. ప్రధానంగా పెట్రోల్/డీజిల్ చెల్లింపులు, ఈవీ వాహనాలకు చార్జింగ్, పార్కింగ్ ఫీజులు మొదలైనవి కూడా నిర్వహించేందుకు వెసులుబాటు కల్పించనున్నది. ఈమేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అనుబంధ విభాగం ఇండియన్ హైవేస్ అండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్‌ఎంసీఎల్) పలు బ్యాంకింగ్ సంస్థలతో ఇటీవల సమావేశం నిర్వహించింది.

సమావేశంలో చర్చించిన అంశాలివీ..

టోల్ గేట్ల వద్ద ఫీజు చెల్లింపు కోసం ఆగాల్సిన అవసరం లేకుండా 'మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) గురించి చర్చించారు. ఈ విధానం కోసం టోల్ గేట్ల వద్ద ఆర్ఎఫ్ఐడీ రీడర్, ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. టోల్ గేట్ వద్దకు వాహనం వచ్చేసరికి నంబరు, ఫాస్టాగ్‌లను అత్యంత వేగంగా గుర్తించి, టోల్ ఫీజును ఆటోమేటిగ్గా వసూలు చేస్తుంది. దాంతోపాటు పెట్రోల్/డీజిల్ బిల్లుల చెల్లింపులు, ఈ-వాహనాల చార్జింగ్, పార్కింగ్ ఫీజుల చెల్లింపునకు అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ప్రస్తుతం దేశంలో జాతీయ రహదారులపై 1,728 టోల్ ప్లాజాలు ఉన్నాయి. దాదాపు 40 బ్యాంకింగ్ సంస్థలు ఇప్పటివరకు 11.05 కోట్ల ఫాస్టాగ్‌లు జారీ చేశాయి. వీటి ద్వారా పెట్రోల్/ డీజిల్ బిల్లుల చెల్లింపు, ఈ-వాహనాల చార్జింగ్, పార్కింగ్ ఫీజుల చెల్లింపు కోసం రూపొందించిన విధి విధానాల ముసాయిదాను ఆ బ్యాంకింగ్ సంస్థలకు ఐహెచ్‌ఎంసీఎల్ అందించింది. దీనిపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలను ఇవ్వాలని కోరింది. అనంతరం ఫాస్టాగ్ సేవలను విస్తృతపరిచే ప్రణాళికను దశలవారీగా అమలు చేయాలని ఐహెచ్‌ఎంసీఎల్ భావిస్తోంది.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంకురార్పణతో పూజలు ప్రారంభం అయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. కాగా ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి పుర ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, శ్రీకాళహస్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో కూడా ఉంది యూనివర్సల్ స్టూడియోస్...

అమెరికాలో యూనివర్సల్ స్టూడియోస్ అందరూ చూస్తారు. అయితే సింగపూర్‌లో ఉన్న యూనివర్సల్ స్టూడియో ఇంకా ఇంటెరెస్టింగ్‌గా ఉంటుంది. ఇది సింగపూర్‌లోని సెంటోసా వద్ద ఉన్న థీమ్ పార్క్. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐదు యూనివర్సల్ స్టూడియోస్ థీమ్ పార్కులలో ఇదీ ఒకటి. ఏటా లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడి వచ్చి వెళ్తుంటారు.

2007 ఏప్రిల్ 19న ఈ థీమ్ పార్క్ నిర్మాణం ప్రారంభించి 2011లో పూర్తి చేశారు. మొత్తం 62 ఎకరాల్లో విస్తరించి ఉన్న 'యూనివర్సల్ స్టూడియోస్' ఆసియా ఖండంలో విశిష్టమైనది. మొదటి సంవత్సరంలోనే ఈ పార్క్‌కు సుమారు 30 లక్షలమంది సందర్శించారు. అప్పటి నుండి ఏటా సుమారు 40 లక్షల మంది ఇక్కడికి వస్తూ ఉంటారు. ఈ పార్క్‌లో సందర్శకుల్ని ఆకర్షించేందుకు 17 రకాల జోన్స్ ఏర్పాటు చేశారు. అందులో 'హాలీవుడ్', 'న్యూయార్క్', 'స్కైఫై సిటీ', 'పురాతన ఈజిప్టు', 'జురాసిక్ పార్క్'.. ఇలా రకరకాల జోన్స్ ఉన్నాయి. వాటిలోకి వెళ్తే నిజంగానే అక్కడే ఉన్న అనుభూతి కలుగుతుంది. ఆయా జోన్స్‌లోకి వెళ్లిన వారి కోసం ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అందులో కొన్ని సీజనల్ కాగా, మరికొన్ని రోజూ ఉంటాయి. ఈ కారణంగా ప్రపంచంలో అనేక దేశాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ సినిమా షూటింగ్‌లు కూడా జరుగుతుంటాయి. వాటిని కూడా చాలా ఆసక్తిగా గమనిస్తుంటారు.













● పుస్తకాలు



పిల్లల సాహసం.. ఆద్యంతం ఆసక్తికరం

చీకటి గుహలోకి నడిచిన చిన్నారులకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే. ఎటువంటి పరిస్థితులు వచ్చినా భయపడక, నిబ్బరాన్ని కోల్పోక గుండె ధైర్యంతో నిలబడ్డ చిన్నారుల కథ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రముఖ రచయిత శాఖమూరి శ్రీనివాస్ ఈ పుస్తకాన్ని పిల్లల కోసం ప్రత్యేకంగా రాశారు.




క్లాసిక్‌గా మిగిలిన నవల

1908లో కెనడియన్ రచయిత్రి లూసీ మౌడ్ మోంట్‌గోమెరీ రాసిన నవల ఇది. పిల్లల పుస్తకాల్లో క్లాసిక్ పుస్తకంగా పేరొందిన ఈ నవల ప్రపంచవ్యాప్తంగా అనేకమందికి ఇష్టమైన పుస్తకం. 11 ఏళ్ల అనాథ బాలిక అన్నే షిర్లీని పొరపాటున మాథ్యూ, మరిల్లా కుత్‌బర్ట్‌ల దగ్గరకు వస్తుంది. అక్కడ తను చేసిన పనులేంటి, వారితో ఆమెకు జరిగిన అనుభవాలేమిటనేది మిగిలిన కథ.

● కథ

ద్రాక్షతోట



అనగనగా అవంతి రాజ్యాన్ని శూరసేన మహారాజు పాలించేవాడు. ఆయనకు రాజ్యవిస్తరణ కాంక్ష ఎక్కువ. ఎప్పుడూ ఇతర రాజ్యాలతో యుద్ధం చేస్తూ తన ప్రతాపాన్ని చూపించేవాడు. తన ధనాగారంలో ఎక్కువ భాగాన్ని సైన్యం కోసమే ఖర్చు చేసేవాడు. ఇతర అవసరాలకు డబ్బు చాలకపోవడంతో రాజసేవకులు జనాల మీద రకరకాల పన్నులు వేసేవారు. వారి వద్ద ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేసేవారు.

ఒకసారి శూరసేనుడు మారువేషంలో రాజ్యంలో సంచరిస్తున్నాడు. మిట్టమధ్యాహ్నం పూట ఆయనకు విపరీతమైన దాహం వేసింది. చుట్టుపక్కల ఎక్కడా నీరు కనిపించలేదు. అలాగే దాహంతో గుర్రాన్ని నడిపిస్తూ ఉండగా దూరంగా ఓ ద్రాక్షతోటలో కొందరు పనిచేస్తూ కనిపించారు. వారి వద్ద నీరు ఉండొచ్చన్న ఆలోచనతో అక్కడికి వెళ్లాడు. తాను బాటసారినని, దూరం నుంచి వస్తున్నానని, దాహానికి నీళ్లివ్వమని అడిగాడు. ఆ తోట యజమాని తన కూతుర్ని పిలిచి ద్రాక్షరసం తీసుకు రమ్మన్నాడు. ఆమె ద్రాక్షరసం తెచ్చేలోగా శూరసేనుణ్ని ఆ యజమాని కూర్చోబెట్టి సేదతీర్చాడు. శూరసేనుడు చుట్టూ ఉన్న తోటను గమనించాడు. విరగకాసిన ద్రాక్ష గుత్తులు ఆయన్ని ఆకర్షించాయి. రాజ్యంలో పంటలు బాగా పండుతున్నాయని తృప్తి పడ్డాడు.

కాసేపటికి యజమాని కూతురు గిన్నెలో ద్రాక్షరసం తీసుకొచ్చి ఇచ్చింది. దాహంతో ఉన్న శూరసేనుడు ఆ రసాన్ని తాగుతూ అమృతాన్ని తాగినట్లు అనుభూతి పొందాడు. వెంటనే శూరసేనుడి మనసులో ఓ ఆలోచన మెదిలింది. తన రాజ్యంలోని ద్రాక్షతోటలన్నింటి మీదా కొత్తగా పన్ను వేస్తే ఎలా ఉంటుందని ఆలోచించాడు. ఇది సరైన ఆలోచన అని, ఇక్కడికి రావడం మంచిదైందని అనుకున్నాడు.

కాసేపు అక్కడే కూర్చున్నాక, లేచి వెళ్లే ముందు మరోసారి ద్రాక్షరసం దొరుకుతుందా అని అడిగాడు. సరేనని యజమాని తన కూతురికి చెప్పాడు. ఈసారి ద్రాక్షరసం రావడానికి చాలా సమయం పట్టింది. అంతసేపు వేచి ఉండటంతో శూరసేనుడికి విసుగొచ్చింది. చివరకు ఆమె గిన్నెతో వచ్చింది. అప్పటికే విసుగుచెందిన శూరసేనుడు అసహనంతో ఆ పాత్ర అందుకున్నాడు. అందులో సగం మాత్రమే రసం ఉంది.

ఆ రసాన్ని తాగేసి, వారి వద్ద సెలవు తీసుకొని గుర్రంపై బయలుదేరాడు. మొదటిసారి రసం తెచ్చిన విధానానికీ, రెండోసారి రసం తెచ్చిన విధానానికీ మధ్య తేడా గురించి ఆలోచించాడు. బహుశా తన మనసులోని మాటలు వారు గ్రహించారా? లేదా ఏదో శక్తి తన మనసులోని మాటలు వారికి చేరేలా చేసిందా అని ఆలోచించాడు. ప్రకృతి ప్రసాదించిన మధుర ఫలాలపై పన్ను వేయడం సరికాదని భావించి, ద్రాక్ష తోటలపై పన్ను వేసే ఆలోచన మానేసి కోట దారి పట్టాడు.

నీతి: ప్రకృతి అందించే వనరులపై లాభం ఆశించకూడదు.

టైటానిక్ మళ్ళీవస్తుంది!



1908 –1912 మధ్య తయారయిన టైటానిక్ షిప్, తన తొలి ప్రయాణాన్ని ఏప్రిల్ 14, 1912 న ప్రారంభించింది. అప్పటి వరకు తయారయిన ఓడల్లో టైటానిక్ అనేది అత్యంత పెద్దది, విలాసవంతమైనది. టైటానిక్ తయారు చేసిన హార్లాండ్ – వోల్ఫ్ కంపెనీ దీన్ని ప్రారంభిస్తూ 'ఎప్పటికీ మునిగిపోని నావ' గా అభివర్ణించారు. కానీ తన మొదటి ప్రయాణంలోనే, అట్లాంటిక్ మహాసముద్రంలో మంచు పర్వతాన్ని ఢీకొట్టి టైటానిక్ మునిగిపోయింది. ఈ విషాద సంఘటనలో పదిహేను వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇది మానవ చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ఘటనల్లో ఒకటిగా చరిత్రకారులు చెబుతారు.

అయితే 1997 లో జేమ్స్ కామెరూన్ టైటానిక్ మునకని 'టైటానిక్' సినిమాగా తీయడం చేత ఆ సంఘటన నిజంగా ఇలానే జరిగుంటుంది అని ప్రజలు ఇప్పటికీ బలంగా విశ్వసిస్తారు. అందునా ఒక అందమైన ప్రేమ కథను జోడించి తీయడం చేత టైటానిక్ నావ ఒక 'విషాద ప్రేమ'కి గుర్తుగా కూడా మారిపోయింది. ఎంతో విషాదాన్ని తనలో నింపుకున్న టైటానిక్, తర్వాతి కాలంలో ఎన్నో కథలకు, నవలలకు, చలన చిత్రాలకు కేంద్రంగా మారింది. అలాంటి టైటానిక్ షిప్ మళ్ళీ మన ముందుకు వస్తుంది. అదెలా అనుకుంటున్నారా? ప్లేస్టేషన్ 5 టైటానిక్ ఎస్కేప్ సిమ్యులేటర్ అనే ఫాంటసీ గేమ్ ని 2026 లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో మీరు టైటానిక్ మునిగిపోవడాన్ని అనుభూతి చెందవచ్చు. టైటానిక్ క్యాబిన్స్ గుండా నడవచ్చు. మునిగిపోయే సమయంలో బయటపడే మార్గాల్ని ప్రత్యక్షంగా అన్వేషించవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే మళ్ళీ టైటానిక్ షిప్ మునిగిపోయిన కాలానికి వెళ్ళి, ఆ సమయంలో ఆ షిప్‌లో ఉంటే ఎలాంటి అనుభూతిని, అనుభవాన్ని పొందేవాళ్లమో ఇప్పుడు కూడా అలాగే పొందవచ్చు. కాకపోతే వర్చువల్ గా. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌తో తయారు చేయబడిన ఈ గేమ్, గేమర్స్‌కి ఎటువంటి రూల్స్ లేకుండా వారికి నచ్చినట్లు ఆడి, వాళ్ళంతట వాళ్ళే బయట పడేలా డిజైన్ చేశామని తయారీదారులు ఇప్పటికే ప్రకటించారు. మరి పిల్లలు, టైటానిక్ సినిమా రూపంలో చూసి, పుస్తకాలలో చదివి, ఎంతో కొంత తెలుసుకుని ఉంటారు కదా. మరి ఇప్పుడు మునిగిపోయే ఈ వర్చువల్ టైటానిక్ ఆడి మీరు బయట పడగలరా?

● మహనీయులు

ఫీజు అడగని వైద్యుడు చెలికాని రామారావు



తెలుగునేలపై జన్మించి స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకున్నవారు ఎందరో ఉన్నారు. వారిలో ఒకరు చెలికాని వెంకట రామారావు. మానవత, నిజాయతీ, వినమ్రత, నిబద్ధత వంటి విశిష్ట లక్షణాలతో ఆయన అన్ని తరాలకూ స్ఫూర్తిగా నిలిచారు. రామారావు జులై 15, 1901లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం సమీపంలోని కొందెవరంలో జన్మించారు. తూర్పుగోదావరి జిల్లా మొదటి నుంచీ సంఘ సంస్కరణోద్యమాలు, విప్లవోద్యమాలకు నెలవు. దీంతో చిన్ననాటి నుంచే ఆ వాతావరణంలో పెరిగారు రామారావు. పాఠశాల జీవితంలోనే స్వదేశీ ఉద్యమం వైపు మొగ్గు చూపారు. దేశం పరాయి పాలనలో మగ్గిపోతుంటే తాను చదువుకోవడం ద్రోహమని భావించి చదువుకు స్వస్తి పలికారు. జాతీయ ఉద్యమంలో చేరి 1922లో మొదటిసారి జైలు శిక్ష అనుభవించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు ఆయనను ఎంతగానో ప్రభావితం చేశారు. కందుకూరి దగ్గర పెరిగిన డాక్టర్ కమలమ్మను 1934లో కులాంతర వివాహం చేసుకున్నారు. అనంతరం వైద్యుడిగా ప్రాక్టీసు ప్రారంభించి పేదలకు సేవలందించారు. వారి నుంచి డబ్బులు తీసుకోకుండా, ఖర్చుల కోసం వారికే కొంత డబ్బు ఇచ్చి పంపేవారు. 1952లో కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా కాకినాడ పార్లమెంటు సభ్యునిగా పోటీ చేశారు. అనారోగ్యం కారణంగా ప్రచారంలో పాల్గొనకపోయినా జనం ఆయన్నే గెలిపించి తొలి లోక్‌సభకు పంపించారు. 84 సంవత్సరాలు జీవించిన రామారావు సెప్టెంబరు 25, 1985న మరణించారు.

● మన సినిమా

కె పాప్ డిమాన్ హంటర్స్... భూతాల వేటగాళ్లు



హేయ్ కిడ్స్... మీకు డిమాన్స్ (భూతాలు/రాక్షసాకారాలు) తెలుసు కదా. డిమాన్స్ చాలా బ్యాడ్, మరి భూతాలను ఎవరైనా హంట్ చేస్తారా. అవును హంట్ చేస్తారు అది కూడా ఓ పాప్ సాంగ్స్ బాండ్ టీమ్. వాళ్ళే' కె పాప్ డిమాన్ హంటర్స్'. ఇదే స్టోరీతో ఇప్పుడు నెట్ ఫ్లిక్స్‌లో ఓ సూపర్ వెరైటీ ఫిల్మ్ స్ట్రీమ్ అవుతోంది. ఇదో యానిమేటెడ్ యాక్షన్ మూవీ. స్టోరీ కూడా సూపర్ గా ఉంటుంది. కె పాప్ డిమాన్ హంటర్స్ అనేది రూమి, మీరా, జోయ్‌లతో ఉన్న ముగ్గురి టీమ్, వాళ్ళంతా తమ పాప్ సాంగ్స్‌తో స్టేడియంలను నింపే సూపర్‌స్టార్స్‌గా ఉండటమే కాకుండా సీక్రెట్‌గా డిమాన్ హంటర్స్‌గా పని చేస్తూ తమ ఫాన్స్‌ను డిమాన్‌ల నుండి కాపాడుతుంటారు. అంతేకాదు ఈ ముగ్గురు తమ పాటలతో హోన్‌మూన్ అనే ఓ గార్డ్‌ని క్రియేట్ చేసుకుంటారు. కానీ ముగ్గురిలో ఒకరైన రూమి డిమాన్‌గా మారడం వల్ల సరిగ్గా పాడలేకపోతుంది. కాని అందరూ కలిసి మళ్ళీ ఆ డిమాన్‌ని ఎలా హంట్ చేస్తారన్నదే కె పాప్ డిమాన్ హంటర్స్ మూవీ. సినిమా మొత్తం యాక్షన్ సీన్స్‌తో సూపర్‌గా ఉంటుంది, అలానే మూవీలో వచ్చే విజువల్ ఎఫెక్ట్స్ వెరైటీగా ఉంటాయి.

– హరికృష్ణ ఇంటూరు

● వండర్ వరల్డ్

కుక్కల భాష ఆమెకు తెలుసు



కుక్కల్ని పెంచుకోవడం చాలామందికి ఇష్టం ఉంటుంది. అయితే కొన్ని కుక్కలు చాలా కోపంతో ఉంటాయి. మరికొన్ని యజమానులతో సరిగ్గా కలవలేవు. మరికొన్ని దిగాలుగా ఉంటాయి. వాటి మనసుల్లో ఏముందో గ్రహించి, వాటికి శిక్షణ అందిస్తే అవి మామూలుగా మెలుగుతాయి. మనం నేర్పే ట్రిక్స్ నేర్చుకొని అద్భుతంగా ప్రదర్శిస్తాయి. అలాంటి శిక్షణ ఇచ్చేవారు ప్రత్యేకంగా తర్ఫీదు పొందుతారు. జర్మనీకి చెందిన అలెక్సా లాయెన్‌బర్గర్ ప్రపంచంలో అతని చిన్న వయసుగల శునకాల శిక్షకురాలిగా పేరు పొందింది.

అలెక్సాకు చిన్ననాటి నుంచి కుక్కలంటే చాలా ఇష్టం. వాటితో ఎక్కువ సమయం గడుపుత చిన్న చిన్న ట్రిక్కులు నేర్పించేది. అవి ఏ సమయాల్లో ఎలా ఉంటున్నాయో నిశితంగా గమనించేది. మెల్లగా కుక్కలకు శిక్షణ ఇవ్వడాన్ని ప్రారంభించింది. అప్పటికి తన వయసు ఐదేళ్లు. ఏడాది వయసున్న కుక్కలు తన మాట విని, తను చెప్పినట్లు చేసేవి. అలా వాటిని అదుపులో పెట్టడం, వాటిచేత ఆటలు ఆడించడం, రకరకాల ట్రిక్స్ చేయించడం వంటివి చేయిస్తుంది అలెక్సా. వాటిని పలు పోటీల్లో పాల్గొనేలా చేసి బహుమతులు సైతం అందుకుంది.

2017లో తొమ్మిదేళ్ల వయసులో 'బ్రిటన్స్ గాట్ టాలెంట్: ది ఛాంపియన్స్ అండ్ అమెరికాస్ గాట్ టాలెంట్: ఛాంపియన్స్' కార్యక్రమంలో అలెక్సా పాల్గొంది. తన ప్రతిభకు, కుక్కల్ని తను అర్థం చేసుకుంటున్న పద్ధతికీ అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత తన ప్రతిభతో గిన్నిస్ ప్రతినిధులను ఆకట్టుకొని ఒకటి, రెండు కాదు, ఏకంగా మూడు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది. ప్రస్తుతం తన వద్ద 13 కుక్కలున్నాయి. స్కూల్ నుండి ఇంటికి రాగానే తన పనులు పూర్తి చేసుకొని వాటితోనే ఎక్కువ సమయం గడుపుతానని అంటోంది అలెక్సా. తను పెద్దయ్యాక కుక్కలకు శిక్షణ ఇచ్చే ఓ పాఠశాలను తెరవాలనుకుంటున్నానని చెప్తోంది.



బిజినెస్ రీల్

విదేశీ వర్సిటీతో అపోలో మెడ్‌స్కిల్స్ జట్టు


ఉజ్బెకిస్తాన్ జార్మెడ్ యూనివర్సిటీలో రూ. 32 లక్షలకి వైద్య విద్య



హైదరాబాద్, బిజినెస్‌బ్యూరో: తక్కువ ఫీజుతో విదేశాల్లో వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చే దిశగా ఉజ్బెకిస్తాన్‌కి చెందిన జార్‌మెండ్ యూనివర్సిటీతో అపోలో మెడ్‌స్కిల్స్ చేతులు కలిపింది. దీనితో ట్యూషన్ ఫీజు, హాస్టల్, ఆహారం మొదలైనవన్నీ కలిపి రూ. 32 లక్షలకి ఆరేళ్ల ఎంబీబీఎస్ కోర్సును చదివే వీలుంటుందని అపోలో మెడ్‌స్కిల్స్ సీఈవో శ్రీనివాస రావు పులిజాల శుక్రవారమిక్కడ విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈ భాగస్వామ్య ఒప్పందం కింద మన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణమైన పాఠ్యాంశాలను, ఇంగ్లీషులో బోధించేలా భారతీయ అధ్యాపకులను అపోలో మెడ్‌స్కిల్స్ సమకూరుస్తుంది. అలాగే అక్కడ విద్యాభ్యాసం తర్వాత, భారత్‌లో లేదా అమెరికా, బ్రిటన్‌లో లైసెన్సింగ్ పరీక్షల కోసం కూడా శిక్షణ కల్పిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. డాక్టర్ చదువు కోసం ఏటా లక్ష మంది వరకు విద్యార్థులు విదేశాల బాట పడుతున్న నేపథ్యంలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

స్క్రూటినీలో సహేతుక ప్రశ్నలు వేయండి

ఐటీ అధికారులకు సీబీడీటీ సూచన



న్యూఢిల్లీ: ఆదాయ పన్ను రిటర్నుల స్క్రూటినీ విషయంలో సహేతుకమైన, నిర్దుష్టమైన ప్రశ్నలు వేయాలని, అసంబద్ధమైన ప్రశ్నలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఆదాయ పన్ను శాఖ అధికారులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) సూచించింది. ఈ విషయాల్లో అసెసింగ్ అధికారులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని ప్రాంతీయ హెడ్స్‌కి (ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్స్ – పీసీసీఐటీ) పంపిన లేఖలో సీబీడీటీ ఛైర్మన్ రవి అగ్రవాల్ పేర్కొన్నారు. నోటీసులు, అసెస్‌మెంట్ ఆర్డర్లు సక్రమంగా ఉండేలా చూసే బాధ్యత ప్రత్యక్షంగా అసెస్‌మెంట్ యూనిట్ హెడ్స్ (అడిషనల్ లేదా జాయింట్ కమిషనర్లు) మీదే ఉంటుందని ఆయన తెలిపారు. పీసీసీఐటీలు మధ్యమధ్యలో అసెసింగ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ ఉండాలని, సూచనలను పునరుద్ఘాటిస్తూ ఉండాలని, నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేసేందుకు ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని సీబీడీటీ పేర్కొంది. స్క్రూటినీ, అసెస్‌మెంట్ ఆర్డర్ల నాణ్యతకు సంబంధించి నెలవారీ అప్‌డేట్ ఇవ్వాలని సూచించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-6-2025	
విశాఖ	575-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	324.6	3.87
ASIANPAINT	2,362.00	3.15
APOLLOHOSP	7,310.00	2.94
INDUSINDBK	860.3	2.89
ULTRACEMCO	12,240.00	2.42

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,121.00	-2.13
DRREDDY	1,302.50	-1.44
WIPRO	265.4	-1.16
SBILIFE	1,843.00	-0.96
AXISBANK	1,223.00	-0.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,248
ఎన్ఎస్ఈ	1,53,035
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,660
ఎఫ్ఐఐ	+ 1,357
డీఐఐ	- 588

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.53	$ 65.24
బ్రెంట్	66.85	$ 66.69

2 మెర్సిడెస్ బెంజ్ జీటీ సిరీస్‌లో స్పోర్ట్స్ కార్లు



ధర రూ. 3 కోట్ల నుంచి ప్రారంభం

ముంబై: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఇండియా కొత్తగా జీటీ సిరీస్‌లో రెండు స్పోర్ట్స్ కార్లను ఆవిష్కరించింది. వీటిలో ఏఎంటీ జీటీ 63 ఫోర్‌మ్యాటిక్‌ప్లస్, జీటీ 63 ప్రో ఫోర్‌మ్యాటిక్‌ప్లస్ కూపే ఉన్నాయి. వీటి ధర వరుసగా రూ. 3 కోట్లు, రూ. 3.65 కోట్లుగా (దేశవ్యాప్తంగా ఎక్స్‌షోరూం) ఉంటుందని సంస్థ తెలిపింది. మరోవైపు, భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల తయారీని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఎస్‌పీఎంఈపీసీఐ పథకం కొత్త విదేశీ సంస్థలకు ఆకర్షణీయంగా ఉంటుందని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. భారత్‌లో తాము గత ముప్పై ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే పుణె ప్లాంటుపై రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేశామని వివరించారు. స్కీమును ప్రకటించడానికి ముందు నుంచే రెండు కార్ల మోడల్స్‌ను దేశీయంగా ఈ ప్లాంటులోనే తయారు చేస్తున్నామని పేర్కొన్నారు.

పోస్టాఫీసుల్లోనూ డిజిటల్ చెల్లింపులు

ఆగస్టు నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో ఆగస్టు నుంచి డిజిటల్ చెల్లింపులను స్వీకరించే విధానం అందుబాటులోకి రానుంది. డైనమిక్ క్యూఆర్ కోడ్‌తో లావాదేవీలను నిర్వహించేందుకు ఉపయోగపడే ఐటీ మౌలిక సదుపాయాల కల్పన ఆగస్టు నాటికి అన్ని పోస్టాఫీసుల్లో పూర్తవుతుందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఐటీ 2.0 కింద కొత్త సిస్టం పైలట్ ప్రాజెక్టు ఇప్పటికే కర్ణాటక సర్కిల్‌లో ప్రారంభమైందని పేర్కొన్నాయి. మైసూర్ హెడ్ ఆఫీస్, బాగల్‌కోట్ హెడ్ ఆఫీసు మొదలైన ప్రాంతాల్లో క్యూఆర్ ఆధారిత బుకింగ్ సేవలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించాయి.



యూపీఐ వ్యవస్థతో పోస్టాఫీసుల ఖాతాలు అనుసంధానం కాకపోవడం వల్ల ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులను స్వీకరించే వెసులుబాటు ఉండటం లేదు. గతంలో సేల్ కౌంటర్స్‌లో స్టాటిక్ క్యూఆర్ కోడ్‌ను పోస్టల్ శాఖ ప్రవేశపెట్టినప్పటికీ, పదే పదే సాంకేతిక సమస్యలు తలెత్తడం, ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ విధానాన్ని నిలిపివేసారు.

క్యూ4లో కరెంట్ ఖాతా మిగులు

13.5 బిలియన్ డాలర్లు

- 2024–25లో 23 బిలియన్ డాలర్ల లోటు
- ఆర్‌బీఐ డేటా విడుదల



ముంబై: గత ఆర్థిక సంవత్సరం (2024–25) చివరి త్రైమాసికంలో (2025 జనవరి–మార్చి/క్యూ4) కరెంటు ఖాతా 13.5 బిలియన్ డాలర్ల (రూ.1.15 లక్షల కోట్లు) మిగులులోకి వచ్చినట్లు ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా స్పష్టం చేస్తోంది. ఇది జీడీపీలో 1.3 శాతానికి సమానం. 2023–24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కరెంటు ఖాతా 4.6 బిలియన్ డాలర్ల మిగులుగా ఉండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద చూస్తే కరెంటు ఖాతా లోటు 23.3 మిలియన్ డాలర్లుగా (జీడీపీలో 0.6 శాతం) ఉంది. 2023–24లో కరెంటు ఖాతా లోటు 26 బిలియన్ డాలర్లు (జీడీపీలో 0.7 శాతం) కావడం గమనించొచ్చు. వస్తువులకు సంబంధించి వాణిజ్య లోటు గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో 59.5 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 52 బిలియన్ డాలర్లుగానే ఉంది. సేవలకు సంబంధించి నికర మిగులు 53.3 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఇది 42.7 బిలియన్ డాలర్ల మేర ఉంది.

బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ

క్యూ4లో బిలియన్ డాలర్ల (రూ.8,400 కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఎఫ్‌డీఐ 10.2 బిలియన్ డాలర్లతో పోల్చిచూస్తే గణనీయంగా తగ్గాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు క్యూ4లో నికరంగా 5.9 బిలియన్ డాలర్ల మేర బయటకు వెళ్లిపోయాయి. విదేశీ మారకం నిల్వలు క్యూ4లో 8.8 బిలియన్ డాలర్ల మేర నికరంగా పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఈ పెరుగుదల 30.8 బిలియన్ డాలర్లుగా ఉంది.

విదేశీ రుణం 736 బిలియన్ డాలర్లు

ప్రభుత్వ విదేశీ రుణ భారం గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 10 శాతం పెరిగి 736.3 బిలియన్ డాలర్లకు చేరింది. 2024 మార్చి నాటికి ఇది 668.8 బిలియన్ డాలర్లుగా ఉంది. జీడీపీలో విదేశీ రుణ భారం 18.5 శాతం నుంచి 19.1 శాతానికి పెరిగింది.

నెట్‌ఫ్లిక్స్‌కి చేరువలో జియో హాట్‌స్టార్

30 కోట్లకు సబ్‌స్క్రయిబర్స్

ముంబై: అంతర్జాతీయ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌కి జియోహాట్‌స్టార్ అత్యంత చేరువలో ఉంది. డిసెంబర్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం నెట్‌ఫ్లిక్స్‌కి 19 దేశాల్లో 30.16 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉండగా ప్రస్తుతం జియోహాట్‌స్టార్ మొత్తం యూజర్ల సంఖ్య 30 కోట్లకు చేరింది. ఫిబ్రవరిలో 5 కోట్లుగా ఉన్న సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య భారీగా పెరగడానికి ఇటీవల ముగిసిన టాటా ఐపీఎల్ క్రికెట్ లీగ్ కారణంగా నిల్చింది. డిస్నీప్లస్‌హాట్‌స్టార్, రిలయన్స్‌కి చెందిన జియోసినిమా విలీనంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటైన జియోస్టార్ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఐపీఎల్ తాజా ఎడిషన్‌కి డిజిటల్ వ్యూయర్‌షిప్ 65.2 కోట్ల స్థాయిని దాటగా, టీవీలో వ్యూయర్‌షిప్ 53.7 కోట్లకు చేరింది.

జియో, ఎయిర్‌టెల్ జోరు

మే నెలలో 43 లక్షల కొత్త యూజర్లు

న్యూఢిల్లీ: దేశీయంగా మే నెలలో టెలికం యూజర్ల సంఖ్య స్వల్పంగా 43,58,231 మేర పెరిగి 120.7 కోట్లకు చేరింది. కొత్త యూజర్లలో సింహభాగం 99.84 శాతం వాటాను (43,51,294 కనెక్షన్లు) రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ దక్కించుకున్నాయి. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ విభాగంలో రిలయన్స్ జియో యూజర్ల సంఖ్య నికరంగా 27 లక్షల కొత్త కస్టమర్లతో 47.24 కోట్లకు చేరింది. 40.92 శాతం మార్కెట్ వాటా ఉంది. అటు భారతి ఎయిర్‌టెల్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య నికరంగా 2.75 లక్షలు పెరిగి 39 కోట్లకు చేరగా, 33.61 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుంది. అయితే సంక్షోభంలో ఉన్న వొడాఫోన్ ఐడియా 2.74 లక్షల మంది, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 1.35 లక్షలు, ఎంటీఎన్ఎల్ 4.7 లక్,ల మంది కస్టమర్లను కోల్పోయాయి. వైర్‌లైన్ సెగ్మెంట్‌లో జియో కొత్త యూజర్ల సంఖ్య 12.76 లక్షలు, ఎయిర్‌టెల్ యూజర్లు 99,000, టాటా టెలీసర్వీసెస్ సబ్‌స్క్రయిబర్స్ 4,890, వొడాఫోన్ ఐడియా యూజర్ల సంఖ్య 1,795 పెరిగింది. ప్రభుత్వ రంగ ఎంటీఎన్ఎల్ అత్యధికంగా 66,834 మంది, బీఎస్ఎన్ఎల్ 46,000 మంది కస్టమర్లను కోల్పోయాయి. దేశీయంగా మొత్తం ల్యాండ్‌లైన్ కనెక్షన్లు 3.34 శాతం పెరిగి 3.86 కోట్లకు, మొబైల్ కనెక్షన్లు 116.84 కోట్లకు చేరాయి. ఏప్రిల్‌లో మొత్తం యూజర్ల సంఖ్య 120.3 కోట్లు.

నైపుణ్య శిక్షణపై పెట్టుబడులు అవసరం

- తద్వారా ఉపాధి కల్పన ఇతోధికం
- ప్రభుత్వ మూలధన వ్యయాలు పెరగాలి
- ఎన్‌సీఏఈఆర్ సూచన



న్యూఢిల్లీ: కార్మికుల అవసరం ఎక్కువగా ఉండే రంగాల్లో ఉపాధిని పెంచేందుకు నైపుణ్య కల్పనపై పెట్టుబడులు పెట్టాలని ఆర్థిక మేథో సంస్థ ఎన్‌సీఏఈఆర్ సూచించింది. దీనివల్ల వచ్చే ఐదేళ్లలో, 2030 నాటికి 13 శాతం మేర ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించింది. వివిధ రంగాల మధ్య అంతర్గత అనుసంధానత కల్పించడం ఉపాధి కల్పనపై ఎన్నో అంచల సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొంది. దీనివల్ల 200 శాతం మేర ఉపాధి అవకాశాలను పెంచొచ్చని సూచించింది. తయారీ రంగంలో కార్మికులపై ఆధారపడిన ఉత్పత్తి 44.1 శాతంగా ఉంటుందని.. సేవల్లో కార్మికుల ఆధారితమైనవి 54.2 శాతంగా ఉంటాయని వివరించింది. తయారీ, సేవల పరిమాణాన్ని పెంచడం ద్వారా ఈ రంగాల్లో కార్మికులకు మరింత ఉపాధి కల్పించొచ్చని సూచించింది. 2030 నాటికి భారత్‌లో 63%ఉద్యోగులకు నైపుణ్యాల పెంపు అవసరం ఉంటుందని అంచనా.

పన్నులు తగ్గించాలి..

కార్మికులకు ఉపాధి అవకాశాలను మరింత పెంచేందుకు ప్రభుత్వం అధిక మూలధన వ్యయాలు చేయాలని, పన్నులు తగ్గించాలని ఎన్‌సీఏఈఆర్ నివేదిక సూచించింది. అంతర్జాతీయంగా అమల్లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలను అందిపుచ్చుకోవాలంటూ.. కార్మికులకు శిక్షణ, నైపుణ్య కల్పనపై జాతీయ ప్రమాణాల కార్యాచరణను అమలు చేయాలని పేర్కొంది. భారత్‌లో తయారీని పెంచేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎల్ఐ పథకాన్ని ప్రస్తావించింది. అధిక విలువ కలిగిన ఉత్పత్తుల తయారీని పెంచడంపై ఈ పథకం ప్రధానంగా దృష్టి పెట్టిందంటూ.. ఇందుకు అధిక నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. పీఎల్ఐ పథకం కింద ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్‌లో అధిక ఉపాధి అవకాశాల కల్పన జరిగినట్టు చెప్పింది. బడ్జెట్‌లో పీఎల్ఐకి చేసిన కేటాయింపులు, వాస్తవ ఉపాధి కల్పన సామర్థ్యం మధ్య అంతరం ఉన్నట్టు పేర్కొంది. కార్మికుల నైపుణ్యం పెంపునకు వీలుగా ఉత్పాదకత, నాణ్యత గణనీయంగా పెంచాల్సి ఉంటుందని తెలిపింది. సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ విజ్ఞానం, ఐసీటీ నైపుణ్యాలను శిక్షణ కార్యక్రమాల్లో భాగం చేయాలని ఈ నివేదిక సూచించింది. శిక్షణ నాణ్యత పెంచడం, సంఘటిత రంగంలో కార్మికుల సంఖ్యను ఇతోధికం చేయడం ద్వారా అధిక ఉపాధి కల్పన లక్ష్యాలను సాధించొచ్చని అభిప్రాయపడింది.

రుణ వృద్ధిపై మరింత దృష్టి పెట్టండి

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



న్యూఢిల్లీ: కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ అర శాతం తగ్గించడాన్ని అవకాశంగా అందిపుచ్చుకుని, ఉత్పాదక రంగాలకు మరిన్ని రుణాలు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు (పీఎస్‌బీ) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పీఎస్‌బీల రుణ వృద్ధి మెరుగుపడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం స్థాయిలో లేదా అంతకు మించిన స్థాయిలో రుణ వృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి సూచించినట్లు వారు వివరించారు. పీఎస్‌బీల ఆర్థిక పనితీరును సమీక్షించేందుకు ఆయా బ్యాంకుల చీఫ్‌లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. ఆర్థిక సమ్మిళితత్వం సాధించేందుకు ప్రభుత్వ పథకాల్లో మరింత మంది కస్టమర్లను చేర్చేందుకు కృషి చేయాలని మంత్రి చెప్పారు. అలాగే తక్కువ వ్యయాలతో కూడుకున్న డిపాజిట్లను సమీకరించే మార్గాలు అన్వేషించాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం ముద్రా, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన తదితర పథకాల పురోగతిని ఈ సమావేశంలో సమీక్షించారు. 2025 ఆర్థిక సంవత్సరంలో 12 పీఎస్‌బీల మొత్తం లాభం 26 శాతం వృద్ధి చెంది రూ. 1.78 లక్షల కోట్లకు చేరింది.

ఎన్నారై కస్టమర్లకు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఆఫర్లు

న్యూఢిల్లీ: ప్రవాస భారతీయ (ఎన్నారై) కస్టమర్ల కోసం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ట్రావెల్ ప్లాట్‌ఫాం మేక్‌మైట్రిప్‌తో కలిసి రూ.2,000 విలువ చేసే భారత్‌లో కాంప్లిమెంటరీ క్యాబ్ బుకింగ్ సర్వీసులను అందిస్తున్నట్లు బ్యాంక్ ఈడీ ఉత్తమ్ టిబ్రెవాల్ తెలిపారు. ప్రీమియం ఖాతాలైన ఎటర్నిటీ, ఐవీ, రాయల్ కస్టమర్లకు ఇది వర్తిస్తుంది. మరోవైపు, సేవింగ్స్ అకౌంట్లపై 6.75% వరకు వడ్డీ రేట్లు, జీరో క్రాస్-కరెన్సీ చార్జీలు, ప్రత్యేకంగా రిలేషన్‌షిప్ మేనేజర్లు వంటి ప్రయోజనాలను కూడా కల్పిస్తున్నట్లు ఉత్తమ్ వివరించారు.

గ్రామీణ విద్యార్థుల కోసం డిజిటల్ యూనివర్సిటీ

సీఎస్‌సీ అకాడమీతో ఫిజిక్స్‌వాలా భాగస్వామ్యం



న్యూఢిల్లీ: గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని వారికి కూడా నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చే ఉద్దేశంతో సీఎస్‌సీ అకాడమీతో (సీఎస్‌సీఏ)తో ఎడ్యుకేషన్ కంపెనీ ఫిజిక్స్‌వాలా చేతులు కలిపింది. ఈ ఒప్పందం కింద డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది అక్రెడిటెడ్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రాంలు, సర్టిఫికేషన్లు అందిస్తుంది. బోధన కోసం కేంద్ర ఐటీ శాఖలో భాగమైన కామన్ సర్వీసెస్ సెంటర్లు (సీఎస్‌సీ) డిజిటల్ లెర్నింగ్ సెంటర్లుగా పని చేస్తాయి. అలాగే, ఫిజిక్స్‌వాలా సంస్థ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో కూడా అందిస్తుంది. సైబర్‌సెక్యూరిటీ, కృత్రిమ మేథ వంటి అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ నివ్వడం, సమిష్టిగా కోర్సులు .. సర్టిఫికెట్ ప్రోగ్రాంలను రూపొందించడం మొదలైనవి ఈ భాగస్వామ్య లక్ష్యంగా ఉంటాయి.

హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్‌లో జోరు

- జూన్ క్వార్టర్‌లో 32 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజింగ్
- 23 శాతం వృద్ధి నమోదు
- ఏడు నగరాల్లో 11% పెరుగుదల
- కొలియర్స్ ఇండియా నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు ఆఫీస్ స్పేస్ లీజింగ్ 23 శాతం అధికంగా 32 లక్షల చదరపు అడుగులుగా (ఎస్ఎఫ్‌టీ) నమోదైంది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో లీజింగ్ పరిమాణం 26 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది. దేశవ్యాప్తంగా ఏడు నగరాల్లోనూ స్థూల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 11 శాతం పెరిగి 178 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్లు కొలియర్స్ ఇండియా ఒక నివేదిక రూపంలో వెల్లడించింది. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ కార్పొరేట్ల నుంచి లీజింగ్‌కు మంచి డిమాండ్ కనిపించినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఏడు నగరాల్లో స్థూల ఆఫీసు లీజింగ్ 161 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది. హైదరాబాద్‌సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, పుణెలో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరగ్గా.. ఒక్క ముంబైలో మాత్రం తగ్గింది. ఈ గణాంకాల్లో లీజు పునరుద్ధరణలు, ముందస్తు హామీలు, ఆసక్తి వ్యక్తీకరణలకు సంబంధించి డేటా లేదని కొలియర్స్ స్పష్టం చేసింది.

నగరాల వారీ లీజింగ్..

- బెంగళూరులో 48 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలోనూ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 48 లక్షల ఎస్ఎఫ్‌టీగానే ఉండడం గమనించొచ్చు.
- చెన్నైలో క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 30 శాతం అధికంగా 26 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైంది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో ఆఫీస్ వసతుల లీజింగ్ 16 శాతం వృద్ధితో 22 లక్షల ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- కోల్‌కతాలో లీజింగ్ 3 లక్షల నుంచి 6 లక్షల చదరపు అడుగులకు దూసుకెళ్లింది.
- పుణె నగరంలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 60 శాతం పెరిగి రూ.16 లక్షల చదరపు అడుగులకు చేరింది.
- ముంబైలో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజింగ్ 28 లక్షల ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 35 లక్షల చదరపు అడులతో పోల్చి చూసినప్పుడు 20 శాతం తగ్గింది.
- ఈ ఏడు పట్టణాల్లో కలిపి 175 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌కు గాను 135 లక్షల ఎస్ఎఫ్‌టీని కార్పొరేట్లు తీసుకున్నారు. 43 లక్షల ఎస్ఎఫ్‌టీని కోవర్కింగ్ ఆపరేటర్లు తీసుకోవడం గమనార్హం.

ఈ ఏడాది ప్రోత్సాహకరమే

''భారత ఆఫీస్ మార్కెట్ 2025లోనూ వృద్ధి దశలో ఉంది. గత రెండు సంవత్సరాలుగా నమోదవుతున్న సానుకూల ధోరణికి అనుగుణంగానే ఉంది. స్థిరమైన సరఫరా, లీజుదారుల పరంగా వైవిధ్యం మద్దతుతో 2025 సంవత్సరం వాణిజ్య రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ప్రోత్సాహకరంగా ఉండనుంది. మొత్తంమీద ఆఫీస్ స్పేస్ డిమాండ్ ఈ ఏడాది చివరికి 65–70 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకోవచ్చు'' అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మల్హోత్రా తెలిపారు.



ఓవర్లు కాదు... ఇకపై బంతుల లెక్క!

టి20 పవర్‌ప్లేపై ఐసీసీ కొత్త నిబంధన

దుబాయ్: వర్షం కారణంగా టి20 మ్యాచ్‌ను కుదించాల్సి వచ్చినప్పుడు ఎన్ని ఓవర్లు పవర్‌ప్లే ఉండాలనే విషయంపై ప్రతీసారి గందరగోళం ఎదురవుతోంది. ఒక టి20 ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లే 6 ఓవర్లు కాగా... ఇన్నింగ్స్‌లో ఓవర్ల సంఖ్య తగ్గగానే దాని ప్రకారం లెక్కగట్టి పవర్‌ప్లే ఓవర్ల సంఖ్యను నిర్ణయించేవారు. అయితే ఒక్కో బంతి ఎంతో కీలకంగా మారి మ్యాచ్ ఫలితాన్నే మార్చేసే టి20ల్లో ఇది సరైంది కాదని చర్చ జరిగింది. దాంతో టి20 పవర్‌ప్లే విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మార్పు చేసింది. ఇది జూలై నుంచి అమల్లోకి వస్తుంది. దీని ప్రకారం ఇకపై కచ్చితత్వం కోసం ఓవర్లు కాకుండా బంతులను పవర్‌ప్లే కోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు 5 ఓవర్ల మ్యాచ్ అయితే 1.3 ఓవర్ల పవర్‌ప్లేనే ఉండాలి. కానీ దానిని దగ్గరి ఓవర్‌కు సవరించి ఇప్పటి వరకు పవర్‌ప్లే 2 ఓవర్లుగా ఇస్తున్నారు. కానీ ఇకపై ఇది మారనుంది. మున్ముందు 5 ఓవర్లో మ్యాచ్ అయితే సరిగ్గా 1.3 ఓవర్లే పవర్‌ప్లే ఉంటుంది. ఇదే తరహాలో 6 ఓవర్లు (1.5), 7 ఓవర్లు (2.1), 9 ఓవర్లు (2.4)...ఇలా 19 ఓవర్ల (5.4) వరకు ఎన్ని బంతులు అనే విషయంపై ఐసీసీ పూర్తి స్పష్టతనిచ్చింది. ఓవర్ మధ్యలో పవర్‌ప్లే ముగియడం వల్ల ఎవరికీ సమస్య ఎదురు కాదని ఐసీసీ అభిప్రాయపడింది. పవర్‌ప్లే ముగియగానే అంపైర్లు సిగ్నల్ ఇస్తారని...దాని ప్రకారం ఫీల్డర్లను పెట్టుకోవచ్చని పేర్కొంది.

వైడ్ నిబంధనలోనూ మార్పు...

వన్డేలు, టి20ల్లో 'వైడ్' నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. లెగ్‌సైడ్ బంతి వెళితే చాలు దానిని అంపైర్లు 'వైడ్'గా ప్రకటిస్తున్నారు. షాట్ ఆడే క్రమంలో బ్యాటర్ పక్కకు జరిగినా దానిని పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే ఇకపై బౌలర్లకు కాస్త సడలింపు ఉండేలా కొత్త నిబంధనను తీసుకొచ్చారు. దీని ప్రకారం 'బంతిని విడుదల చేసే సమయంలో బ్యాటర్ కాలు ఎక్కడ ఉందని విషయాన్ని కూడా వైడ్‌ను ప్రకటించే విషయంలో పరిగణనలోకి తీసుకుంటాం. బంతి బౌలర్ చేతిని వీడాక షాట్ ఆడేందుకు బ్యాటర్ ఆఫ్‌సైడ్‌కు జరిగినా సరే దీనిని అంపైర్లు దీనిని దృష్టిలో పెట్టుకుంటారు' అని ఐసీసీ వెల్లడించింది. ఇది బౌలర్లకు కాస్త ఊరటనిస్తుందని, అందుకే దీని కోసం సిఫారసు చేసినట్లు ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడు, మాజీ పేసర్ షాన్ పొలాక్ చెప్పారు.





కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ పేరు చెప్పాలి...

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కూడా కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ విషయంలో ఐసీసీ కొత్త మార్పు తెచ్చింది. ఇకపై ప్రతీ మాయచ్‌కు ముందు 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్' పేరును కూడా జట్లు వెల్లడించాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు తమకు అవసరమైన ఆటగాడిని పంపకుండా ఈ నిబంధనతో అడ్డుకోవచ్చు. కన్‌కషన్‌తో బయటకు వెళ్లిన ఆటగాడు కనీసం వారం రోజుల విరామం తర్వాతే మళ్లీ మైదానంలోకి దిగాలి. ఆటగాళ్లకు తగిన విశ్రాంతి, వారి సౌకర్యం కోసం అని ఐసీసీ పేర్కొంది. అయితే కన్‌కషన్ పేరుతో ఒక మ్యాచ్ నుంచి హఠాత్తుగా తప్పుకొని వెంటనే తర్వాతి మ్యాచ్ కోసం సిద్ధమయ్యే ఆటగాళ్లను నిలువరించడం కూడా కొత్త నిబంధనకు ఒక కారణం. మరోవైపు మ్యాచ్ మొదలైన తర్వాత ఏ ఆటగాడికైనా తీవ్ర గాయం అయితే ఆ జట్టు పది మందితోనే మ్యాచ్‌లో కొనసాగేది. ఇకపై అలా జరిగితే అదే తరహా మరో ఆటగాడిని పూర్తి స్థాయిలో తుది జట్టులోకి తీసుకొని ఆడించవచ్చు. అయితే ఈ నిబంధనను ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో కాకుండా దేశవాళీ క్రికెట్‌లోనే ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకురానున్నారు.



అది ఆసీస్‌కు రిటర్న్ గిఫ్ట్

టి20 వరల్డ్ కప్ మ్యాచ్‌పై రోహిత్ శర్మ

న్యూఢిల్లీ: సరిగ్గా ఏడాది క్రితం... జూన్ 29న భారత జట్టు రోహిత్ శర్మ నాయకత్వంలో టి20 వరల్డ్ కప్ గెలుచుకుంది. 2007లోనూ టి20 వరల్డ్ కప్ విజయంలో భాగంగా ఉన్న రోహిత్ నాయకుడిగా సాధించిన తొలి టి20 టోర్నీ ఇది. ఈ టోర్నమెంట్‌లో ఎప్పటిలాగే పాకిస్తాన్‌తో మ్యాచ్‌తో పాటు సెమీస్‌కు ముందు ఆస్ట్రేలియాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్ ఎప్పటికీ మర్చిపోలేనివి. ఈ నేపథ్యంలో 'జియో–హాట్‌స్టార్' రూపొందించిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ కెప్టెన్ రోహిత్ నాటి మ్యాచ్‌లకు సంబంధించి పలు విషయాలను గుర్తు చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో పోరులో భారత్ 24 పరుగులతో విజయం సాధించింది. 41 బంతుల్లోనే 92 పరుగులు చేసిన రోహిత్ శర్మ... స్టార్క్ వేసిన ఒక ఓవర్లో 4 సిక్స్‌లు, ఫోర్‌తో ఏకంగా 28 పరుగులు రాబట్టాడు. అంతకుముందు ఏడు నెలల క్రితం జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన టీమిండియా తీవ్ర నిరాశకు లోనైంది. ఆ ఓటమి తమ మనసుల్లోనే ఉండటంతో ఆసీస్‌పై గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగామని రోహిత్ చెప్పాడు. 'మేం ఈ మ్యాచ్ గెలిస్తే ఆసీస్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుందన్న మాట చాలు మాలో స్ఫూర్తి నింపడానికి. నవంబర్ 19న మాతో పాటు మన దేశ అభిమానులందరికీ ఆనందం దూరం చేశారనే విషయం మనసులో మెదులుతూనే ఉంది. కాబట్టి వారికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని భావించాం. అయితే అది అంత సులువు కాదని, మైదానంలోనే చూపించాలని భావించాం. అందుకే ఒక్కసారి బ్యాటింగ్‌కు దిగగానే నేను ఏం చేయగలనో అది చేశాను. స్టార్క్‌తో గతంలో చాలాసార్లు తలపడ్డా. ఈసారి అతడు నన్ను అవుట్ చేయడానికి కాకుండా పరుగులు ఇవ్వకుండా ఆపేందుకు మాత్రమే ప్రయతిస్తున్నట్లు అర్థమైంది. అక్కడే నేను సగం గెలిచాను. ఆపై విరుచుకుపడ్డాను. సెంచరీలు సాధించడం గొప్పే. కానీ మ్యాచ్ పరిస్థితి, దీకను బట్టి చూస్తే ఈ ఇన్నింగ్స్ సెంచరీకంటే ఎంతో విలువైంది. నాకు సంబంధించి ఇది నా అత్యుత్తమ ప్రదర్శన' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. అంతకుముందు పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో కూడా 140 చేస్తే గెలుస్తామని భావించామని... 119 పరుగులు చేసిన తర్వాత కూడా 2–3 వికెట్లు తీస్తే పాక్‌ను ఓడించగలమని నమ్మకం ఉందని చెప్పాడు. నిజానికి మ్యాచ్ ఫలితంకంటే దానికి ముందు ఉండే హడావిడే ఎప్పుడూ ప్రత్యేకమని అతను అన్నాడు. 'బయట మాకు ముప్పు ఉందని చెబుతూ మ్యాచ్‌కు రెండు రోజుల ముందు నుంచి కూడా హోటల్ బయటకు మమ్మల్ని వెళ్లనీయలేదు. మీడియా, అభిమానులతో నిండిపోయిన హోటల్ కనీసం నడవడానికి కూడా వీలు లేని విధంగా మారిపోయింది. అప్పుడు ఇది సాధారణ మ్యాచ్ కాదని మాకు అర్థమైంది. గ్రౌండ్‌కు వెళ్లిన తర్వాత కూడా ఇరు దేశాల అభిమానుల జోష్‌ను చూస్తే ఆశ్చర్యం వేసింది. పాకిస్తాన్‌పై నేను ఎన్నో మ్యాచ్‌లు ఆడాను. కానీ ఆటకు ముందు కనిపించే వాతావరణం ప్రత్యేకతే వేరు. దానికి ఏదీ సాటి రాదు' అని రోహిత్ శర్మ వివరించాడు.



హెడ్, వెబ్‌స్టర్, కేరీ అర్ధసెంచరీలు

బ్రిడ్జ్‌టౌన్: మిడిలార్డర్ బ్యాటర్లు ట్రావిస్ హెడ్ (95 బంతుల్లో 61; 8 ఫోర్లు), వెబ్‌స్టర్ (120 బంతుల్లో 63; 8 ఫోర్లు), అలెక్స్ కేరీ (75 బంతుల్లో 65; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకోవడంతో... వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా భారీ స్కోరు చేసింది. టీ విరామానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 310 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు కొన్‌స్టాస్ (5), ఉస్మాన్ ఖ్వాజా (15), కామెరూన్ గ్రీన్ (15), జోష్ ఇన్‌గ్లిస్ (12) విఫలమవడంతో ఒక దశలో 65/4తో కష్టాల్లో పడ్డ జట్టును హెడ్, వెబ్‌స్టర్ ఆదుకున్నారు. కరీబియన్ బౌలర్లలో షమార్ జోసెఫ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు... విండీస్ 190 పరుగులకు ఆలౌట్ అయ్యాయి.

రాణించిన వైభవ్ సూర్యవంశీ

ఇంగ్లండ్‌పై యువభారత్ గెలుపు



హోవ్: ఐపీఎల్ సరికొత్త సంచలనం వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 48; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఇంగ్లండ్ పర్యటనను మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రారంభించాడు. అండర్–19 జట్ల మధ్య జరుగుతున్న ఐదు యూత్ వన్డేల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత అండర్–19 జట్టు 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై జయభేరి మోగించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు 42.2 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ఇసాక్ మొహమ్మద్ (28 బంతుల్లో 42; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడగా... మిడిలార్డర్‌లో ఆండ్రూ ఫ్లింటాఫ్ తనయుడు రాకీ ఫ్లింటాఫ్ (90 బంతుల్లో 56; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) నింపాదిగా ఆడి అర్ధసెంచరీ సాధించాడు. యువ బౌలర్లలో కనిష్క్ చౌహాన్ 3, హెనిల్ పటేల్, అంబ్రీశ్, మొహమ్మద్ ఇనాన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ కేవలం 24 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి 178 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు వైభవ్, ఆయుశ్ మాత్రే (21; 4 ఫోర్లు) తొలి వికెట్‌కు 71 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు. స్వల్ప వ్యవధిలోనే వీళ్లిద్దరు అవుటైనప్పటికీ అభిజ్ఞాన్ (34 బంతుల్లో 45; 4 ఫోర్లు, 1 సిక్స్) కుదురుగా ఆడటంతో ఏ ఇబ్బంది లేకుండా యువభారత్ గెలిచింది. ప్రత్యర్థి బౌలర్లలో ఫ్రెంచ్ 2 వికెట్లు తీశాడు. ఇరు జట్ల మధ్య ఈ నెల 30న రెండో వన్డే నార్తాంప్టన్‌లో జరుగుతుంది.

యూపీ వారియర్స్ హెడ్ కోచ్ లూయిస్‌కు ఉద్వాసన



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ ఫ్రాంచైజీ తమ హెడ్ కోచ్ జాన్ లూయిస్‌కు ఉద్వాసన పలికింది. లీగ్ మొదలైన 2023లో ఆయనతో కుదుర్చుకున్న మూడేళ్ల ఒప్పందం గడువు ఈ సీజన్‌తోనే ముగియడంతో మళ్లీ పొడిగింపునివ్వలేదు. ప్రారంభ సీజన్ (2023)లో లూయిస్ కోచింగ్‌లోని యూపీ వారియర్స్ ప్లేఆఫ్స్ దశకు చేరింది. అన్ని మ్యాచ్‌లు గెలిచిన యూపీ... ప్లేఆఫ్స్‌లో ఒక్క ముంబై ఇండియన్స్ చేతిలో ఓడింది. ఆ సీజన్ చాంపియన్ కూడా ముంబైయే! తదుపరి 2024 సీజన్‌లో పాయింట్ల పట్టికలో వారియర్స్ నాలుగో స్థానంలో నిలిచింది. అయితే ఈ సీజన్‌లో అట్టడుగున నిలువడంతో కాంట్రాక్టు ముగియగానే సాగనంపింది. మూడేళ్ల పాటు తమ జట్టుకు సేవలందించిన లూయిస్‌కు సోషల్ మీడియా వేదికగా యూపీ యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది.

నిలవాలంటే గెలవాలి



- చైనాతో భారత మహిళల హాకీ పోరు నేడు
- ఓడితే ప్రొ లీగ్ నుంచి టీమిండియా అవుట్

బెర్లిన్: పరాజయాల పరంపరకు బ్రేక్ వేయడమే లక్ష్యంగా భారత మహిళల జట్టు చైనాతో పోరుకు సిద్ధమైంది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో అమ్మాయిల జట్టు వరుసగా ఆరు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. దీంతో తీవ్రమైన ఒత్తిడిలో కూరుకుపోయిన భారత్ ఎలాగైన చైనాపై జరిగే పోరులో గెలవాలనుకుంటుంది. ఈ మ్యాచ్ కూడా ఓడితే సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ నుంచి నిష్క్రమించడం దాదాపు ఖాయమవుతుంది. మొత్తం 9 జట్లు తలపడుతున్న ఈ టోర్నీలో 14 మ్యాచ్‌లాడిన మహిళల జట్టు 10 పాయింట్లతో అట్టడుగున ఉంది. ప్రొ లీగ్ నిబంధనల ప్రకారం అట్టడుగున నిలిచిన జట్టు ప్రస్తుత లీగ్‌లో చోటు కోల్పోతుంది. మళ్లీ ప్రొ లీగ్‌లో స్థానం కోసం ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో ఆడాల్సి ఉంటుంది. ఇలాంటి దుస్థితి నుంచి తప్పించుకోవాలంటే భారత్... చైనాపై గెలిచి తీరాలి. అప్పుడు అథమ స్థానం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ కూడా తమ జట్టు ఈ యూరోపియన్ అంచెలో బోణీ చేయాలని గట్టిగా ఆశిస్తున్నాడు. ఈ ఏడాది సొంత గడ్డపై జరిగిన ప్రొ లీగ్‌లో రాణించిన జట్టు యూరోపియన్ అంచెకు వచ్చేసరికి చతికిలబడటం అనూహ్య పరిణామం. ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బెల్జియంలతో జరిగిన రెండేసి మ్యాచ్‌ల్లో... మొత్తం ఆరు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడం కోచ్ హరేంద్రకు ఏమాత్రం రుచించడం లేదు. కెప్టెన్ సలీమా టెటె ఈ డబుల్ హెడర్ (చైనాతో రెండు మ్యాచ్‌లు) కీలకమని చెప్పింది. భారత పురుషుల జట్టులాగే ఆఖర్లో బెల్జియంపై గెలిచినట్లే తాము కూడా చైనాపై గెలుస్తామని పేర్కొంది. చైనాతో చివరిసారిగా ఆడిన మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు పైచేయి సాధించింది. గత నవంబర్‌లో బిహార్‌లో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలో 3–0తో గెలిచిన అమ్మాయిల జట్టు... ఫైనల్లో 1–0తో గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఇప్పుడు ఈ సానుకూల పరిస్థితుల్నే అనుకూలంగా మలచుకొని విజయం సాధించాలనే పట్టుదలతో భారత మహిళల జట్టు బరిలోకి దిగుతోంది.

విజయానికి చేరువలో...

- బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో శ్రీలంక ఆధిపత్యం
- రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 115/6



కొలంబో: బ్యాటర్ల సమష్టి వైఫల్యంతో... శ్రీలంకతో రెండో టెస్టులో బంగ్లాదేశ్ జట్టు ఓటమి అంచున నిలిచింది. శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (48 బంతుల్లో 19; 1 ఫోర్లు, 1 సిక్స్), షాద్‌మన్ ఇస్లామ్ (24 బంతుల్లో 12; 2 ఫోర్లు), అనాముల్ హక్ (19 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్), మోమినుల్ హక్ (33 బంతుల్లో 15; 2 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (53 బంతుల్లో 26; 2 ఫోర్లు), మెహదీ హసన్ మిరాజ్ (16 బంతుల్లో 11; 1 ఫోర్) విఫలమయ్యారు. ఆతిథ్య బౌలర్ల ధాటికి నిలవలేక వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య, ధనంజయ డిసిల్వా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో 4 వికెట్లు ఉన్న పర్యాటక బంగ్లాదేశ్ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 96 పరుగులు వెనుకబడి ఉంది. మరో నాలుగు వికెట్లు పడగొడితే... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27 సైకిల్‌లో శ్రీలంక తొలి విజయం నమోదు చేసుకుంటుంది. వికెట్ కీపర్ లిటన్ దాస్ (39 బంతుల్లో 13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. మరో రెండు రోజుల ఆట మిగిలిఉన్న ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం ఖాయం కాగా... నాలుగో రోజు బంగ్లాదేశ్ ఎన్ని పరుగులు చేస్తుందో చూడాలి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 290/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 116.5 ఓవర్లలో 458 పరుగులకు ఆలౌటైంది. పాథుమ్ నిసాంక (254 బంతుల్లో 158; 19 ఫోర్లు) క్రితం రోజు స్కోరుకు మరో 12 పరుగులు జోడించి వెనుదిరగగా... వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (87 బంతుల్లో 84; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ హాఫ్‌సెంచరీతో అదరగొట్టాడు. కమిందు మెండిస్ (41 బంతుల్లో 33; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 5 వికెట్లు పడగొట్టగా... నయీమ్ హసన్ 3 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 247 పరుగులు చేసింది.

జై జగన్నాథ్



శుక్రవారం పశ్చిమబెంగాల్‌లోని పూర్వ మేద్నిపూర్ జిల్లా దిఘాలో జగన్నాథ రథయాత్ర సందర్భంగా రోడ్డు ఊడుస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

చైనాకు పాండాలు



ఈ జెయింట్ పాండా పేరు సైహిన్. చైనా ఇలాంటి నాలుగు పాండాలను జపాన్‌కు అరువుగా ఇచ్చింది. అవి త్వరలో చైనాకు తిరిగి వెళ్లనున్నాయి.

మొహర్రం ప్రార్థనలు



మొహర్రం సందర్భంగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో ఇమామ్ మౌసా అల్ ఖదీమ్‌లో శుక్రవారం షియా వర్గీయుల సందడి

కోరల్స్ 'తెల్ల'ముఖం



పెరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల కారణంగా లెబనాన్ తీర సమీపంలో సముద్రపు లోతుల్లో రంగు వెలిసి కనిపిస్తున్న కోరల్ రీఫ్స్

పరశురామ ప్రీతి



నోయిడా సెక్టార్ 2లో ఒక కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం కారణంగా ఎగసిపడుతున్న అగ్నికీలలు, పొగ

అంతరిక్షం నుంచి భారత్

గత 41 ఏళ్లలో స్పష్టమైన మార్పు
- విపరీతంగా పెరిగిన పట్టణీకరణ
- రాత్రిపూట చిత్రీకరించిన శాటిలైట్ ఫొటోలతో గుర్తింపు

న్యూఢిల్లీ: అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా రాకేశ్ శర్మ రికార్డుకెక్కారు. 1984 ఏప్రిల్‌లో ఆయన అంతరిక్ష యాత్ర చేశారు. వారం రోజుల్లో భూమిపైకి తిరిగొచ్చారు. అంతరిక్షం నుంచి మన దేశం ఎలా కనిపిస్తోంది? అని అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రశ్నించగా.. 'సారే జహాసే అచ్ఛా'అటూ రాకేశ్ శర్మ బదులిచ్చారు. ఒకవేళ ఆయన ఇప్పుడు అంతరిక్షంలోకి వెళ్లి ఉంటే అప్పట్లో చూడని ఎన్నో దృశ్యాలు తిలకించేవారు. ముఖ్యంగా రాత్రిపూట మన ఇండియా ఎలా కనిపిస్తోందో వెల్లడించేవారు. ప్రస్తుతం ఆ అవకాశం శుభాన్షు శుక్లా దక్కింది. ఆయన గురువారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. 1984 నుంచి గమనిస్తే.. గత 41 ఏళ్లలో మన దేశం ఎంతగానో పురోగమించింది. పట్టణీకరణ విపరీతంగా పెరిగింది. రాత్రి సమయంలో చిత్రీకరించిన ఉపగ్రహ చిత్రాలు 2000 సంవత్సరం నుంచి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అంతకంటే ముందున్న శాటిలైట్ కెమెరాలు ఆధునికమైనవి కావు. రాత్రి సమయంలో ఫొటోలను స్పష్టంగా చిత్రీకరించే సామర్థ్యం వాటికి లేదు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ శాటిలైట్ కెమెరాలు అంతరిక్షం నుంచి ప్రతి దేశాన్ని స్పష్టంగా మన కంటికి చూపగలుగుతున్నాయి. రాత్రిపూట దేదీప్యమానంగా వెలిగే విద్యుత్ దీపాలను బట్టి ఆయా ప్రాంతాల అభివృద్ధిని అంచనా వేయొచ్చు. దేశ ప్రగతితోపాటు సామాజిక, ఆర్థిక మార్పులను ఇవి కొంతవరకు ప్రతిబింబిస్తాయనడంలో సందేహం లేదు.

విద్యుత్ కాంతి విస్తృతి

ఇండియాలో పట్టణీకరణ, అభివృద్ధి ఏ మేరకు జరిగిందో తెలుసుకొనేందుకు శాటిలైట్ చిత్రాల ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్సీ) ఒక అధ్యయనం చేసింది. 2012 నుంచి 2021 వరకు రాత్రి సమయంలో అంతరిక్షం నుంచి ఉపగ్రహాలు చిత్రీకరించిన ఫొటోలు సేకరించి, విశ్లేషించింది. పదేళ్లలో దేశంలో రాత్రిపూట విద్యుత్ కాంతి(నైట్‌టైమ్ లైట్) విస్తృతి ఏకంగా 43 శాతం పెరిగినట్లు తేలింది. ముఖ్యంగా బిహార్, మణిపూర్, లద్దాఖ్, కేరళలో ఈ విస్తృతి అధికంగా ఉండడం విశేషం. 2020 సంవత్సరంలో చాలా రాష్ట్రాల్లో తగ్గిపోయింది. ఇందుకు కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి కారణమని చెబుతున్నారు. 1984 నాటి చిత్రాలను, ఇప్పటి చిత్రాలను గమనిస్తే 1990వ దశకంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాతే ఇండియాలో పట్టణీకరణ వేగం పుంజుకున్నట్లు స్పష్టమవుతోంది.

అంతరిక్షం నుంచి భారత్ అద్భుతం

ఇండియన్-అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తొమ్మిది నెలలపాటు ఉండి, ఏప్రిల్‌లో భూమిపైకి తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. అంతరిక్షం నుంచి ఇండియా అద్భుతంగా కనిపిస్తోందని ఆమె చెప్పారు. హిమాలయ పర్వతాలపై నుంచి వెళ్లినప్పుడల్లా అందమైన చక్కటి ఫొటోలు తీసుకున్నామని తెలిపారు. గుజరాత్, ముంబైలో సౌందర్యవంతంగా కనిపించాయని వెల్లడించారు.

13 రోజులైనా కేరళలోనే యూకే యుద్ధ విమానం

రానున్న 40 మంది నిపుణుల బృందం

ప్రత్యేక టో వాహనాన్ని పంపిన యూకే



త్రివేండ్రం: కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండయిన బ్రిటన్ నేవీ యుద్ధ విమానం ఎఫ్-35 గత 13 రోజులుగా అక్కడే ఉంది. టేకాఫ్ ప్రయత్నాలు విఫలం కావడంతో రాయల్ బ్రిటీష్ నేవీ కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టింది. హైడ్రాలిక్ స్నాగ్ కారణంగా ఉండిపోయిన ఎఫ్-35బీ యుద్ధనౌకను తరలించడం కోసం యూకే నుంచి ప్రత్యేక టో వాహనం వస్తోంది. 40 మంది బ్రిటిష్ ఇంజనీర్లు, నిపుణుల బృందం కూడా కేరళకు బయల్దేరింది. ఫైటర్ జెట్‌ను భారత్‌లోనే మరమ్మతు చేయనున్నట్లు సమాచారం. యుద్ధవిమానం పార్కింగ్ కోసం బ్రిటన్ భారీగా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సరిపడా ఇంధనం లేకపోవడంతో పాటు వాతావరణం అనుకూలించక విమాన వాహన నౌక తిరిగి రాకపోవడంతో ఎఫ్-35బి జూన్ 14న తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండవడం తెలిసిందే. సురక్షిత ల్యాండింగ్‌కు భారత వైమానిక దళం వీలు కల్పించింది. ఇంధనం నింపడంతో పాటు అన్నిరకాల మద్దతు అందించింది. కానీ హైడ్రాలిక్ వైఫల్యంతో జెట్ ఎగరలేకపోయింది. దాన్ని సరిచేయడానికి రాయల్ నేవీ టెక్నీషియన్ల చిన్న బృందం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. విమానం ప్రస్తుతం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) రక్షణలో బే 4 వద్ద ఉంది. ''తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎఫ్-35బీని వీలైనంత త్వరగా మరమ్మతు చేయడానికి యూకే కృషి చేస్తోంది. భారత అధికారుల నిరంతర మద్దతుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము'' అని భారత్‌లోని బ్రిటిష్ హైకమిషన్ పేర్కొంది. నిపుణుల బృందం మరమ్మత్తు ప్రయత్నాలు కూడా విఫలమైతే జెట్‌ను యూకేకి విమాన మార్గంలో తరలించడమే చివరి మార్గమని చెబుతున్నారు.

జోరుగా మీమ్స్

బ్రిటన్ యుద్ధ విమానం రెండువారాలుగా కేరళలోనే ఉండటంపై ఆన్‌లైన్‌లో జోరుగా మీమ్స్ పుట్టుకొస్తున్నాయి. 11 కోట్ల డాలర్ల విలువైన జెట్‌ను కేవలం 4 కోట్లకే ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉంచినట్లు ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. రెండు వారాలుగా ఇక్కడే ఉంటున్నందున ఆ జెట్‌కు భారత పౌరసత్వానికి అర్హత వచ్చిందని కొందరు చమత్కరించారు. ''బహిరంగ ప్రదేశంలో పార్క్ చేయబట్టి సరిపోయింది. మరెక్కడైనా అయితే దొంగతనానికి గురయ్యేది'' అంటూ మీమ్స్ వైరలవుతున్నాయి.

సామ్యవాద, లౌకిక పదాలను సమీక్షించాలి

రాజ్యాంగం వాస్తవ స్ఫూర్తిని పునరుద్ధరించాలి
- ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి హొసబళె వ్యాఖ్య
- తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్, వామపక్షాలు

న్యూఢిల్లీ: దేశ రాజ్యాంగం వాస్తవ స్ఫూర్తిని పునరుద్ధరించేందుకు పీఠికలో సవరణ ద్వారా చేర్చిన 'సోషలిస్ట్', 'లౌకిక' పదాలపై సమీక్ష చేపట్టాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబళె పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో కాంగ్రెస్ తీసుకువచ్చిన పలు వక్రీకరణ విధానాల నుంచి రాజ్యాంగానికి విముక్తి కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన రాసిన వ్యాసం శుక్రవారం ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రిక ఆర్గనైజర్‌లో ప్రచురితమైంది. 1948లో దేశాన్ని సెక్యులర్, ఫెడరల్, సోషలిస్ట్ యూనియన్ ఆఫ్ స్టేట్స్'గా భారత్‌ను పేర్కొనాలన్న ప్రతిపాదనను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రాజ్యాంగ సభలో జరిగిన చర్చ సందర్భంగా తిరస్కరించారని హొసబళె తన వ్యాసంలో గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన 42వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ సభ చర్చా ప్రక్రియకు ప్రతిబింబం కాదన్నారు. భవిష్యత్ తరాలకు అధికారం ఇచ్చే ప్రజాస్వామ్య చట్రం అనే అంబేడ్కర్ దార్శనికతకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేసేందుకు హొసబళె బహిరంగ చర్చను కోరుకున్నారని ఆర్గనైజర్ వారపత్రిక వివరించింది. అంతేతప్ప, రాజ్యాంగాన్ని రద్దు చేయడం ఆయన ఉద్దేశం కానేకాదని స్పష్టత నిచ్చింది. కాంగ్రెస్ వంచనను బయటపెట్టి, రాజ్యాంగం నిజ స్ఫూర్తికి గౌరవం కల్పించేందుకు చర్చ జరగాల్సిన అవసరముందని పేర్కొంది. హొసబళె వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మన రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎన్నడూ ఆమోదించలేదని, రాజ్యాంగాన్ని రద్దు చేయడమనే దీర్ఘకాలం కుట్రలో తాజా వ్యాఖ్యలు ఒక భాగమని ఆరోపించింది. రాజ్యాంగం ఆత్మపై ఆర్ఎస్ఎస్ ఉద్దేశ పూర్వకంగా దాడి చేస్తోందిన మండిపడింది. సోషలిస్ట్, సెక్యులర్ విధానాల కోసమే స్వాతంత్ర్య పోరాట యోధులు తమ జీవితాలను త్యాగం చేశారని సీపీఎం పేర్కొంది. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి హొసబళె వ్యాఖ్యలను ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. దేశాన్ని 'హిందూ రాష్ట్ర'గా మార్చాలన్న ఆర్ఎస్ఎస్ కుట్రలో ఇదో భాగమని పేర్కొంది.

ఆర్ఎస్ఎస్ ముసుగు తొలగింది: రాహుల్

ఆర్ఎస్ఎస్ నేత హొసబళె వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఆర్ఎస్ఎస్‌కు కావాల్సింది మనుస్మృతే తప్ప రాజ్యాంగం కాదన్న విషయం మరోసారి రూఢీ అయ్యిందని విమర్శించారు. రాజ్యాంగం వంటి శక్తివంతమైన ఆయుధాన్ని, హక్కులను లాగేసుకుని, సామాన్యులను బానిసలుగా మార్చడమే ఆర్ఎస్ఎస్ వాస్తవ అజెండా అని ఆయన శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ అజెండా ఎన్నటికీ నిజం కాబోదు, ఇలాంటి కలలను కనడం ఆర్ఎస్ఎస్ మానుకోవాలని హితవు పలికారు. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడూ రాజ్యాంగాన్ని ఆఖరి శ్వాస వరకు కాపాడుకుంటారని రాహుల్ స్పష్టం చేశారు.

ఇరాన్, ఇజ్రాయెల్ నుంచి 4,400 మంది వెనక్కి: కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌ల నుంచి 4,400 మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చినట్లు విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. ఆపరేషన్ సింధులో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి వీరి కోసం 19 ప్రత్యేక విమాన సర్వీసులను నడిపినట్లు వెల్లడించింది. ఇరాన్ నుంచి ఆర్మీనియా రాజధాని ఎరెవాన్ చేరుకున్న 173 మంది భారతీయులతో కూడిన ప్రత్యేక విమానం తాజాగా గురువారం రాత్రి ఢిల్లీకి చేరుకుందని పేర్కొంది. అక్కడి క్షేత్ర స్థాయి పరిస్థితులను అంచనా వేశాక తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాకు వివరించారు. మొత్తమ్మీద ఇరాన్‌లో 10 వేల మంది, ఇజ్రాయెల్‌లో 40 వేల మంది భారతీయులు ఉన్నారన్నారు. భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడంలో సహకరించిన ఈజిప్టు, జోర్డాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 20న గగనతలాన్ని భారతీయుల కోసం తెరిచిన ఇరాన్‌తోపాటు తుర్క్‌మెనిస్తాన్, ఆర్మీనియా ప్రభుత్వాలకు సైతం ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మొదలుకాగా, 22న అమెరికా ఇరాన్ అణు వసతులపై దాడులకు దిగడంతో తీవ్ర రూపం దాల్చడం తెల్సిందే.

రాజ్‌నాథ్ నిర్ణయం సరైందే: జైశంకర్

న్యూఢిల్లీ: షాంఘై సహకార సంఘం(ఎస్‌సీవో) ఉమ్మడి ప్రకటనలో ఉగ్రవాదం గురించిన ప్రస్తావన తప్పనిసరిగా ఉండాలని భారత్ కోరుకుందని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ చెప్పారు. కానీ, ఒకే ఒక్క సభ్య దేశానికి అది ఆమోదయోగ్యం కాదని, పాకిస్తాన్‌ను ఉద్దేశించి ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఉగ్రవాదంపై పోరాటమనే ప్రధాన లక్ష్యంతో ఎస్‌సీవో రక్షణ మంత్రులు చైనాలో సమావేశమయ్యారని గుర్తు చేసిన జై శంకర్..ఆ ప్రస్తావనే లేకుండా రూపకల్పన చేసిన ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయరాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. శుక్రవారం మంత్రి జై శంకర్ మీడియాతో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని, సీమాంతర ఉగ్రవాదానికి పాక్ ఆజ్యంపోయడంపై భారత్ ఆందోళనను పట్టించుకోకుండా తయారు చేసిన ప్రకటనపై భారత్ సంతకం చేయని విషయం తెల్సిందే. పైపెచ్చు, ఆ ప్రకటనలో భారత్ ప్రోద్బలంతో బలూచిస్తాన్‌లో భారత్ ఉగ్ర కార్యకలాపాలను ప్రేరేపిస్తోందంటూ పాకిస్తాన్ ఒక పేరాను కలిపేందుకు ప్రయత్నించడం గమనార్హం.

ముగ్గురు ముష్కరుల కోసం సాగుతున్న వేట

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లా బసంత్‌గఢ్‌లో దట్టమైన అటవీ ప్రాంతంలో దిగ్బంధానికి గురైన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైషే మొహమ్మద్‌కు చెందిన ఒక ముష్కరుడు హతమయ్యాడు. తప్పించుకున్న అతడి మరో ముగ్గురు సహచరులను బలగాలు చుట్టుముట్టాయి. తప్పించుకునేందుకు వీల్లేకుండా అదనపు బలగాలను మోహరించాయి. దట్టంగా పొగమంచు కురుస్తున్నప్పటికీ రాత్రంగా అప్రమత్తంగా ఉన్న బలగాలు..శుక్రవారం ఉదయం డ్రోన్లు, జాగిలాలతో తిరిగి కూంబింగ్ చేపట్టాయని ఐజీపీ భీమ్‌సేన్ టుటి తెలిపారు. నలుగురు సభ్యుల ఉగ్రముఠా సంచారంపై ఏడాది నుంచి నిఘా వేసి ఉంచామన్నారు. దట్టమైన అడవులు, గుహల్లో దాక్కుంటూ స్థానిక కార్యకర్తల సాయంతో ఇప్పటిదాకా దొరక్కుండా తప్పించుకున్నారన్నారు. ఆర్మీ, పోలీసులు చేపట్టిన కూంబింగ్‌లో చిట్టచివరికి గురువారం ఉదయం బిహాలీ ప్రాంతంలో తారసపడ్డారని వివరించారు. కాగా, గురువారం ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదిని పాకిస్తాన్‌కు చెందిన హైదర్ అలియాస్ మౌల్విగా గుర్తించామన్నారు. వీరికి, ఇప్పటి వరకు ఆహారం, ఆశ్రయం కల్పించిన పలువురిని అరెస్ట్ చేశామని ఐజీపీ టుటి చెప్పారు. పాకిస్తాన్‌ను చొరబడే ఉగ్రవాదులకు దట్టమైన అటవీప్రాంతంలో ఎత్తైయిన కొండలు, గుహలు ఉన్న బసంత్‌గఢ్ అడ్డాగా ఉంటోందని తెలిపారు.

సినీ ఫక్కీలో కార్ ఛేజింగ్

పోలీసు అధికారికి గాయాలు

తిరువళ్లూరు: తమిళనాడులో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్ సినీ ఫక్కీలో హైవేపై కారును ఛేజ్ చేశారు. కిలోమీటరు దూరం పాటు కారు కిటికీని పట్టుకుని వేలాడుతూ ఓ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను పట్టుకునే ప్రయత్నం చేశారు. కారులో ఉన్న వారు బయటకు నెట్టేయడంతో రోడ్డుపై పడి స్వల్పంగా గాయపడ్డారు. అళగురాజా అనే నిందితుడు మయిలై శివకుమార్ అనే వ్యక్తి హత్యతో సహా అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతనిపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తిరువళ్లూరు జిల్లాలో ఉన్నాడన్న సమాచారం మేరకు అతన్ని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. వారు చుట్టుముట్టగానే అళగురాజా తిరుపతి హైవే వెంబడి కారులో పారిపోవడానికి ప్రయత్నించాడు. దాన్ని ఆపడానికి సబ్-ఇన్‌స్పెక్టర్ ఆనంద కుమార్ ప్రయత్నించారు. పోలీసు వాహనం నుంచి నిందితుడు వెళ్తున్న కారుపైకి దూకారు. వేగంగా వెళ్తున్న కారు కిటికీని పట్టుకుని దాదాపు కిలోమీటరు ప్రయాణించారు. వాహనంలో ఉన్నవారు తోసేయడంతో రోడ్డుపై పడిపోయారు. హెల్మెట్ ధరించి ఉండటంతో తీవ్ర గాయాలేమీ కాలేదు. అళగురాజా పరారీలో ఉన్నాడు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

ఒకరు మృతి, 11 మందికి గాయాలు

నబాటియె: దక్షిణ లెబనాన్‌లోని నబాటియె నగరంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు శుక్రవారం దాడులు చేశాయి. నగర సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపునకు చెందిన భూగర్భ మౌలిక వసతులను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. దాడుల్లో ఒక మహిళ చనిపోగా 11 మంది గాయపడ్డారు. కాగా, రెండు విడతలుగా సాగిన ఈ దాడుల్లో ఇజ్రాయెల్ బంకర్ బస్టర్ బాంబులను వాడిందని లెబనాన్ ప్రధాని తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పదేపదే ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. తాజా ఘటనపై హెజ్‌బొల్లా స్పందించలేదు.

డీజిల్‌లో నీళ్లు..కాదు నీళ్లలో డీజిల్!

మొరాయించిన సీఎం కాన్వాయ్ • 19 వాహనాలు మొరాయింపు

భోపాల్: పెట్రోల్ బంకుల్లో జరిగే ఇంధన కల్తీ తీవ్రతకు తాజా ఉదాహరణ ఇది. మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. ఏకంగా సీఎం మోహన్ యాదవ్ కాన్వాయ్‌లోని ఎస్‌యూవీలే కల్తీ కాటుకు గురికావడం గమనార్హం. రట్లాంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం మోహన్ యాదవ్ గురువారం ఇండోర్ నుంచి వాహనాల్లో బయలుదేరారు. రట్లాం వద్దకు వచ్చేసరికి డీజిల్ నిండుకోవడంతో అక్కడున్న పెట్రోల్ బంకులో వాహనాలకు డీజిల్ ఫుల్‌ట్యాంక్ చేయించారు. అక్కడ్నుంచి ఒక కిలోమీటర్ దూరం వెళ్లాయో లేదో వాహనాలన్నీ ముందుకు వెళ్లమని మొరాయించాయి. ఒకటీరెండూ కాదు, ఏకంగా 19 వాహనాలు నిలిచిపోయాయి. సిబ్బందే వాటిని రోడ్డు పక్కకు నెట్టాల్సి వచ్చింది. రట్లాంలోని సంబంధిత పెట్రోల్ బంకులో తనిఖీలు చేపట్టిన అధికారులు డీజిల్‌లో భారీగా నీళ్లు కలిసి ఉన్నట్లు నిర్ధారించారు. కాగా, కొద్దిసేపటి తర్వాత ఇండోర్ నుంచి తెప్పించిన వేరే వాహనాల్లో సీఎం కాన్వాయ్ ముందుకు సాగింది.

భారీ వర్షాలతో కూలిన పాత భవనం

ఇద్దరు మృతి, ఒకరు గల్లంతు

త్రివేండ్రం: కేరళలో భారీ వర్షాల కారణంగా త్రిస్సూర్‌లోని కొడకరాలో రెండంతస్తుల పాత భవనం కూలిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. 14 మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఈ భవనంలో వలస కార్మికులు నివసిస్తున్నారు. వారు పనికి బయలుదేరడానికి సిద్ధమవుతుండగా ఘటన జరిగింది. ముగ్గురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. స్థానికులతో పాటు పోలీసులు, అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది ఉదయం నుంచి సహాయక చర్యలు చేపట్టారు. బాధితుల్లో బెంగాల్‌కు చెందిన రాహుల్ (19), రూపేల్ (21) ఉన్నారు. రూపేల్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, రాహుల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అలీమ్ (30) ఆచూకీ కోసం గాలిస్తున్నారు. గత రాత్రి ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షం నిర్మాణం బలహీనపడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

భార్య ఉద్యోగం చేస్తున్నా భరణానికి అర్హురాలే

బాంబే హైకోర్టు తీర్పు

ముంబై: ఉద్యోగం చేస్తూ వేతనం ఆర్జిస్తున్న మహిళ కూడా విడిపోయిన తన భర్త నుంచి నెలనెలా జీవన భృతి పొందడానికి అర్హురాలేనని బాంబే హైకోర్టు తేల్చిచెప్పారు. ఆమెకు సొంత సంపాదన ఉందన్న కారణంతో భర్త నుంచి ఆర్థిక సాయం పొందకుండా నిరోధించలేమని పేర్కొంది. మహారాష్ట్రలోని థానేకు చెందిన యువతి, యువకుడికి 2012 నవంబర్ 28న వివాహం జరిగింది. విభేదాల కారణంగా 2015 మే నెల నుంచి దూరంగా ఉంటున్నారు. అధికారికంగా విడాకులు తీసుకోలేదు. సదరు యువతి ఓ పాఠశాలలో టీచర్‌గా ఉద్యోగం చేయడం ప్రారంభించింది. తన భర్త నుంచి జీవన వ్యయం ఇప్పించాలని కోరుతూ బాంద్రాలోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. దాంతో ప్రతినెలా రూ.15 వేల చొప్పున ఆమెకు ఇవ్వాలని ఆదేశిస్తూ భర్తను ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆ వ్యక్తి బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ మంజూష దేశ్‌పాండే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. భార్య ఉద్యోగం చేస్తోంది కాబట్టి ఆమె జీవన వ్యయాన్ని తాను భరించాల్సిన అవసరం లేదన్న భర్త వాదనను తిరస్కరించింది. భార్య ఉద్యోగం చేస్తున్నా ఆమెను పోషించాల్సిన బాధ్యత భర్తపై ఉందని పేర్కొంది. ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం భార్యకు ప్రతినెలా రూ.15 వేల చొప్పున ఇవ్వాలని భర్తను ఆదేశిస్తూ తాజాగా తీర్పు వెలువరించింది.

ట్విట్టర్ కిల్లర్‌కు ఉరి



ఉరిశిక్షకు ముందు రోదిస్తున్న షిరైషి

టోక్యో: తొమ్మిది మందిని హత్య చేసిన ట్విట్టర్ హంతకుడికి జపాన్ ఉరి శిక్ష అమలు చేసింది. 2022 తర్వాత ఆ దేశం మరణశిక్షను అమలు చేయడం ఇదే తొలిసారి. ట్విట్టర్ కిల్లర్‌గా పిలిచే తకాహిరో షిరైషి చేసిన వరుస హత్యలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. 15 నుంచి 26 ఏళ్ల మధ్య వయసు వ్యక్తులను తన అపార్ట్‌మెంట్‌కు రప్పించి గొంతు కోసి, అవయవాలు ముక్కలు చేసేవాడు. బాధితుల్లో ఒకరి కోసం వెతుకుతుండగా 2017 అక్టోబర్‌లో టోక్యో సమీపంలో పోలీసులకు శరీర భాగాల దొరకడంతో ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయి. తొమ్మిది మంది ఆత్మహత్య బాధితులను హత్య చేసినట్లు షిరైషి అంగీకరించాడు. టోక్యో సమీపంలో ఉన్న జమా సిటీలోని అతని ఫ్లాట్‌లో కూలర్లు, టూల్ బాక్సుల్లో ముక్కలు ముక్కలుగా ఉన్న మృతదేహాలు కనిపించాయి. వారితో ట్విట్టర్ ద్వారా పరిచయం పెంచుకున్నట్టు షిరైషి వెల్లడించాడు. చనిపోవడానికి వారికి సాయం చేశానని చెప్పుకున్నాడు. 2020 డిసెంబర్‌లో అతనికి మరణశిక్ష విధించారు. తీర్పు సమయంలో వందలాది మంది విచారణకు హాజరయ్యారు.

టాయిలెట్ నుంచే వర్చువల్‌గా హైకోర్టు విచారణకు హాజరు

గాంధీనగర్: ఓ కేసు విచారణ సందర్భంగా గుజరాత్ హైకోర్టు విచారణకు ఓ వ్యక్తి వర్చువల్‌గా టాయిలెట్ నుంచే హాజరైన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ నెల 20వ తేదీన చోటుచేసుకున్న ఈ ఉదంతానికి సంబంధించిన వీడియోను బార్ అండ్ బెంచ్ తాజాగా షేర్ చేసింది. జస్టిస్ నిర్జర్ ఎస్ దేశాయ్ ఓ కేసులో వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సమద్ బ్యాటరీ అనే సంక్షిప్త పేరుతో వర్చువల్‌గా ఓ వ్యక్తి కనిపించాడు. క్లోజప్‌లో మొదట అతడు మెడలో బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్‌తో కనిపించాడు. కొద్దిసేపటి తర్వాత కెమెరా యాంగిల్ మారాక గమనించగా, అసలు విషయం తేలింది. వాస్తవానికి అతడు వెస్టర్న్ టాయిలెట్ కమోడ్‌పై కూర్చున్నాడు. అంటే అతడు వర్చువల్ విచారణకు టాయిలెట్ నుంచి హాజరైనట్లు అందరికీ అర్థమైపోయింది. ప్రత్యక్ష సాక్షి అయిన జడ్జి సహా అందరూ అవాక్కయ్యారు. కొద్దిసేపటి తర్వాత అతడు వేరే రూంలో మామూలుగా కనిపించాడు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసేలా పోలీసులను ఆదేశించాలని పిటిషన్ వేసింది అతడేనని బార్ అండ్ బెంచ్ తెలిపింది. కక్షిదారుల్లో అతడు కూడా ఉన్నాడు. ఈ కేసులో ఇరుపక్షాలు రాజీకి రావడంతో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసినట్లు ఆ తర్వాత కోర్టుకు సమాచారం అందింది. కాగా, తాజా వీడియోపై ఆన్‌లైన్‌లో నెటిజన్ల నుంచి భారీగా స్పందన కనిపించింది. కోర్టు మర్యాదలను పాటించలేదంటూ ఆ వ్యక్తిపై కొందరు విమర్శలు కురిపించగా, మరికొందరు మాత్రం ఈ ఇబ్బందికర సన్నివేశంపై చతురోక్తులు సంధించారు.



హడలెత్తించిన గజరాజులు

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శుక్రవారం జగన్నాథ రథయాత్రలో చిన్న అపశ్రుతి దొర్లింది. యాత్ర సందర్భంగా మూడు ఏనుగులు అదుపు తప్పి కాసేపు బీభత్సం సృష్టించాయి. పెద్దపెట్టున ఘీంకరిస్తూ జనాలపైకి పరుగులు తీశాయి. దాంతో భక్తులంతా భయభ్రాంతులై తలో దిక్కు పారిపోయారు. ఒకరు గాయపడటం మినహా ప్రాణ నష్టం వంటివేమీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ-28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం.

ప్రకరణ 28(2): పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు.

ప్రకరణ 28(3): ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు/బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు-29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

అల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మేంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

ప్రకరణ - 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ, 1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300-ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు.

ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తి హక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

ప్రకరణ - 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతోపాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం. ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32(4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో-వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ 32(3): సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల (స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి.

హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును **ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త** అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19-22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు (లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం. ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది. అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public), జ్యుడీషియల్ సంస్థలు, క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు. ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు. మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీచేస్తారు. అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా (Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమం?



వాయు కాలుష్యం

మానవ మనుగడకు గాలి, నీరు, నేల అత్యంత ప్రధానమైనవి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో మనకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ మానవ కార్యకలాపాల వల్ల గాలి, నీరు, నేల వాటి సహజత్వాన్ని కోల్పోతున్నాయి. ఈ సహజ వనరులపై మనకెంత అధికారం ఉందో, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.

గాలి - వాతావరణం

భూఉపరితలం నుంచి సుమారు 1000 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాయు మండలాన్ని వాతావరణం అంటారు. గాలి వివిధ వాయువుల మిశ్రమం. ఇందులో ప్రధాన అనుఘటకం నైట్రోజన్. తర్వాతి స్థానంలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరి ఉన్నాయి. వీటితోపాటు ఆర్గాన్, హీలియం, నియాన్ అనే జడవాయువులు ఉన్నాయి. గాలిలోని ఈ వాయువులు వాటి సహజ ధర్మాన్ని కోల్పోకుండా ఉంటాయి. అయితే ఈ సంఘటనం అన్ని వేళలా, అన్ని ప్రదేశాల్లో స్థిరంగా ఉండకపోవచ్చు. పారిశ్రామిక వాడల్లో శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం తదితర పదార్థాలను ఎక్కువగా మండిస్తారు. అందువల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం పెరుగుతుంది. శ్వాసక్రియలో భాగంగా మానవులు, ఇతర జంతుజాలం ఆక్సిజన్‌ను గ్రహించి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి. వెంటిలేషన్ సరిగా లేని తరగతి గదిలో శ్వాసించేందుకు సరిపడా ఆక్సిజన్ లభించదు. దీంతో ఆవలింతలు వస్తాయి. మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా పిండి పదార్థాలను తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను వినియోగించుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందుకే వృక్షసంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లోని గాలిలో కార్బన్ డై ఆక్సైడ్ సమతుల్యంగా ఉంటుంది. 'లెగ్యుమినేసి' మొక్కలు ఉన్న ప్రాంతాల్లోని గాలిలో నైట్రోజన్ పరిమాణం సాధారణం కంటే తక్కువగా ఉంటుంది. ఈ మొక్కల వేర్ల బుడిపెల్లో బ్యాక్టీరియా ఉంటుంది. ఇది గాలిలోని నైట్రోజన్‌ను గ్రహించి మొక్కలకు ఉపయోగకరమైన నైట్రేట్ ఎరువుల రూపంలోకి మారుస్తుంది.

గాలి సంఘటనం

గాలిలోని వాయువు	సంఘటనం
నైట్రోజన్	78%
ఆక్సిజన్	21%
ఆర్గాన్	0.9%
నీటిఆవిరి	0.04%
కార్బన్ డై ఆక్సైడ్	0.03%

జంతు, వృక్ష సంబంధ పదార్థాలు బ్యాక్టీరియా వల్ల కుళ్లిపోయి, వాటి ప్రొటీన్ సంబంధిత సంయోగ పదార్థాలు వియోగం చెంది నైట్రోజన్ విడుదలవుతుంది. ఇలా విడుదలైన నైట్రోజన్ గాలిలోకి చేరుతుంది.

గాలిలోని నీటిఆవిరి కూడా అన్ని ప్రదేశాల్లో ఒకేలా ఉండదు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, సముద్ర తీర ప్రాంతాల్లో గాలిలో నీటిఆవిరి ఎక్కువగా ఉంటుంది. పీఠభూమి ప్రాంతాల్లో తేమ(నీటిఆవిరి) తక్కువగా ఉంటుంది. శీతాకాలంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిఆవిరి అధికంగా ఉండటం వల్ల నీటిమంచు, పొగమంచు ఏర్పడతాయి.

మనం పీల్చే గాలి సహజ సంఘటనంలో ఉండటం లేదు. వాహనాలు, పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు విష వాయువులను వెలువరిస్తున్నాయి. బొగ్గును మండించటం, వంటచెరకు కాల్చడం తదితర చర్యల వల్ల కూడా అనేక విష వాయువులు గాలిలో చేరుతున్నాయి. ఇలా వాతావరణంలో చేరే వాటిలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, ఫ్రియాన్, ఓజోన్, మీథేన్ లాంటి వాయువులు; ఫ్లైయాష్, మెర్క్యురీ, జింక్, క్రోమియం, కాడ్మియం తదితర లోహాలు ముఖ్యమైనవి.

వాతావరణ కాలుష్యం - పదాల వివరణ

కాలుష్యం: మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల వల్ల విడుదలై, పరిసరాల మీద దుష్ప్రభావం చూపే పదార్థాన్ని కాలుష్యం అంటారు.

ఉదాహరణ: సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువులు. లెడ్, మెర్క్యురీ తదితర లోహాలు. పుప్పొడి రేణువులు, దుమ్ము, ధూళి, రేడియోధార్మిక పదార్థాలు, పురుగు మందులు మొదలైనవి.

మలినం: ప్రకృతిలో సహజంగా లభించని, మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల ద్వారా పరిసరాల్లోకి విడుదలైన పదార్థాన్నే మలినం అంటారు.

ఉదాహరణ: భోపాల్ దుర్ఘటనకు కారణమైన మిథైల్ ఐసోసయనేట్. ఢిల్లీ దుర్ఘటనకు కారణమైన పైరో సల్ఫ్యూరిక్ ఆమ్లం. హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమైన క్లోరో ఫ్లోరో కార్బన్లు (ఫ్రియాన్‌లు). ఈ వాయువులు ప్రకృతిలో సహజసిద్ధంగా లభించవు. మానవ కార్యకలాపాల ద్వారా గాలిలో చేరాయి.

గ్రాహకం: కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమాన్ని గ్రాహకం అంటారు. **ఉదా:** ఆటో మొబైల్ గ్యారేజిలో, రోడ్లపై వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా మన కళ్లు ఎర్రబారి మండుతాయి. ఈ సందర్భంలో కళ్లను గ్రాహకాలు అనవచ్చు.

సింక్: కాలుష్యాలతో చర్య జరిపే మాధ్యమాన్ని సింక్ అంటారు. ఉదాహరణకు అడవులు, సముద్రాలు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని సింక్‌లుగా పనిచేస్తాయి.

వాతావరణ విభాగాలు

భూమిపై సుమారు 500 కి.మీ. వరకు వ్యాప్తి చెంది ఉన్న వాతావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. భూమి ఉపరితలం నుంచి పైకి పోయే కొద్దీ గాలి సాంద్రత, పీడనం, ఉష్ణోగ్రత తగ్గుతాయి. అందుకే ఎత్తయిన కొండ ప్రాంతాల్లో త్వరగా వంట చేయలేం. పర్వతారోహకులకు ఆక్సిజన్ సరిగా అందదు.

ట్రోపో ఆవరణం (0-11 కి.మీ.), స్ట్రాటో ఆవరణం (11-50 కి.మీ.), మీసో ఆవరణం (50-85 కి.మీ.), థర్మో ఆవరణం (85-500 కి.మీ.) అనేవి వాతావరణంలోని పొరలు.

స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ పొర ఉంటుంది. ఇది సూర్యరశ్మిలోని చర్మ క్యాన్సర్‌ను కలిగించే అతినీలలోహిత కిరణాలను భూమికి చేరకుండా అడ్డుకుంటుంది. కానీ ఫ్రియాన్లు ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతున్నాయి. స్ట్రాటో స్ఫియర్‌లోనే విమానాలు ప్రయాణిస్తాయి. అంతరిక్షం నుంచి భూమివైపు వేగంగా దూసుకొచ్చే ఉల్కలు మీసో ఆవరణంలో మండిపోతాయి. భూమి నుంచి ఉద్గారమైన రేడియో తరంగాలు థర్మోస్ఫియర్ ద్వారా తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి.

ప్రధాన వాయు కాలుష్యాలు

కార్బన్ మోనాక్సైడ్ (CO): ఇది విషపూరితమైంది. పెట్రోల్ లాంటి శిలాజ ఇంధనాలు తక్కువ గాలి(ఆక్సిజన్) సమక్షంలో అసంపూర్తిగా మండటం వల్ల ఇది వాతావరణంలోకి విడుదలవుతుంది. వాహనాలు, ఐరన్, స్టీల్ పరిశ్రమలు, ఘన వ్యర్థాల నుంచి కూడా ఇది విడుదలవుతుంది. కార్బన్ మోనాక్సైడ్‌ను పీల్చడం ప్రమాదకరం. ఇది హిమోగ్లోబిన్‌తో కార్బాక్సీ హిమోగ్లోబిన్‌ను ఏర్పర్చి రక్తంలో ఆక్సిజన్ సరఫరా కాకుండా చేస్తుంది. హిమోగ్లోబిన్‌తో ఆక్సిజన్ ఏర్పరిచే బంధం కంటే CO బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. వాతావరణంలో ఆమోదించదగిన CO స్థాయి 7 పీపీఎం. దీని పరిమాణం ఎక్కువైతే దృష్టి కోల్పోవడం (10 పీపీఎం), తలనొప్పి (100 పీపీఎం), స్పృహ కోల్పోవడం (250 పీపీఎం), కోమాలోకి వెళ్లడం (750 పీపీఎం), తక్షణ మరణం (1000 పీపీఎం) లాంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. కార్బన్ మోనాక్సైడ్‌కు నేల ప్రధానమైన సింక్. నేలలోని కొన్ని రకాల సూక్ష్మజీవులు వాతావరణంలోని COను తొలగిస్తాయి.

కార్బన్ డై ఆక్సైడ్ (CO_2): ఇది విషపూరితం కాని కాలుష్యకారకం. శ్వాసక్రియ, శిలాజ ఇంధనాల దహనం, సిమెంట్ పరిశ్రమలు (సున్నపురాయిని కాల్చడం ద్వారా), మొక్కలు కుళ్లిపోవడం, అగ్నిపర్వతాల విస్ఫోటనం తదితర కారణాల వల్ల CO_2 వాతావరణంలో కలుస్తుంది. అడవులను ప్రధాన కార్బన్ డై ఆక్సైడ్ సింక్‌లుగా పేర్కొనవచ్చు. సముద్రాలు కూడా కార్బన్ డై ఆక్సైడ్‌ను కరిగించుకొని కార్బొనేట్లు, బైకార్బొనేట్లను ఏర్పరుస్తూ మరో ప్రధాన సింక్‌లుగా పనిచేస్తాయి. సూర్యరశ్మి సమక్షంలో క్లోరోఫిల్ ఉన్న మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి పిండిపదార్థాలను తయారుచేసుకుంటాయి. ఇవి CO_2 స్థాయిని తగ్గిస్తాయి. హరిత గృహ ప్రభావం (భూగోళ తాపం) కలిగించే వాయువుల్లో కార్బన్ డై ఆక్సైడ్ ప్రధానమైంది.

ఇతరవాయువులు: నీటి ఆవిరి, ఫ్రియాన్లు, ఓజోన్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్.

సల్ఫర్ డై ఆక్సైడ్: ఇది ఘాటైన వాసన ఉన్న, రంగు లేని వాయువు. నేలబొగ్గును మండించటం (ఉదా: థర్మల్ పవర్ ప్లాంట్లు), పెట్రోలియం రిఫైనరీలు, అగ్నిపర్వతాలు, పైరైటిస్ ఖనిజాల (ఐరన్, కాపర్, జింక్ సల్ఫైడ్‌లు) భర్జనం, కుళ్లిన పదార్థాల నుంచి విడుదలైన హైడ్రోజన్ సల్ఫైడ్ ఆక్సీకరణం తదితర కారణాల వల్ల ఇది వాతావరణంలోకి చేరుతుంది. ఇది నైట్రోజన్ ఆక్సైడ్‌తో కలిసి ఆమ్ల వర్షానికి కారణమవుతుంది. ఆమ్ల వర్షాల వల్ల నేల pH తగ్గుతుంది. ఫలితంగా నేల నిస్సారమవుతుంది. పాలరాయి లేదా చలువరాయి/సున్నపురాయితో నిర్మించిన కట్టడాలకు సల్ఫర్ డై ఆక్సైడ్ వల్ల నష్టం వాటిల్లుతుంది. పాలరాతి కట్టడమైన తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి మదురలోని చమురు శుద్ధి కర్మాగారం విడుదల చేసే సల్ఫర్ డై ఆక్సైడే కారణం. ఈ వాయువు ఊపిరితిత్తుల వ్యాధిని కలిగిస్తుంది. మొక్కల పెరుగుదలను క్షీణింపజేస్తుంది.

నైట్రోజన్ ఆక్సైడ్‌లు: నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్‌లు కాలుష్యాన్ని కలిగించే ప్రధాన నైట్రోజన్ ఆక్సైడ్‌లు. ఇవి గ్రీన్‌హౌస్ వాయువులు. నైట్రోజన్ ఆక్సైడ్ స్ట్రాటోస్ఫియర్‌లో కాంతి రసాయన చర్యల్లో పాల్గొని ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతుంది. ఇది నేలలోని సూక్ష్మజీవుల వల్ల కూడా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ ఒకదానితో మరొకటి చర్య జరపవు. కానీ మెరుపులు ఏర్పడినప్పుడు అధిక ఉష్ణోగ్రతల (1483 K కంటే అధికం) వద్ద ఈ రెండు వాయువులు చర్య జరపుతాయి. ఫలితంగా నైట్రోజన్ ఆక్సైడ్‌లు వాతావరణంలోకి విడుదలవుతాయి. నైట్రోజన్ డై ఆక్సైడ్ సూర్యరశ్మి సమక్షంలో విఘటనం చెంది చర్యాశీలత ఉన్న ఆక్సిజన్ పరమాణువును ఏర్పరుస్తుంది. ఇది బాష్పశీల హైడ్రోకార్బన్లు, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ లాంటి సమ్మేళనాలతో కలిసి 'కాంతి రసాయన స్మాగ్'కు కారణమవుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసే ప్రక్రియలేవి?
   ఎ. అగ్ని పర్వతాల విస్ఫోటనం
   బి. జంతు శ్వాసక్రియ
   సి. కిరణజన్య సంయోగక్రియ
   డి. మొక్కలు కుళ్లిపోవడం
   1) ఎ,బి మాత్రమే
   2) ఎ, సి, డి మాత్రమే
   3) ఎ, బి, డి మాత్రమే 4) పైవన్నీ
2. స్టీల్ పరిశ్రమ వాతావరణంలోకి విడుదల చేసే కాలుష్య కారక వాయువులేవి?
   1) సల్ఫర్ డై ఆక్సైడ్
   2) కార్బన్ డై ఆక్సైడ్
   3) కార్బన్ మోనాక్సైడ్ 4) పైవన్నీ
3. మెరుపులు ఏర్పడినప్పుడు విడుదలయ్యే వాయువు ఏది?
   1) నైట్రస్ ఆక్సైడ్ 2) కార్బన్ డై ఆక్సైడ్
   3) సల్ఫర్ డై ఆక్సైడ్
   4) నైట్రోజన్ డై ఆక్సైడ్
4. కాంతి రసాయన పొగమంచుకు కారణమైన పదార్థాలేవి?
   1) నైట్రస్ ఆక్సైడ్ 2) పొగ
   3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
   4) పైవన్నీ
5. వాతావరణంలో అనుమతించదగ్గ కార్బన్ మోనాక్సైడ్ స్థాయి?
   1) 10 పీపీఎం 2) 7 పీపీఎం
   3) 50 పీపీఎం 4) 100 పీపీఎం
6. కింద ఇచ్చిన వాటిలో గాలిని కలుషితం చేయనిది?
   1) ఫ్లై యాష్ 2) ఫ్రియాన్
   3) హైడ్రోజన్ సల్ఫైడ్ 4) ఫ్లోరైడ్
7. అంటార్కిటికాలో ఓజోన్ క్షీణతకు కారణమైన పదార్థం?
   1) ఎక్రోలిన్ 2) PAN
   3) CO, CO_2 4) క్లోరిన్ నైట్రేట్
8. కార్బన్ మోనాక్సైడ్ (CO) విడుదలకు ప్రధాన కారణం?
   1) పరిశ్రమలు 2) వాహనాలు
   3) అడవులు 4) అగ్నిపర్వతాలు
9. రేడియో తరంగాలను పరావర్తనం చేసే వాతావరణ పొర?
   1) స్ట్రాటో ఆవరణం
   2) మీసో ఆవరణం
   3) ట్రోపో ఆవరణం
   4) థర్మో ఆవరణం
10. వాతావరణం పై పొరల్లో ఓజోన్ పొర క్షీణతకు కారణమైన వాయువులేవి?
    1) ఫుల్లరీన్లు 2) ఫ్రియాన్లు
    3) పాలిహాలోజన్లు
    4) ఫెర్రోసీన్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 1; 4) 4; 5) 2; 6) 4; 7) 4; 8) 2; 9) 4; 10) 2.

తప్పించుకునే విధానాల నుంచి తప్పనిసరైన తరుణం!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

భారతీయ జనతా పార్టీ

చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలమని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 90వ దశకంలోనే ప్రకటించింది. పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది. వాజ్‌పేయి నేతృత్వంలో బీజేపీ 1996లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ ఇది కేవలం 13 రోజులే కొనసాగింది. ఆ తర్వాత 1998లో పార్లమెంటు ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ.. ఉత్తర ప్రదేశ్‌లో ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ, మహారాష్ట్రలో విదర్భ రాష్ట్రాల ఏర్పాటుకు సిద్ధమేనని ప్రకటించింది.

- 1998లో కాకినాడలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేశారు. 1998 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బీజేపీ 'ఒక ఓటు – రెండు రాష్ట్రాలు' అనే అంశాన్ని ప్రచారం చేసింది.
- 1999 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ విజయం సాధించింది. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పోటీచేసిన 8 లోక్‌సభ సీట్లలో ఏడింటిని గెలుచుకుంది. ఎన్డీఏలో భాగస్వామ్య పార్టీ అయిన టీడీపీ (తెలుగు దేశం పార్టీ) 29 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. అసెంబ్లీకి నిర్వహించిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకొని టీడీపీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- ఎన్డీఏ ప్రభుత్వం 2000లో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు.
- తెలంగాణ అంశాన్ని బీజేపీ పక్కన పెట్టడంతో ఆగ్రహించిన ఎంపీ ఆలె నరేంద్ర పార్టీ నుంచి బయటకు వచ్చి 'తెలంగాణ సాధన సమితి'ని స్థాపించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారు. తర్వాత ఈ పార్టీని 2002 ఆగస్టు 11న టీఆర్ఎస్‌లో విలీనం చేశారు.
- 2004లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లాయి. ఈ రెండింటికీ ఎదురుదెబ్బ తగిలింది.
- బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ 2007 ఆగస్టు 5న పార్లమెంటులో 'కాలింగ్ అటెన్షన్ మోషన్ ద్వారా' తెలంగాణ అంశాన్ని చర్చకు తీసుకువచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెడితే తమ పార్టీ తక్షణమే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని చెప్పి కేంద్ర హోంమంత్రిని ఇరకాటంలో పడేశారు.

మలిదశ ఉద్యమ నిర్మాణంలో టీఆర్ఎస్ పార్టీకి ఎంత ప్రాముఖ్యం ఉందో.. రాష్ట్ర ఏర్పాటు విషయంలో పార్లమెంట్‌లో నిర్వహించిన పాత్ర దృష్ట్యా బీజేపీకి అంతే ప్రాధాన్యం ఉందని చెప్పవచ్చు. 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలిపింది. దీంతో బిల్లు సునాయాసంగా సభ ఆమోదం పొందింది. రాజ్యసభలో ఫిబ్రవరి 20న ప్రవేశపెట్టిన రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు బీజేపీ పక్షనేత అరుణ్‌జైట్లీ మద్దతు ప్రకటించారు. దీంతో ఈ సభలోనూ బిల్లు ఆమోదం పొంది దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించడానికి మార్గం సుగమమైంది.

- బీజేపీ 2008 నవంబర్ 13న సికింద్రాబాద్‌లో 'సంకల్ప యాత్ర' పేరుతో బహిరంగ సభ నిర్వహించింది. ఇందులో బీజేపీ అగ్రనేత ఎల్.కె.అద్వానీ తమ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో తెలంగాణ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రోశయ్య 2009 డిసెంబర్ 7న ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బహిరంగంగా మద్దతు ప్రకటించింది.
- టీ–జేఏసీలోనూ బీజేపీ కీలకంగా వ్యవహరించింది. జేఏసీ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమాల్లో పార్టీ నేతలు చురుగ్గా పాల్గొన్నారు.
- 2010 జనవరి 5న కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ తరఫున తెలంగాణ ప్రాంతం నుంచి దత్తాత్రేయ, ఆంధ్రా ప్రాంతం నుంచి హరిబాబు హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ప్రకటించింది.
- 2010 జనవరి 23న నిజాం కాలేజీలో నిర్వహించిన రణభేరి సభకు బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ యువకులు బలిదానం చేసుకోవద్దని పిలుపునిచ్చారు.
- తెలంగాణ ఏర్పాటుపై జాప్యాన్ని నిరసిస్తూ 10 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు బీజేపీకి చెందిన యెండల లక్ష్మీనారాయణ పదవులకు రాజీనామా చేశారు. 2010 జూలై 31న ప్రకటించిన ఉప ఎన్నికల ఫలితాల్లో వీరందరూ ఘన విజయం సాధించారు.
- 2011 మే 31న కరీంనగర్‌లో బీజేపీ పోరుసభ నిర్వహించింది. ఈ సభలో సుష్మాస్వరాజ్ 'తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఇవ్వకపోతే మా పార్టీ ఇస్తుంది' అని ప్రకటించారు.
- నాగం జనార్దన్ రెడ్డి 'తెలంగాణ నగారా సమితిని' 2013 జూన్ 3న బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో బీజేపీలో విలీనం చేశారు.
- 2014 ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించడం ద్వారా తెలంగాణ.. దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించింది.



తెలుగుదేశం పార్టీ (టీడీపీ)

1983లో నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) హయాంలో కోస్తాంధ్ర నుంచి హైదరాబాద్‌కు వలసల పర్వం ఊపందుకుంది. 1975లో వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులను సక్రమంగా అమలు చేయాలని తెలంగాణ ఎన్జీవో సంఘం ఎన్టీఆర్‌ను కోరింది. దీంతో ఆయన 'జయభారత్ రెడ్డి' నేతృత్వంలో ఈ అంశంపై ఒక కమిటీ వేశారు. ఈ కమిటీ 1975–1980 వరకు జరిగిన నియామకాల్లో అక్రమాలు జరిగాయని నివేదిక ఇచ్చింది. దీన్ని పరిశీలించడానికి సుందరేశన్ ఆధ్వర్యంలో మరో కమిటీ వేశారు. ఇది కూడా జయభారత్ రెడ్డి కమిటీ మాదిరిగానే సిఫారసు చేసింది. దీంతో 1985 డిసెంబర్ 30న 610 జీవోను విడుదల చేశారు. 1986 మార్చి 31 నాటికి ఈ జీవో అమల్లోకి రావాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ అమల్లోకి రాలేదు. రామారావు హయాంలో అన్ని రంగాల్లో కోస్తాంధ్రుల ఆధిపత్యం ప్రారంభమైంది. సచివాలయం ముఖ్య శాఖాధిపతుల కార్యాలయాల్లో ఆంధ్రా ప్రాంతంవారి సంఖ్య బాగా పెరిగింది. స్థానికులకు తీవ్ర అన్యాయం జరిగింది.

- 1995లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఎన్డీఏ హయాంలోని కేంద్ర ప్రభుత్వం 2000లో మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చంద్రబాబే అడ్డుకున్నారనే విషయం ప్రజల్లోకి బలంగా వెళ్లింది.
- చంద్రబాబు ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేస్తున్న కె.చంద్రశేఖర్‌రావు తన పదవికి రాజీనామా చేసి 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీని స్థాపించారు. ఇదే సమయంలో 610 జీవో అమలు ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి రగిలింది.
- 2008లో సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీ సీనియర్ నేత దేవేందర్ గౌడ్ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి 'నవ తెలంగాణ పార్టీ' స్థాపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ఆందోళనకు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాలకు తెలంగాణ స్టిక్కర్లు అంటించడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు.
- తెలుగుదేశం పార్టీ అధ్యక్ష హోదాలో చంద్రబాబు నాయుడు 2008 అక్టోబర్ 10న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చారు.
- హైదరాబాద్‌లో 2009 డిసెంబర్ 7న తెలంగాణ అంశానికి సంబంధించి నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో 'తెలంగాణపై మీరు బిల్లు పెట్టండి, మేం మద్దతు ఇస్తాం' అని టీడీపీ ప్రకటించింది.
- 2009 డిసెంబర్ 8న రాష్ట్ర అసెంబ్లీలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 'తెలంగాణకు అనుకూలంగా మీరు అసెంబ్లీలో తీర్మానం చేస్తే మద్దతిస్తాం' అంటూ ప్రభుత్వానికి సవాలు విసిరారు.
- 2009 మార్చిలో దేవేందర్ గౌడ్ తన పార్టీని ప్రజారాజ్యం పార్టీలో విలీనం చేశారు. 2009 ఆగస్టు 6న ప్రజారాజ్యం నుంచి బయటకు వచ్చి మళ్లీ టీడీపీలో చేరారు.
- 2009 డిసెంబర్ 24 ఉస్మానియా వర్సిటీ విద్యార్థుల దీక్షకు మద్దతు తెలపడానికి వెళ్లిన టీడీపీ నేత నాగం జనార్దన్ రెడ్డిపై దాడి చేశారు.
- 2010 జనవరి 5న ఢిల్లీలో కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి టీడీపీ తరఫున తెలంగాణ నుంచి రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఆంధ్రా ప్రాంతం నుంచి యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. తెలంగాణపై కాంగ్రెస్ తన అభిప్రాయం చెప్పకుండా టీడీపీని ఇరకాటంలో పెట్టడానికే ఈ ఎత్తుగడ వేసిందని రేవూరి అఖిల పక్షంలో ఆరోపణలు గుప్పించారు.
- నాగం జనార్దన్ రెడ్డి టీడీపీకి రాజీనామా చేసి 2011 సెప్టెంబర్ 10న 'తెలంగాణ నగారా సమితి' ఏర్పాటు చేశారు.
- తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఊపందుకోవడంతో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపై చంద్రబాబు రెండు కళ్ల వ్యూహాన్ని అమలు చేశారు.
- 2008 అక్టోబర్‌లో రాసిన లేఖను ప్రస్తావిస్తూ 2012 సెప్టెంబర్ 26న ప్రధాని మన్మోహన్ సింగ్‌కు చంద్రబాబు మరోసారి ఉత్తరం రాశారు.
- '2008లో ఇచ్చిన లేఖకు కట్టుబడి ఉన్నాం. మీరు నిర్ణయం తీసుకొని అస్థిరతను దూరం చేయండి' అంటూ 2012 డిసెంబర్ 27న నాటి హోంమంత్రి సుశీల్ కుమార్ షిండేకు చంద్రబాబు నాయుడు లేఖ రాశారు.
- 2014 జనవరి 25న చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ విభజన బిల్లు తప్పుల తడక అని, దాన్ని తిప్పి పంపాలని కోరారు. డ్రాఫ్ట్ బిల్లు కాకుండా ఒరిజినల్ బిల్లు పంపాలని కోరారు.
- కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే విధానం సరిగా లేదంటూ 2014లో ఢిల్లీలో చంద్రబాబు నాయుడు దీక్ష చేశారు.

వామపక్షాలు

సీపీఐ

తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన నేపథ్యం ఉండటం వల్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సీపీఐ బహిరంగంగా మద్దతు ప్రకటించింది.

- 2007 ఆగస్టు 5న సీపీఐ అగ్రనేత గురుదాస్ గుప్తా లోక్‌సభలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పూర్తి మద్దతు ప్రకటించారు.
- 2010 జనవరి 5న ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో సీపీఐ తరఫున తెలంగాణ ప్రాంతం నుంచి గుండా మల్లేష్, ఆంధ్రా ప్రాంతం నుంచి నారాయణ హాజరయ్యారు. వీరిద్దరూ తెలంగాణ ఏర్పాటుకు తమ పార్టీ అనుకూలమేనని స్పష్టం చేశారు.
- టీ–జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సకల జనుల సమ్మె, సడక్ బంద్, మిలియన్ మార్చ్ తదితర కార్యక్రమాల్లో సీపీఐ చురుగ్గా పాల్గొంది. ఈ పార్టీ విద్యార్థి సంఘాలు, కార్మిక అనుబంధ సంఘాలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాయి.

సీపీఎం

ఈ పార్టీ తాము చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు వ్యతిరేకమని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ విభజన తమకు సమ్మతం కాదని పేర్కొంది.

- ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడి ఉన్న, అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలైన తెలంగాణ, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించాలని, 610 జీవోను కచ్చితంగా అమలు చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ రాశారు.
- 2010 జనవరి 5న ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి సీపీఎం తరఫున తెలంగాణ నుంచి జూలకంటి రంగారెడ్డి, ఆంధ్రా ప్రాంతం నుంచి రాఘవులు వెళ్లారు. వీరు తెలంగాణకు తాము వ్యతిరేకమని, ఇది పార్టీ నిర్ణయమని చెప్పారు.

What is core inflation?

BANK EXAMS

BANKING AWARENESS



Model Questions

1. Insurance Repository is formed and registered under:
   a) Companies Act 1956
   b) IRDA Act 1999
   c) Partnership Act 1932
   d) Shops and Establishments Act of respective States
   e) None of these
2. Which type of banking that shuns the very idea of interest rates and is founded on the principles of profit sharing:
   a) Islamic Banking
   b) Land Development Banking
   c) Consumer Banking
   d) Exchange Banking
   e) Personal Banking
3. Which of the following banks has issued Multi Currency World Travel Card?
   a) Karur Vysya Bank
   b) Union Bank of India
   c) Kotak Mahindra Bank
   d) Bank of Baroda
   e) State Bank of India
4. The Gold Monetisation Scheme, 2015 will replace the existing ________. However, the deposits outstanding under the Gold Deposit Scheme will be allowed to run till maturity unless the depositors prematurely withdraw them.
   a) Gold Deposit Scheme, 1995
   b) Gold Deposit Scheme, 1999
   c) Sovereign Gold Bond Scheme.
   d) Gold Deposit Scheme, 1991
   e) None of the above
5. Which of the following is not correct regarding the Rajiv Gandhi Equity Savings Scheme.
   a) Those investors whose annual taxable income is below Rs. 10 lacs are eligible under the scheme.
   b) The maximum investment permissible under the scheme is Rs.50,000.
   c) It is a tax savings scheme which gives tax benefit for new investors.
   d) The scheme aims to promote debt culture in India.
   e) None of the above
6. Which of the following banking system is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
   a) Tiered Banking
   b) Shadow Banking
   c) Multiple Banking
   d) Universal Banking
   e) Night Banking
7. Which one of the following entity is not authorised to open insurance accounts?
   a) Central Insurance Repository Limited
   b) SHCIL Projects Limited
   c) NSDL Database Management Limited
   d) Kotak Insurance Repository Limited e) None of the above
8. The scheme "Aapka paisa aapke haath", refers to the
   a) Direct Transfer Scheme
   b) Direct Benefit Transfer Scheme
   c) Direct Bank Transfer Scheme
   d) Direct Bank Transfer Mode
   e) Direct handing over of cash benefit by hand through postal services
9. Interest rate payable on saving bank account is:
   a) Regulated by RBI
   b) Regulated by State Govt
   c)Regulated by Finance Ministry
   d) Deregulated e) None
10. Which of the following are eligible to make deposits under Gold Monetisation Scheme?
    a) Resident Indians & HUF
    b) Trusts including Mutual Funds / Exchange Traded Funds
    c) Registered under SEBI (Mutual Fund) Regulations
    d) Companies
    e) All of these
11. The Union Finance Minister has launched the IRDA's Insurance Repository System (IRS). Which of the following is not correct about IRS service record of all insurance policies?
    a) Insurance Repository is authorised only to maintain the policies in physical form
    b) Insurance Repository provide a Insurance
    c) The Repository acts as a single stop for several policy service requirements.
    d) The Repository will issue a unique code number to all policy holders
    e) None of the above
12. The drawee of a cheque can be:
    a) One person b) Two person
    c) Any legal or juristic person
    d) A Bank e) None of these
13. Which of the following organization was established as a subsidiary of the Reserve Bank of India with the purpose of providing long term industrial finance and later took over business of Refinance Corporation of India in September, 1964?
    a) ICICI Ltd b) IDBI Ltd
    c) IFCI Ltd
    d) Development Credit Bank of India(DCB)
    e) None of the above
14. Which of the following is/are called Bretton Woods institution?
    a) International Monetary Fund
    b) World Trade Organization
    c) United Nations
    d) Asian Development Bank
    e) Multilateral Development Bank
15. The minimum deposit at any one time shall be raw gold (bars, coins, jewellery excluding stones and other metals) equivalent to ____ grams of gold of 995 fineness.
    a) 10 gm b) 20 gm
    c) 30 gm d) 40 gm e) 50 gm
16. The new RTGS System operationalised is based on which standard messaging formats?
    a) ISO 2002 b) ISO 20022
    c) ISO 2022 d) ISO 22200
    e) ISO 22220
17. The forensic audit of which bank ordered by the Reserve Bank of India is a first in the country's banking history?
    a) United Bank of India
    b) Allahabad Bank
    c) State Bank of India
    d) Union Bank of India
    e) Dena Bank
18. RBI has mandated that the banks intending to enter insurance broking:
    a) NPAs should not exceed 3% of their loans.
    b) Should have a minimum net worth of Rs. 500 crore
    c) Should have capital adequacy ratio of 10%
    d) Only a & b e) All a, b, and c
19. Which State Govt. in India will introduce a cash compensation policy for housewives with less than Rs. 3 laks annual income:
    a) Karnataka b) Goa
    c) Maharashtra d) Delhi
    e) Andhra Pradesh
20. The maximum limit for deposit under the Gold Monetisation Scheme is _______:
    a) Rs. 1 lak b) Rs. 5 lak
    c) Rs. 10 lak d) Rs 20 lak
    e) No limit
21. No margin is required to bought in by the borrower for the education loans to special courses up to _________:
    a) Rs. 2 lak b) Rs. 4 lak
    c) Rs. 3 lak d) Rs. 5 lak
    e) None of the above
22. What is core inflation?
    a) It is the inflation rate of a particular basket of commodities
    b) It is the sudden increase in prices of certain amount of food grains
    c) It is caused by supply shocks in certain essential commodities.
    d) It is the sudden decrease in supply of all goods and services.
    e) Only a & b
23. Which of the following regulatory authority has been introduced by the Central Govt. with wide powers to recommend, enforce and monitor the compliance of accounting and auditing standards?
    a) Financial Reporting Authority of India
    b) National Financial Reporting Authority
    c) National Financial Stabilization Authority
    d) Audit Departments of Respective States
    e) None of the above
24. Japan will promote ________, a theory which asserts that the advancement of women in the society is directly correlated with its growth rate.
    a) womenomics
    b) womenpowerment
    c) women Empowerment
    d) women Employment
    e) None of the above.
25. The Reserve Bank is issuing Banknotes in Mahatma Gandhi Series 2005 with a new numbering pattern and special features for the visually impaired in ____, ____ and ____ denominations.
    a) Rs.10, Rs. 50, Rs.100
    b) Rs.100, Rs.500 and Rs.1000
    c) Rs.50, Rs.100 and Rs.500
    d) Rs.10, Rs.500 and Rs.1000
    e) Rs.5, Rs.10, and Rs.20
26. To provide better security for debit card holders, payment services provider, National Payment Corporation of India has introduced a chip based card that provide protection to banks and their customers against card skimming and counterfeiting frauds. Such cards falls under which brand?
    a) Rupay Brand
    b) Rupaiya Brand
    c) Rupee Brand
    d) Rupiah Brand
    e) Rupai Branch
27. As per Govt. guidelines, banks having total business of Rs. 300000 cr are to have how many EDs?
    a) Minimum 2 b) 2
    c) 3 d) Maximum 3
    e) Only one irrespective of total business
28. According to Pension Fund Regulatory and Development Authority which Bank has been appointed as the new National Pension System Trustee Bank ?
    a) State Bank of India
    b) Axis Bank
    c) ICICI Bank
    d) Punjab National Bank
    e) Bank of India
29. Which of the following banks is the first Indian bank to introduce Display Debit cards?
    a) HDFC Bank b) Axis Bank
    c) ICICI Bank
    d) State Bank of India
    e) HSBC Bank
30. The Reserve Bank has reviewed and enhanced the limit or cash withdrawal at Point of Sale (POS - for debit cards and open system prepaid cards issued by banks in India) from Rs.1000 to ________ per day in Tier III to VI centres.
    a) Rs. 1500 b) Rs. 2000
    c) Rs. 2,500 d) Rs.3000
    e) Rs. 3,500

KEY

1) a	2) a	3) c	4) b	5) d
6) b	7) d	8) b	9) d	10) e
11) a	12) d	13) b	14) a	15) c
16) b	17) a	18) e	19) b	20) e
21) b	22) a	23) b	24) a	25) b
26) a	27) c	28) b	29) b	30) b